

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్ సిటీ*



మంగళవారం | 29-8-2017 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 50

శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 2.53 తదుపరి నవమి; నక్షత్రం: అనూరాధ రా. 10.57 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: తె. 5.51 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 8.34-9.23, రా. 10.16-11.01; అమృతఘడియలు: ఉ. 11.21-1.08; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.28

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



మంత్రివర్గ సహచరులతో ఏపీ సీఎం ఆనందం; అఖిలప్రియ, మౌనికలతో విజేత బ్రహ్మానందరెడ్డి



గెలుపు ‘బ్రహ్మ’ండం

నంద్యాల్లో టీడీపీ జయభేరి

భూమా బ్రహ్మానందరెడ్డికి 27,466 ఓట్ల మెజారిటీ.. వైసీపీకి పరాభవం

అనువుగాని చోట అసాధారణ విజయం.. ఒక్కటి మినహా అన్ని రౌండ్లలో ఆధిక్యం

అమరావతి, కర్నూలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే సార్వత్రిక ఎన్నికలకు దిక్సూచిగా రాజకీయ పార్టీలు భావించిన, విశ్లేషకులు అభివర్ణించిన నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. దివంగత భూమా నాగిరెడ్డి- శోభ కుటుంబానికి చెందిన బ్రహ్మానందరెడ్డి (టీడీపీ) భారీ మెజారిటీతో గెలుపొందారు. స్వయంగా 13 రోజుల పాటు స్వయంగా నంద్యాలలో మకాం వేసినా వైసీపీ నేత జగన్ తన పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించుకోలేకపోయారు. సవాళ్లు, ప్రతిసవాళ్లు, ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమ ఉద్రిక్త వాతావరణంలో సాగిన నంద్యాల ఎన్నికలపై తెలుగు రాష్ట్రాల్లో పెను ఉత్కంఠ నెలకొంది. ఇది చంద్రబాబు ప్రభుత్వంపై రిఫరెండం, 2019లో జరగబోయే కురుక్షేత్రానికి నంద్యాలే నాంది అని జగనే స్వయంగా ప్రకటించడంతో ఈ ఉప ఎన్నిక సెమీ ఫైనల్స్‌గా ప్రచారం పొందింది. ఊహించిన దానికన్నా భారీ పోలింగ్ నమోదవడంతో ఉత్కంఠ మరింత

మిగతా 11వ పేజీలో...

లెక్క పక్కా!

‘ఆంధ్రజ్యోతి’ సర్వే అక్షరాలా నిజం

టీడీపీకి 56.78% ఓట్లని అంచనా

56.05% ఓట్లతో టీడీపీ విజయభేరి



గురువు కాదు... అడవి మృగం

గుర్మీత్‌కు 20 ఏళ్ల జైలు

30 లక్షల జరిమానా

- రేప్ కేసులో సీబీఐ కోర్టు తీర్పు
- నమ్మిన భక్తురాళ్లనూ వదల్లేదు
- వారిపై లైంగిక దాడి తీవ్ర నేరం
- దయాదాక్షిణ్యాలకు అర్హుడు కాదు
- సీబీఐ జడ్జి జగ్దీప్ సింగ్ వ్యాఖ్యలు
- ఒక్కో కేసులో పదేసి సంవత్సరాలు
- ఒకదాని తర్వాత మరొకటి అమలు

తప్పు చేశా.. క్షమించండి!

పిల్లాడిలా వెక్కివెక్కి ఏడ్చిన బాబా

తనకు శిక్ష తగ్గించాలని వేడుకోలు

కదలనంటే ఈడ్చించిన జడ్జి

రోహ్‌తక్, ఆగస్టు 28: డేరా బాబా పాపం పండింది. తనను నమ్మి ఆరాధించిన భక్తురాళ్లపైనే అత్యాచారానికి పాల్పడిన గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు శిక్ష పడింది. తనను తాను దైవదూత (మెసెంజర్ ఆఫ్ గాడ్)గా అభివర్ణించుకున్న రేపిస్టు బాబాకు సీబీఐ కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఆయన చేసిన ఒక్కో రేప్‌నకూ పదేళ్ల చొప్పున శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పింది. గుర్మీత్ ఒక అడవి మృగంలా ప్రవర్తించాడని, తనపట్ల ఎంతో భక్తి విశ్వాసాలున్న భక్తురాళ్లను కూడా వదల్లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అమాయకంగా, గుడ్డిగా తననే ఆరాధించిన అటువంటి భక్తులపై లైంగిక దాడికి పాల్పడడం ద్వారా గుర్మీత్ అత్యంత తీవ్రమైన నేరానికి పాల్పడ్డాడని, ఎటువంటి దయాదాక్షిణ్యాలకు ఆయన

మిగతా 14వ పేజీలో...

250 మందిపై రేప్!

300 మంది సన్యాసినుల్లో 90% మందిని బాబా చెరిచాడు

నన్ను కాపలా ఉంచి 16 ఏళ్ల అమ్మాయిపై అత్యాచారం

300 మంది మగ ఉద్యోగులకు వృషణాలను తొలగించాడు

హత్యలూ అక్కడ సాధారణమే

మొదట్లో ఎవరినైనా చంపితే శవాన్ని నదిలో పడేసేవారు

తర్వాత్తర్వాత ఆశ్రమంలోనే కాల్చేసేవారు.. పూడ్చేసేవారు

బాబా కన్ను పడ్డ భూమి తన సొంతం కావాల్సిందే

20 లక్షల భూమికి 1-2 లక్షలే

గుర్మీత్ మాజీ బాడీగార్డు వెల్లడి



న్యూఢిల్లీ, ఆగస్టు 28: పితాజీ గుఫా.. అది గుహ కాదు.. అమ్మాయిల పాలిట నరకం! అత్యాచారాలకు గురయ్యే అబలల ఆక్రందనలతో ప్రతిధ్వనించిన పాప కూపం!! గుర్మీత్ రామ్ రహీం సింగ్ బాబా.. ఆ గుహలో మాటు వేసిన మానవ మృగం!! ఆ మదమెక్కిన మృగాన్ని.. దైవదూతగా భావించి 250 మందికిపైగా అమాయకురాళ్లు అతడి కామదాహానికి బలైపోయారు. ఆ రేపిస్టు బాబా వద్ద ఒకప్పుడు అంగరక్షకుడిగా పనిచేసిన బియాంత్ సింగ్.. గుర్మీత్ చేసిన దారుణాల గురించి ఒక ఆంగ్ల చానల్

మిగతా 14వ పేజీలో...



డోక్లాంలో చైనా వెనకడుగు

73 రోజుల ప్రతిష్టంభనకు తెర!.. ఇరు దేశాల సైన్యం ఉపసంహరణ

దౌత్యచర్చల్లో అంగీకారం: భారత్.. రోడ్డు నిర్మాణాన్ని చైనా ఆపేసింది

చైనా బుల్‌డోజర్లు వెనక్కి వెళ్లాయి.. భారత ప్రభుత్వ వర్గాల వెల్లడి

ఇండియా బలగాలే వెనక్కి మళ్లాయి.. మా గస్తీ కొనసాగుతుంది: చైనా

కింద పడ్డా తమదే పైచేయి అన్నట్టు ప్రకటన.. రోడ్డుపై జవాబు దాటవేత



మోదీ భేష్

చైనాపై మనదే పైచేయి: ఒమర్

న్యూఢిల్లీ/బీజింగ్, ఆగస్టు 28: భారత్ వేసిన ఒత్తిడి ఎత్తుగడ ఫలించింది. డోక్లాం ప్రతిష్టంభన ముగిసింది. ఆ ప్రాంతంలో రోడ్డు వేయాలన్న చైనా వ్యూహానికి అడ్డుకట్ట పడింది. డోక్లాం నుంచి ఇరు దేశాల సైనికులూ వీలైనంత వేగంగా వైదొలగాలనే అంగీకారానికి

మిగతా 16వ పేజీలో...

రూ.2 లక్షలపై లావాదేవీలకు

నగదు వాడొద్దు

వాడితే వంద శాతం జరిమానా.. ఐటీ శాఖ హెచ్చరిక

20 వేలకు మించి స్థిరాస్తి నగదు చెల్లింపులకూ వర్తింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: రెండు లక్షలు, అంతకు మించి నగదు లావాదేవీలు చేయడం చట్ట విరుద్ధమని ఆదాయపన్ను శాఖ మరోసారి గుర్తు చేసింది. అలాంటి లావాదేవీలకు పాల్పడితే చట్టప్రకారం జరిమానా తప్పదని దేశ ప్రజలను హెచ్చరించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేసింది. “ఒక సంఘటన లేదా సందర్భానికి సంబంధించి రూ.2 లక్షలు అంతకు మించిన సొమ్ము ఒక

మిగతా 16వ పేజీలో...

డిగ్రీ విద్య ప్రక్షాళన!

క్రమంగా సీట్ల కోత.. తర్వాత కాలేజీలు సగానికి సగం తగ్గింపు

ప్రతి గ్రూపులో 25% భర్తీ తప్పనిసరి.. భర్తీ కాని కాలేజీలో రద్దు

ప్రవేశం పొందిన వారు వేరే చోటుకి.. వర్సిటీలకు ఆదేశాలు జారీ

5

కరెంట్ సబ్సిడీ నేరుగా ఖాతాకే

విద్యుత్తులోనూ నగదు బదిలీ

పేదలు, అర్హులకే రాయితీలు

రాష్ట్రానికి కేంద్రం సూచన

6

రామప్ప శిథిలం







- 800 ఏళ్ల కాకతీయ కళావైభవానికి ముప్పు
- వర్షాలకు కూలిన ప్రహరి ఉప ఆలయం
- కురుస్తున్న ప్రధాన ఆలయం.. అభిషేకాల్లేవు
- పురావస్తు శాఖ అధికారుల నిర్లక్ష్యం

భూపాలపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'శిలలపై శిల్పాలు చెక్కినారు.. మనవాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారు'.. అని ఆ చారిత్రక శిల్ప సంపదను చూసి రమ్యంగా పాడుకుంటాం. కనుచూపు కరువైన వారికి సైతం శతాబ్దాలనాటి జీవకళను కనువిందు చేసే ప్రత్యక్ష సాక్ష్యాలని గొప్పలు పోతాం. అలాంటిది.. ఆ శిల్పాలే ఇప్పుడు తమకు ఆదరణ ఏదీ? అంటూ మూగగా రోదిస్తున్నాయి. ఘనకీర్తి గల చారిత్రక ఆలయంలో కూలుతున్న స్తంభాలు.. కొన్ని కట్టడాలపై మొలచిన పిచ్చి మొక్కల మధ్య శిల్పాలన్నీ వెలవెలబోతున్నాయి యునెస్కో వారసత్వ కట్టడంగా గుర్తింపునకు పోటీ పడుతున్న కాకతీయ కళావైభవమైన రామప్ప ఆలయ దురవస్థ ఇదంతా!! ఆలయ చరిత్ర తెలిస్తే.. కాకతీయ కళావైభవం రోమాంచితులను చేస్తుంది. సుమారు 804 ఏళ్ల చరిత్ర కలిగిన రామప్ప ఆలయంలో అన్నీ ప్రత్యేకతలే. ప్రధాన ఆలయం నక్షత్రాకారపు గద్దెపై నిర్మించారు. మూడువైపులా (తూర్పు, ఉత్తరం, దక్షిణం) ద్వారాలతో మధ్యలో నునుపైన నాలుగు నల్లసేనపు రాళ్లపై చెక్కబడిన శిల్పాలు చూపరులను తన్మయత్వానికి గురిచేస్తాయి. కాకతి రాజు గణపతి దేవుడి కాలంలో సేనాధిపతి రేచర్ల రుద్రుడు పాలంపేటలో రామప్ప అనే శిల్పి ద్వారా ఈ ఆలయాన్ని కట్టించాడు. 1173లో నిర్మాణాన్ని ప్రారంభించి 1213లో పూర్తిచేశారు. ఇక్కడ ఉన్న ప్రతి శిల్పంలోనూ జీవకళ ఉట్టిపడుతుంది. స్థానికంగానే లభించే రెండు రంగు రాళ్లతో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. పైగోపురం సైతం నీటిలో తేలే ఇటుకలతో చేపట్టారు. రామప్ప ప్రాంగణంలోనే కాటేశ్వరాలయం, కామేశ్వరాలయాల నిర్మాణం చేపట్టారు. వీటితోపాటు చుట్టూ 13 ఉప ఆలయాలు నిర్మించారు.

కూలిన 36 మీటర్ల ప్రాకారం..

కాకతీయుల అద్భుత కళానైపుణ్యం ఉట్టిపడే రామప్ప నేడు శిథిలావస్థకు చేరుతోంది. కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయం అభివృద్ధికి నోచుకోకపోగా కట్టడాలు కూలిపోతున్నా.. పురావస్తు శాఖలో చలనం కనిపించడంలేదు. దీంతో గత రెండేళ్లుగా రామప్ప ఆలయం శిథిలమవుతోంది.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తూర్పు ద్వారాన్ని ఆనుకుని ఉన్న ప్రాకారం 36మీటర్ల వరకు కుప్పకూలింది. దీంతో ప్రహరీ మొత్తంగా కూలిపోయే పరిస్థితి కనిపిస్తోంది. వారం క్రితం రామప్ప ఆలయానికి 300మీటర్ల దూరంలో ఉన్న ఉప శివాలయం సైతం పూర్తిగా కూలిపోయింది. ఈ ఘటనలు జరిగినప్పటికీ కేంద్ర పురావస్తు శాఖఅధికారులు రామప్ప పరిరక్షణకు తీసుకోనున్న చర్యలు పెద్దగా లేవు. రామప్పలోని శివ లింగానికి అభిషేకాలు కూడా నోచుకోవడం లేదు. సోమసూత్రం మూసుకుపోవడంతో ఏడాదిన్నర కాలంగా ఇక్కడ అభిషేకాలు లేవు. పైకప్పు పూర్తిగా చిల్లులు పడి వర్షానికి ఆలయం మొత్తం తడిచే పరిస్థితి నెలకొంది. ఇటీవల సిబార (సున్నము, ఇసుక, బెల్లం, కరక్కాయల మిశ్రమం) పద్ధతిలో మరమ్మతులు చేపట్టారు. కేంద్ర పురావస్తు శాఖ పట్టించుకోకపోవడంతో భవిష్యత్తులో రామప్ప ఆలయం కాలగర్భంలో కలిసిపోతుందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన ఆలయంతోపాటు చుట్టుపక్కల 16 ఉప ఆలయాలూ పూర్తిగా శిథిలమైపోయాయి. వీటిలో కామేశ్వరాలయం పునర్నిర్మాణం కోసం కూలగొట్టి శిలలను కుప్పలుగా పోశారు. చుట్టుపక్కల ఉన్న ఆలయాలన్నీ దశాబ్దాల తరబడి ఆదరణ లేక శిథిలమయ్యాయి. వీటిలో యాకూబ్‌సాబ్ స్థలంలో ఉన్న శివాలయం పూర్తిగా కూలిపోయింది. గుప్తనిధుల కోసం దుండగులు గునపాలతో గర్భగుడిని తవ్వుకెళ్లిపోయారు. శివలింగాలు చెల్లాచెదురయ్యాయి.



ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించేనా..?

పురాతన కట్టడాలు, చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేసేందుకు యునెస్కో సంస్థ సర్వే చేపడుతోంది. ఈ క్రమంలో రాష్ట్రం నుంచి ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందేందుకు వరంగల్ కోట, వేయి స్తంభాల ఆలయం, రామప్ప ఆలయాన్ని ప్రభుత్వం ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించింది. వీటిలో వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి తిరస్కరణకు గురి కాగా.. రామప్ప ఆలయం మాత్రం యునెస్కో పరిశీలనలో మిగిలింది. అయితే అధికారులు పంపించిన ప్రతిపాదనలు మరోసారి పరిశీలించేందుకు గత పదిరోజుల క్రితం యునెస్కో ప్రతినిధి బృందం రామప్పను సందర్శించింది. కట్టడంలోని శిల్పాలను, నిర్మాణతీరును అన్ని కోణాల్లోను ఈ బృందం పరిశీలించింది. దీంతో రేపోమాపో రామప్పకు వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తింపు లభిస్తుందనే ఆశ చరిత్రకారుల్లో వ్యక్తమవుతోంది.



సీఎం పెద్ద మనసు

- పేద బాలుడి వైద్యానికి సహాయం

హైదరాబాద్/గజ్వేల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ పేద బాలుడికి సీఎం కేసీఆర్ ఆపన్నహస్తం అందించారు. కాలేయ వ్యాధితో బాధపడుతున్న బాలుడికి రూ.25 లక్షలు మంజూరు చేసి పెద్ద మనసు చాటుకున్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన హనుమాన్ దాస్ కుమారుడైన దేవసాని శ్రీమాన్ (11 నెలలు) పుట్టినప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య పరీక్షలు చేయించగా కాలేయానికి సంబంధించిన సమస్య తలెత్తిందని, కాలేయ మార్పిడి ఒక్కటే పరిష్కారమని వైద్యులు తెలిపారు. విషయం పత్రికల ద్వారా తెలుసుకున్న సీఎం వెంటనే సిద్ధిపేట కలెక్టర్ వెంకట్రామ్ రెడ్డితో మాటాడి రూ.25 లక్షలను సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేశారు. ఈ మేరకు చెక్కును కలెక్టర్ బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు.

సరస్వతీ పుత్రుడికి వైద్యం

- వైద్య మంత్రి లక్ష్మారెడ్డి హామీ

బోనకల్, ఆగస్టు 28: 'సరస్వతీ పుత్రుడికి కిడ్నీ సమస్య' పేర 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై మంత్రి కె.లక్ష్మారెడ్డి స్పందించారు. ఖమ్మం జిల్లా గోవిందాపురం(ఎల్)కి చెందిన సాయిరాంకు ఉన్నత వైద్యం అందించేందుకు ముందుకొచ్చారు. సోమవారం బాధితుడికి మంత్రి వ్యక్తిగత కార్యదర్శి ఫోన్ చేసి.. మంత్రి ఆదేశాల మేరకు నిమ్స్ ఆస్పత్రి యూరాలజీ ప్రధాన వైద్యులతో మాట్లాడాం. బయలుదేరి హైదరాబాద్ రండి అని భరోసా ఇచ్చారు.



నువ్వు కృష్ణుడివట కదా..
అందుకే కృష్ణ జన్మ స్థానానికి పంపారు!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	22.0	30.0
హైదరాబాద్	22.3	27.1
మహబూబ్‌నగర్	23.7	27.4
ఖమ్మం	24.0	29.0
వరంగల్	24.5	27.5
నల్లగొండ	25.4	30.0

నేడు అక్కడక్కడా భారీ వర్షాలు!

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడా మంగళవారంనాడు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. అలాగే చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాగా.. బుధ, గురువారాల్లో వర్షాలు కొంత మేరకు తగ్గి.. తిరిగి శుక్రవారంనాడు వర్షాలు పెరిగేందుకు ఆస్కారం ఉన్నట్లు తెలిపింది. సోమవారంనాడు సాయంత్రం వరకు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగానే నమోదయ్యాయి.

మాపైకి వస్తే సముద్రంలో కలిపేస్తాం!

"మా దేశంపైకి దండెత్తి వస్తే అమెరికా మొత్తాన్ని సముద్రంలో కలిపేసేందుకు సిద్ధంగా ఉన్నాం.విధ్వంసపు కత్తితో పొడవాలని చూస్తున్న దక్షిణ కొరియాను, దాని వెనకున్న అమెరికాను ఎప్పుడైనా ఎదుర్కొనేందుకు తగిన సామర్థ్యాన్ని సాధించాం. అమెరికా యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తే ఉత్తర కొరియా నావికాదళం సత్తా చాటుతుంది"

–ఉత్తర కొరియా నావికాదళ 68వ వార్షికోత్సవం సందర్భంగా ఆ దేశ అధికార వర్కర్స్ పార్టీకి చెందిన రొడాంగ్ సిన్మన్ అనే దినపత్రిక చేసిన వ్యాఖ్య.



వేడి పాలల్లో బాలుడు

- 45 శాతం కాలిన శరీరం
- దంతాలపల్లి అంగన్‌వాడి కేంద్రంలో దారుణం

దంతాలపల్లి, ఆగస్టు 28: తోటి పిల్లలతో సరదాగా ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడు.. తూలి పక్కనే సలసల మరుగుతున్న పాల గిన్నెలో పడ్డాడు! ఆ వేడికి ఒళ్లంతా కాలిన గాయాలతో కూడిన బాధతో చిన్నారి ఆర్తనాదాలు చేస్తే తప్ప ఆ అంగన్‌వాడి టీచర్‌గానీ, ఆయాగానీ దారుణాన్ని గుర్తించలేదు. ఇలా అంగన్‌వాడి సిబ్బంది నిలువెత్తు నిర్లక్ష్యం అభంశుభం తెలియని చిన్నారికి ప్రాణమీదకు తెచ్చిన ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడి రెండో కేంద్రం(ఎస్సీ కాలనీ సెంటర్)లో సోమవారం ఏడుగురు పిల్లలు హాజరయ్యారు. పిల్లలంతా గదిలో ఆడుకుంటున్న తరుణంలో సోమారపు ప్రణీత్ తేజ అనే చిన్నారి తూలి పాల గిన్నెలో పడ్డాడు. గుర్తించిన అంగన్‌వాడి టీచర్ సోమరపు విజయ, ఆయా లక్ష్మి.. బాలుడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యులు సీతారాంరాజు, అక్షయ్ బాలుడికి ప్రథమ చికిత్స చేసి వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. బాలుడికి 45 శాతం పాలతో శరీరం కాలిపోయిందన్నారు. సమాచారం అందడంతో జిల్లా శిశు సంక్షేమ అధికారి లేనినా, సీడీపీవో శిరీష, చైల్డ్ ప్రొటెక్షన్ జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకున్నారు. జరిగిన విషయంపై జిల్లా కలెక్టర్ ప్రీతిమానా, శిశు సంక్షేమ రాష్ట్ర డైరెక్టర్ విజయేంద్రబోయికి ఫోన్లో సమాచారం అందించారు. అనంతరం కలెక్టర్ ప్రీతిమీనా ఆదేశాల మేరకు సదరు అంగన్‌వాడి సెంటర్ టీచర్ విజయ, ఆయా లక్ష్మిని విధుల నుంచి తొలగిస్తున్నట్టు ఐసీడీఎస్ అధికారులు విలేకరులకు తెలిపారు. కాగా శిశువుకు నాణ్యమైన వైద్య చికిత్స అందజేస్తామని, ఇందుకయ్యే పూర్తి ఖర్చులను తామే భరిస్తామని శిశు సంక్షేమ రాష్ట్ర డైరెక్టర్ విజయేంద్రబోయి చెప్పారు.

ప్రాణం తీసిన 'ర్యాగింగ్' భూతం!

- చున్నితో ఉరి వేసుకున్న పాలిటెక్నిక్ విద్యార్థిని
- కళాశాలలో నరకం చూస్తున్నానంటూ లేఖ

హత్నూర, ఆగస్టు 28: మార్గనిర్దేశనం చేయాల్సిన సీనియర్లు ఆమెను మనోవేదనకు గురిచేశారు. అండదండగా ఉండాల్సిన కళాశాల యాజమాన్యం చోద్యం చూస్తూ ఉండిపోయింది. దీంతో ఎంతో ప్రతిభావంతురాలైన ఓ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం తుర్కలఖానాపూర్‌లోని రత్నపురి పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహంలో సహస్ర (17) అనే యువతి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన అనకాపల్లి రాజశేఖర్, అరవింద దంపతుల కూతురు సహస్ర రత్నపురి పాలిటెక్నిక్ కాలేజ్‌లో అగ్రికల్చర్ డిప్లమా కోర్సు చదువుతోంది. చదువుతో పాటు క్రీడ, క్విజ్ పోటీల్లో సహస్ర ముందు వరుసలో ఉండేది. అయితే కొంతకాలంగా సీనియర్ విద్యార్థులు ఆమెకు ర్యాగింగ్ పేరిట నరకం చూపిస్తున్నారు. మరోవైపు అరకొర వసతులతో ఉన్న కళాశాల హాస్టల్‌లో సహస్ర ఇమడలేకపోయింది. విద్యార్థినులు తమ సమస్యలు చెప్పుకోవడానికి మహిళా వార్డెన్ కూడా లేదు. దీంతో సహస్ర తన ఇబ్బందుల గురించి తలిదండ్రులకు తెలియజేసింది. వారు వెంటనే కూతురి సమస్యలను కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఫలితం శూన్యం. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన సహస్ర ఆదివారంనాడు వసతిగృహంలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కళాశాలలో నరకం చూస్తున్నానంటూ సూసైడ్ నోట్‌లో పేర్కొంది. విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కళాశాల యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూతురు మృతికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సహస్ర తండి రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు

ఐక్యూలో మనోడిదే అగ్రస్థానం!

లండన్, ఆగస్టు 28: ఐక్యూ పరీక్షల్లో భారతీయులు సత్తా చాటుతున్నారు. తాజాగా బ్రిటన్‌లోని మెన్సా సంస్థ నిర్వహించిన ఐక్యూ టెస్ట్‌లో భారత సంతతి బాలుడు ధృవ్ గర్గ్ (13) సత్తా చాటాడు. మొత్తం 162 పాయింట్లు సాధించి, ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన ఒక్కశాతం వ్యక్తుల జాబితాలో చోటు సంపాదించాడు. మొదటి పరీక్షలో 162, రెండో టెస్టులో 152 పాయింట్లు సాధించాడు. ప్రపంచవ్యాప్తంగా మెన్సా నిర్వహించిన రెండు పరీక్షల్లోనూ ఈ స్థాయి పాయింట్లు సాధించిన అతి కొద్ది మందిలో ధృవ్ కూడా ఒకడిగా నిలిచాడు.



32 అడుగుల వేల్‌కు ప్రాణదానం

అది బ్రెజిల్‌లోని రియో సముద్ర ప్రాంతం. సుమారు 32 అడుగుల పొడవు.. 4 టన్నుల బరువు ఉన్న తిమింగలం పొరబాటున ఒడ్డుకు కొట్టుకువచ్చింది. తిరిగి నీటిలోకి వెళ్లలేక.. ఊపిరి ఆడక అది ఇబ్బంది పడుతోంది. గుర్తించిన స్థానికులు అధికారుల సహకారంతో దానిని నీటిలోకి పంపే ఏర్పాట్లు చేశారు. సుమారు 300మంది దీనిని రక్షించే పనిలో పడ్డారు. ఈలోపు అది చనిపోకుండా ఉండేందుకు క్యానన్లతో దానిపై నీటిని పోశారు. రేయింబవళ్లు కష్టపడి చిన్న కాలువలా తవ్వారు. దీంతో ఆ కాలువ ద్వారా వేల్ నీటిలోకి వెళ్లిపోయింది.

'చనిపోయినోడు' తిరిగొచ్చాడు!

భైంసా రూరల్, ఆగస్టు 28: చనిపోయాడనుకున్న వ్యక్తి తిరిగిరావడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. విచారంతో పెద్ద కర్మకు ఏర్పాట్లు చేసుకుంటున్న కుటుంబానికి ముందు రోజే పెద్ద షాకిచ్చాడు చనిపోయాడనుకుంటున్న రవీందర్ రెడ్డి అనే వ్యక్తి. పెంబి మండల కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన వార్త గత ఆదివారం దినపత్రికలో ప్రచురితమైంది. ఆ వార్తలో ఉన్న ఆధారాలు నిర్మల్ జిల్లా భైంసా మండలం కోతుల్‌గాం గ్రామానికి చెందిన రవీందర్ రెడ్డిని పోలి ఉన్నాయి. దీంతో తమ సోదరుడే మృతి చెందాడని భావిస్తూ కుటుంబ సభ్యులు అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు కూడా చనిపోయింది రవిందర్‌రెడ్డే అని నిర్ధారించుకున్నారు. అంతకుముందే పోలీసులు ఆ శవానికి దహన సంస్కారాలు చేశారు. దీంతో కుటుంబీకులు సోమవారం పెద్దకర్మ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే, అంతకుముందు రోజే రవీందర్‌రెడ్డి ఇంటికి చేరుకుని అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. దీంతో కుటుంబీకుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. బతికున్న సోదరుడి పెద్దకర్మ నిర్వహిస్తున్నందుకు వారు బాధపడ్డారు. నిర్మల్ వెళ్లిన రవీందర్‌రెడ్డి తమ ఊరికి చెందిన వ్యక్తి కనబడడంతో పలకరించాడు. వెంటనే అతడు రవీందర్ కుటుంబీకులకు సమాచారమిచ్చాడు. జరిగింది రవీందర్‌కు చెప్పడంతో హుటాహుటిన స్వగ్రామానికి చేరుకున్నాడు. దీంతో కుటుంబీకుల ఆనందానికి అవధుల్లేకుండా పోయా యి. పెద్దకర్మను రద్దు చేసుకొని బంధువులందరికీ సమాచారం అందించారు. ఇప్పుడు పెంబిలో గుర్తుతెలియని మృతదేహం ఎవరిది? అన్న ప్రశ్న మిగిలింది.



కుటుంబీకులతో రవిందర్‌రెడ్డి

దత్తాత్రేయ చొరవతో మక్కా చేరిన దంపతులు



హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పవిత్ర హజ్ యాత్రకు వెళ్లాలనుకున్న ముస్లిం దంపతులకు సహకరించి కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ తన పెద్ద మనసు చాటుకున్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన అబ్దుల్ ఖయూం, ఆయన భార్య ఫాతిమూన్‌లు ఈ యేడు పవిత్ర హజ్ యాత్రకు(కవర్ నెంబర్ 787) వెళ్లడానికై అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. విమానం ఎక్కేందుకు ఈ నెల 19న శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. చివరి నిమిషంలో వీరి పాస్‌పోర్టులు, ఇతర ముఖ్యమైన పత్రాలున్న బ్యాగ్ కనిపించకుండా పోయింది. ఖయూంకు సంబంధించిన బ్యాగ్‌ను మరో యాత్రికుడు తీసుకుని అప్పటికే విమానమెక్కాడు. దీంతో వారి ప్రయాణం రద్దయిపోయింది. దీంతో హజ్ కమిటీ ప్రతినిధులు కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, బీజేపీ శాసనసభ్యుడు కిషన్‌రెడ్డిలను సంప్రదించి సహాయం కోరారు. కేంద్ర మంత్రి దత్తాత్రేయ చొరవతో అబ్దుల్ ఖయూంకు సౌదీ ఎంబసీ వీసా జారీ చేసింది. దీంతో సెంట్రల్ హజ్ కమిటీ ఈ నెల 26న ముంబై నుంచి జెడ్డా వెళ్లే విమానంలో ఖయూం దంపతులను హజ్‌కు పంపింది.

శశికళకు ఉద్వాసన!





- జయ నియామకాలే చెల్లుతాయి
- 12న ఈసీసమావేశం, శశిపైవేటు

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేలో అంతర్గత పోరు పతాకస్థాయికి చేరింది. తనకు వ్యతిరేకంగా వ్యవహరించే నేతలందరిపైనా అన్నాడీఎంకే వెలివేత ఉపప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ వేటు వేస్తుండగా, ఇప్పుడు ఆయన అధికారులకు కత్తెరవేస్తూ, సీఎం ఎడప్పాడి పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం వర్గాలు కీలక నిర్ణయం తీసుకొన్నాయి. వెలివేతకు గురయిన దినకరన్ చేస్తున్న నియామకాలు చెల్లబోవని తేల్చేశాయి. వచ్చేనెల 12వ తేదీన కార్యవర్గ సమావేశాలను నిర్వహించి.. శశికళకు ఉద్వాసన పలకాలని నిర్ణయించాయి. సోమవారం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా కార్యదర్శులతో సమావేశం నిర్వహించిన పళనిస్వామి, పన్నీరుసెల్వం నాలుగు నిర్ణయాలు తీసుకున్నారు. "అన్నాడీఎంకే నుంచి దినకరన్‌ను ఈ నెల 10వ తేదీనే తొలగించాం. కాబట్టి, ఆయన చేసే నియామకాలకు విలువ లేదు. ఆయన ఇస్తున్న ఆదేశాలు చెల్లవు" అంటూ తీర్మానించారు జయలలిత జీవించి ఉన్నప్పుడు ఆమె నియమించిన నేతలు చేసే ఆదేశాలే పార్టీలో చెల్లుబాటవుతాయని స్పష్టం చేశారు. .పార్టీ అధికారిక పత్రిక 'నమదు ఎంజీఆర్‌నీ, జయ టీవీనీ స్వాధీనం చేసుకునేందుకు చట్టప్రకారం చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించారు. కాగా కొద్దిసేపటికి పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ ఇ.మధుసూదన్ పేరుతో ఒక ప్రకటన వెలువడింది. పార్టీ సర్వసభ్య, కార్యవర్గ సమావేశాలను సెప్టెంబరు 12వ తేదీన నిర్వహించనున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ సమావేశాల్లోనే పార్టీ ప్రధాన కార్యదర్శిగా పన్నీర్‌సెల్వంను ఎన్నుకునే అవకాశమున్నట్లు తెలిసింది. కాగా, పార్టీ ప్రధానకార్యదర్శిగా శశికళ పేరుతో ఎన్నికల కమిషన్‌కు గతంలో ఇచ్చిన లేఖను ఉపసంహరించుకునేందుకు ఓపీఎస్, ఈపీఎస్‌లు మంగళవారం ఢిల్లీ బయలుదేరివెళ్లనున్నారు. కాగా, సీఎం ఎడప్పాడి, డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం నిర్వహించిన సమావేశానికి 30 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం పార్టీని వణికిస్తోంది.

అవి ప్రైవేటు ఆస్తులు

- జయా టీవీ, నమదు ఎంజీఆర్ సీఈఓ

జయా టీవీ, నమదు ఎంజీఆర్ పత్రిక ప్రైవేటు ఆస్తులని, వీటిని స్వాధీనం చేసుకొనే అధికారం ప్రభుత్వానికి లేదని ఆ సంస్థల సీఈఓ వివేక్ జయరామన్ స్పష్టం చేశారు. ఈపీఎస్- ఓపీఎస్‌ల నేతృత్వంలో సోమవారం సమావేశమైన అన్నాడీఎంకే నేతలు జయా టీవీని, నమదు ఎంజీఆర్ పత్రికను స్వాధీనం చేసుకోవాలని తీర్మానించడంపై వివేక్ స్పందించారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలదొక్కుకున్న ఈ సంస్థలను కైవసం చేసుకోవాలని పళని బృందం తీసుకున్న నిర్ణయాన్ని ఖండించారు.

సూదులతో గుచ్చి.. డ్రగ్స్ ఎక్కించి..

90 మంది రోగుల్ని హత్య చేసిన మగ నర్సు

బెర్లిన్, ఆగస్టు 28: ఆస్పత్రికి వచ్చే రోగులను కంటికి రెప్పలా కాపాడే నర్సు వేషంలో ఉన్న హంతకుడతడు. రోగుల్ని సూదులతో గుచ్చుతూ.. డ్రగ్స్ ఎక్కించి ఒక్కర్ని కాదు.. ఇద్దర్ని కాదు.. ఏకంగా 90 మందిని హత్య చేశాడు జర్మనీలోని బ్రెమెన్‌కు చెందిన నీల్స్ హోగెల్(40) అనే నర్సు. రెండు హత్యలు, నాలుగు హత్యాయత్నం కేసుల్లో 2015 నుంచి జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్నాడు ఈ కిరాతకుడు. ఓ మహిళ తన తల్లి మరణంలో నీల్స్ హస్తం ఉందని పోలీసులను ఆశ్రయించగా.. దర్యాప్తు ప్రారంభించిన అక్కడి అధికారులకు దిమ్మదిరిగిపోయింది. 1999 నుంచి 2005 మధ్య నీల్స్ పనిచేసిన రెండు ఆస్పత్రుల్లో చనిపోయిన వారి డేటాను పరిశీలించి, 130 శవాలకు పరీక్షలు నిర్వహించగా అందులో 90 మందిని అతడే చంపినట్లు నిర్ధారణ అయ్యింది. హతంకుడు తన మనసు బాగున్నపుడు రోగిని కాపాడ్డానికి ప్రయత్నిస్తాడట. ఈ హత్యలన్నీ ఎందుకు చేశావని అడిగితే 'మాట్లాడలేను' అని మాత్రమే సమాధానం ఇస్తాడు నీల్స్.

నేటి పెట్రో ధరలు (లీ.)


పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.73.16	పాత ధర 61.95
కొత్త ధర రూ.73.18	కొత్త ధర 61.94
పెరుగుదల .02 పైసలు	తగ్గుదల .01 పైసా



ఉప్పు ఎక్కువైతే హృద్రోగం

లండన్, ఆగస్టు 28: ఆహారంలో మోతాదుకు మించి ఉప్పు తీసుకుంటే హృద్రోగ వ్యాధులు వచ్చే అవకాశం రెట్టింపు అవుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. రోజుకు 6.8 గ్రాముల కన్నా తక్కువ తినే వాళ్ల కన్నా 13.7 గ్రాముల కన్నా ఎక్కువ ఉప్పు తిన్నవాళ్లలో గుండె జబ్బులు తొందరగా వచ్చినట్లు తమ 12 ఏళ్ల సుదీర్ఘ అధ్యయనంలో తేలిందని ఫిన్లాండ్‌కు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ హెల్త్ అండ్ వెల్ఫేర్ పరిశోధకులు తెలిపారు. ఎక్కువ ఉప్పు వల్ల రక్తపోటు తీవ్రమై గుండెపోటుకు దారితీస్తుందని వివరించారు. రోజుకు 5 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకోకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది.

కేన్సర్, గుండెపోటు ముప్పును తగ్గించే మందు



బోస్టన్, ఆగస్టు 28: గుండె మంట, ఊపిరితిత్తుల వాపును తగ్గించే మందులతో గుండెపోటు, ఊపిరితిత్తుల కేన్సర్ ముప్పు తగ్గుతుందన్నది అమెరికాలోని బ్రిఘం యూనివర్సిటీ, వుమెన్స్ హాస్పిటల్ శాస్త్రవేత్తలు చెబుతున్న మాట. కాలేయం విడుదల చేసే సీ-రియాక్టివ్ ప్రొటీన్ శరీరంలో మంటను పెంచుతుంది. దాన్ని తగ్గించేందుకు కనకిన్యూమబ్ అనే ఔషధం ప్రభావవంతంగా పనిచేస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. 25 ఏళ్లపాటు దాదాపు 10వేల మంది హృద్రోగులకు ఈ ఔషధం ఇచ్చి పరీక్షించి చూడగా దాదాపు 25% గుండెపోటు ముప్పు తగ్గిందని, కీళ్లవాతం కూడా అదుపులోకి వచ్చిందని వెల్లడించారు.


జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టులోకి చేరిన నీరు

'కాళేశ్వరం' పనులకు ఆటంకం

మెదక్‌ జిల్లాలో భారీ వర్షం.. తాలిపేరు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్‌, ఆగస్టు 28: అల్పపీడన ద్రోణి కారణంగా ఛత్తీస్‌గఢ్‌, చర్ల మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వస్తోంది. అప్రమత్తం అయిన అధికారులు సోమవారం ఉదయం ప్రాజెక్టు 25 గేట్లలో 10 గేట్లు ఎత్తి 27,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మెదక్‌ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. జిల్లాలో 14.5 మి.మీ సగటు వర్షపాతం నమోదయింది. ఇప్పటికి జిల్లా వ్యాప్తంగా 60శాతం పైగా చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. వర్షంతో జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు ఆటంకం కలుగుతోంది. కన్నెపల్లి, అన్నారం పంప్‌హౌజ్‌లోకి నీరు చేరింది. కుమ్రం భీం ఆసిఫాబాద్‌ జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి, సోమవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. వాగులు ఉప్పొంగి కనర్గాం, బీంపూర్‌, నందుపా, దుబ్బగూడ, రోహిణిగూడ, మెట్‌పల్లి, అంకుశాపూర్‌ గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. తిర్యాణి మండలంలో అత్యధికంగా, కాగజ్‌నగర్‌లో అత్యల్పంగా వర్షపాతం నమోదైంది. మంచిర్యాల జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం 6.7 మి.మీ వర్షపాతం నమోదైంది.

ప్రతి గ్రామం అంకాపూర్‌గా ఎదగాలి

- మంత్రి ఈటల రాజేందర్‌.. డిసెంబర్‌ చివరికల్లా భగీరథ నీరు: జూపల్లి



పెద్దపల్లి/చిన్నంబావి: రైతు సమన్వయ సమితిల ఏర్పాటుతో ప్రతి గ్రామం అంకాపూర్‌గా ఎదగాలని మంత్రి ఈటల రాజేందర్‌ అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన రైతు అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నిటికి సంఘాలు ఉన్నాయని, కానీ రైతులకు సంఘాలు లేవన్నారు. రైతులు ఒక సంఘంగా ఏర్పడి, గిట్టుబాటు ధరలకు పంటలను అమ్ముకొని, ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు సీఎం కేసీఆర్‌ రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేయాలని సంకల్పించారని పేర్కొన్నారు. అంకిత భావంతో పనిచేసే వారినే రైతు కమిటీల్లో సభ్యులుగా చేర్చాలని ఆయన సూచించారు. 2018 జూన్‌ నాటికి పాత కరీంనగర్‌ జిల్లా వాటర్‌ హబ్‌గా, సీడ్‌, రైస్‌ బౌల్‌ ఆఫ్‌ తెలంగాణగా మారుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు మిషన్‌ భగీరథ పథకంలో భాగంగా డిసెంబర్‌ చివరి నాటికి తాగునీటిని అందిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం ఆయన వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణాలను అక్టోబర్‌ చివరి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

ఎంపీ బాల్కసుమన్‌ రాజీనామా చేయాలి

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌



గోదావరిఖని, ఆగస్టు 28 : సింగరేణి ప్రాంతంలో నిమ్స్‌ను తలపించేలా మెడికల్‌ కళాశాలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్‌ హామీ ఇచ్చారని, ఇప్పటికీ మూడేళ్లవుతున్నా మెడికల్‌ కళాశాల ఏర్పాటు చేయనందుకు పెద్దపల్లి ఎంపీ బాల్కసుమన్‌ తన పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎంపీ, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్‌ డిమాండ్‌ చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్‌లో మెడికల్‌ కళాశాల ఏర్పాటు చేయాలని ఆమరణ నిరాహారదీక్ష చేపడితే అవాకులు చెవాకులు పేలిన సుమన్‌ ఈ ప్రాంతంలో మెడికల్‌ కళాశాల ఏర్పాటుపై ఊసెత్తకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. తెలంగాణ వస్తే అభివృద్ధి చెందుతుందని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల్లో రాష్ట్రం ఎలాంటి పురోగతి సాధించలేదని పేర్కొన్నారు. వారసత్వ ఉద్యోగాల పేరుతో సింగరేణి కార్మికులను ప్రభుత్వం, టీఆర్‌ఎస్‌, టీబీజీకేఎస్‌ మోసం చేసిందని ఆరోపించారు.ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సింగరేణిలోని కేంద్ర వాటాను కొనుగోలు చేస్తామన్న ముఖ్యమంత్రి ఆ విషయంలో నోరుమెదపడం లేదని, సింగరేణి పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభాకర్‌ డిమాండ్‌ చేశారు. మంత్రి హరీ‌ష్‌రావు అబద్దాలకు బ్రాండ్‌ అంబాసిడర్‌లా మారాడని ఏడాదిలోపు కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేస్తానని ప్రకటించి ఇటీవలే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం ఏమిటని ఎద్దేవా చేశారు.

దళితులపై దాడులు పెరిగాయి: మందకృష్ణ



ఆర్మూర్‌, ఆగస్టు 28 : రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సోమవారం నిజామాబాద్‌ జిల్లా ఆర్మూర్‌ మండలం మంథని గ్రామంలోని అంబేద్కర్‌ సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై అధిక సంఖ్యలో దాడులు జరుగుతున్నప్పటికీ డీజీపీ తప్పుడు లెక్కలు చెప్తున్నారన్నారు. ఆర్మూర్‌ సబ్‌ డివిజన్‌లోని గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీల దౌర్జన్యాలు పెరిగిపోయాయని, మంథనిలో ఇటీవల దళితులకు సాంఘిక బహిష్కరణ విధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. వీడీసీలు సాంఘిక బహిష్కరణ విధించిన వెంటనే స్పందించడంలో పోలీసులు జాప్యం చేశారని అన్నారు. ఇలాంటి వీడీసీలను రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు. మంథనిలో దళితులకు సాంఘిక బహిష్కరణ చేసిన వీడీసీ సభ్యులను అరెస్టు చేయాలన్నారు.

ప్రతిపక్షాలను గౌరవించని సీఎం కేసీఆరే

- కేంద్ర మాజీమంత్రి ఎస్‌ జైపాల్‌రెడ్డి


మహబూబ్‌నగర్‌లో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌ : నీళ్ల కోసం, నిధుల కోసం అన్న నినాదంతో టీ జేఏసీ, పాలమూరు అధ్యయన వేదిక, బీజేపీయేతర ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా సోమవారం విస్తృతంగా ధర్నాలు నిర్వహించారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన ధర్నాలో కేంద్ర మాజీ మంత్రి ఎస్‌. జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా ముఖ్యమంత్రులు ప్రతిపక్షాల మాటకు విలువ ఇస్తారని, కానీ, ప్రతిక్షాలను పరిగణనలోకి తీసుకోని ముఖ్యమంత్రి ఒక్క కేసీఆరేనని, ఎమెర్జెన్సీలో కూడా ఇలా జరగలేదని అన్నారు.జిల్లాకు నీటి కేటాయింపుల విషయంలో జిల్లాకు చెందిన ఆ పార్టీ నేతలంతా ఏకాభిప్రాయంతో కేసీఆర్‌కు లేఖ రాసినా స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. పాలమూరుకునీటి విషయంలో న్యాయం చయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఆయన సొంతపార్టీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలకే విలువలేదన్నారు. పీసీసీ ఉపాధ్యక్షురాలు డీకె అరుణ మాట్లాడుతూ పాలమూరుకు గండి కొట్టి నల్గొండకు నీళ్లిస్తామంటే సహించబోమని, ఎస్‌ఎల్‌బీసీ పనులు ప్రారంభించి నల్గొండకు నీళ్లివ్వాలని డిమాండ్‌ చేశారు. జడ్చర్లలో ప్రొఫెసర్‌ హరగోపాల్‌ మాట్లాడుతూ తక్కువ నష్టం, అధిక ప్రయోజనాలు ఉండే విధంగా ప్రాజెక్టులను నిర్మించాలని డిమాండ్‌ చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి మాట్లాడుతూ నిర్వాసితులకు ఎకరాకురూ. 20లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. వనపర్తిలో ఎమ్మెల్యే చిన్నారెడ్డి మాట్లాడుతూ మననీళ్లు మన నిర్వాసితుల కోసం మరో ఉద్యమం చేద్దామన్నారు.

బీజేపీ నేతల హామీతో 'గ్రానైట్‌' దీక్షల విరమణ

ఖమ్మం టౌన్‌, ఆగస్టు 28: మూడు రోజులుగా గ్రానైట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిరాహార దీక్షలు జరుగుతుండగా బీజేపీ రాష్ట్ర నేతల హామీతో సోమవారం సాయంత్రం అసోసియేషన్‌ నాయకులు తమ దీక్షలను విరమించారు. గ్రానైట్‌ పరిశ్రమలపై కేంద్ర ప్రభుత్వం విధించిన 28శాతం జీఎస్టీని 5శాతానికి తగ్గించాలని గ్రానైట్‌ పరిశ్రమల యజమానులు శనివారం నుంచి ఖమ్మం కలెక్టరేట్‌ నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ క్రమంలో బీజేపీ ఉప్పల్‌ ఎమ్మెల్యే ఎంవీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌, హన్మకొండ మాజీ ఎమ్మెల్యే ధర్మారావు సోమవారం సాయంత్రం దీక్షా శిబిరానికి వచ్చారు. వచ్చే నెల 9న హైదరాబాద్‌లో జరిగే జీఎస్టీ సమావేశంలో గ్రానైట్‌ పరిశ్రమలపై విధించిన జీఎస్టీని తగ్గించేలా కృషిచేస్తామన్నారు. జీఎస్టీని తగ్గించని పక్షంలో బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో తామే నిరాహార దీక్షలు చేపడతామని హామీనివ్వడంతో గ్రానైట్‌ వ్యాపారులు దీక్షలు విరమించారు. ప్రముఖ వ్యాపారి, గాయత్రి గ్రానైట్‌ సంస్థల అధినేత వద్దిరాజు రవిచంద్ర నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు.


శిబిరంలో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే ప్రభాకర్‌

ఇద్దరు 'చంద్రులు' నిర్లక్ష్యం వీడాలి

- కృష్ణా జలాల సాధనలో విఫలం: తమ్మినేని


నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్‌ పైలాన్‌ పిల్లర్‌ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

నాగార్జునసాగర్‌, ఆగస్టు 28: ప్రజలకు సాగు, తాగునీటిని అందించే విషయంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిర్లక్ష్యం వీడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌ పైలాన్‌ కాలనీ ప్రధాన డ్యామ్‌ వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిర్లక్ష్యం వీడి కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడి 15 టీఎంసీల నీటిని సాగర్‌ ప్రాజెక్టుకు విడుదల చేయించాలని డిమాండ్‌ చేశారు. శ్రీశైలం, సాగర్‌ ప్రాజెక్టులు పూర్తిగా ఎండిపోవడానికి ప్రకృతి వైపరీత్యాలు మాత్రమే కారణం కాదని, ప్రభుత్వాల వైఫల్యం కూడా ఉందన్నారు. ఉన్న ప్రాజెక్టుల్లో నీరు లేక ఎండిపోతుంటే ఎగువన ఉన్న రాష్ట్రాలతో మాట్లాడి నీటిని తీసుకురాలేని సీఎం కేసీఆర్‌ కొత్త ప్రాజెక్టులు కడతాననడం విడ్డూరంగా ఉందన్నారు. విపక్షాలు కూడా కృష్ణా నీటి కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సాగర్‌ ప్రాజెక్టు పరిధిలో ఉన్న లక్షల ఎకరాల ఆయకట్టును ఎండబెట్టిన ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ చరిత్రలో మిగిలిపోతారన్నారు. ప్రజల పక్షాన పోరాడి రైతురాజ్యంగా, బంగారు తెలంగాణ సాధించే ముఖ్యమంత్రి అయితే తక్షణమే కర్ణాటక రాష్ట్రంతో మాట్లాడి సాగర్‌ ప్రాజెక్టుకు నీటిని తీసుకరావాలని డిమాండ్‌ చేశారు. అనంతరం ఎడమ కాల్వ ఎర్తు డ్యాం గేట్లను తోసుకొని వెళ్లి ఎర్త్‌ డ్యాంపై చిల్డ్రన్స్‌ పార్కు వద్ద ఉన్న పుష్కరఘాట్‌ నుంచి నదిలోకి దిగి అక్కడ మానవహారం నిర్వహించారు. అనంతరం నదిలో నీటిని తాగి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన 1000 మంది సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉదయం సస్పెన్షన్‌.. సాయంత్రానికి రద్దు

- 'యాదాద్రి' ఉద్యోగులపై వేటు
- ఉద్యోగుల సంఘం ఒత్తిడితో వెనక్కి

యాదాద్రి, ఆగస్టు 28: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఉద్యోగులు ఆరుగురుని సోమవారం ఉదయం ఆలయ ఈవో సస్పెండ్‌ చేశారు. ప్రభుత్వ విప్‌ గొంగిడి సునీత ఆదివారం స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆశీర్వచనం అందించే విధులకు గైర్హాజరయ్యారని వేద పండితులు కె.వేణుగోపాలాచారి, చిత్తరంజన్‌ హోతా, రామానుజన్‌, శ్రీనివాసశర్మ, పవన్‌కుమార్‌శర్మ, ఆలయ పర్యవేక్షకుడు మల్లేష్‌ను ఈవో సస్పెండ్‌ చేశారు. అయితే ఆలయ ఉద్యోగుల సంఘం ఒత్తిడితో సోమవారం సాయంత్రమే ఆ ఉత్తర్వులను రద్దు చేశారు. సమాచార లోపంతో జరిగిన చిన్న తప్పిదానికి సస్పెన్షన్‌ సరికాదని ఆలయ ఉద్యోగ సంఘం ఈవోకు వివరించింది.

'బాసర'పై సమగ్ర విచారణ ఎప్పుడు?

- విగ్రహ ఘటనపై దేవాదాయ శాఖ నిర్లక్ష్యం
- మంత్రి ఆదేశించినా ప్రారంభం కాని విచారణ

బాసర, ఆగస్టు 28 : నిర్మల్‌ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం నుంచి పండితులు విగ్రహాన్ని తీసుకువెళ్లి నల్లగొండ జిల్లా దేవరకొండలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పూజలు నిర్వహించిన తీరు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. గత నెల 28న జరిగిన ఈ ఘటనపై ఇంకా అనేక అనుమానాలు, ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. విగ్రహం తీసుకెళ్లినప్పటి నుంచి తిరిగి యధాస్థానంలో ఉంచేంత వరకు కనిపెట్టకపోవడంలో ఆలయ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఘటనకు బాధ్యులైన ఇద్దరు పండితులకు ఈనెల 2న అధికారులు చార్జి మెమోలు జారీచేసి చేతులు దులుపుకున్నారు. తర్వాత మూడవ పూజారి పాత్రపై ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడం చర్చనీయాంశమైంది. దీంతో జిల్లాకు చెందిన దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. బాధ్యుతలైన పండితులను వెంటనే సస్పెండ్‌ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈనెల 9న ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు. దేవాదాయ శాఖలో నిజాయితీగా పేరున్న రీజినల్‌ జాయింట్‌ కమిషనర్‌ కృష్ణవేణిని ఏకసభ్య కమిటీగా నియమిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. 20 రోజులు గడిచినా ఇప్పటివరకు ఏ అధికారి బాసరకు రాలేదు. తీవ్ర వివాదాస్పదమైన ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఇతర కారణాలను తెలుసుకునే విషయంలో దేవాదాయ శాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని విమర్శలు ఉన్నాయి. ఈ ఏకసభ్య కమిటీ బాసరతో పాటు దేవరకొండలో పూజలు నిర్వహించిన ప్రైవేటు పాఠశాలలో కూడా విచారణ చేపట్టే అవకాశం ఉంది. కాగా, పూజలు నిర్వహించిన ఘటనలో ప్రధాన పాత్రధారిగా భావిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్‌కుమార్‌ ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారు. ఆయనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విగ్రహం విషయంలో కేసు కూడా నమోదైంది. ఇప్పటి వరకు ఆయన ఆచూకీ తెలియరాలేదు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్‌: అప్పుల బాధతో నల్లగొండ జిల్లాలో ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. చింతపల్లి మండలం వింజమూరుకు చెందిన నాగిళ్ల యాదమ్మ (43) సాగులో నష్టపోయి ఈనెల 20న పురుగు మందు తాగింది. చికిత్స పొందుతూ సోమవారం చనిపోయింది. నాంపల్లి మండలం మహమ్మదపురానికి చెందిన రాశిక యాదయ్య(35) వ్యవసాయంలో 4లక్షలు అప్పులై ఆదివారం రాత్రి ఇంట్లో పురుగు మందుతాగాడు. చిట్యాల మండలం సుంకెనపల్లికి చెందిన ఆవుల నర్సింహ(56) పత్తి చేను ఆదివారం కాలువకు గండిపడి పూర్తిగా మునిగిపోయింది. మనోవేదనకు గురైన ఆయన సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు.

నకిలీ సర్టిఫికెట్ల కేసులో పెద్ద సారు సస్పెన్షన్‌

- మూడు రోజులక్రితం అరెస్ట్‌
- గతంలోనూ విధుల నుంచి తొలగింపు


హెచ్‌.ఎం నందికేశ్వర్‌

నిడమనూరు, ఆగస్టు 28: నకిలీ సర్టిఫికెట్ల కేసులో ఓ ప్రధానోపాధ్యాయుడిపై సస్పెన్షన్‌ వేటు పడింది. నల్లగొండ జిల్లాని డమనూరు మండలం ముప్పారం శివారు సోమవారిగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కస్తూరి నందికేశ్వర్‌కు నకిలీ సర్టిఫికెట్ల ముఠాతో సంబంధాలున్నట్లు తేలడంతో సస్పెండ్‌ చేసినట్లు నల్లగొండ డీఈవో చంద్రమోహన్‌ తెలిపారు. ఈ నెల 14న హైదరాబాద్‌లో నకిలీ సర్టిఫికెట్ల దందా చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ ముఠాలో ప్రధానోపాధ్యాయుడు నందికేశ్వర్‌ కూడా ఉన్నారు. దీనిపై పత్రికల్లో వార్తలు రావడంతో నందికేశ్వర్‌పై నిడమనూరు ఎంఈవో బాలునాయక్‌ ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. విచారణ చేసిన ఉన్నతాధికారులు ముఠాలో నందికేశ్వర్‌ పాత్ర ఉన్నట్లు తేలడంతో ఆయనను సస్పెండ్‌ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2011లో ముప్పారం ప్రాథమిక పాఠశాలలో హెడ్మాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఈ తరహా కేసులోనే ఆయన సస్పెండ్‌ అయ్యారు. ఈ నెల 14న నకిలీ సర్టిఫికెట్ల ముఠా సభ్యుడిగా పోలీసులకు పట్టుబడ్డాడు.

పశువులను తరలిస్తున్న కంటైనర్‌ పట్టివేత


కంటైనర్‌లో పశువులు

మహబూబాబాద్‌ క్రైం: పశువులను తరలిస్తున్న కంటైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్‌లో మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా పశువులను తరలిస్తున్న కంటైనర్‌లో సుమారు 45 ముసలి ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. అయితే ఆ ఎద్దులు పూర్తిగా వయసు మీరాయని, అవి వ్యవసాయానికి పనికి రాకుండా ఉండడంతో సదరు వ్యాపారులు కబేళాలకు తరలిస్తున్నారని తెలుస్తోంది. ఎద్దులను స్థానిక పశువైద్యాధికారికి అప్పగించారు. వాటిని పరీక్షించిన వైద్యులు వ్యవసాయానికి పనికి వస్తాయా? పనికిరావా? ధ్రువీకరించాక.. వాటిని పనికి వస్తే గోశాలకు, లేకపోతే కబేళాకు పంపనున్నట్లు పోలీస్‌ వర్గాలు చెబుతున్నాయి.

తృటిలో తప్పిన ప్రమాదం

14 మీటర్ల ఎత్తుకు చేరిన ఊటనీరు


ఊటనీరుతో నిండిన డివాటరింగ్‌ యూనిట్‌

గద్వాల(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ఫేస్‌-1 యూనిట్‌లో సీపేజ్‌ (ఊటనీరు) అధికంగా పేరుకుపోయింది. 14 మీటర్ల ఎత్తు మేర నీరు చేరడంతో ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. నెట్టెంపాడు ఫేస్‌-1 యూనిట్‌లో 6 డీవాటరింగ్‌ (ఊటనీరును ఎత్తిపోసే) పంపులు ఒకేసారిగా పనిచేయకపోవడంతో పరిస్థితి విషమించింది. ఆదివారం పగలు 1గంట వరకు పనిచేసిన డీవాటరింగ్‌ మోటార్లు సెన్సార్‌తో పాటు ఆగిపోయాయి. ఈ విషయాన్ని స్థానిక సిబ్బంది గమనించకపోవడంతో పరిస్థితి తీవ్రమైంది. సాయంత్రం 6గంటలకు డీవాటరింగ్‌ పంపులు ఎందుకు పనిచేయడంలేదని సిబ్బంది దిగి చూడడంతో పరిస్థితి విషమించడం తెలియవచ్చింది. ఈ విషయాన్ని వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేశారు. నీరు పెరుగుతూ వస్తోంది. దాదాపు 18 నుంచి 20 గంటల వరకు ప్రస్తుతం నెట్టెంపాడు యూనిట్‌లో 14 మీటర్ల నీరు పెరిగి ఉన్నది. ఈ నీటిని వెంటనే ఇతర పంపుల ద్వారా బయటకు తీయడానికి ఉన్నతాధికారులు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న మూడు పంపులను తీసుకొస్తున్నారు. ఈ పంపులు అమర్చి నీటిని బయటకు తీస్తే కానీ సెన్సార్‌ ఎందుకు పనిచేయడం లేదనే విషయం తెలుస్తుందని ఈఎన్‌సీ (ఇంజనీర్‌ ఇన్‌ ఛీఫ్‌) మురళీధర్‌రావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఈఎన్‌సీతో పాటు సీఎం పీఈఓ ఇరిగేషన్‌ ఓఎస్డీ శ్రీధర్‌దేశ్‌పాండే తదితరులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

కేయూలో న్యాక్‌ బృందం పర్యటన


వివరాలు నోట్‌ చేసుకుంటున్న న్యాక్‌ బృందం

కేయూ క్యాంపస్‌: ఆరు నెలలుగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నేషనల్‌ అసెస్‌మెంట్‌ అండ్‌ అక్రెడిటేషన్‌ కౌన్సిల్‌ (న్యాక్‌) బృందం కాకతీయ యూనివర్సిటీని సోమవారం సందర్శించింది. ఉదయం కేయూ వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ ఆర్‌.సాయన్న ఎన్‌సీ గౌతం నేతృత్వంలోని గౌతం సన్యాల్‌, కన్హయ్య అహూజ, ఏవీ సింగ్‌ మధ్వావత్‌, సీహెచ్‌పీ పాండే, సంజీవ్‌పురి, వైకే గుప్తాలకు స్వాగతం పలికారు. అనంతరం పరిపాలన భవనంలో వీసీ సాయన్న న్యాక్‌ బృందానికి వర్సిటీ ప్రొఫైల్స్‌పై ప్రజెంటేషన్‌ ఇచ్చారు. న్యాక్‌ బృందం రెండు బృందాలుగా విడిపోయి సోషల్‌సైన్స్‌, ఆర్ట్స్‌, కామర్స్‌ విభాగాలకు ఒక బృందం, రెండవ బృందం బయోటెక్నాలజీ, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంతో పాటు ఇతర విభాగాలను సందర్శించింది. డిపార్టుమెంట్‌లలో ప్రొఫెసర్లు ఎందరు? అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు ఎందరు? ఖాళీలు ఎన్ని.. కాంట్రాక్టు పద్ధతిలో ఎందరు పనిచేస్తున్నారు? ఇలా అన్ని విషయాలను బృందం డిపార్టుమెంట్‌ సందర్శనలో అడిగి తెలుసుకుంది. డిపార్టుమెంట్‌ల అధ్యాపకులు ప్రచురించిన పుస్తకాలు, రాసిన ఆర్టికల్స్‌పై ప్రధానంగా సమాచారం సేకరించారు. ఆయా సమాచారంతో కూడిన నివేదికను రేపు సాయంత్రం సెనెట్‌ హాల్‌లో జరిగే సమావేశంలో వైస్‌చాన్స్‌లర్‌ సాయన్నకు నివేదిక ఇస్తారు. క్యాంపస్‌లో విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలను పరిశీలించింది. తరగతి గదులు, లైబ్రరీ రూంలు ఇలా అన్ని అంశాలను న్యాక్‌ బృందం పరిశీలించింది.

'ఉప' సంకేతాలు

మూడు రాష్ట్రాల్లో నాలుగు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు పలుకారణాల రీత్యా విశిష్టమైనవి. గోవాలో పనాజీ నుంచి తాను స్వయంగా నెగ్గడంతో పాటు, మరో నియోజకవర్గాన్ని కూడా దక్కించుకోవడంతో ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ పూర్తిగా పుంజుకున్నట్లే. ఢిల్లీలోని బవానా స్థానాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ గెలుచుకోవడం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుదీర్ఘమౌనాన్ని ఆక్షేపించిన ఫలితం. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి సాధించిన విజయం ఏ స్థాయిదో, ఎంతటి విశేషమైనదో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన అభినందన వ్యాఖ్య దాని ప్రాధాన్యతను, రాజకీయ ప్రభావాన్ని తెలియచెబుతున్నది. మిగతావాటితో పోలిస్తే ఇక్కడ పోరు ఏ స్థాయిలో జరిగిందో, ఈ విజయం ఎంత ముఖ్యమైనదో ప్రధాని సహా అందరికీ తెలిసిందే.

నంద్యాల ఎన్నిక ఒక ఉపఎన్నిక స్థాయి దాటిపోయి ఏకంగా ఒక యుద్ధాన్నే తలపించింది. విజయావకాశం కంటే ఓటమి భయమే అధికార, విపక్షాలను వెంటతరిమింది. పరాజయాన్ని ఏమాత్రం సహించలేని, వినయాన్ని స్వీకరించలేని ఒక మనస్తత్వం ఏర్పడింది. విపక్షాలు, ప్రతిపక్షాలు స్థాయి దాటి, ఆ ఉప ఎన్నికలో కనీసం ఉద్రిక్తత, ఎక్కడా వివిధ వ్యక్తిగత దూషణలు, దుర్భాషలతో ప్రచారం సాగింది. అయినప్పటికీ, ప్రజలు ఆ మోటు వ్యాఖ్యలు, నాటు చేష్టల ప్రభావానికి లోనుకాకుండా తీర్పు చెప్పడం విశేషం. నోటిదురుసుతనాన్ని ప్రజలు ఎంతగా నిరసించారో ఈ ఫలితం తెలియచెబుతున్నది. మరో ఏడాదిన్నరలో సార్వత్రిక ఎన్నికలున్నందున, రాష్ట్రంలోని రాజకీయ వాతావరణాన్ని పట్టిచూడడానికీ, ప్రజల నాడిని తెలుసుకోవడానికీ ఈ ఉప ఎన్నిక ఒక అవకాశమన్నది కాదనలేని వాస్తవం. అధికారపక్షం తన పనితీరుకు లిట్మస్ పరీక్షగా భావించడంలోనూ అర్థం ఉన్నది. అయితే, ఇక్కడి విజయాన్ని తన రాజకీయ భవిష్యత్తుకు పునాదిగా వైఎస్ఆర్‌సీపీ అధినాయకుడు జగన్మోహన్‌రెడ్డి భావించినందున నంద్యాల పోరు ఒక వ్యక్తిగత వైరంగా, ఇద్దరి మధ్య యుద్ధంగా మారిపోయింది. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు 13రోజుల పాటు అక్కడే మకాంవేసి, అభ్యర్థిని వెంటపెట్టుకుంటూ అన్ని తావులా తిరగడంతో ఆయన ఈ ఎన్నికకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారో తెలియచెబుతున్నది. ఎన్నికల ప్రచారంలో ఆయన రాజకీయ విమర్శలు కాక, ముఖ్యమంత్రిపై ఎంతటి అమానవీయమైన వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారో మరోమారు చెప్పుకోనక్కరలేదు. కాల్చిచంపడాలు, ఉరిశిక్షలు, చొక్కా విప్పించేయడాల భాషను ప్రజలు మెచ్చుతారని ఎలా అనుకున్నారో అర్థం కాదు. పోలింగ్ రోజువరకూ ప్రజల నోళ్లలో నానితే ఓట్లు రాలుకోవచ్చున్న ఒక తప్పుడు ఆలోచనతో అధినాయకుడితో సహా అందరూ ఇష్టారీతిన నోరుపారేసుకున్నారు. మొగతనం పేరిట మహిళలను అవమానించడమూ యథేచ్ఛగా సాగిపోయింది. ప్రజలు సహేతుకమైన విమర్శలను, ఆరోపణలను సహిస్తారు కానీ, ఉన్మాదం మూర్తీభవించిన జుగుప్సాకర వ్యాఖ్యలను కాదు. ఈ విజయాన్ని అధికారపక్షం తోచిన రీతిలో ఉన్నతంగా ప్రచారం చేసుకోవచ్చు. ఈ ఎన్నిక ఇంతకాలం ఎవరికి విలువను కట్టబెట్టిన విపక్ష నాయకుడికే ఇప్పుడు తన ఓటమినీ, ఎదుటిపక్షం విజయాన్నీ తేలిక తీసిపారేయడమూ కనిపిస్తున్నది. ధర్మమే గెలుస్తుందని బల్లగుద్దిన వారికి ఇప్పుడు ప్రజల తీర్పు అన్యాయంగా కనిపించి ఆగ్రహం కలుగుతున్నది. 2019 కురుక్షేత్రయుద్ధానికి నంద్యాలను నాందిగా అభివర్ణించి, స్వయంగా తానే కత్తిపట్టి కదనరంగంలోకి కదిలినవారు ఇప్పుడు అన్యాయం అక్రమంతో విజయాన్ని వక్రీకరించినంత మాత్రాన ఈ ఫలితం ప్రభావం రాష్ట్రంపై చెరిగిపోదు. రాజకీయరణరంగంలోనూ నిబంధనలు ఉంటాయనీ, వాటి అతిక్రమణలను విలువల ఉల్లంఘననూ ప్రజలు ఏమాత్రం సహించరని ఇప్పటికైనా గ్రహిస్తే మంచిది.

నోరుపారేసుకుంటే ఏం జరుగుతుందనేది ముందుగా గుర్తించబట్టే మొన్నటివరకూ కష్టాల్లో ఉన్న ఆమ్ ఆద్మీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇప్పుడు ఉపఎన్నికల్లో ఒడ్డునపడ్డారు. బవానాలో ఆయన పార్టీ విజయం ప్రశంసనీయమైనది. ఆయన పార్టీ అభ్యర్థికి దక్కిన మెజారిటీని బట్టి ప్రజల్లో ఉన్న కాస్తోకూస్తో వ్యతిరేకత కేవలం ఆయన వీరంగానికి తప్ప పాలనకు కాదని అర్థం చేసుకోవచ్చు. గోవా, పంజాబ్‌లలో ఓటమి తరువాత, ముఖ్యంగా ఢిల్లీ స్థానిక ఎన్నికల ఫలితాల తరువాత కేజ్రీవాల్ అనే ఒక ఉద్యమకారుడు ఈ దేశప్రజలకు సుదీర్ఘకాలం కనిపించకుండా పోయారు. ఆయన మైకు ముందుకు వస్తేచాలునని ఎదురుచూసిన కీలకమైన సందర్భాల్లోనూ మౌనాన్నే ఆశ్రయించారు. ఎన్నికల ప్రచారంలోనూ మితంగానే ఉంటూ మాటల్లో మోతాదు దాటలేదు. మోదీకి సమవుజ్జీని, యావత్ ప్రతిపక్షానికి తానే దిక్కని భావించిన కేజ్రీవాల్ చేసిన విన్యాసాలు ప్రజలకు నచ్చలేదు. ఢిల్లీకి పరిమితమవుతూనే మారిపోయిన మనిషి విస్తరణ వ్యూహాలు వారికి ఆత్మాశం కనిపించింది. దీర్ఘకాల విజయానికి దూరం చేయడంతో ఆయన దిగివచ్చాడు. ప్రజలు మెచ్చారు. 66 స్థానాలున్న మనిషికి ఇప్పుడు మరో సీటు గెలుచుకోవడం వల్ల కొత్తగా ఒరిగిందేమీ లేదు. కానీ, ఈ విజయం వెనుక ఉన్న సందేశాన్ని గ్రహించి మళ్లీ పాత కేజ్రీవాల్‌లాగా మారకుండా ఢిల్లీ పాలనపై ఆయన పూర్తిశ్రద్ధపెడితే మంచిది. ఇక, కేంద్రమంత్రి పదవిని వదిలి రాష్ట్రానికి గోవాలో దిగిన మనోహర్ పారికర్ చిన్నాచితకా పార్టీలను కలుపుకొని ఎలాగో ముఖ్యమంత్రి కాగలిగారు కానీ, ఆయనకు అసలైన ఊపిరినిచ్చింది ఇప్పటి ఫలితమే. గెలుచుకున్న రెండు స్థానాలూ సభలో ఆయన బలాన్ని తగిన స్థాయికి పెంచడంతో పాటు, అడ్డదారిలో అధికారం కొట్టేశారన్న అపకీర్తి ఉపశమించడానికి కూడా తోడ్పడతాయి. ఉప ఎన్నికలే కావచ్చును కానీ, ఆయా రాష్ట్రాల రాజకీయంపై సోమవారం వెలువడిన ఫలితాల ప్రభావం విశేషమైనది.

ప్రజారోగ్యానికి మేలుబాట

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

గోరఖ్‌పూర్ విషాదం ప్రభుత్వాసుపత్రులలోని దుర్భర పరిస్థితులను బహిర్గతం చేసింది. ఇతర దేశాలలో ప్రజా ఆరోగ్య భద్రతా వ్యవస్థల నిర్వహణ తీరుతెన్నులను చూద్దాం. ప్రజల ఆరోగ్య భద్రతా బాధ్యతలను అమెరికా పూర్తిగా ప్రైవేట్ రంగానికి వదిలివేసింది. అత్యంత సమర్థంగా, ప్రభావశీలంగా పనిచేయడం అమెరికా అవలంబించిన ఆరోగ్య భద్రతా విధానంలో ఒక ప్రశంసనీయ అంశం. అత్యుత్తమ, అధునాతన సాంకేతికతలు వారికి అందుబాటులో వుంటాయి. తత్ఫలితంగా ఫలితాలు ఇతర దేశాల్లో కంటే మెరుగ్గా వుంటాయి.

అమెరికా ఫార్మాస్యూటికల్ కంపెనీలు నిరంతరం కొత్త కొత్త ఔషధాలను రూపొందిస్తుంటాయి. అయితే ఇది, ఆరోగ్య భద్రతా వ్యయం మరింత పెరిగిపోవడానికి దారితీస్తోంది. ఉదాహరణకు మన దేశంలో ఎవరికైనా జబ్బు చేస్తే మందుల దుకాణానికి వెళ్ళి యాభై రూపాయలతో యాంటీ బయాటిక్స్‌ను కొనుక్కొని వేసుకోవడం ద్వారా బాధ నుంచి ఉపశమనం పొందడం జరుగుతోంది. అమెరికాలో ఇది సాధ్యంకాదు. ఎందుకంటే అక్కడ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకపోతే దుకాణదారులు ఏ మందులూ ఎవరికీ విక్రయించరు. మరి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ పొందాలంటే విధిగా 250 డాలర్లు (రూ. 13,000) డాక్టర్లకు సమర్పించుకోవల్సిందే. చాలామంది అమెరికన్లు ఈ కారణంగానే ఆరోగ్య భద్రతా వ్యయాలను భరించలేకపోతున్నారు. ఈ వ్యయాలు అత్యధికంగా ఉండడంవల్లే అమెరికాలో 60 శాతం కుటుంబాలు వైద్యసేవలను పొందలేకపోతున్నాయి.

మనం ఒక వాస్తవాన్ని అంగీకరించాలి. అమెరికాలో ప్రైవేట్ ఆరోగ్య భద్రతా వ్యవస్థ సమర్థంగా రోగులకు ఉపశమనం కల్పిస్తుంది. వైద్యశాస్త్ర పురోగతికి తోడ్పడే పరిశోధనలను ప్రోత్సహిస్తుంది. అయితే ప్రజానుకూలంగా ఆ వ్యవస్థను క్రమబద్ధీకరించకపోవడం, డాక్టర్ల కొరత, మందుల భారీ ధర కారణంగా అత్యధిక అమెరికన్లు అనారోగ్యం నుంచి సకాలంలో బయటపడలేక అనేక విధాల నష్టపోతున్నారు.

ప్రభుత్వ రంగ ఆరోగ్య భద్రతా వ్యవస్థకు స్వస్తిచెప్పాలి. ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకే వదిలివేయాలి. అవసరమైన వైద్యసేవలను ప్రైవేట్ ఆస్పత్రుల ద్వారా పొందేందుకు హెల్త్‌కేర్ ఓచర్ల రూపేణా ప్రజలకు ఆర్థిక తోడ్పాటును అందించాలి.

మరి అమెరికా అనుభవం నుంచి మనం నేర్చుకోవల్సిన పాఠమేమిటి? ప్రైవేట్ ఆరోగ్య భద్రతా వ్యవస్థ ఆరోగ్యరక్షణలో మంచిఫలితాలను సాధిస్తుంది. అయితే ఇందుకు ఆస్పత్రులు, ఫార్మాస్యూటికల్ కంపెనీల మధ్య పోటీ తీవ్రస్థాయిలో వుండాలి (ఈ పోటీని మనమూ ప్రోత్సహిస్తున్నాం). అలాగే డాక్టర్లు మరింత అధిక సంఖ్యలో వుండాలి (ఇది మనం చేయలేకపోతున్నాం).

అమెరికాకు పూర్తిగా విరుద్ధమైన ఆరోగ్యభద్రతా విధానాన్ని బ్రిటన్ అనుసరిస్తోంది. ఈ దేశంలో ప్రభుత్వాసుపత్రులు ప్రజారోగ్య పరిరక్షణలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. బ్రిటన్‌లో ప్రతి పౌరుడికీ ప్రభుత్వాసుపత్రులలో అత్యున్నత స్థాయి వైద్యసేవలు పూర్తిగా అందుబాటులో వుంటాయి. అయితే దీనివల్ల ఆస్పత్రుల పనిభారం ఇతోధికంగా పెరిగిపోతోంది. తత్కారణంగా చిన్న ఆపరేషన్ చేయించుకోవాలన్నా నెలల తరబడి వేచివుండవలసి వస్తోంది. ప్రభుత్వాసుపత్రులకు కేటాయింపులు పెంచడంలో బ్రిటిష్ ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. తత్ఫలితంగా ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందడం లేదు. బ్రిటన్ అనుభవం మనకు రెండు పాఠాలను నేర్పుతుంది. ఒకటి– ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలను ప్రజలందరికీ అందుబాటులో ఉంచడం సాధ్యమే. రెండు– డిమాండ్ అత్యధికంగా ఉండడం వల్ల ప్రతి ఒక్కరికీ ఉత్కృష్ట వైద్య సేవలను ప్రభుత్వాసుపత్రుల ద్వారా సమకూర్చడం అసాధ్యం.

సరే, ప్రజారోగ్యం విషయంలో మన పరిస్థితి మరింత ఘోరమైనది. ఎందుకంటే మన దేశ జనాభా 130కోట్లకు పైగా ఉన్నది. అవినీతి అపారంగా ఉన్నది. ఈ కారణంగానే గోరఖ్‌పూర్ విషాదం సంభవించింది. కనుక ప్రభుత్వ వ్యవస్థ ద్వారా వైద్యసేవలందించడమనే బ్రిటిష్ విధానం మనకు అనుసరణయోగ్యం కాదు. అయితే మన రాజ్యాంగం సంక్షేమ రాజ్యాన్ని నిర్మించాలని ప్రభుత్వాలను నిర్దేశిస్తుంది. దీన్ని మనం పాటించవలసి వున్నది. మరి మార్గాంతరమేమిటి? ప్రభుత్వ ఆరోగ్యభద్రతా వ్యవస్థను కూల్చివేయాలి. అమెరికా విధానాన్ని అనుసరించాలి. ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి ఆరోగ్యభద్రతా సేవలు పొందేందుకు ప్రతి ఒక్కరికీ హెల్త్‌కేర్ ఓచర్ల రూపేణా ఆర్థికతోడ్పాటు అందించాలి.

మనం అనుసరిస్తున్న ఆరోగ్యభద్రతా విధానంలో కొన్ని ప్రజానుకూల అంశాలు వున్నాయి. ప్రైవేట్ ఆరోగ్య భద్రతా సంస్థలు మరింత జవాబుదారీగా వుండే పరిస్థితిని చట్టబద్ధంగా కల్పించాం. అనేక ఔషధాలు సరసమైన ధరలకు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. ఫలితంగా ఆరోగ్యభద్రతా వ్యయం స్వల్పస్థాయిలో వుంటోంది. ఫార్మాస్యూటికల్ కంపెనీల మధ్య పోటీని ప్రోత్సహించడంలో మనం సఫలమయ్యాం. ప్రపంచంలో మరే దేశంలో లేనివిధంగా మన దేశంలోనే చాలా మందులు స్వల్ప ధరకే అసంఖ్యాక ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. అలాగే ఆస్పత్రుల మధ్య పోటీని కూడా బాగా పెంచాం. ఈ కారణంగా మనదేశం ప్రపంచ ఆరోగ్యపర్యటనా కేంద్రంగా ఆవిర్భవిస్తోంది.

అయినప్పటికీ గోరఖ్‌పూర్ విషాదం లాంటివి మన దేశంలో చోటుచేసుకొంటున్నాయి. ప్రభుత్వరంగ ఆరోగ్యభద్రతా వ్యవస్థకు ప్రాధాన్యం పూర్తిగా తగ్గించి, ప్రజలందరికీ హెల్త్ కేర్ ఓచర్లు ఇవ్వాలి. వాటి ద్వారా వారు తమకు అవసరమైన సేవలను ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి కొనుగోలు చేసుకోగలుగుతారు. అవసరం లేకపోయినా వైద్య పరీక్షలు నిర్వహించడం, అనవసర మందులను ప్రిస్క్రైబ్ చేయడం మొదలైన విషయాల్లో మనం మరింత జాగ్రత్త చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా వున్నది. బహుశా బాధిత రోగి, సరైన వైద్యం చేయని డాక్టరు లేదా ఆస్పత్రిపై ఫిర్యాదు చేయగానే సత్వరమే చర్య తీసుకొనేలా సమాంతర 'హెల్త్ పోలీస్' వ్యవస్థనొకదాన్ని సృష్టించుకోవడం అన్ని విధాల మంచిది.

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

భాషావిధానంపై బాధ్యతా రాహిత్యం

'రెండు తెలుగురాష్ట్రాలలో కలిపి తొమ్మిది కోట్ల మంది తెలుగు మాట్లాడే జనాభా ఉన్నారని తెలుగు ప్రాంతాలకు బయట మరి తొమ్మిది కోట్లమంది తెలుగు మాట్లాడేవారు (ఇతర రాష్ట్రాలలోను, ఇతర దేశాలలోను) నివసిస్తున్నారని ఇటీవలి కాలపు లెక్కలు తెలుపుతున్నాయి. 18 కోట్ల మంది తెలుగు మాట్లాడుతూ ఉంటే దాదాపు 60 టీవీ ఛానళ్ల 24 గంటలు తెలుగు (భ్రష్ట తెలుగు)లో పనిచేస్తూ ఉంటే దాదాపు 50 లక్షల తెలుగు దినపత్రిక ప్రతులు ప్రతి రోజూ ప్రజలకు చేరుతూ ఉంటే, అంతర్జాలంలో మరికొన్ని లక్షల మంది ఈ పత్రికలు చదువుతూ ఉంటే, ఏదో కొంపలంటుకుంటున్నట్లు తెలుగు రేపో ఎల్లుండో చచ్చిపోబోతూందని గొడవ పెడతారెందుకండీ' అని ఇటీవల ఒక తెలుగు మేధావి తర్కానికి దిగాడు. వినడానికి చాలా బాగుంది. కానీ తెలుగు భాషకు సంబంధించి గొంతెత్తి అరిచేవారు తెలుగు అమలుకోసం అహర్నిశలూ తపించేవారు భయపడుతున్నది తెలుగు చచ్చిపోతుందని కాదు. మాతృభాషకు సంబంధించి తెలుగు ప్రజలకు సహజ సిద్ధంగా వచ్చిన హక్కుల గురించి. తెలుగు ప్రజలు పొందవలసిన విజ్ఞానం, చదువులు, భాష కారణంగానే పొందలేకపోతున్నారని. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు దాటినా తెలుగు ప్రభుత్వాలకు ఒక భాషా విధానం సమగ్రంగా రూపొందించుకోవాలనే తెలివిడి ఇంకా ఏర్పడలేదనే.

సరే తెలుగు చచ్చిపోదు. కానీ జీవచ్ఛవంలా ఉంటే సరిపోతుందా? అవును ఈ తరం వారు అందరికీ తెలుగు రాయడం, చదవడం వచ్చు. ఇప్పటికీ అక్షరాస్యుల సంఖ్య 65 శాతమేనని లెక్కలు చెబుతున్నాయి. అంటే ఇంకా 35 శాతం తెలుగు ప్రజలకు రాయడం, చదవడం రాదనే కదా. ఇప్పటి తరం పోయిన తర్వాత సంగతేమిటి? ఏ బడిలోను తెలుగు చెప్పకపోతే తెలుగు మీడియం పాఠశాలలే లేకపోతే తెలుగు చదవడం రాయడం రాని తరం ఒకటి పూర్తిగా తయారు కావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుంది? కేవలం పాతిక ముప్పై, నలభై ఏండ్లలో తెలుగు రాయడం చదవడం వచ్చిన వారు గతిస్తే పరిస్థితి ఏమిటి? తెలుగు రాయడం చదవడం రాని తరం తయారైనప్పుడు తెలుగు పత్రికలు ఎన్ని లక్షలు అచ్చయితే ఏమి లాభం? అంతర్జాలంతో తెలుగు ఎలా మనగలుగుతుంది? అప్పుడు తెలుగు కేవలం ఒక గిరిజన భాష లాగా వినికిడి భాషగా మాత్రమే మిగిలిపోయే ప్రమాదం అతి దగ్గరగా లేదా? నలభై ఏభై సంవత్సరాలు ఒక వ్యక్తికి దీర్ఘకాలం కావచ్చు. కానీ ఒక జాతికి అది చాలా తక్కువ సమయం. ఇప్పుడు భాష గురించి అజాగ్రత్తగా ప్రవర్తిస్తే జరగబోయే విపరీత పరిణామాలకు బాధ్యత వహించవలసింది ఆ పాపాన్ని మూట కట్టుకోవలసింది ఇప్పటి ప్రభుత్వాలు కాదా?

ఆగస్టు 29న గిడుగు రామమూర్తి జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. పోయిన సంవత్సరం ఇదే రోజున తెలుగు ప్రభుత్వం విశేషించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు అభివృద్ధికి ఎన్నో ప్రణాళికలను ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రతి సంవత్సరం లాగానే అవి కూడా కనుమరుగు అయ్యాయి. ఆ అమాత్యులు సహా అధికారులు ఆ సభా వేదిక నుంచి కిందికి దిగగానే ఆ సంగతిని మర్చిపోయినట్లుంది.

అంతేకాదు ఇది జరిగిన కొద్దిరోజులకే బాధ్యతగలిగిన ఒక అమాత్యుడు తెలుగు మాధ్యమంలో చదువుకుంటే ఉద్యోగాలు రావని, ఇంగ్లీషు మాధ్యమంలోనే ఉద్యోగాలొస్తాయని మున్సిపల్ పాఠశాలన్నింటిలో తెలుగు మాధ్యమం తీసేసి ఇంగ్లీషు మాధ్యమం పెడతామని ప్రకటించారు. ఇది భాషా ప్రేమికులకు తీవ్ర అఘాతం అయింది. తెలుగువారు పిల్లల తల్లిదండ్రులు అందరినీ అయోమయానికి గురిచేసింది. ఇది ఎంత బాధ్యతారాహిత్యమైన ప్రకటనో చెప్పవలసిన పనిలేదు. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగింది. తెలంగాణ ప్రభుత్వం కూడా గురుకుల పాఠశాలలు ఇంగ్లీషు మీడియంలో ఉంటాయని ప్రకటించింది.

పాఠశాలలన్నింటిలోను పదవతరగతి వరకు తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా ఉంటుందని ఐదవ తరగతి వరకు తెలుగు మాధ్యమం ఉంటుందని వగైరా వగైరా ప్రభుత్వ ఉత్తర్వులు ఎందుకు అమలుకావడం లేదు. దానికి భిన్నంగా బాధ్యత గల అమాత్య శేఖరులు ఇంగ్లీషు మాధ్యమం గురించి ఎందుకు ప్రకటన చేశారు? ప్రభుత్వాలు ఇంత బాధ్యతారాహిత్యంగా ఎందుకుంటున్నాయి, అని ఆలోచించాలి. తెలుగు మాధ్యమంలో చదువుకుంటే ఉద్యోగాలు రావని చెప్పేవారు ఇంకా ప్రభుత్వంలోని వివిధ స్థాయి అధికారులు, అటు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు గ్రహించవలసిన ప్రధానమైన విషయం ఒకటి ఉంది.

రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు 14 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. అంటే 14 లక్షల ఉద్యోగాలు ప్రత్యక్షంగా ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ఈ పద్నాలుగు లక్షల మంది తెలుగు వారికోసం పనిచేయాలి. అంటే తెలుగులో పని చేయాలి అని అర్థం. అంటే ప్రభుత్వ కార్యకలాపాలన్నీ తెలుగులో ఉండాలి అని అర్థం. తెలుగులో పనిచేయవలసిన 14 లక్షల మంది ఉద్యోగులు తెలుగు



తెలుగు రాష్ట్రాలలో 14 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. ఈ పద్నాలుగు లక్షల మంది తెలుగు వారికోసం పనిచేయాలి. అంటే తెలుగులో పనిచేయాలి. తెలుగులో పనిచేయవలసిన ఈ ఉద్యోగులు తెలుగు మాధ్యమంలో కాక మరే ఇతర మాధ్యమంలోనో చదువుకోవలసిన అవసరం ఏముంది? అధికార భాష అమలుకు తెలుగు మాధ్యమంలో చదువులు చెప్పడానికి విడదీయ రాని సంబంధం ఉందని ప్రభుత్వాలు గ్రహించాలి.

akbar

మాధ్యమం కాక ఏ మాధ్యమంలోనో చదువుకోవలసిన అవసరం ఏముంది? బయటి ఉద్యోగాలకు పోయే కొద్దిమంది ఆంగ్లమాధ్యమంలో చదువుకుంటే సరిపోదా? ప్రభుత్వాలు తప్పనిసరిగా అధికార భాష అమలుచేస్తే ఉద్యోగులందరూ తెలుగులో పనిచేయవలసి వస్తే వారు తప్పనిసరిగా తెలుగు మాధ్యమంలోనే చదువుకోవాలి కదా! కాబట్టి అధికార భాష అమలుకు తెలుగు మాధ్యమంలో చదువులు చెప్పడానికి విడదీయరాని సంబంధం ఉందని ఈ ప్రభుత్వాలు గ్రహించాలి. ఈ సూక్ష్మాన్ని గ్రహించకుండా స్వాతంత్ర్యం వచ్చిన 70 సంవత్సరాల తర్వాత కూడా అధికారభాషని ప్రజల మాతృభాషలో నడపలేకపోవడం ప్రభుత్వపరంగా ఒక భాషా విధానాన్ని ఏర్పరచుకోకపోవడం మన ప్రభుత్వాలకు ముందుచూపు లేకపోవడాన్ని, అవగాహన లేకపోవడాన్ని స్పష్టంగా చెబుతుంది.

అంతే కాదు, ఒక స్వతంత్ర దేశంలోని పౌరులు తమకు దగ్గరలో ఉన్న ఏ ప్రభుత్వ కార్యాలయానికి పోయి అయినా తన మాతృభాషలో అధికారిక కార్యకలాపాలు చేసుకోవడం అనేది అది స్వతంత్ర దేశం అని చెప్పడానికి మొదటి గుర్తు, మొదటి ప్రజాధికారం. ఈ అధికారం ప్రజలకు లేకపోతే ఆ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు కాదు. ప్రజలు తాము ఎన్నుకున్న ప్రభుత్వంలో తమకు సంబంధించిన పనులన్నీ తన మాతృభాషలో చేసుకోగలగడం అనేది సహజంగా సంక్రమించిన హక్కు.

ప్రాచీన తెలుగు హోదా పరిస్థితి ఏమిటి? ఈ సంస్థ కార్యాలయాన్ని ఎక్కడ పెట్టుకోవాలో కూడా రెండు తెలుగు రాష్ట్రాలు ఒక అవగాహనకు రాలేకపోయాయి. నిధులను సమంగా తీసుకొని రెండు రాష్ట్రాల్లో కార్యాలయాలు పెట్టుకోవాలా అనే ఆలోచనకు కూడా రాలేదు. రెండు రాష్ట్రాలలో అధికార భాషా సంఘాలున్నాయి. సాంస్కృతిక సలహాదారులున్నారు. ప్రభుత్వాలు చాలా ఉన్నత స్థాయిలో ప్రకటనలు చేస్తాయి. కానీ క్లాసికల్ తెలుగు సంస్థను ఇంత వరకు మైసూరు నుంచి తెలుగు నేలకు తెచ్చుకోలేకపోయాము. వందల కోట్ల రూపాయలు కేంద్ర నిధులు వృథాగా ప్రతి సంవత్సరం పోతుంటే తెలుగు వారంతా చూస్తూ కూర్చోవలసిందేనా? ఈ మాత్రం శ్రద్ధ లేకపోతే ఎలా.

రెండు రాష్ట్రాలలో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో తెలుగు అమలుకు సంబంధించి పాఠ్యపుస్తకాలలో ఉండే భాషకు సంబంధించి, పాఠ్యపుస్తకాలలో ఉండే విషయాల గురించి కూడా భిన్నమైన ఆలోచనలున్నాయి. ఉండడంలో విభేదించవలసిన అవసరం లేదు. అధికార భాష శైలికి సంబంధించి కూడా భిన్నమైన ఆలోచనలు ఉండవచ్చు. కానీ ఉమ్మడి భాషా విధానాలు ఉండవచ్చు. ప్రాచీన సాహిత్యం ప్రాచీన భాషా పరిశోధన రెండు వైపులా ఒకేలా ఉంటుంది. భాషాశాస్త్రం, కావ్యశాస్త్రం, వ్యాకరణం ఛందస్సు వంటి శాస్త్రాలు రెండు చోట్ల ఒకటే. కాగా ఉమ్మడిగా ఆలోచించి చేయవలసిన పనులు పైన చెప్పినట్లుగా ప్రాచీన తెలుగు ప్రాధికార సంస్థ ఏర్పాటు వంటివి చాలా ఉన్నాయి. ముందు వారి వారి రాష్ట్రాలలో భాషావిధానాలు ఏర్పరచుకొని తర్వాత ఉమ్మడి విషయాల గురించి దృష్టి పెట్టవచ్చు. భాషా సాహిత్యాలకు కేంద్రప్రభుత్వ నిధులను సంపాదించుకోవడంలో ఉమ్మడి వ్యూహాలు తప్పనిసరిగా ఉండాలి. ఇందుకు రెండు రాష్ట్రాల అధికారభాషా సంఘాలు లేదా సాంస్కృతిక శాఖలు కలిసి పనిచేయవలసి ఉంటుంది.

ఏ అధికారాలు లేని అధికార భాషా సంఘాల స్థాయిలో అన్ని అధికారాలున్న ప్రాధికార సంస్థలు రావాలి. ఈ సంస్థ భాష అమలుకు సంబంధించి ఒక ఉత్తర్వు ఇస్తే దాన్ని అన్ని ప్రభుత్వ సంస్థలు విధిగా పాటించేలా చేసే అధికారం ఈ సంస్థలకు కట్టబెట్టాలి. అసలు అధికారభాషా సంఘం అధ్యక్షులను ఎంపిక చేయడంలోనే వీరి శ్రద్ధ కనిపిస్తూ ఉంది. భాషా శాస్త్ర నేపథ్యం లాంగ్వేజ్ ప్లానింగ్‌తో ఏ సంబంధం లేని వారిని ఎన్నడూ భాషల వినిమయం, అమలుకు సంబంధించిన పనిచేయని వారిని ఈ పదవిలో నియమించడం రాజకీయ పునరావాసాన్ని అస్మదీయులకు కల్పించే విషయంలో చూపే శ్రద్ధ వల్ల జరుగుతూ ఉంది. ఆ పనికి తగిన వారిని నియమించే శ్రద్ధకాని ఆలోచన కాని ప్రభుత్వాలకు లేకపోవడం శోచనీయం.

లాంగ్వేజ్ ప్లానింగ్ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న అనుభవజ్ఞులను భాషోద్యమంలో అంకితమై పనిచేసే వారిని పిలిచి చర్చించి, అలాంటి అనుభవజ్ఞులతో భాషా ప్రాధికార సంస్థలను ఏర్పరచుకొని, అధికార భాష అమలుకు, తెలుగు మాధ్యమం అమలుకు ఉన్న లంకెను గ్రహించి వాటిని కలిపి భాషా వికాస వ్యూహాలను రూపొందించుకోవాలి. ఇప్పటికైనా తెలుగు ప్రభుత్వాలు కళ్ళు తెరిచి వృథాగా పోతున్న కేంద్రప్రభుత్వ నిధులను తెచ్చి క్లాసికల్ లాంగ్వేజ్ సంస్థను మన రాష్ట్రాలలో ఏర్పరచుకోవాలి. ఇప్పటికైనా మించి పోయింది లేదు తెలుగు మాధ్యమంలో చదివిన వారికే ముందు ఉద్యోగాలు వస్తాయనే భరోసాను ప్రభుత్వాలు కల్పించాలి. చిత్తశుద్ధిని చూపిస్తే సాధించలేనిది లేదని గ్రహించాలి.

■ **ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి**

ద్రావిడ విశ్వవిద్యాలయం

(నేడు గిడుగు రామమూర్తి జయంతి, తెలుగుభాషా దినోత్సవం)

సుప్రీం తీర్పు ఆహ్వానించదగిందే..

ముమ్మారు తలాక్ విషయమై సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా వివిధ వర్గాల నుంచి మిశ్రమ స్పందన వెలువడుతోంది. అత్యధిక శాతం మంది తీర్పును ఆహ్వానిస్తున్నారు. కొంతమంది సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిందంటున్నారు. కొంతమంది దీన్ని బీజేపీ విజయంగా అభివర్ణిస్తున్నారు. ముస్లిం సమాజంలో వేళ్ళూనుకుపోయి ఉన్న దురాచారం అంతమైందంటున్నారు. ఇక ముస్లిం సముదాయంలో కొత్త సూర్యుడు ఉదయించినట్లే అంటున్నారు. కానీ అసలు విషయం ఏమిటి? ఇస్లామ్ ధర్మంపై, షరియత్ చట్టాలపై ఈ విధంగా విమర్శలు రావడానికి కారణం ఏమిటి? దీనికి ఎవరు బాధ్యులు? నిజంగానే ఇస్లామీయ చట్టాల్లో అంతటి అమానవీయత, క్రూరత్వం, కర్కశత్వం ఉన్నాయా? ఏకకాలంలో ముమ్మారు 'తలాక్' అని పలికితే దాంపత్య బంధం పుటుక్కున తెగిపోతుందా? పేపరుపై మూడుసార్లు తలాక్ అని రాసి, వాట్సాప్‌లో మూడుసార్లు తలాక్ అని టైప్ చేసి, ఫోన్‌లో, ఈమెయిల్‌లో మూడుసార్లు తలాక్ అని చెప్పేస్తే విడాకులు అయిపోతాయా? అవునన్న దుష్ప్రచారమే ఇంతటి చర్చకు కారణమైంది. నిజానికి ఇస్లామీయ షరియత్‌లో ఇలాంటి తలతిక్క చేష్టలకు అవకాశమే లేదు. మరెందుకు దేశవ్యాప్తంగా ఇంతటి ఆందోళన వ్యక్తమవుతోంది. ముస్లిం సముదాయం నుండి ఎందుకంత వ్యతిరేకత ఎదురవుతోంది. ఇందులో రాజకీయ నాయకుల స్వార్థప్రయోజనాలతో పాటు, ముస్లిం నాయకుల ముఖ్యంగా ఆలిండియా ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు తప్పిదం కూడా ఉంది. 'తలాఖె బిద్ అత్' షరియత్ స్ఫూర్తికి విరుద్ధమని, ఇలాంటి దుర్మార్గానికి పాల్పడిన వాణ్ణి ఆ కాలంలోనే ఖలీఫా హజ్రత్ ఉమర్(ర) శిక్షించారని రాజ్యానికి వినపడేలా గొంతెత్తి అరవాల్సింది. ప్రభుత్వం చెవులు మూసుకున్నా ప్రజలు వినేవారు. అంటే, ముస్లిం సమాజంలో అవగాహన కల్పించడంలో బోర్డు విఫలమైంది. ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ బారినపడ్డ మహిళలకు ముస్లింసమాజం నుంచి సరైన సహకారం లభించకపోవడంతోనే వాళ్ళు మరొకరి గడప తొక్కారు. ఇస్లాం వ్యతిరేకశక్తులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నాయి. ఈ నేపథ్యంలోనే, అలాంటి తలాక్ చెల్లదని సుప్రీం ధర్మాసనం తీర్పుచెప్పింది. ఇందులో ఎలాంటి ఆశ్చర్యమూ లేదు. మీడియా ఊదరగొడుతున్నట్లు ఇది సంచలనమూ కాదు. ఇస్లామ్ చెప్పేదే సుప్రీం చెప్పింది. ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు ఈ ముక్కను ఆనాడే చెప్పి, ముస్లిం సమాజంలో అవగాహన, చైతన్యం కలిగించే కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికన చేపట్టి ఉంటే ధర్మాసనం జోక్యం చేసుకునే అవకాశంగాని, ఆ అవసరం గాని ఏర్పడేదే కాదు. అయితే సుప్రీం తీర్పు వెలువరించింది ఏక కాలంలో ముమ్మారు తలాక్‌పై మాత్రమే అన్న విషయం చాలామంది గమనించడం లేదు. సుప్రీం కోర్టు తలాక్‌ను రద్దుచేసింది అనే అనుకుంటున్నారు. అంతేకాదు, ఆరునెలల్లో చట్టంచేసుకోండి అంటూ బంతిని పార్లమెంటు కోర్టులోకి విసిరేసింది. చట్టం చేయాలనుకుంటే, రాజ్యాంగం మత స్వేచ్ఛకు హామీనిస్తున్న ఆర్టికల్ 25ను అనుసరిస్తూ, షరియత్ చట్టాలను గమనంలోకి తీసుకోవాలని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్, జస్టిస్ నజీర్ స్పష్టంగా చెప్పారు. ఏకకాలంలో ముమ్మారు తలాక్ పలికి భార్యను వదిలేద్దామనుకునే వారిని శిక్షించేలా పార్లమెంటు చట్టం చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఈ సాకుతో మొత్తం షరియత్ వ్యవస్థనే మార్చేస్తామంటే వివాదం మొదటికొస్తుంది. అందుకే కేంద్రప్రభుత్వం వేచిచూసే వైఖరినే అవలంబించవచ్చన్న సంకేతాలు వెలువడుతున్నాయి. భిన్నకులాలు, మతాలు, సంస్కృతులు, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కలిగిఉన్న భారతదేశంలో ఇక ఇంతటితో ఆగకుండా, ఉమ్మడి పౌరస్మృతిని తేవాలని ఆలోచించడం అవివేకం, దుస్సాహసం తప్ప మరేమీకాదు.

- యండి. ఉస్మాన్ ఖాన్, హైదరాబాద్

జనవాక్యం
వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

మాతృభాషతోనే మేధో వికాసం

తెలుగు మాతృభాషా రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పాలకుల్లో భాషాభిమానలేమి కారణంగా తెలుగు ప్రజలు సృజన కోల్పోతున్నారు. నేటి విద్యార్థులు మాతృభాషలోనే ఉత్తీర్ణులు కాలేకపోవడం బాధాకరంగా ఉంది. సమాజం ప్రపంచీకరణ ఉచ్చులో పడి మాతృభాషలకు ఆదరణ లేకుండా అంతరించిపోయే ప్రమాదపుటంచులకు నెట్టివేస్తూ స్వయంకృతాపరాధంలో పడుతోంది. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల్లో తెలుగుకు ఉన్న స్థానం, ఆదరణ చూస్తే, మాతృభాష కనుమరుగవడం ఎంతో దూరంలో లేదు అనేది వాస్తవం కాదా! పాలకులు, పాలితుల, వింత ధోరణి చూస్తుంటే నైపుణ్యానికి, వినూత్నతకు, గుణాత్మకతకు, సృజనాత్మకతకు సమాధి కట్టేది మనమే కదా అని అనిపిస్తుంది. ప్రాచీన భాష హోదా రావడం సంతోషించదగినదే. అయినా ఒక భాష ప్రాధాన్యం, అభివృద్ధి, వాడుక, భాష కళల్లో సృజనాత్మకత చతుర్విధ ప్రక్రియలైన వినడం, మాట్లాడడం, చదవడం, రాయడంపై ఆధారపడి ఉంటుంది. ప్రముఖ భాషావేత్త 'ఆలివర్ వెండెర్ హోమ్స్' చెప్పిన మాటల్లో ప్రతీ భాష ఒక దేవాలయం, దానిని మాట్లాడే ప్రజల ఆత్మ అందులో ఉంటుంది. తెలుగుకు దక్కిన ప్రాచీన హోదాతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. కేంద్రం ఏటా వందల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తుంది. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో తెలుగు భాషాభివృద్ధికి పీఠాలు ఏర్పాటు చేస్తారు. భాషా వికాసానికి కృషి చేసే పండితులకు ప్రతి ఏటా ముగ్గురికి జీవిత సాఫల్య పురస్కారం, లక్ష రూపాయల నగదు బహుమతి ఉంటుంది. ఐదు జాతీయ స్థాయి అవార్డులు ప్రకటిస్తారు.

ప్రజలు తమ బిడ్డకు తెలుగు రాకున్నా పోయేది ఏమీలేదనే దురభిప్రాయం వీడాలి. పాలనలో, బోధనలో, నియామకాల్లో తెలుగుకు సముచిత ప్రాధాన్యం రావాలి. పాలకులకు భాషను బతికించుకునే చిత్తశుద్ధి దండిగా ఉండాలి. ప్రాచీన హోదాతో తెలుగు భాషను బతికించుకోగలగాలి. అప్పుడే రేపటి పౌరుల్లో సృజన పురులు విప్పుకుంటుంది. ఈ వాస్తవాన్ని తల్లిదండ్రులు, సమాజం గమనించాలి. ఈ నేపథ్యంలో భాషా పరిరక్షణను ఒక ఉద్యమంలా చేపట్టాలి.

పాలకులు, ప్రజలు ఆంగ్ల మోజులో పడి మాతృభాష తృణీకరణను విడనాడనంత కాలం భాషా పరిరక్షణ జరగడమనేది హాస్యాస్పదంగా మిగులుతుంది. ప్రజల నాల్కలపై నడయాడే భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉంది.

పాలకులు ఆంగ్ల భాషలో ప్రజలపై ఎన్నికల హామీల వర్షం కురిపించి అధికార పీఠాన్ని దక్కించుకోగలరా! ఇది ముమ్మాటికీ అసాధ్యం. మాతృభాషలో ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి ఓట్లు దండుకుంటూ ప్రజలను మోసం చేస్తుంది పాలకులు కాదా! కోర్టులకున్న చిత్తశుద్ధి పాలకులకు లేదా..! 'మాతృ భాషను నేర్చుకో, అన్య భాషను గౌరవించు' అనే రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించి, మరోవైపు అధికార కార్యకలాపాలు, మాతృభాషలోనే జరగాల్సిన ఉత్తర్వులను ఉల్లంఘించి పరభాష పల్లకి మోసే పాలక బోయిలను ఎందుకు ఉపేక్షించాలి? తప్పనిసరిగా 1–5 తరగతుల వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో మాతృభాషలో బోధన జరగాలి. ఆపై 6వ తరగతి నుంచి విశ్వవిద్యాలయాల వరకు తెలుగును తప్పనిసరి చేయాలి. తెలుగు మాధ్యమాలు తెలుగు భాష పరిరక్షణలో ముందుండాలి. లేని పక్షంలో తెలుగు జాతికి గాఢాంధకారం సమీపంలోనే ఉందని గమనించండి.

ప్రతి సంవత్సరం పది డాక్టరేట్ ఫెలోషిప్‌లు, ఐదు పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లను ఇస్తారు. తెలుగు మాట్లాడే రెండు రాష్ట్రాల పాలకులు నిర్లక్ష్యం విడనాడి సంఘటితంగా తెలుగు భాష పరిరక్షణార్థం చర్యలు చేపట్టకపోతే ఫలితం ఉండదు. బ్రిటిష్ వాళ్ళ వస్త్రాలను తగలబెట్టి, శాసనాలను ఉల్లంఘించి, భారతదేశ తీరం దాటే దాకా తరిమినాం. అలాంటిది ఆంగ్ల భాష మోజును విడనాడకపోవడం బాధాకరం. శిశువు జన్మించిన 6 నెలల నుంచే అమ్మభాషలో స్పందిస్తూ గ్రహణశక్తిని పెంచుకుంటాడు. ఆ సహజ బలాన్ని కాదని వేరే భాషల్లో అభ్యసనానికి చేసే ప్రయత్నం పేగుబంధానికి ఉన్న శక్తిని బలహీనపరచడమే... అలా పరాయీకరణ మొదలై మా బిడ్డకు తెలుగు రాకున్నా పోయేది ఏమీలేదనే దురభిప్రాయం వీడాలి. పాలనలో, బోధనలో, నియామకాల్లో తెలుగుకు సముచిత ప్రాధాన్యం రావాలి. పాలకులకు భాషను బతికించుకునే చిత్తశుద్ధి దండిగా ఉండాలి. ప్రాచీన హోదాతో తెలుగు భాషను బతికించుకోగలగాలి. అప్పుడే రేపటి పౌరుల్లో సృజన పురులు విప్పుతుంది. ఈ వాస్తవాన్ని తల్లిదండ్రులు, సమాజం గమనించాలి. ఈ నేపథ్యంలో భాషా పరిరక్షణను ఒక ఉద్యమంలా చేపట్టాలి.

■ **మేకిరి దామోదర్**

తెలుగును పరిరక్షించుకుందాం

'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్నారు శ్రీకృష్ణ దేవరాయలు. నేడు తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాషకు సముచిత గౌరవం లభించడం లేదు. మనవారికి మన భాషలో మాట్లాడటం నామోషి. తమ పిల్లలను అత్యధిక ఫీజులు వసూలు చేసే ఆంగ్ల పాఠశాలలో చేర్చేందుకే ఎక్కువ మంది తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలుగు మీడియం అంటేనే చిన్నచూపు.

తెలుగు పద్యాల కంటే ఆంగ్ల పదాలపైనే వ్యామోహం పెరిగింది. అభివృద్ధికి ఆంగ్ల భాష చిహ్నమనే ధోరణితో అందమైన తెలుగు భాషకు తెగులు పట్టించి కురూపిలా చూస్తున్నారు. ఆది గురువైన మాతృమూర్తిని 'అమ్మా' అని పిలవడం అనాగరికమై 'మమ్మీ' అనే రోజులు దాపురించాయి.



కన్నతల్లి జన్మభూమి మాతృభాషలను మరవకూడదని మన భారతీయ సంస్కృతి బోధిస్తున్నది. ప్రపంచీకరణ నేపథ్యంలో పాశ్చాత్య సంస్కృతి మన వేష భాష ఆచార వ్యవహారలన్నింటిపై విష ప్రభావం చూపిస్తూనే ఉన్నది. దానిని నివారించకుంటే సమీప భవిష్యత్తులో మన తెలుగు భాష అంతరించే ప్రమాదం లేకపోలేదు.

తెలుగు భాషను ప్రాథమిక స్థాయి వరకు బోధించేలా ప్రభుత్వం నిర్బంధంగా అమలుపరచాలి. గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర సచివాలయం వరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తెలుగు భాష మాత్రమే ఉపయోగించాలి. అధికార భాషా కమిటీలో రాజకీయ జోక్యం ఉండకుండా స్వయం ప్రతిపత్తి కల్పించాలి. విద్యాలయాల్లో తెలుగు మాధ్యంలో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలి. ప్రసారమాధ్యమాల్లో తెలుగును అధికంగా ఉపయోగించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తెలుగును తీర్చిదిద్దేలా సరళతరం చేయాలి. దర్శక నిర్మాతలు తమ చిత్రాల పేర్లకు తెలుగును మాత్రమే వాడాలి. దూరదర్శన్ ప్రసారాల్లో వ్యాఖ్యానం తెలుగును గౌరవించేలా ఉండాలి. రచనా వ్యాసంగంలో తెలుగును వెలిగిస్తున్న కవులు రచయితలను ప్రోత్సహించి నవతరానికి ఉత్తమ సాహిత్యాన్ని అందించాలి. ప్రపంచ దేశాల అధినేతలు సైతం తమ భాషకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తమిళనాడులు తమ భాషల కోసం చేస్తున్న కృషి చెప్పుకోతగ్గది. తెలుగువారిగా మన భాషను ఉభయ రాష్ట్రాల ప్రజలే రక్షించుకోవాలి. విద్యా, ఉద్యోగ, వ్యాపార రీత్యా మనం ఏ భాష నేర్చుకున్నా మన ఆత్మీయులు ఎదురైనప్పుడు తెలుగులో పలకరించుకోవాలి. మన భాషపై సంపూర్ణ అవగాహన ఉంటేనే మిగతా భాషలపై పట్టు సాధించే అవకాశం ఉన్నది.

■ **బైతి దుర్గయ్య, రాముని పట్ల, సిద్ధిపేట జిల్లా**

విద్యార్థుల వద్దకే వైద్యం!

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజన విద్యార్థులకు ప్రత్యేక వైద్య సౌకర్యాలు అందనున్నాయి. విద్యార్థుల వద్దకే వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, తగిన మందులు, చికిత్స అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. వైద్య రంగంలో పేరొందిన పనాసియా సంస్థ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు ఈ సేవలు అందించనున్నారు. పనాసియా సంస్థ అధికార ప్రతినిధులతో సోమవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా భేటీ అయ్యారు. కార్యాచరణ ప్రణాళికను నెలాఖరులోగా పూర్తి చేసి వచ్చే నెల నుంచే అమలులోకి తేవాలని సంబంధిత అధికారులు, పనాసియా ప్రతినిధులను ఆదేశించినట్లు వెల్లడించారు.

ఆర్‌ఎంపీలకు శిక్షణ వద్దు!

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇవ్వాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఉస్మానియా జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, సంజీవ్ వైద్య ఆరోగ్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీకి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఆర్‌ఎంపీలకు ప్రత్యేక శిక్షణ, సర్టిఫికెట్ల జారీతో సమాజంలో వైద్య రంగంపై చెడు ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

వైద్యవిద్య అభ్యర్థులకు మరో అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య సీట్ల భర్తీలో భాగంగా విద్యార్థులకు తెలంగాణ హెల్త్ వర్సిటీ మరో అవకాశం ఇచ్చింది. ఇప్పటి వరకు సీట్లు రాని విద్యార్థులు మంగళవారం తమ ఆప్షన్లను నమోదు చేసుకోవాలని సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. మూడో దశ కౌన్సెలింగ్‌లో భాగంగా ఆదివారం రాత్రి వరకు మెడికల్ సీట్లను కేటాయించారు. ఈ సీట్లు పొందిన వారు ఆయా కాలేజీల్లో చేరకపోతే.. ఆ సీట్లు వృథా అయ్యే అవకాశం ఉంది. దీంతో మంగళవారం వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సిందిగా విద్యార్థులకు యూనివర్సిటీ సూచించింది.

సెప్టెంబరు 7నుంచి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించనున్న ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌పై సందిగ్ధత వీడింది. సెప్టెంబరు 7నుంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని అడ్మిషన్ల ప్రక్రియపై ఏర్పాటైన కమిటీ సోమవారం నిర్ణయించింది. ఈనెల 30న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. సెప్టెంబరు 7నుంచి 13వరకు ధ్రువపత్రాల పరిశీలన, 9నుంచి 16వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 20న సీట్ల కేటాయింపు ప్రక్రియ కొనసాగనుంది.

వార్డెన్‌పై ప్రాసిక్యూషన్‌కు అనుమతి

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వసతిగృహ నిర్వహణలో అవినీతికి పాల్పడిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(వార్డెన్) బి.నరేందర్‌పై ప్రాసిక్యూషన్‌కు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.అశోక్‌కుమార్ అనుమతించారు. రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో బీసీ బాలుర సంక్షేమ వసతిగృహ వార్డెన్‌గా నరేందర్ విధులు నిర్వర్తిస్తున్న సమయంలో విద్యార్థుల హాజరును తప్పుగా నమోదు చేసినట్లు రుజువైంది. 2015 జనవరి 30న ఆకస్మిక తనిఖీచేసి హాజరు పట్టిక నమోదులో తప్పులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విచారణలో 2014 జూన్12 నుంచి 2015 జనవరి 30 వరకు కొందరు విద్యార్థులు హాస్టల్‌లో లేకున్నా..ఉన్నట్లుగా నమోదు చేశాడని తేలింది. దీంతో అతడ్ని సర్వీసు నుంచి తొలగించి, అవినీతి నిరోధక చట్టం కేసు నమోదు చేశారు.

హైకోర్టుకు బీఈడీ, డీఈడీ కళాశాలలు

- ఎన్‌సీటీఈ అక్రిడిటేషన్ నిబంధనపై వ్యాజ్యం

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని బీఈడీ, డీఈడీ కళాశాలలు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) నుంచి తప్పనిసరిగా గుర్తింపు(అక్రిడిటేషన్) పొందాలన్న ఉత్తర్వులను సవాల్ చేస్తూ పలు కళాశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్, ఎన్‌సీటీఈ తరపు వాదనలు విన్న ధర్మాసనం రూ.1.5 లక్షలు చెల్లించకుండా ఆయా కాలేజీల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపర్చడానికి అవకాశం ఉందేమో తెలుసుకుని కోర్టుకు చెప్పాలని సూచించింది. తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది.

చర్చలు సఫలం.. మునిసిపల్ సమ్మె విరమణ

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన సమ్మె ప్రతిపాదనను ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ విరమించుకుంది. సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈ నెల 29, 30 తేదీల్లో మునిసిపాలిటీల్లో సమ్మె చేపడతామని ఇటీవల నోటీసు ఇచ్చింది. ఈ క్రమంలో కార్మిక సంఘాలతో మునిసిపల్ శాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్ పలు దఫాలుగా చర్చలు జరిపారు. ఈ మేరకు సమ్మె విరమించుకుంటున్నట్లు కార్మిక సంఘాల జేఏసీ సోమవారం తెలిపింది.

బీసీ కులాల పునర్వర్గీకరణ ఎలా?: కమిషన్

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం నియమించిన బీసీ కమిషన్.. బీసీ కులాల పునర్‌వర్గీకరణపై దృష్టి సారించింది. బీసీ కులాలు, సంచార జాతులు, వారి పరిస్థితులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాల స్థితిగతులను కమిషన్ సమీక్షించింది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సోమవారం బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్.రాములు, సభ్యులు.. సామాజిక పరిశోధనా సంస్థల అధిపతులు, పలు విశ్వవిద్యాలయాల ఆచార్యులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో అమలులో ఉన్న బీసీ జాబితాలో అత్యంత వెనుకబడిన వర్గాలు(ఎంబీసీలు), సంచార కులాలు, ఇతర కులాలపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణాది రాష్ట్రాల డైరెక్టర్ చెన్న బసవయ్య, సెస్ డైరెక్టర్ గాలబ్, తదితరులు సలహాలు, సూచనలు అందజేశారు.

పంచాయతీకి నిధులు బంద్?

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ఆదాయం వచ్చేదే అంతంత మాత్రం... దానిని వినియోగించుకునేందుకు వీలులేకుండా చేసింది సర్కారు. తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయకుండా ప్రభుత్వం అనధికారికంగా ఫ్రీజ్(స్థంభన) చేసిందని విశ్వసనీయ సమాచారం. దీంతో గ్రామాల్లో చేసిన పనులు, ఇతర నిర్వహణ ఖర్చులకు ఎస్టీవో కార్యాలయాలకు వెళుతున్న గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లకు నిరాశే ఎదురవుతోంది. 15రోజులుగా ఎలాంటి బిల్లులు మంజూరు కావడం లేదని తెలుస్తోంది. 14వ ఆర్థిక సంఘం నుంచి ఈ ఏడాది రూ.1047 కోట్లు రావాల్సి ఉంది. ఇప్పటికే కొన్ని నిధులు మంజూరైనా, వాటిని విడుదల చేయకుండా చేసినట్లు సమాచారం. నిధులను అనధికారికంగా స్థంభింప చేయడంతో స్థానికంగా కనీస నిర్వహణ పనులు చేయలేకపోతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీతో పొత్తు ఉండదు: జితేందర్ రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో బీజేపీతో టీఆర్ఎస్‌కు పొత్తు ఉండదని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత, ఏపీ జితేందర్‌రెడ్డి చెప్పారు. సోమవారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ఎంపీలు బీజేపీలోకి వెళ్తున్నారనేది తప్పుడు ప్రచారమన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధిక పురోగతి సాధించిందని స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారన్నారు. 20.7% వృద్ధితో దేశంలోనే తెలంగాణ నం.1 రాష్ట్రంగా ఉందన్నారు.

మిడ్ మానేరు నీరు ఈ ఏడాదే

అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలు ప్రపంచ రికార్డు.. కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టులకు అనుమతులే రాలేదు

- కాళేశ్వరం ప్రాజెక్టుకు క్లియరెన్సులు తుది దశకు
- 806 కోట్లతో కాలువల మరమ్మతు
- కోట్లతోనే ఎస్సారెస్పీకి నీరు: హరీశ్
- జగిత్యాల జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ పనుల ప్రారంభం


జగిత్యాల జిల్లా పెగడపల్లిలో బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

జగిత్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు నుంచి ఈ ఏడాదే మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాలకు సాగునీరు అందించే ప్రక్రియ చేపడుతున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుతో ఈ రెండు నియోజకవర్గాల భూములు సస్యశ్యామలం అవుతాయన్నారు. సోమవారం జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి, ధర్మపురి మండలాల్లో మంత్రి పర్యటించారు. రాయపట్నం, తిమ్మాపూర్‌లో నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్‌లను, పెగడపల్లిలో నిర్మించిన గోదాములను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కరువును పారదోలాలనే ఆలోచనతో సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తయితే టూరిజం, మత్స్య శాఖ అభివృద్ధి చెందడంతోపాటు నదికి ఇరువైపులా భూములకు సాగునీరు అందుతుందని అన్నారు. వాస్తవానికి నదీ గర్భంలోనే నీటిని నిల్వ చేసేందుకు అధ్యయనం చేశామని, వరుసగా బ్యారేజీలు కట్టాలని ఆలోచన చేశామని తెలిపారు. ఎస్సారెస్పీ కింద 161 మీటర్లు, ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ ధర్మపురి వద్ద 148 మీటర్లు ఉందని, 148 నుంచి 361 మీటర్ల వరకు 170 మీటర్ల ఎత్తులో నీటిని పంపాలంటే రూ.40 వేల కోట్లు ఖర్చు అవుతుందని అన్నారు. 11 బ్యారేజీలు, 12 లిఫ్టులు నిర్మించాల్సి ఉందని, గోదావరి కిలోమీటర్ వెడల్పు ఉండటంతో ఊళ్లు, భూములు మునిగిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందుకే ఎకరం భూమి కూడా మునగకుండా, ఒక్క ఇల్లుకు కూడా నష్టం జరుగకుండా రూ.1000 కోట్లతోనే ఏడాదిలోనే పునరుజ్జీవం పథకాన్ని చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోనసీమగా మారబోతోందని మంత్రి అన్నారు. పునరుజ్జీవం ద్వారా వరద కాలువ, కాకతీయ కాలువల మధ్య ఉన్న 70వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తొమ్మిదేళ్ల కాంగ్రెస్ హయాంలో మిడ్‌మానేరు కోసం రూ.106కోట్లు ఖర్చు చేశారని, తాము వచ్చాక వెంటనే మిడ్‌మానేరు పనులను వేగవంతం చేశామని, ఈ ఏడాదే మానకొండూర్, హుస్నాబాద్ ప్రాంతాలకు నీరందించబోతున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టులకు క్లియరెన్స్ కూడా రాలేదని, ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుకు క్లియరెన్స్ తుదిదశకు వచ్చిందన్నారు. మంథని ప్రాంతంలో 40వేల ఎకరాలకు నీరందించబోతున్నామని, ఆయకట్టు చివరి భూములైన మంథని, రామగుండం ప్రాంతాలకు నీరందించాలనే ఆలోచనతో రూ.806కోట్లతో కాలువల ఆధునీకరణకు చర్యలు చేపట్టామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు చేపట్టి పదేళ్లు అవుతోందని, కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతుంటే.. ఆంధ్రా ఎమ్మెల్యేలు, మంత్రులు ఆశ్చర్యపోతున్నారన్నారు. సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలు ప్రపంచ రికార్డు సృష్టించబోతున్నాయని తెలిపారు. రోళ్లవాగు ప్రాజెక్టు త్వరలోనే పూర్తి కాబోతోందని, త్వరలోనే మంచిర్యాల జిల్లా పరిధిలోని గూడెంలో లిఫ్టు ఏర్పాటు చేసి, గూడెం ప్రజలకు నీరందిస్తామని చెప్పారు.

రెవెన్యూ రికార్డుల శుద్ధికి
రూట్‌మ్యాప్ సిద్ధం

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల ప్యూరిఫికేషన్/అప్‌డేషన్ రూట్‌మ్యాప్ సిద్ధమైంది. ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. సెప్టెంబరు 15 నుంచి రెవెన్యూ గ్రామం యూనిట్‌గా భూమి రికార్డుల ప్రక్షాళన చేపట్టాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఆపరేషనల్ గైడ్‌లైన్స్ విడుదల కాగానే సర్వేను ఏ విధంగా చేయాలనే అంశంపై తర్ఫీదునిచ్చే అవకాశాలున్నాయని సమాచారం. మరోవైపు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి రైతు సమన్వయ సమితులపై ఇప్పటికే మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈ కమిటీలు ఏర్పడగానే గ్రామ రైతు సంఘాల సమన్వయ సమితులతో కలిసి పనిచేసేలా ఆదేశాలు ఇవ్వనున్నారు. తొలిదశలో ఒక్కో గ్రామంలో వివాదాల్లేని భూముల రికార్డులే సరి చేస్తారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో పూర్తిస్థాయి రికార్డుల ప్యూరిఫికేషన్ జరగ్గా, సంగారెడ్డిలో పూర్తికావస్తోంది. సిద్ధిపేటలోని ఒక గ్రామంలో ప్రయోగాత్మకంగా పూర్తి చేశారు. ఆయా జిల్లాల్లోని అనుభవాల ఆధారంగా స్పెషల్‌డ్రైవ్ జరుగనుంది. సెప్టెంబరు 15 నుంచి వంద రోజుల పాటు జరిగే కార్యక్రమంలో ఒక్కో రెవెన్యూ గ్రామంలో నెలరోజుల పాటు అధికారుల బృందం ఉండనుంది.

రేపటి నుంచి చేప పిల్లల పంపిణీ

- సింగూరు ప్రాజెక్టులో ప్రారంభం
- 14.76 లక్షల గొర్రెల పంపిణీ: తలసాని



హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 30 నుంచి ప్రారంభించనున్నట్లు పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. సింగూరు ప్రాజెక్టులో చేప ప్లిలను వదిలి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. సచివాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది 77 రిజర్వాయర్లు, 7,647 మత్స్య శాఖ చెరువులు, 20,391 గ్రామపంచాయతీ చెరువుల్లో 69.66 కోట్ల చేప పిల్లలను వదలనున్నట్లు పేర్కొన్నారు. చేప పిల్లల పంపిణీకి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసినట్టు చెప్పారు. నిర్ణీత సైజు, నాణ్యత లేని చేప పిల్లలను తిరస్కరించి వెనక్కు పంపాలని మత్స్యకారులకు సూచించారు. చేపప్లిలను నీటిలోకి వదిలే ప్రక్రియను వీడియో తీయిస్తున్నట్టు తెలిపారు. కాగా.. మత్స్యకారులు తమ చేపలను విక్రయించుకునేందుకు వీలుగా పెద్ద ఎత్తున మార్కెట్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. వారికి సబ్సిడీపై వాహనాలనూ అందజేస్తున్నామని పేర్కొన్నారు. మత్స్యకార సొసైటీల్లో సభ్యత్వానికి అర్హతగా ఉన్న చేపల వల విసరడం, ఈత రావడం వంటివి మినహాయించాలంటూ సూచించామని, సొసైటీ సభ్యులకు ప్రభుత్వమే ఈ నైపుణ్యాలపైన శిక్షణ ఇస్తుందని చెప్పారు. కాగా, రాష్ట్రంలో ఇప్పటివరకు 14,76,573 గొర్రెలను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. గొర్రెల కొనుగోళ్ల కోసం ప్రస్తుతానికి టెండర్లు పిలిచే యోచన లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పంపిణీ చేసిన గొర్రెల అమ్మకం వంటివి ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో చోటు చేసుకుంటే చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ పాల్గొన్నారు.

చెరువులే సిద్ధంగా లేవు!

చెరువుల్లోకి వదిలేందుకు చేప పిల్లలను మత్స్యశాఖ సిద్ధం చేసింది. కానీ వాటిని వదిలేందుకు చెరువులే సిద్ధంగా లేని పరిస్థితి నెలకొంది. నీటి పారుదల శాఖ సేకరించిన సమాచారం ఆధారంగా.. రాష్ట్రంలోని 25,115 నీటి వనరుల్లో పంపిణీకిగాను 69.66కోట్ల చేపపిల్లల సేకరణకు మత్స్యశాఖ టెండర్లు నిర్వహించింది. జిల్లాల వారీగా చేప పిల్లల ధర కూడా ఖరారైంది. అయితే సరిపడా వానలు లేకపోవడంతో చెరువులు నిండలేదు. దీంతో చేప పిల్లలు పెంచడానికి అనువుగా ఎక్కువ సంఖ్యలో చెరువులు తయారు కాని పరిస్థితి కనిపిస్తోంది. చెరువులో చేప పిల్లలు మనగలిగి.. మత్స్యకారులకు గిట్టుబాటు కావాలంటే ఆయా చెరువుల్లో కనీసం 1/3వంతు నీరు నిల్వ ఉండాలి. రాష్ట్రంలో చేపల పెంపకానికి అవసరమైన కనీస నీటి నిల్వ ఉన్న వనరులు 7,108 మాత్రమే ఉన్నాయి. అంటే చేపలు పెంచడానికి వీలైన నీటి వనరుల్లో కేవలం 30% మేర అవసరమైనంతగా నీటి నిల్వలు ఉన్నాయి. ఈ నీటి వనరుల్లో పెంచడానికి 32.92 కోట్ల చేప పిల్లలు సరిపోతాయని మత్స్యశాఖ అంచనా వేసింది.

అంగన్‌వాడీ కేంద్రాలకు
'రేషన్' నుంచే సరుకులు

- 60 ఏళ్లు నిండిన టీచర్లకు 60 వేలు
- ఆయాలకు 30 వేల వన్‌టైం సెటిల్‌మెంట్ వేతనం: తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సెప్టెంబరు నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో తన చాంబర్‌లో మహిళా శిశు సంక్షేమంపై ఆయన సమీక్షించారు. అంగన్‌వాడీ టీచర్ బయోమెట్రిక్ ఆధారంగా పిల్లల సంఖ్య మేరకు రేషన్ సరుకులను అందించనున్నట్టు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తోన్న 60ఏళ్లు నిండిన టీచర్లకు 60 వేలు, ఆయాలకు 30 వేల చొప్పున వన్‌టైం సెటిల్‌మెంట్ కింద డబ్బులు అందించనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించినట్లు అధికారులు మంత్రికి తెలిపారు. అలాగే వెనుకబడిన ప్రాంతాల్లో కొత్తగా 300అంగన్‌వాడీ మోడల్ భవనాలు నిర్మించనున్నట్టు మంత్రి తెలిపారు. వీటిని నిర్మించేందుకు వేదాంత ఫౌండేషన్ ముందుకొచ్చిందన్నారు. సంబంధించి భూములను ఆ సంస్థకు అప్పగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, మొత్తం ప్రక్రియను 15 రోజుల్లో పూరి చేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలను వెంటనే నిర్మించాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిని వెంటనే శాశ్వత భవనాలకు మార్చాలని మంత్రి అదేశించారు. సమీక్షలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జగదీశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్య ప్రక్షాళన!

- రంగం సిద్ధం చేసిన ఉన్నత విద్యామండలి

హైదరాబాద్, అగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే రాష్ట్రంలో అస్తవ్యస్తంగా ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలను ప్రక్షాళన చేసిన ప్రభుత్వం ఇప్పుడు డిగ్రీ విద్య ప్రక్షాళనపై దృష్టి సారించింది. ఇందుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి చర్యలు ప్రారంభించింది. ప్రైవేటు కాలేజీల్లో క్రమంగా సీట్లకు కోత పెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఆ తర్వాత నిబంధనలు పాటించని, అడ్మిషన్లు కాని కాలేజీలను మూసివేయనుంది. ఇందుకోసం సీట్ల భర్తీ ప్రాతిపదికన సరికొత్త నిబంధనను అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే అన్ని వర్సిటీలకు ఉన్నత విద్యామండలి ఆదేశాల్చింది. డిగ్రీలో ప్రవేశాలకు ప్రస్తుతం కౌన్సెలింగ్ జరుగుతున్న నేపథ్యంలో త్వరలోనే కాలేజీల వారీగా సమాచారాన్ని సేకరించి కొరడా ఝుళిపించనున్నారు.

25శాతం సీట్లు భర్తీ కాకుంటే అంతే సంగతి

డిగ్రీ కాలేజీల ప్రక్షాళనలో భాగంగా ఉన్నత విద్యామండలి నిర్ణయం ప్రకారం ప్రతి గ్రూపులోనూ 25% సీట్లు కచ్చితంగా భర్తీ కావాల్సి ఉంది. అంతకు తక్కువగా భర్తీ అయితే సదరు కాలేజీలో ఆ గ్రూపును రద్దు చేయబోతున్నారు. ప్రతి కాలేజీలో ప్రతి గ్రూపునకు కనీసం 60 సీట్లను కేటాయించారు. అంటే ప్రతి గ్రూపులో 60 సీట్లకు కనీసం 15 సీట్లు తప్పనిసరి భర్తీ కావాలి. మరో రెండు మూడు రోజుల్లో డిగ్రీ ప్రవేశాల కౌన్సెలింగ్ ముగియనుంది. ఆ తర్వాత కాలేజీల వారీగా లెక్కలు తీసి చర్యలు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కాలేజీల్లో ఆ గ్రూపుల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థుల భవిష్యత్‌పై అయోమయం నెలకొంది. ఆ విద్యార్థులను దగ్గర్లోని కాలేజీల్లో సర్దుబాటు చేయాలని నిర్ణయించారు. కౌన్సెలింగ్‌లో నచ్చిన కాలేజీని ఎంచుకున్న విద్యార్థులను వేరే కాలేజీలకు పంపిస్తే ఏవిధంగా స్పందిస్తారనేదే ప్రశ్న.

మిగులుకు చెక్...

1092 డిగ్రీ కాలేజీల్లో 4,10,267 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 956 కాలేజీలు ప్రైవేటువే కావడం గమనార్హం. ఆయా కాలేజీల్లో 3,47,420 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది మూడో విడత కౌన్సెలింగ్ ముగిసే నాటికి మొత్తం సీట్లకుగానూ 1,85,945 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 2,07,423 సీట్లు మిగిలిపోయాయి. ప్రైవేటు కాలేజీల్లోనే 1,80,586 సీట్లు మిగిలిపోవడం గమనార్హం. గత ఏడాది కూడా దాదాపు 2.5 లక్షల సీట్లు మిగిలాయి. ఈ నేపథ్యంలో సీట్ల సంఖ్యతో పాటు కాలేజీల సంఖ్యను కూడా సగానికి తగ్గించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది.

సెప్టెంబరు 1 నుంచి 7 వరకు
బీజేపీ తెలంగాణ విమోచన యాత్ర

- 17న నిజామాబాద్‌లో బహిరంగ సభ
- హాజరుకానున్న హోంమంత్రి రాజ్‌నాథ్

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినంగా అధికారికంగా నిర్వహించాలన్న డిమాండ్‌తో వచ్చే నెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు విమోచన యాత్ర చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె.లక్ష్మణ్ నేతృత్వంలో జరిగే ఈ యాత్ర షెడ్యూల్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గం సోమవారం ఖరారు చేసింది. సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి యాత్రను ప్రారంభిస్తారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం, రజాకార్లను ఎదిరించి అసువులుబాసిన భువనగిరి, బైరాన్‌పల్లి, కూటిగల్, జనగామ, వరంగల్, పరకాల, తిరుమలగిరి, నిర్మల్, కొమరంభీం తదితర ప్రాంతాలను సందర్శించి సెప్టెంబరు 7న హైదరాబాద్ చేరుకుంటుంది. 17న నిజామాబాద్ జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, ఈ సభకు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వస్తారని బీజేపీ నేతలు తెలిపారు. షెడ్యూల్‌ను లక్ష్మణ్ మంగళవారం మీడియాకు విడుదల చేస్తారు.

అమిత్‌షా తెలంగాణ
పర్యటన వాయిదా!

బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా మలివిడత తెలంగాణ పర్యటన వాయిదా పడే అవకాశం ఉంది. గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలో సెప్టెంబరు 10, 11, 12 తేదీల్లో జరపాల్సిన అమిత్‌షా పర్యటన అక్టోబరుకు వాయిదా పడినట్లు బీజేపీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. సెప్టెంబరు 17 బహిరంగ సభ ఏర్పాట్ల దృష్ట్యా కూడా అమిత్‌షా పర్యటనను వాయిదా వేసుకున్నట్లు సమాచారం.

కేసీఆర్ నకిలీ సర్వేలు, బోగస్ అవార్డులు

- 3.5 వేల రైతులు చనిపోతే అవార్డులా?
- ఓటమి భయంతోనే నెలవారీ సర్వేలు: ఉత్తమ్
- భూసర్వే టీఆర్ఎస్‌కే పరిమితమా: షబ్బీర్, పొంగులేటి

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్ నకిలీసర్వేలు, బోగస్ అవార్డులతో ప్రజలను, టీఆర్ఎస్ కార్యకర్తలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఆయనంత అబద్ధాల కోరు దేశంలో ఎవరూ లేరని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బషీర్‌బాగ్‌లోని విద్యుత్ అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన తర్వాత గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల భయం పట్టుకున్నందునే కేసీఆర్ నెలానెలా సర్వేలు చేయించుకుంటున్నారన్నారు. ప్రజలు టీఆర్ఎస్ పట్ల సంతోషంగా లేరని, వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్తారన్నారు. టీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో సర్వేల గురించి తప్ప ప్రజా సమస్యలను చర్చించలేదన్నారు. ప్రైవేటు విత్తన సంస్థ ఇచ్చిన అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు గురించి టీఆర్ఎస్ నేతలు ప్రచారార్భాటం చేస్తున్నారన్నారని, రాష్ట్రంలో ఈ మూడేళ్లలో 3,500 మంది రైతులు ఆత్మహత్యచేసుకుంటే సీఎం అవార్డులు తీసుకోవడమేంటని ప్రశ్నించారు. గిట్టుబాటు ధరల కోసం రైతులు ఆందోళన చేస్తే వారికి సంకెళ్లు వేసి జైల్లో పెట్టారన్నారు. విద్యుత్ చార్జీలపై నాడు చంద్రబాబు అనుసరించిన విధానాలనే నేడు కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. కాగా, భూ సర్వే టీఆర్ఎస్ పార్టీ వ్యవహారమా, ప్రభుత్వ కార్యక్రమమా.. అని శాసన మండలిలో విపక్ష నేత షబ్బీర్ అలీ ప్రశ్నించారు. భూ సర్వేపై అఖిల పక్షాన్ని పిలవాలని, అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపర్చాలని డిమాండ్ చేశారు. విపక్ష నేతలను వివిధ కమిటీల్లో తీసుకునేందుకు ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. టీఆర్ఎస్‌లో 90% మంది ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని, ఫిరాయించిన వారూ సంతోషంగా లేరన్నారు. పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ నేతలతో సర్వే చేయించాలని కేసీఆర్ అనుకుంటున్నారని, ఇది రైతులతో ఆడుతున్న మైండ్ గేమ్ అన్నారు. రైతు సంఘాలను కూడా టీఆర్ఎస్ రైతు సంఘాలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు.


విద్యుత్తు ఉద్యమ అమరులకు నివాళులర్పిస్తున్న ఉత్తమ్ తదితరులు

'విద్యుత్'ను ప్రైవేటీకరించే కుట్ర: వామపక్షాలు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో చంద్రబాబు, కేసీఆర్ ప్రభుత్వాలు మళ్లీ విద్యుత్ సంస్కరణలు అమలుచేస్తూ ఈ రంగాన్ని ప్రైవేటుపరంచేసే కుట్ర పన్నుతున్నారని వామపక్షాల నేతలు ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా చేపట్టిన ఆందోళనల్లో అమరులైన వారి స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని విద్యుత్ అమరుల స్థూపం వద్ద నివాళి అర్పించారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం నిరసన తెలిపే అవకాశమూ ఇవ్వ డం లేదని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రపంచబ్యాంకు, నీతిఆయోగ్ సలహాలతో విద్యుత్ పంపిణీ సంస్థల ప్రైవే టీకరణకు మోదీ సర్కారు ప్లాన్ చేస్తోందని సీపీఎం నేత రాఘవులు అన్నారు.

కేసీఆర్.. ఓ డేరా బాబా: రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఏపీకి వైసీపీ అధినేత వైఎస్ జగన్, తెలంగాణకు సీఎం కేసీఆర్ డేరా బాబాలు అని టీడీపీ-టీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. జగన్ డేరా నంద్యాలలో లేచిపోయిందని, ఇక లేపాల్సిన డేరా తెలంగాణలోనే మిగిలి ఉందన్నారు. రాజ్యం, భార్యాబిడ్డలతో పాటు సర్వస్వం కోల్పోయినా జీవితంలో ఏనాడూ అబద్ధం చెప్పని వ్యక్తి హరిశ్చంద్రుడైతే ఆయనకు పూర్తి విరుద్ధంగా జీవితంలో ఒక్క నిజం కూడ చెప్పని వ్యక్తి కేసీఆర్ అన్నారు. కేపీహెచ్‌బీ బస్టాండ్‌వద్ద టీడీపీ జెండా దిమ్మెను ఆగంతకులు ఇటీవల కూల్చివేయగా, కొత్తగా నిర్మించిన దిమ్మెపై సోమవారం రేవంత్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్, ఆయన భజన బృందం టీడీపీ జెండా దిమ్మెలపై చెయ్యేస్తే తాము కేసీఆర్ అధికార గద్దెను ధ్వంసం చేస్తామన్నారు. టీడీపీ నుంచి గెలిచి టీఆర్ఎస్‌లో చేరిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావుపైనా నిప్పులు చెరిగారు.

భూసర్వేతో ఒరిగేదేముండదు: బీజేపీ

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సమగ్ర భూసర్వేతో రైతులకు ఒరిగేదేమీ ఉండదని, సమగ్ర కుటుంబ సర్వే మాదిరిగానే ఈ సర్వే కూడా వృథా ప్రయాసగా మిగిలిపోతుందని బీజేపీ అధికారప్రతినిధి కృష్ణసాగర్‌రావు విమర్శించారు. సర్వేతో ఏం సాధించాలనుకుంటున్నారో సీఎం కేసీఆర్ చెప్పలేదని, భూములను పరిరక్షిస్తారా? ఇంకేమైనా చేస్తారా? అని అనుమానం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. సమగ్ర భూసర్వే, రైతు సమాఖ్యల పేరుతో సీఎం కేసీఆర్ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కేసీఆర్‌ది లక్ష్యం లేని టైంపాస్ ప్రభుత్వమన్నారు.

దళితులపై పెరిగిన దాడులు: కేరళ మాజీ స్పీకర్

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనలో దళితులపై దాడులు పెరిగాయని కేరళ మాజీ స్పీకర్, దళిత్ ముక్తి సోషన్ మంచ్(డీఎస్ఎంఎం) జాతీయనేత రాధాకృష్ణన్ ఆరోపించారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో పోరాడుతామన్నారు. డీఎస్ఎంఎం జాతీయ కమిటీ సమావేశాలు ఇక్కడ సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా డీఎస్ఎంఎం జాతీయ సమన్వయకర్త వి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణలో పరువు హత్యలు పెరిగిపోతున్నాయన్నారు.

నేరుగా కరెంట్ సబ్సిడీ

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు రంగంలోనూ నగదు బదిలీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సూచించింది. విద్యుత్తు చార్జీల సబ్సిడీని నేరుగా వినియోగదారులకే అందించాలని సిఫారసు చేసింది. అందులోనూ, నిరుపేదలు, అవసరం ఉన్న వారికే విద్యుత్తు సబ్సిడీ ఇవ్వాలని స్పష్టం చేసింది. క్రాస్ సబ్సిడీ, టారిఫ్‌లపై ఇటీవల జాతీయ స్థాయిలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా క్రాస్ సబ్సిడీని తగ్గించుకోవాలంటే విద్యుత్తు సబ్సిడీని నేరుగా వినియోగదారులకే ఇవ్వాలని కేంద్రం సూచించింది. ఈ మేరకు మార్గదర్శకాలూ జారీ చేసింది. ఇప్పటికే గ్యాస్ సబ్సిడీతో పాటు పలు పథకాలకు నగదు బదిలీ విధానం అమలవుతోందని, ఇదే విధానాన్ని విద్యుత్ వినియోగదారులకూ అమలు చేయాలని, క్రమంగా క్రాస్ సబ్సిడీని రద్దు చేయాలని తెలిపింది. నిజానికి, గృహ వినియోగదారులకు ఏటా తెలంగాణ ప్రభుత్వం రూ.1541.39 కోట్లు సబ్సిడీగా అందిస్తోంది. వ్యవసాయ రంగానికి రూ.3235.66 కోట్లు సబ్సిడీ ఇస్తోంది. ఈ రాయితీని ప్రతి ఏటా బడ్జెట్లో ప్రవేశపెట్టి డిస్కమ్‌లకు అందిస్తోంది. ఇందులో భాగంగా 50 యూనిట్లలోపు వాడే వారికి రూ.1.45కు; 51-100 యూనిట్లలోపు వాడే వారికి రూ.2.60కు; 101-200 యూనిట్లలోపు వారికి 4.30 రూపాయలు.. ఇలా వివిధ టారిఫ్‌ల ప్రకారం డిస్కమ్‌లు విద్యుత్తును సరఫరా చేస్తున్నాయి. ఎస్పీడీసీఎల్ పరిధిలో 100 యూనిట్లలోపు వాడే వినియోగదారులకు యూనిట్‌కు సరాసరిన రూ.2.08 చొప్పున డిస్కమ్ వసూలు చేస్తోంది. కానీ, ఎస్పీడీసీఎల్ పరిధిలో 100 యూనిట్లలోపు వాడకానికి యూనిట్‌కు అయ్యే ఖర్చు రూ.2.08 కాగా.. ఎన్పీడీసీఎల్‌లో ఇది రూ.8.17! ఎల్టీ-1 (బీ-1) పరిధిలో 101-200 యూనిట్ల శ్లాబ్‌లో ఒక్కో యూనిట్‌కు డిస్కమ్ రూ.4.30 వసూలు చేస్తోంది. కానీ, ఆ యూనిట్ ఉత్పత్తికి ఎన్పీడీసీఎల్‌కు రూ.7.40 ఖర్చవుతోంది. రెండు డిస్కమ్‌ల పరిధిలో వేర్వేరుగా ఖర్చవుతున్నా వినియోగదారులకు ఒకే టారిఫ్ అమలు చేస్తోంది. సబ్సిడీ ఇవ్వడం ద్వారా రేట్లను సమం చేస్తోంది. ఈ సబ్సిడీ సొమ్ములు రాబట్టుకోవడానికి హెచ్‌టీ వినియోగదారులకు క్రాస్ సబ్సిడీ అమలు చేస్తోంది. 200 యూనిట్లలోపు వినియోగదారులకు సబ్సిడీ ఇవ్వడానికి డిస్కమ్‌లు ఓపెన్ యాక్సెస్ (బహిరంగ విపణి)లో కరెంట్ కొంటున్న వారి నుంచి అదనపు క్రాస్ సబ్సిడీని వసూలు చేస్తున్నాయి. హెచ్‌టీ వినియోగదారుల నుంచి 11 కేవీ అయితే రూ.1.63 నుంచి రూ.2.03 వరకూ; 33 కేవీకి రూ.1.44- రూ.1.46 దాకా, 132 కేవీకి రూ.1.30-రూ.1.31 దాకా వసూలు చేస్తున్నాయి. ఆ సొమ్మును పేదలకు రాయితీ ఇవ్వడానికి ఖర్చు పెడుతున్నాయి. ఈ విధానం వద్దని కేంద్రం కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తోంది. రాయితీని నేరుగా వినియోగదారుడికే ఇవ్వాలని సూచించింది. పలు వర్గాలతో సంప్రదింపుల అనంతరం తెలంగాణ ప్రభుత్వానికి, డిస్కమ్‌ల సీఎండీలకు లేఖ రాసింది. అయితే, కేంద్రం చేసిన సూచనలను రాష్ట్రంలో అమలు చేసే అవకాశాల్లేవని అధికారులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కేంద్రం ఎప్పటి నుంచో ఇటువంటి సూచనలు చేస్తోందని వివరించారు.

వినియోగదారుడు	వసూలు చేస్తున్నది	అయ్యే ఖర్చు ఎస్పీడీసీఎల్	ఎన్పీడీసీఎల్	ప్రభుత్వం భరించే సబ్సిడీ
ఎల్టీ-1 (0-50 యూనిట్లలోపు)	రూ.1.45	రూ.2.08	రూ.8.17	
51-100 యూనిట్లు	రూ.2.60	రూ.2.60	రూ.7.23	రూ.1541.39 కోట్లు
హెచ్‌టీ-1(ఏ)				
11 కేవీ	రూ.6.65	రూ.6.65	రూ.6.65	
33 కేవీ	రూ.6.15	రూ.6.15	రూ.6.15	
132 కేవీ ఆ పైన	రూ.5.65	రూ..5.65	రూ.5.65	



మీ కాళ్లు మొక్కుతాం.. పరిహారమిప్పించండి

సంగారెడ్డి జిల్లాలోని కందిలో వ్యవసాయ ఇంజనీరింగ్ కాలేజీ, హాస్టల్ భవనాన్ని మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలేజీ భవన నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు అక్కడికి వచ్చారు. తాము కోల్పోయిన భూములకు పరిహారమిప్పించాలంటూ మంత్రిని వేడుకున్నారు. 'మీ కాళ్లు మొక్కుతాం' అంటూ మంత్రికి దణ్ణంపెట్టారు. - కంది

కాళేశ్వరానికి సమ్మతమే

పరిహారం చెల్లింపుపైనే కొన్ని చోట్ల అభ్యంతరాలు.. ప్రాజెక్టు నిర్మాణంపై ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ

- 15 జిల్లాల్లో సభలు.. 832 మంది అభిప్రాయాలు

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజలందరి నుంచీ ఆమోదం లభించింది. బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు, కరువును పారదోలేందుకు ప్రాజెక్టును నిర్మించాల్సిందేనని ముక్తకంఠంతోకోరారు. అయితే ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్నవారు, ముంపునకు గురవుతున్నవారి నుంచి పరిహారం చెల్లింపు విషయంలోనే అక్కడక్కడ కొన్ని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, పర్యావరణ ప్రభావంపై ఈ నెల 22 నుంచి చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ శనివారం ముగిసింది. ప్రజాభిప్రాయ సేకరణ సభలు విజయవంతమైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భూపరిహారం చెల్లింపుపై వచ్చిన అభ్యంతరాలు, వినతులను భవిష్యత్తులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవడానికి కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రభావం ఉన్న 15 జిల్లాల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. 22న కరీంనగర్, మేడ్చల్, యాదాద్రి, నిజామాబాద్ జిల్లాల్లో, 23న కామారెడ్డి, నల్లగొండ, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లో, 24న జగిత్యాల, నిర్మల్, మెదక్‌జిల్లాల్లో, 26న భూపాలపల్లి, మంచిర్యాల, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ సభలు నిర్వహించారు. ఈ సభల్లో 832 మంది అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఎవరూ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మాట్లాడలేదు. కొన్ని ప్రాంతాల్లో మాత్రం సేకరిస్తున్న భూముల ధర పెంచాలని, గ్రామానికి వచ్చి ధర నిర్ణయించాలని కోరారు. ముంపు ప్రాంతాల్లో పునరావాస కార్యక్రమాలపై ప్రజలు తమ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి.. సమస్యలను పరిష్కరించిన తర్వాతే భూములను సేకరిస్తామనే హామీ ఇచ్చారు. దాంతో ప్రాజెక్టు నిర్మాణంతో పర్యావరణంపై ప్రజల నుంచి ఎలాంటి వ్యతిరేకత వ్యక్తం కాకపోవడంతో అధికారులు ఈ ప్రక్రియను సవ్యంగా పూర్తి చేశారు. కాగా పెద్దపల్లి జిల్లాలో మాత్రం కొంత వివాదం తలెత్తింది. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలు వ్యక్తం చేసి, ఆందోళన నిర్వహించింది. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం పెద్దగా ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కాలేదు. కాగా ఈ ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రత్యేక నివేదికను రూపొందిస్తున్నారు. త్వరలోనే దానిని కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. అనంతరం కేంద్రం ఈ నివేదిక ఆధారంగా ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతులను జారీ చేయనుంది.

ప్రజాభిప్రాయ సేకరణ వివరాలు

జిల్లా పేరు	సభలో మాట్లాడిన వారి సంఖ్య
కరీంనగర్	23
మేడ్చల్	41
యాదాద్రి	96
నిజామాబాద్	47
కామారెడ్డి	75
నల్లగొండ	45
సంగారెడ్డి	43
పెద్దపల్లి	29
జగిత్యాల	35
నిర్మల్	45
మెదక్	69
భూపాలపల్లి	64
మంచిర్యాల	44
సిరిసిల్ల	70
సిద్దిపేట	106
మొత్తం	832

రైతుల ఆత్మహత్యలు ఆపుతాం

- వారి ఆదాయాలను రెట్టింపు చేస్తాం
- రుణపరపతిని పెంచుతాం
- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 28: రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు 2022 నాటికల్లా రైతుల ఆదాయాలను రెట్టింపు చేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. రుణ పరపతి తక్కువగా అందే రాష్ట్రాలు, తూర్పు ప్రాంత రాష్ట్రాలు, జమ్మూకశ్మీరులోని రైతులకు తగిన విధంగా పంటల రుణాలు లభ్యమయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కేంద్ర వ్యవసాయ శాఖ కోర్టుకు తెలిపింది. పంజాబ్‌కు చెందిన ఒక ఎన్జీవో దాఖలు చేసిన పిల్ సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ ఎంబీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. "రైతుల అల్పాదాయాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. గణనీయ సంఖ్యలో రైతులు దారిద్ర్యరేఖకు దిగువన జీవించడం బట్టి వ్యవసాయ రంగం ఎంత సంక్షోభంలో ఉందో స్పష్టమవుతోంది. రైతుల ఆదాయాలను పెంచడం ద్వారానే అన్నదాతల ఆత్మహత్యలను ఆపవచ్చు. ఈ అవగాహనతోనే 2022నాటికల్లా రైతుల ఆదాయాలను రెట్టింపు చేసే విధంగా కృషి చేస్తాము" అని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ లక్ష్య సాధనగా వ్యవసాయ, సహకార శాఖ రైతుల ఆదాయాలలోని వివిధ కోణాలను పరిశీలించి తగిన వ్యూహాన్ని సిఫార్సు చేసేందుకు అంతర్ మంత్రిత్వ శాఖ కమిటీని ఏర్పాటు చేసిందని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది.

ఎమ్మెల్యే చెన్నమనేని పౌరసత్వాన్ని 6 వారాల్లో తేల్చండి

- కేంద్ర హోంశాఖకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పౌరసత్వ అంశాన్ని ఆరువారాల్లో తేల్చాలని కేంద్ర హోంశాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది. తప్పుడు ధ్రువపత్రాలతో దేశ పౌరసత్వం పొందారని, ఆయన ఎన్నిక చెల్లదంటూ బీజేపీ నేత ఆది శ్రీనివాస్ దాఖలు చేసిన కేసును సోమవారం సుప్రీంకోర్టు విచారించింది. నిబంధనల ప్రకారం రమేశ్‌బాబు భారత పౌరసత్వం పొందారా లేదా అనేది తేల్చే బాధ్యత కేంద్ర హోంశాఖకు అప్పగించారు. 1993లో ఆయన దేశ పౌరసత్వాన్ని రద్దు చేసుకుని జర్మనీ పౌరసత్వం పొందారు. 2009 ఎన్నికల సమయంలో తిరిగి భారత పౌరసత్వాన్ని నిబంధనల మేర పొందలేదని, అందుకే ఆయన ఎన్నికను రద్దు చేయాలంటూ ఆయన చేతిలో ఓడిన ఆది శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించారు. పిటీషనర్ చెప్పినట్లు రమేశ్‌బాబు తప్పుడు ధ్రువపత్రాలతో పౌరసత్వం పొందారని ఉమ్మడి హైకోర్టు తీర్పు చెప్పింది. దీనిని సవాల్ చేస్తూ రమేశ్‌బాబు సుప్రీంకోర్టుకు వెళ్లారు. హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే విధించింది. ఇదే కేసులో 2016 ఆగస్టు 11న సుప్రీంకోర్టు ఆరునెలల్లో పౌరసత్వంపై వివాదాన్ని తేల్చాలని కేంద్ర హోంశాఖను ఆదేశించింది. సమయం సోమవారం ముగియడంతో సుప్రీం విచారణ చేపట్టింది.



అంగన్‌వాడీ టీచర్‌కు జాతీయ పురస్కారం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు మంగల్‌పల్లి అంగన్‌వాడీ టీచర్ కడారి మల్లమ్మకు జాతీయస్థాయి పురస్కారం లభించింది. ఈ నెల 31న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధి చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారం అందుకోనున్నారు. ఆమె చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

పూర్తికాల సీజేను నియమించాలి: లాయర్లు

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టుకు పూర్తికాల ప్రధాన న్యాయమూర్తిని నియమించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రాకు సీనియర్ న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీనియర్ న్యాయవాదులు సరసాని సత్యంరెడ్డి, ఎస్.రామచందర్‌రావు, టి.నిరంజన్‌రెడ్డి, గంగయ్యానాయుడు తదితరులు సోమవారం సీజేఐ కార్యాలయానికి వినతిపత్రం పంపారు. సమస్యలను దృష్టిలో ఉంచుకుని త్వరగా ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

నువ్వుకు బీమా నవ్వు

- పంటల బీమా జాబితాలో కొత్తగా చేర్చిన అధికారులు
- మండలం యూనిట్‌గా ఈ ఏడాది నుంచే అమలు
- పంటల బీమాపై సమన్వయ కమిటీ భేటీలో నిర్ణయం
- ప్రీమియం చెల్లింపునకు తుదిగడువులు ఖరారు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రబీ పంటల బీమా జాబితాలో ఈ ఏడాది కొత్తగా నూగు (నువ్వులు) పంటను చేర్చారు. మండలం యూనిట్‌గా దానికి బీమాను అమలు చేయబోతున్నారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన పంటల బీమా రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా (పీఎంఎఫ్‌బీవై) కింద రబీలో 12 పంటలకు బీమాను అమలు చేయాలని నిర్ణయించారు. వరి, జొన్న, మొక్కజొన్న, పెసర, మినుములు, శనగ, మిర్చి, పొద్దు తిరుగుడు, వేరుశనగ, ఉల్లి, నువ్వుల పంటలకు బీమాను అమలు చేయబోతున్నారు. ఇక, మామిడి పంటకు వాతావరణ ఆధారిత పంటల బీమా అమలు చేస్తారు. గ్రామం యూనిట్‌గా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వేరుశనగ పంటకు, ఆదిలాబాద్, గద్వాల్ జిల్లాల్లో శనగ పంటకు, ఆసిఫాబాద్ జిల్లాలో జొన్నకు బీమాను అమలు చేస్తారు. మిగిలిన 25 జిల్లాల్లో వరికి గ్రామం యూనిట్‌గా అమలు చేస్తారు. కాగా, ప్రీమియం చెల్లింపునకు పంటల వారీగా శనగకు నవంబరు 30, మామిడికి డిసెంబరు 15, మిగిలిన పంటలకు డిసెంబరు 31ని తుది గడువుగా ఖరారు చేశారు.

వీగిపోయిన కేసులపై 'పోస్టుమార్టం'

- డీజీపీ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ
- విచారణాధికారుల తప్పులపై సమీక్ష
- పునరావృతం కాకుండా చర్యలు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కేసుల్లో నిందితులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు... ఆయా అభియోగాలను కోర్టులో నిరూపించి శిక్షలు పడేలా చేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సగానికిపైగా కేసుల్లో ఇదే పరిస్థితి ఉండడంతో పరిస్థితి చక్కదిద్దడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కేసులు వీగిపోయే క్రమంలో దర్యాప్తు అధికారి ఎక్కడ తప్పు చేశాడనేదానిపై ఇక నుంచి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించనున్నారు. దర్యాప్తు అధికారులు చేసిన తప్పుల్ని ఎత్తిచూపడంతోపాటు పైకోర్టులో నిందితులకు శిక్షపడేలా చేయడం, భవిష్యత్‌లో దర్యాప్తు అధికారి తప్పు చేయకుండా ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ క్రమంలో న్యాయస్థానంలో కేసులు వీగిపోకుండా చర్యలు తీసుకోవడమే కాకుండా వీగిపోయిన కేసుల్లో ఎక్కడ లోపం జరిగిందనే దానిపై 'పోస్టుమార్టం' నిర్వహించేందుకు పోలీసు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా కమిటీలు ఏర్పాటు చేసి వీగిపోయిన కేసులను పునఃపరిశీలించనున్నారు. డీజీపీ నేతృత్వంలో అదనపు డీజీపీలు, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సభ్యులుగా ఉంటారు. ఐజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఉండే కేసులను ఏడాదికి ఒకసారి ఈ కమిటీ పరిశీలిస్తుంది. అదేవిధంగా క్రిమినల్ కేసులకు సంబంధించి సీఐడీలోని ఏడీజీ, ఐజీ స్థాయిలో ఉండే కమిటీ ప్రతినెలా పరిశీలిస్తుంది. కమిషనరేట్ స్థాయిలో కమిషనర్ అధ్యక్షతన జాయింట్ కమిషనర్, డీసీపీ క్రైమ్స్ ఆధ్వర్యంలో ఉండే కమిటీ, ఎస్పీ నేతృత్వంలో అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలోని కమిటీ ప్రతి నెలా కేసుల్ని పరిశీలిస్తుంది. ఈ క్రమంలో కింది స్థాయి అధికారులు, సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందిస్తారు. ఒకసారి జరిగిన తప్పిదం మరోసారి పునరావృతం కాకుండా, న్యాయస్థానంలో నిందితులకు శిక్ష పడేలా కసరత్తు చేస్తున్నారు.

తోడుగా.. స్పీడుగా..

తండ్రి తిప్పలు చూడలేక .. వ్యవసాయ యంత్రాల ఆవిష్కరణ

- కరెంటు, డీజిల్ అక్కర్లేని ఇంజన్లు
- కూలీలు లేకుండా కాయల ఏరివేత
- సోలార్‌తో పొలాలకు కాలువ నీళ్లు
- ఓ ఇంజనీరింగ్ విద్యార్థి పొలంబాట

నరసన్నపేట, ఆగస్టు 28 : పొలం పని అంటేనే పరుగు. నాట్లు వేసే, కోతలు కోసే, కాయలు యేరే కూలీల కోసం పరుగే పరుగు. లక్షలు ఖర్చుపెట్టి పంట వేసినా.. కూలీలు దొరకకపోతే అంతా మట్టిపాలే. అదేగనుక యంత్రాల వాడకాన్ని సాగులో పెంచితే రైతులకు ఈ తిప్పలు తప్పుతాయి కదా అనే ఆలోచన శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన పంచిరెడ్డి లక్ష్మీనారాయణని పొలం పట్టించింది. తన కళ్ల ముందు తండ్రి పడుతున్న అవస్థలు చూసి, ఆయన బరువు తగ్గించాలను కొన్నాడు ఈ ఇంజనీరింగ్ విద్యార్థి.. తమ పొలాన్నే ప్రయోగశాలగా చేసుకొని.. అనేక ఆవిష్కరణలు చేశాడు.



గతిశక్తితో నీటిని తోడే ఇంజన్

సాగు 'గతి'ని మార్చి..

ప్రవహించే నీటికి ఉండే గతిశక్తిని వినియోగించి ఎటువంటి విద్యుత్, డీజిల్ అవసరం లేకుండా నీటిని తోడే యంత్రాన్ని లక్ష్మీనారాయణ తయారుచేశారు. దీనికోసం కాలువల్లో నీరు ప్రవహించే మార్గంలో చెక్‌డ్యామ్ ఏర్పాటు చేసుకోవాలి. అక్కడ ఈ యంత్రాన్ని అమర్చితే, అందులోని టర్బన్లు తిరుగుతాయి. ఇలా 1,200 ఆర్‌పీఎం శక్తి ద్వారా నీటిని పంపులోకి పంపడం ద్వారా రోజుకు మూడెకరాల వరకు సాగునీరందించవచ్చు. గత ఆరేళ్లగా లక్ష్మీనారాయణ కుటుంబం ఈ యంత్రాన్నే వాడుతోంది.

'వేరు'...శనగ యంత్రం

రబీ కాలంలో తీసేపంట వేరుశనగ. ఈ కాలంలో గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులు జోరుగా సాగుతూ, కూలీల సమస్య ఉంటుంది. అలాగని ఆగితే, పంటను అడవి పందులు పాడుచేస్తాయి. ఈ విషయంలో తన తండ్రికి కొంత వెసులుబాటు కల్పించాలని లక్ష్మీనారాయణ భావించారు. కాయలను వేరు చేసే యంత్రాన్ని ఆవిష్కరించారు. కేవలం ఇద్దరు కూలీల సహాయంతో మొక్కల నుంచి కాయలను వేరుచేయడం ఈ యంత్రం ప్రత్యేకత. నిజానికి, ఇంతపనిని ఒక రోజులో పూర్తిచేయడానికి 20మంది పడతారు. దీని తయారీకి రూ.35వేలు ఖర్చు అయింది.

సోలార్ నీటి ఇంజన్

సౌరశక్తి విద్యుత్‌ని వ్యవసాయరంగానికి సంధానం చేసేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నది. రైతులకు సోలార్ విద్యుత్ ప్లేట్‌లను అందిస్తోంది. తండ్రితో పొలం వెళ్లినప్పుడల్లా ఆ ప్లేట్‌లను లక్ష్మీనారాయణ పరిశీలించేవారు. ఈ క్రమంలో వచ్చిన ఆలోచనే.. సోలార్ నీటి ఇంజన్ తయారీకి దారితీసింది. ఒక చిన్న ట్రక్కుపై సోలార్ పవర్ ప్లేట్‌లను అమర్చి.. అక్కడ ఉత్పత్తయ్యే విద్యుత్ శక్తితో పనిచేసే నీటి ఇంజన్‌ను తయారుచేశారు. పోర్టబుల్ సైజుతో ఉన్న ఈ ఇంజన్ తయారీకి రూ.1.20 లక్షలు ఖర్చయింది.



వేరుశనగ కాయలను వేరుచేసే యంత్రం, (ఇన్‌సెట్‌లో లక్ష్మీనారాయణ)



10 నిమిషాల్లో పిచికారీ పూర్తి

రెండు ఎకరాల పొలంలో పురుగుమందు పిచికారీ చేయడానికి ఆరుగురు కూలీలు రోజంతా పనిచేయాలి. పొలానికి పురుగు పట్టేసినా, ఏపుగా వచ్చిన పంటని చీడపీడలు ఆవహించినా.. కూలీలు దొరకకపోతే రైతులు చేయడానికి ఏమీ ఉండదు. ఇంట్లో తండ్రి తిప్పలు చూస్తూ పెరిగిన లక్ష్మీనారాయణ.. ట్రాక్టర్ స్పింకర్‌ను సిద్ధం చేశారు. ట్రాక్టరు వెనుక భాగంలో నాగలి షెట్టువలె ఈ స్పింకర్‌ని అమర్చి, పురుగుమందును ఉంచే డ్రమ్‌ను ఏర్పాటు చేశారు. ట్రాక్టర్ పొలంలో కొద్దిసేపు తిరిగితేచాలు.. పొలమంతా పిచికారీ అయిపోతుంది. ఆరుగురు మనుషులు రెండు ఎకరాల్లో రోజంతా చల్లే మందుని ఈ యంత్రం పది నిమిషాల్లో పిచికారీ చేసేస్తుంది.

పెట్టుబడులు తగ్గాయి



'వ్యవసాయంలో యాంత్రీకరణ విధానాలను అవలంభించడంతో అధిక దిగుబడులు సాధిస్తున్నాను. ఎటువంటి రసాయన మందులు, పురుగు మందులను వినియోగించకుండా కేవలం ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభిస్తున్నాం. మా వాడు తయారుచేసిన యంత్రాలతో సకాలంలో పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా పెట్టుబడులు తగ్గాయి.

-పంచిరెడ్డి సింహాచలం , లక్ష్మీనారాయణ తండ్రి. శ్రీరామపురం

అక్టోబరు వరకు అంతే!

- రాష్ట్రంలో కానరాని కాంగ్రెస్ కార్యకలాపాలు
- నిరుత్సాహంలో కార్యకర్తలు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పటిదాకా వేరు.. ఇకపై వేరు. నెల రోజుల్లో పార్టీని ప్రక్షాళన చేస్తాం. గడప గడపకూ తీసుకెళ్తాం.. ప్రభుత్వంపై పోరాట చేస్తాం' ఇదీ.. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కొత్త ఇన్‌చార్జిగా నియమితులైన ఆర్‌సీ కుంతియా ఇటీవల రాష్ట్రానికి వచ్చినప్పుడు చేసిన ప్రకటన. ఈ ప్రకటన చేసి పక్షం రోజులు గడిచిపోయాయి. కానీ, ప్రక్షాళన కాదు కదా.. కనీస స్థాయిలో కూడా కాంగ్రెస్ కార్యకలాపాలు కనిపించడంలేదు. కుంతియా వచ్చివెళ్లిన నాటి నుంచి గాంధీభవన్‌లో సందడే లేకుండా పోయింది. మొత్తంగా రాష్ట్ర కాంగ్రెస్‌లో స్తబ్ధత నెలకొంది. చివరికి సీఎం కేసీఆర్ "కాంగ్రెసోళ్లు వెధవలు" అని తిట్టినా స్పందించలేని పరిస్థితిలో తమ పార్టీ ఉండడాన్ని ద్వితీయ శ్రేణి కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్ని రోజులు ఈ పరిస్థితి అంటూ వారు నిరాశ చెందుతున్నారు. అక్టోబరు వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని కొందరు ముఖ్య నేతలంటున్నారు.

అక్టోబరులో ఏఐసీసీ ఎన్నికలు..

అక్టోబరులో ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల తంతు పూర్తవుతుంది. పనిలో పనిగా పీసీసీ అధ్యక్ష ప్రకటన జరుగుతుంది. అయితే ఇటీవల పార్టీలో సంభవించిన కొన్ని పరిణామాల నేపథ్యంలో అక్టోబరు ప్రకటన అనంతరమే పార్టీ కార్యకలాపాలు ముమ్మరం చేద్దామని టీపీసీసీ ముఖ్య నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కుంతియా.. 2019 వరకు ఇదే టీమ్ కొనసాగుతుందని చేసిన ప్రకటనతో కోమటిరెడ్డి బ్రదర్స్ ఫైర్ అయిన విషయం తెలిసిందే. కోమటిరెడ్డి బ్రదర్స్ బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు, సీనియర్ నేతలు ఢిల్లీకి పంపిన ఫిర్యాదులతో పార్టీలో అంతర్గత వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఏఐసీసీ ఎన్నికలు జరగక ముందే రాష్ట్ర ఇన్‌చార్జి ఇలాంటి ప్రకటనలు చేయడంపై కోమటిరెడ్డి సోదరులు బహిరంగంగా, ఇతర సీనియర్ నేతలు అంతర్గతంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికలు పీసీసీ అధ్యక్ష ఎన్నికలతో ముడిపడి ఉంటాయి కనుక అప్పటివరకు ఏమైనా జరగొచ్చని వారు వ్యాఖ్యానించారు. దీంతో కోమటిరెడ్డి బ్రదర్స్ ఏదో చక్రం తిప్పుతున్నారని పార్టీలో ప్రచారం జరిగింది. అయితే.. ఉత్తమ్ వర్గీయులు అక్టోబరు వరకు నిశ్శబ్దంగా ఉండి.. పీసీసీ అధ్యక్ష ప్రకటన జరిగిన తరువాత కార్యకలాపాలు కొనసాగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్ష పదవికి అధికారికంగా ఎన్నికలు జరగాలని ఏమీ లేకపోయినా.. తంతు మాత్రం పూర్తవుతుంది.

అధికారులు కావలెను..!

- గణేష్ బందోబస్తు పర్యవేక్షణకు ఆఫీసర్ల కొరత
- ఇతర రాష్ట్రాల సహకారం కోరుతున్న తెలంగాణ

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పోలీస్ శాఖను ఉన్నతాధికారుల కొరత పట్టిపీడిస్తోంది. అందుబాటులో ఉన్నవారికే అదనపు బాధ్యతలు అప్పగించి రోజువారీ విధులు ఎలాగోలా నెట్టుకొస్తున్నా.. ప్రత్యేక సందర్భాల్లో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. తాజాగా గణేష్, బక్రీద్ బందోబస్తును పర్యవేక్షించేందుకు ఇన్‌స్పెక్టర్, ఆపైస్థాయి అధికారులు తగినంతగా లేకుండా పోయారు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి రప్పించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఏపీతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి ఇన్‌స్పెక్టర్, ఆపైస్థాయి అధికారులను రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు ఆయా రాష్ట్రాల పోలీస్ అధికారులకు తెలంగాణ అధికారులు లేఖలు రాస్తున్నారు. హైదరాబాద్‌లో పోలీసుల అనుమతి తీసుకుని ఏర్పాటు చేసిన గణేష్ మండపాలు సుమారు 12 వేలకు పైగా ఉన్నాయి. ఇవి కాకుండా అనుమతి లేకుండా ఏర్పాటు చేసే గణేష్‌లను కూడా నిమజ్జనానికి తరలిస్తుంటారు. దీంతో బందోబస్తుకు భారీగా పోలీసులు కావాల్సి ఉంటుంది. కాగా, ఈ సారి ప్రతి మండపాన్ని జీపీఎస్‌తో అనుసంధానం చేసి కంట్రోల్ రూం నుంచే పర్యవేక్షిస్తున్నారు.



ఇద్దరు స్కూలు పిల్లలు ఊళ్ళో గ్రంథాలయం కోసం ఐదేళ్ళు పోరాటం చేసి, ఆఖరుకు విజయం సాధించిన స్ఫూర్తిగాథ ఇది.

ఆలోచన మంచిదైతే, ఆచరణలో అలసత్వం లేకపోతే, చిన్న ప్రయత్నం పెద్ద ఫలితాలనిస్తుందని నిరూపించిన ఈ కావ్య, సంధ్య... మన మధ్యనే ఉన్న మన లాంటి అమ్మాయిలే!

అచ్చంగా... రియల్ లైఫ్ హీరోయిన్స్!!



ఇదో ఇద్దరమ్మాయిల కథ

పట్టుదలే సాధనంగా



-నేతి కావ్య.

"మా నాన్న జగన్‌మోహన్ యాక్సిడెంటులో తీవ్రంగా గాయపడి పాక్షికంగా అంగవైకల్యాన్ని ఎదుర్కొంటున్నారు. దాంతో వేరే పనేమీ చేయలేక చిన్న పాన్‌షాప్ నడుపుతున్నారు. అమ్మ పేరు కుమారి. టైలరింగ్ బాగా వచ్చు కానీ కొన్నాళ్లుగా ఆరోగ్యంగా బాగా లేనందున ఆ పని చేయడం లేదు. నాన్న కష్టంతోనే కుటుంబం గడుస్తుంది. తన చిరు సంపాదనతోనే నాన్న నన్ను, తమ్ముడిని చదివిస్తున్నారు. నేను ఆరవ తరగతి నుంచి బహదూర్‌పల్లి జడ్‌పిహెచ్ స్కూల్‌లో చదివాను. నేను సంధ్యారాణి ఒకే క్లాసు. మేం ఎనిమిదవ తరగతి చదివేటప్పుడు టెక్ మహేంద్రలో చేస్తున్న చైతన్య, అమర్, పృథ్వీ రాజ్ సార్లు ప్రతి శనివారం మా స్కూలుకు వచ్చి బయట విషయాలను స్కూలు పిల్లలతో పంచుకునేవారు. అలా మాలో ఎంతో స్ఫూరిని రగిలించారు. చైతన్యగారి మాటల వల్లే మాకు గ్రంథాలయ ఏర్పాటు ఆలోచన వచ్చింది.

మా ఊరిలో గ్రంథాలయం ఉందా అని ఆరా తీస్తే మా పంచాయతీలో లేదని తెలిసింది. అప్పుడు బడిలో, ఊరిలో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేయడానికి కృషిచేయాలని నేను, సంధ్య నిశ్చయించుకున్నాం. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు సర్పంచ్ వల్లే తెలుసుకుని ఒక విజ్ఞాపన పత్రాన్ని తయారుచేశాం. మా క్లాస్‌మేట్స్ కూడా మాతో సహకరించారు. ఎక్కడ ఏ సమావేశం జరిగినా అక్కడకు వెళ్లి మా విజ్ఞాపన పత్రాలు పట్టుకుని ప్రదర్శన ఇవ్వడం మొదలెట్టాం. ఆ తర్వాత కాలంలో క్లాస్‌మేట్స్ కొందరు మాతో రావడం మానేసినా మేమిద్దరం మటుకు మా ప్రయత్నాలు ఆపలేదు. అలా గ్రంథాలయం కోసం మా పోరాటం ఆపకుండా రెండేళ్లు కొనసాగించాం. ఆ స్కూలులో మా చదువు పూర్తయినా గ్రంథాలయం కోసం పోరాటం మాత్రం ఆపలేదు. చివరకు సర్పంచ్ శ్రీనివాస్ గారు రెండు సంవత్సరాలు గడువు అడిగారు. పాత పంచాయతీ ఆఫీసు స్థానంలో కొత్త భవనం కట్టిస్తానని, అందులో రెండు గదులను గ్రంథాలయానికి కేటాయిస్తానని మాకు ఆయన మాటిచ్చారు. చివరికి సర్పంచ్‌గారు అన్నమాటను నిలబెట్టుకున్నారు. నూతన భవనం గ్రౌండ్‌ఫ్లోరులో రెండు గదులను గ్రంథాలయానికి కేటాయించారు. మేం చేసిన పోరాటానికి ముగ్ధులై 'తోపుడుబండి' సాదిక్ షేక్‌గారు గ్రంథాలయానికి మూడువేల పుస్తకాలను అందజేశారు. ఆయన ఇచ్చిన పుస్తకాలతోనే ఈ ఆగస్టు 13 నుంచి పంచాయతీ ఆఫీసులో గ్రంథాలయం మొదలైంది. పిల్లలకు నచ్చే పుస్తకాలు ఎన్నో మా ఈ గ్రంథాలయంలో ఉన్నాయి. ముఖ్యంగా మోటివేషనల్ బుక్స్, సైన్స్ బుక్స్, స్టోరీ బుక్స్, పిల్లల ప్రాజెక్టులకు ఉపయోగపడే పుస్తకాలు, ఆరోగ్యం, అల్లికలు సంబంధించిన పుస్తకాలున్నాయి. బహదూర్‌పల్లి జడ్పీ హైస్కూలు హెడ్‌మాస్టర్ రవీంద్రనాథ్‌గారు కూడా మాకు అండగా నిలబడ్డారు. ఇప్పుడు నేను బిఎస్‌సి కంప్యూటర్స్ చేస్తున్నాను. కానీ... నా లక్ష్యం మాత్రం సివిల్స్ సాధించడమే! పేద ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడానికే సివిల్స్‌ను నా మార్గంగా ఎంచుకున్నాను. నలుగురికీ పనికివచ్చే పని చేయమంటూ అమ్మ నన్ను ప్రోత్సహిస్తే, నాన్న ఆడపిల్ల అన్న వివక్షను ఎన్నడూ... చూపలేదు'

ఈ స్ఫూర్తి అంతటా రావాలి...

తోపుడుబండి మీద పుస్తకాలు పెట్టుకుని ఉచితంగా ఇస్తూ పుస్తకపఠనంపై అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాను. దీనికి మంచి స్పందన వచ్చింది. చాలా గ్రామాల్లో మా వూళ్లో గ్రంథాలయం పెట్టండి అంటూ అడిగిన వాళ్లు కోకొల్లలు. బహదూర్‌పల్లిలో ఇద్దరమ్మాయిలు గ్రంథాలయం కోసం చేసిన పోరాటం నన్ను ముగ్ధుణ్ణిచేసింది. ఇదే చైతన్యం పల్లెపల్లెలో, గ్రామ గ్రామాన పెంపొందాలి.

- సాదిక్, 'తోపుడుబండి'.

ఇద్దరమ్మాయిలు.. ఒక సర్పంచ్.. ఒక గ్రంథాలయం.. అంతేనా.. ఇంకేమైనా ఉందా..?

చెప్పుకోవాలే కానీ బోలెడు ఉంది. హైదరాబాద్-నిజామాబాద్ హైవేమీద కొంపల్లి దాటిన తర్వాత ఎడమవైపుకు ఏడు కిలోమీటర్లు లోపలికి వెడితే బహదూర్‌పల్లి అనే గ్రామం వస్తుంది. అక్కడ ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉంది. అందులో 2012లో సంధ్య, కావ్యలు ఎనిమిదవ తరగతి కలిసి చదివారు. అక్కడి నుంచి వీళ్ల కథ మొదలువుతుంది. బహదూర్‌పల్లికి చెందిన ఈ ఇద్దరమ్మాయిలూ పేదింటి పిల్లలు. ప్రజలలో హక్కుల చైతన్యం రగిలించే ఆలోచనలు వారివి. ఆ ఆలోచనలే వారిని తమ ఊళ్లో గ్రంథాలయాన్ని ప్రారంభించడానికి పోరాడేలా చేశాయి... అంతేకాదు కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి ఉండాలని ఈ అమ్మాయిలు తమ ఊరి ప్రజలను 'ఎడ్యుకేట్' చేస్తున్నారు. సమాచార హక్కు గురించి కూడా తమ గ్రామస్థులను చైతన్యపరిచారు. ఓటు హక్కులో వారికున్న ఛాయిస్‌ను తెలియజెప్పారు.



క్రెడిట్ వీళ్లదే...



ఈ ఇద్దరమ్మాయిలు 8వ తరగతి చదివేటప్పుడు బడిలో, ఊరిలో గ్రంథాలయం పెట్టాలని అడిగారు. ఊరులో జరిగిన సభలు, సమావేశాలప్పుడు వినతిపత్రాలతో సభాప్రాంగణంలో నిలబడి వారి గ్రంథాలయ స్థాపన డిమాండ్‌ను గుర్తుచేసేవారు. చివరికి గ్రామపంచాయతీ నూతన భవనంలోనే రెండు గదులను లైబ్రరీకి కేటాయించాం. గ్రంథాలయ అభివృద్ధికి రెండులక్షల రూపాయలను ఖర్చుచేయాలని కూడా పంచాయతీ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. ఊరికి గ్రంథాలయం తెచ్చిన క్రెడిట్ మాత్రం ఈ ఇద్దరమ్మాయిలదే.

- శ్రీనివాస్, సర్పంచ్, బహదూర్‌పల్లి

ప్రచారం చేస్తాం



-కావేటి సంధ్యారాణి

"మా అమ్మ ప్రమీల టైలర్. నాన్న సత్యనారాయణ ఒక ప్రైవేటు కంపెనీలో చిరుద్యోగి. మా అమ్మానాన్నలకు మేం ముగ్గురం కూతుళ్లం. వాళ్లల్లో నేనే పెద్దదాన్ని. ఆడపిల్లలమనే వివక్ష మా కుటుంబంలో లేనే లేదు. నేను ప్రస్తుతం ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. నా లక్ష్యం మాత్రం డాక్టర్ కావాలనే! ఎందుకంటే నాకు బయాలజీ అంటే చాలా ఇష్టం. అందుకే నా లక్ష్యాన్ని తప్పకుండా సాధిస్తాను. కావ్య, నేను క్లాస్‌మేట్స్. నేనిప్పుడు ఇంత అనర్గళంగా మాట్లాడుతున్నానంటే అది కావ్య వల్లే. చదువులో ఇద్దరం ఒకరికి ఒకరం ఏమాత్రం తీసిపోయేవాళ్లం కాదు. కావ్యకి చర్చల్లో, వక్తృత్వపు పోటీలలో పాల్గొనడమంటే చాలా ఇష్టం. చైతన్య సార్ మాకు చదవంటే క్లాసు పుస్తకాలే కాదని ఏనాడైతే చైతన్య పరిచారో ఆరోజే మా ఆలోచనా పరిధి విస్తృతమైంది. బయట విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది. అలా ఊర్లో గ్రంథాలయం ఏర్పాటు చేయడానికి పూనుకున్నాం. సత్యాగ్రహ పంథాలో గ్రంథాలయం కోసం వినతిపత్రాలు పట్టుకుని ప్రతి సమావేశంలోనూ సర్పంచ్, ఇతర ప్రముఖులకు ఇచ్చేవాళ్లం. అలా ఆలస్యంగానైనా సరే మా గ్రంథాలయ కోరికను నెరవేర్చుకున్నాం. ఓటుహక్కులో వ్యక్తులకున్న స్వేచ్ఛ, ఛాయిస్‌ల గురించే కాకుండా కులమతాలకు అతీతంగా ప్రజలు కలిసి ఉండాలని, సమాచార హక్కు వల్ల పొందే ప్రయోజనాలపై ఊళ్లోని ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను కూడా నిర్వహించాం.

బహదూర్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్, 'తోపుడుబండి' సాదిక్, బహదూర్‌పల్లి జడ్‌పిహెచ్‌ఎస్ హెడ్‌మాస్టర్ రవీంద్రనాథ్ వంటి వారి తోడ్పాటుతో ఊరిలోని ఎందరో పిల్లలకు రకరకాల పుస్తకాలను నేడు అందుబాటులోకి తేగలిగాం. దీన్ని ఇంకా అభివృద్ధి చేస్తాం. నేను ఊర్లో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని మా నాన్న ఏనాడూ అడ్డుకోలేదు. అంతేకాదు 'బాగా చదువకుని మీ కాళ్ల మీద మీరు నిలబడండి' అని ఎప్పుడూ నాన్న అంటారు. ఒక దశలో నాన్నకు ఒంట్లో బాగుండకపోవడంతో నేను చదువు మానేశాను. అప్పుడు కొంతమంది టెక్కీలు కలిసి పలు ప్రాంతాల్లోని పేదలకు సహాయం చేసేందుకు 'విప్రిన్ ఫౌండేషన్'గా ఏర్పడ్డారు. ఆ ఫౌండేషనే అప్పుడు నన్ను ఆదుకుంది. ఇంటర్‌లో ఒక సంవత్సరంపాటు నాకు ఆర్థిక సహాయాన్ని అందించింది. కావ్యకు కూడా విప్రిన్ ఆర్థిక సహాయం చేస్తోంది. గ్రంథాలయాల అభివృద్ధే కాదు పలు అంశాలలో ప్రజలను చైతన్య పరచడం మా ఊరి నుంచే మొదలెట్టాలన్నది మా ఇద్దరి అభిప్రాయం. ఆ దిశగా ఆపకుండా పనిచేస్తాం.

నేను, కావ్యా మరిచిపోలేని సంఘటన ఒకటి ఉంది. అది మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ గారిని మేం కలవడం. ఆయన మాలో ఎంతో స్ఫూర్తినింపిన మహానుభావుడు. మేం అబ్దుల్ కలామ్‌గారితో విజన్-2020 గురించి మాట్లాడాం. అలాగే సక్సెస్, ఫైల్యూర్లలో ఏది గొప్ప అని ఆయన్ని అడిగాం. ఆయన అప్పుడు మాతో ఎన్నో విషయాలను పంచుకున్నారు. అప్పుడు ఆయన చెప్పిన మాటలను ఈ రోజుకు కూడా మేం మర్చిపోలేం. 'నువ్వు చేయగలిగింది ప్రపంచానికి చేయి. నువ్వు చదివిన దానిని మిగతా వాళ్లకు పంచు' అని కలాం గారు చెప్పారు. ఆ మాటలే మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నాయి. ఆయన మా స్ఫూర్తి.."

పోరాటం చేశారు..

ఈ పిల్లలిద్దరూ ఎంతో సిన్సియర్. చదువులో మంచి ప్రతిభావంతులు. ఇద్దరూ చాలా పేద కుటుంబాల నుంచి వచ్చిన వారే. ఊరిలో గ్రంథాలయం కోసం ఈ ఇద్దరు ఆడపిల్లలు పట్టు వీడకుండా చేసిన పోరాటం వల్లే ఎందరో కొత్త పిల్లలకు మంచి పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి


- రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయుడు

• **నవ్య డెస్క్,** ఫోటోలు: **రాజ్‌కుమార్**

పరిశోధన

జ్ఞాపకశక్తి పెరగడానికి..

సీనియర్ సిటిజన్స్‌కు అవకడో ఎంతో మంచిదట. ఈ పండును రోజూ తినడం వల్ల వృద్ధుల కంటి ఆరోగ్యంతో పాటు జ్ఞాపకశక్తి కూడా బాగా మెరుగుపడుతుందట. అంతే కాదు మెదడు ఎంతో చురుగ్గా పనిచేస్తుందని అధ్యయనకారులు చెప్తున్నారు. ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా ప్రతి రోజూ అవకడోను తిన్న వృద్ధుల కళ్లల్లో ల్యుటిన్ ప్రమాణాలు పెరుగుతాయి. దాంతో మెదడు చురుగ్గా పనిచేయడం ప్రారంభిస్తుంది. ల్యుటిన్ పళ్లల్లో, కూరగాయల్లో ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల పెరిగిన ల్యుటిన్ మెదడు, రక్తం, కళ్లల్లోకి చేరుతుంది. ఇది యాంటి-ఇన్‌ఫ్లమేటరీ ఏజెంటు మాత్రమే కాదు శక్తివంతమైన యాంటాక్సిడెంట్ కూడా. అమెరికాలోని టఫ్ట్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు దీనిపై పరిశోధన చేశారు. సీనియర్ సిటిజన్స్ కళ్లల్లో పెరిగిన ల్యుటిన్ పరిమాణం మెదడు ఆలోచనా శక్తిని పెంపొందించడాన్ని శాస్త్రవేత్తలు గమనించారు. వారిలో జ్ఞాపకశక్తితో పాటు ఏకాగ్రతా శక్తి పెరగడాన్ని కూడా గుర్తించారు. అవకడో తినని వారిలో కాగ్నిటివ్ సామర్థ్యం పరిమితంగానే పెరగడాన్ని కూడా పరిశోధకులు గమనించారు. మెదడు ఆరోగ్యంగా పనిచేయడానికే కాకుండా కంటి ఆరోగ్యానికి కూడా అవకడో ఎంతో మంచిది. సప్లిమెంట్స్ కన్నా తాజా అవకడోలు తిన్న వాళ్ల కళ్లల్లో ల్యుటిన్ ప్రమాణాలు రెట్టింపు ఉంటాయి. వృద్ధుల కంటిని, మెదడును ఆరోగ్యంగా ఉంచే అవకడో వాళ్లకి మంచి మందు అనడంలో సందేహం లేదంటున్నారు పరిశోధకులు.



ఆదర్శం



ఇక్కడ ఫోటోలో కనిపిస్తున్న ఆమె లేడీ ఐఎఎస్ ఆఫీసర్. పేరు గౌరీ పరాశర్ జోషీ. డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్‌కు సిబిఐ ప్రత్యేక కోర్టు శిక్ష ఖరారు చేసిన నేపథ్యంలో హర్యానా రాష్ట్రంలో చెలరేగిన హింసాకాండలో ఆమె ఎందరి ప్రాణాలనో కాపాడారు. ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు.



పోలీసులు పారిపోయిన వేళ..

... REAL CIVIL SERVANT

అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలు తక్కువగా ఉండే రాష్ట్రం హర్యానా. అంతేకాదు పితృస్వామిక సంస్కృతి బాగా వేళ్లూనుకుని ఉన్న రాష్ట్రం కూడా! అలాంటి రాష్ట్రంలోని ఐఎఎస్ అధికారి గౌరీ పరాశర్ జోషి ఇప్పుడు వార్తల్లో నిలిచారు. 'డేరా' అనుచరులు హర్యానాలో చేసిన మారణకాండను నిరోధించడంలో గౌరీ పరాశర్ చూపిన ధైర్యసాహసాలు, చొరవ నేడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. 'డేరా' అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్‌పై ఉన్న అత్యాచారకేసులకు సంబంధించి సిబిఐ ప్రత్యేక కోర్టు శిక్షను ఖరారు చేసిన నేపథ్యంలో హర్యానాలోని పంచకులలో డేరా అనుచరులు పెద్ద ఎత్తున హింసాత్మకదాడులకు, దహనకాండకు పూనుకున్నారు. వారిని ఎదుర్కోవడానికి స్థానిక పోలీసులు సైతం ధైర్యం చూపలేక వెనుకంజ వేసిన పరిస్థితి. అలాంటి క్షణాల్లో పంచకుల డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌరీ పరాశర్ హింసకు పాల్పడుతున్న డేరా అనుచరులను, అల్లరి మూకలను నిరోధించడానికి ధైర్యంగా ముందుకు ఉరికారు. 'డేరా' అనుచరులు కత్తులు, కటార్లతో దూసుకురావడం చూసి భయపడిపోయి పోలీసులు కాళ్లకు బుద్ధిచెబితే, ఆమె మాత్రం ఆందోళనకారులను అడ్డుకుని వారిని నియంత్రించడానికి ప్రయత్నించారు. హింస పెచ్చరిల్లిపోవడంతో ఆమెకు గాయాలవడమే కాదు, వేసుకున్న దుస్తులు సైతం చిరిగిపోయాయి. 11 నెలల చిన్నారికి తల్లి అయిన గౌరి పరాశర్ తాను గాయాలపాలైనా లెక్కచేయలేదు. విధి నిర్వహణలో వెన్ను చూపలేదు. వెంటనే తన కార్యాలయానికి వెళ్లి పరిస్థితులు చేయిదాటకుండా సైన్యాన్ని రంగంలోకి దింపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయం తీసుకునేటప్పుడు ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని సైతం సంప్రదించలేదు. ప్రజల రక్షణ ప్రథమ ధ్యేయంగా పెట్టుకున్నారామె. గౌరి పరాశర్ తీసుకున్న ఆ నిర్ణయం హింస మరింత పెచ్చరిల్లకుండా నియంత్రించిందని పలువురు స్థానికులు ప్రశంసల వర్షం కురిపించారు.

'సైన్యం కనుక సరైన సమయానికి రంగంలోకి దిగకపోయి ఉంటే స్థానిక నివాసప్రాంతాలు నేలమట్టం అయ్యేవి. ఎందరో ప్రజలు ప్రాణాలు కోల్పోయేవారు. గత మూడు రోజులుగా మేం ఇక్కడి పోలీసులకు చాయ్, బిస్కట్లు అందజేస్తున్నాం కానీ గొడవలు మొదలయ్యేసరికే మొదట పారిపోయింది పోలీసులే' అని స్థానిక వ్యక్తి ఒకరు చెప్పడం చూస్తే గౌరీ పరాశర్ అంతటి ఆందోళనకర పరిస్థితుల్లోనూ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ముగ్ధులను చేస్తాయి. పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి సమయస్ఫూర్తితో వ్యవహరించిన తీరు ఎందరికో ఆమెను ఆత్మీయురాలిని చేసింది.

గౌరి పరాశర్ జోషి ఒడిశా కేడర్‌కు చెందిన ఐఎఎస్ ఆఫీసర్. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ 2009 బ్యాచ్‌కి చెందినామె. మొదట్లో రెండు సంవత్సరాలపాటు కలహండిలో పనిచేశారు. ఆమె విధుల నిర్వహణ తీరుపై ప్రభుత్వమే కాదు ప్రజలు సైతం ప్రశంసల వర్షం కురిపించారు. ప్రొబేషన్ టైములో సైతం వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు కింది స్థాయి ప్రజలకు సైతం సక్రమంగా అందేలా పనిచేశారు. తీవ్ర పేదరికం, నిరక్షరాస్యత ఉన్న కలహండి లాంటి ప్రాంతాల్లో సైతం ఆమె ఎన్నో నిర్మాణాత్మకమైన మార్పులకు నాంది పలికారు. అక్కడి నుంచి తన స్వంత రాష్ట్రమైన హర్యానాకు ఆమెను బదిలీచేశారు. హర్యానాలోనూ తన పనితీరు ప్రత్యేకతను నిరూపించుకుని ప్రజలకు ఆమె మరింత ప్రీతిపాత్రులవడం విశేషం. ఆమె భర్త అజిత్ జోషి కూడా ఐఎఎస్ ఆఫీసరే. ఆయనకు కూడా మంచి నిజాయితీపరుడైన అధికారిగా పేరుంది. గౌరీ పరాశర్ జర్నలిజం చేసిన తర్వాత ఐఎఎస్ కావాలనుకుంది. 2008లో యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసి అఖిల భారత స్థాయిలో 60వ ర్యాంకు సంపాదించారు. స్వల్ప కాలంలోనే మంచి సివిల్ సర్వెంట్‌గా పేరు తెచ్చుకున్నారు.

గొడవలు జరిగిన రోజు గౌరి పరాశర్ ఇంటికి తెల్లవారుజామున 3గంటలకు వెళ్లారు. అయితే ఇంటికి వెళ్లడానికి ముందు ఆమె సిటీలోని అన్ని ప్రాంతాలకు స్వయంగా తిరిగి, పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని నిర్ధారించుకున్న తర్వాతే ఇంటికి చేరారు. గతంలో ఆమె నక్సల్ బాధిత ప్రాంతాల్లో కూడా పనిచేసారు. అక్కడ కూడా ఎందరికో ఫేవరేట్ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఒడిశాలోని నక్సల్ బాధిత ప్రాంతమైన కలహండిలో విధులు నిర్వర్తించారు.

ఇంట్లో పదకొండేళ్ల చిన్నారిని వదిలి వచ్చి తన విధులపై దృష్టిసారించిన గౌరి పరాశర్ చొరవ, ధైర్యసాహసాలు ఎందరికో ఆదర్శం. దాడులకు పాల్పడ్డవారిని నియంత్రించడానికి గౌరి ఎంతో తెగువ చూపారు. గొడవలు జరిగిన రోజు రాత్రి వెయ్యిమందికి పైగా డేరా అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. హింసాత్మక సంఘటనలతో, దహనకాండతో అట్టుడిగి పోతున్న పంచకులలో విధుల నిర్వహణకు ధైర్యంగా ముందుకు ఉరికిన ఏకైక మహిళా అధికారి గౌరి కావడం విశేషం. తొలుత జర్నలిస్టుగా విధులు నిర్వహించిన ఆమె ఐఎఎస్ అవాలనుకున్నారు. మంచి ర్యాంకుతో తన లక్ష్యాన్ని సాధించడమే కాదు రియల్ సివిల్ సర్వెంట్ అని నిరూపించుకున్నారు.

గుడ్ మార్నింగ్



బలవంతుడు 'నా తల రాతకు నేనే కారకుడను' అని ధైర్యంగా చెబుతాడు. వృద్ధాప్యంలో అడుగు పెడుతున్న వారే అదృష్టం గురించి మాట్లాడతారు.

- స్వామి వివేకానంద

నయాహవా

హ్యాండ్ వాషింగ్ డ్యాన్స్



రోజంతా బిజీగా గడిపే వారిలో డాక్టర్లు ముందు వరుసలో ఉంటారు. కొన్నిసార్లు గంటల కొద్దీ ఆపరేషన్ థియేటర్‌లోనే గడుపుతుంటారు. అలాంటి డాక్టర్లు పార్కులో హాయిగా 'గ్రూప్ డ్యాన్స్' చేస్తున్న ఒక వీడియో ఇంటర్నెట్‌లో హలచల్ చేస్తోంది. అయితే ఆ డాక్టర్లు డ్యాన్స్ చేయడానికి ఒక కారణముంది. టైంపాస్ కోసమో, ఎంజాయ్‌మెంట్ కోసమో వాళ్లు డ్యాన్స్ చేయలేదు. జనాలకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఆ డ్యాన్స్ ద్వారా అందించారు. చేతులు సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడం వల్ల ఎన్నో జబ్బుల బారిన పడుతుంటారు. జ్వరం, విరేచనాలు, వాంతుల వంటి సమస్యలతో డాక్టర్ల దగ్గరకు వెళ్లినపుడు వాళ్లు చెప్పే ముఖ్యమైన సూచన కూడా ఇదే. 'చేతులు తరచుగా శుభ్రం చేసుకోండి. వ్యాధులకు దూరంగా ఉండండి' అని. అదే విషయాన్ని ఇండోనేషియాకు చెందిన ఈ డాక్టర్ల బృందం డ్యాన్స్ రూపంలో తెలియజేసింది. చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో ఈ వీడియోలో క్లియర్‌గా వివరించారు. ఇలా చెబితేనైనా ప్రజలకు సులభంగా అర్థమవుతుందనే ఉద్దేశంతో ఇలా చేశారు. ఈ వీడియో ప్రస్తుతం నెట్‌లో వైరల్ అవుతోంది. ఇప్పటికే 34 లక్షల మంది చూశారు.

పేరెంటచ్

నీ పక్కవాడి విషయం నీకెందుకూ అంటే!



పిల్లల మనసుల్లో స్వార్థ చింతన ప్రవేశపెట్టే ప్రక్రియ, చాలా వరకు ఇంట్లోనే మొదలవుతుంది. " నీ క్లాస్ మేట్‌కు ఏమైతే నీకెందుకు? నీ స్ట్రీట్ మేట్‌లకు ఏ సమస్య వస్తే నీకెందుకు? నీ చదువు నువ్వు చదువుకో. నీ గురించి నువ్వు ఆలోచించుకో" ఇలాంటి మాటలతో పిల్లల్ని 24 గంటలూ కట్టడి చేస్తే మునుముందు ఆ పిల్లలు ఎలా తయారవుతారు? పరమ స్వార్థపరులుగా తప్ప మరోలా మారే అవకాశం చాలా తక్కువ. ఈ సంకుచిత ధోరణి స్నేహితుల దగ్గరే ఆగిపోదు. ఈ రోజు స్నేహితులకు దూరదూరంగా తిరగడం అలవాటు చేసుకున్నవాడు, రేపు అయిన వాళ్లూ, ఆత్మీయులకు కూడా దూరంగా ఉంటాడు. చివరికి పెళ్లయి తనకంటూ ఒక కుటుంబం ఏర్పాడ్డాక అమ్మానాన్నలకు కూడా దూరమయ్యే ప్రమాదం ఉంది. అప్పుడు అనకుని ఏ ప్రయోజనమూ ఉండదు ఎందుకంటే అప్పటికే ఆ వ్యక్తి మనసు స్వార్థంతో నిండిపోతుంది. చాక్లెట్లు, స్వీట్లతో పాటు ఏవీ ఇచ్చినా స్నేహితులకు ఇవ్వమని చెప్పగలగాలి. ఇవ్వడం అలవాటు చేయడం వల్ల మన పిల్లల హృదయంలో కాస్తంత ఉదాత్తత చోటుచేసుకుంటుంది. సమస్యల్లో ఉన్న సాటి మనుషుల పట్ల సానుభూతితో వ్యవహరించే సంస్కారం అబ్బుతుంది.. ఈ ధోరణితో ఇతరులకే కాదు, తనకు కూడా ఎంతో మేలు కలుగుతుంది. నలుగురిలో ఒక మనిషిగా, గౌరవంగా నిలబడే స్థితి ఏర్పడుతుంది.

ఇలా అవసరమేనా?

అవాంఛిత రోమాలను తొలగించుకోవటం అందరికీ అలవాటే! కాకపోతే అందుకు అనుసరించే సురక్షిత పద్ధతుల గురించి అవగాహన లేక టీనేజర్లు చాలామంది సమస్యల్లో పడుతూ ఉంటారు. స్టయిల్స్, ట్రెండ్స్‌కు తగ్గట్టు ఉండాలనే తాపత్రయంలో తోచిన పద్ధతిని అనుసరించకుండా కాస్త అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు వైద్యులు.



కాలం వేగంగా పరిగెత్తుతోంది. దాంతోపాటే శరీర జీవక్రియల వేగం కూడా పెరిగింది. దాంతో పిల్లల్లో చిన్న వయసులోనే హార్మోన్ల విడుదల మొదలయిపోతోంది. ఫలితంగా 12, 13 ఏళ్ల పసి వయసులోనే అవాంఛిత రోమాలు మొలకెత్తటం మొదలవుతోంది. మగపిల్లలైతే మీసాలు, గడ్డాలు రావటం, ఆడపిల్లలకు బాహుమూలల్లో, కటి ప్రదేశంలో వెంట్రుకలు రావటం జరుగుతోంది. అయితే ఈ రోమాల విషయంలో మరీ ముఖ్యంగా ఆడపిల్లలకు కొన్ని ఇబ్బందులుంటాయి. అందంగా కనిపించటం కోసం లేదా అందవిహీనంగా కనిపించకుండా ఉండటం కోసం ఈ రోమాల్ని తొలగించుకోవాలని అనుకుంటారు. అయితే ఇందుకోసం వ్యాక్సింగ్, త్రెడింగ్, షేవింగ్, హెయిర్ రిమూవల్ క్రీమ్స్ వాడటం... బ్యూటీ పార్లర్లలో లేదా ఇంట్లో తమకు అనుకూలంగా ఉన్న పద్ధతిని అనుసరిస్తూ ఉంటారు. అయితే...వీటిలో ఏ పద్ధతి సురక్షితం? అసలు అవాంఛిత రోమాలను తొలగించుకోవటం ఎంత వరకూ అవసరం?

వెంట్రుకలతో ఉపయోగమే!

శరీరం మీద పుట్టుకతో ఉండే వెంట్రుకలను తొలగించుకోకపోవటమే ఉత్తమం. వెంట్రుకలు చర్మానికి రక్షణనిస్తాయి. సూర్యరశ్మి నుంచి కాపాడతాయి. చర్మానికి కావలసిన తేమనిచ్చి పొడిబారకుండా సంరక్షిస్తాయి. కాబట్టే చేతులు, కాళ్ల మీద ఉండే వెంట్రుకలను తొలగించుకోకపోవటమే మంచిది. అయితే పై పెదవి మీద మొలిచే వెంట్రుకలను, చిక్కని కనుబొమల్లోని అదనపు వెంట్రుకలను తొలగించుకోవచ్చు. బాహుమూలలు, కటి ప్రదేశాల్లోని రోమాలను తప్పనిసరి పరిస్థితుల్లోనే తొలగించుకోవాలి. వాటి కారణంగా కొన్ని రకాల దుస్తులు వేసుకోలేకపోతుంటే తొలగించుకోవటంలో తప్పు లేదు. కొందరికి ఆ ప్రదేశాల్లో విపరీతమైన చమట వల్ల పొక్కులు, కురుపులు, ఇన్‌ఫెక్షన్లు రావటం జరుగుతుంది. ఇలాంటివాళ్లు తప్పనిసరిగా తొలగించుకోవాల్సిందే!



ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు సోకే ప్రమాదం!

వ్యాక్సింగ్, త్రెడింగ్, ప్లకింగ్, షేవింగ్....పద్ధతి ఏదైనా సరైన శుభ్రత పాటించకపోతే బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంటుంది. అలాగే క్షయ లాంటి అంటు రోగాలు కూడా! బ్యూటీ పార్లర్లు, సెలూన్లలో ఒకరికి వాడిన వస్తువులనే ఇంకొకరికి వాడటం, వస్తువులను శుభ్రం చేయకపోవటం వల్ల ఈ ఇన్‌ఫెక్షన్లు ఒకరి నుంచి మరొకరికి సోకుతూ ఉంటాయి. నైఫ్‌ను వ్యాక్స్‌లో పదే పదే ముంచి తీసి ఎంతోమందికి అప్లై చేస్తూ ఉంటారు. అలాగే వ్యాక్సింగ్ కోసం వాడే క్లాత్ కూడా సరిగా శుభ్రం చేయకుండా వాడుతూ ఉంటారు. ఇది సరైన పద్ధతి కాదు. త్రెడింగ్ కోసం వాడే దారం, వ్యాక్సింగ్ కోసం వాడే కత్తి, క్లాత్ ప్రతి ఒక్కరికీ మారుస్తూ ఉండాలి. బ్యూటీపార్లర్‌లో ఈ పద్ధతి పాటిస్తున్నారో లేదో తెలుసుకోవాలి. అలాగే రేజర్లు కూడా! ఒకసారి వాడి పారేసే డిస్పోజబుల్ రేజర్లనే ఎంచుకోవాలి.

షేవింగ్ వల్ల సమస్యలు

అన్‌వాంటెడ్ హెయిర్ తొలగించుకోవటం కోసం షేవింగ్ చేసేవాళ్లు అనుసరించే కొన్ని పద్ధతుల వల్ల చర్మం పాడవుతూ ఉంటుంది. వెంట్రుకల పెరుగుదలకు వ్యతిరేక దిశలో షేవింగ్ చేయటం వల్ల వెంట్రుకల కుదుళ్లు దెబ్బతిని ఆ ప్రదేశంలో నల్లని మచ్చలు ఏర్పడతాయి. అలాగే షేవింగ్ చేసేముందు వెంట్రుకలను తడి చేయటం మర్చిపోకూడదు. పదే పదే షేవింగ్ చేయటం వల్ల చర్మం మీద గుండ్రటి బుడిపెలు ఏర్పడి చర్మం నునుపుదనం కోల్పోతుంది. చర్మం పై పొర తొలగిపోయి మందంగా తయారవుతుంది.

తరచుగా త్రెడింగ్

త్రెడింగ్‌కు వాడే దారం వల్ల చర్మ సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువ. వెంట్రుకలు తెగిపోవటం, ఆ ప్రదేశంలోని చర్మం పదే పదే రాపిడికి గురవటం వల్ల నల్లబడుతుంది. ఒకరికి వాడిన దారాన్నే ఇంకొకరికి వాడటం వల్ల ఇన్‌ఫెక్షన్లు ప్రబలే ప్రమాదం కూడా ఉంటుంది. కాబట్టి త్రెడింగ్ కోసం వాడే దారం మన్నికదై ఉండాలి. కొత్తదై ఉండాలి. బ్యూటీ పార్లర్లకు వెళ్లే వాళ్లు తమకంటూ ఒక త్రెడింగ్ దారాన్ని కొని దగ్గరుంచుకుంటే మంచిది.

వేడి వేడి వ్యాక్సింగ్

ఎక్కువకాలం రోమాలు పెరగకుండా చేసే పద్ధతి ఇది. కానీ వెంట్రుకల పెరుగుదల అనేది జన్యుపరంగా వ్యక్తికీ, వ్యక్తికీ మారుతూ ఉంటుంది. కొందరికి వ్యాక్సింగ్ 15 రోజులకోసారి అవసరమైతే ఇంకొందరికి వారానికే అవసరం పడొచ్చు. అయితే వ్యాక్సింగ్ చేయించుకోవాలనుకున్నప్పుడు దాని పద్ధతి తెలిసిన అనుభవజ్ఞులైన బ్యూటీషియన్లనే సంప్రదించాలి. అలాగే డిస్పోజబుల్ క్లాత్ వాడే పార్లర్లకే వెళ్లాలి. వ్యాక్సింగ్‌కి వ్యాక్సింగ్‌కీ మధ్య గ్యాప్ ఇవ్వాలి. వెంట్రుకలు పూర్తిగా పెరిగిన తర్వాతే వ్యాక్సింగ్ చేయించుకోవాలి. అంతేగానీ కొద్దిగా పెరగగానే వ్యాక్సింగ్‌కి వెళ్లకూడదు. ఇలా చేస్తే వెంట్రుకల కుదుళ్లు దెబ్బతింటాయి.

ప్లకింగ్

కనుబొమలు, పై పెదవి మీద ఉండే వెంట్రుకలను తొలగించుకోవటం కోసం కొంతమంది ఇంట్లోనే ప్లక్కర్‌ని ఉపయోగిస్తూ ఉంటారు. ప్లక్కర్‌తో వెంట్రుకను పట్టుకుని లాగినప్పుడు అది రూట్‌తో సహా వచ్చేస్తే ఫరవాలేదు. అలాకాకుండా తెగటం, మధ్యకి విరిగిపోవటం జరిగితే వెంట్రుకల కుదుళ్ల మీద ఒత్తిడి పడి ఆ ప్రదేశం నల్లగా తయారవుతుంది. కాబట్టి కనుబొమలను త్రెడింగ్‌తో షేప్ చేసుకున్న తర్వాత ఏవైనా ఒకటి రెండు అదనపు వెంట్రుకలు తొలగించటానికి మాత్రమే ప్లక్కర్‌ని వాడాలి. ఇక పై పెదవి మీది వెంట్రుకలను తొలగించటం కోసం ప్లక్కర్‌ని వాడకపోవటమే మేలు.

పర్మనెంట్ హెయిర్ రిమూవల్

అన్‌వాంటెడ్ హెయిర్‌ను శాశ్వతంగా తొలగించుకోవటం కోసం లేజర్, ఎలక్ట్రాలసిస్ మొదలైన పద్ధతులున్నాయి. అయితే అవాంఛిత రోమాల వల్ల తరచుగా ఇన్‌ఫెక్షన్లు, పుండ్లు లాంటి సమస్యల్ని ఎదుర్కొనేవాళ్లు మాత్రమే ఈ చికిత్సలు తీసుకోవటం మంచిది. ఈ చికిత్సలో వెంట్రుకల కుదుళ్లను కొంతవరకూ అచేతనం చేసి వెంట్రుకల మందాన్ని తగ్గిస్తారు. చికిత్స వల్ల వెంట్రుకలు పెరిగినా పలచగా, నూగులా పెరిగి చర్మంలో కలిసిపోతాయి కాబట్టి వెంట్రుకలు లేనట్టే కనిపిస్తుంది. కానీ నిజానికి లేజర్, ఎలక్ట్రాలసిస్ చికిత్సల్లో వెంట్రుకలను శాశ్వతంగా తొలగించటం ఉండదు. వ్యక్తుల శరీర తత్వాన్ని బట్టి కొందరికి నాలుగు సిట్టింగ్‌లు, ఇంకొందరికి అంతకంటే ఎక్కువ అవసరమవుతాయి.

ఫ్రెంచ్ బియర్డ్, అండర్‌కట్

ఫ్యాషన్‌లో భాగంగా అబ్బాయిలు కూడా రకరకాల హెయిర్ స్టయిల్స్ చేస్తున్నారు, గడ్డాలు చేయిస్తున్నారు. అయితే ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు సంక్రమించకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

- డిస్పోజబుల్ రేజర్లనే వాడాలి.
- వెంట్రుకలను అపసవ్య దిశలో తొలగించకూడదు.
- షేవింగ్ బ్రష్ శుభ్రంగా ఉండాలి.
- ఆఫ్టర్ షేవ్ లోషన్ తప్పనిసరిగా వాడాలి.
- గడ్డం మీద ఒక చోట చిన్న కురుపులా వస్తే దానికి రేజర్‌ను తగలనివ్వకూడదు. లేదంటే రేజర్‌తోపాటు ఆ కురుపులు ముఖమంతా వ్యాపిస్తాయి.
- సెలూన్లలో షేవింగ్‌కు డిస్పోజబుల్ షేవర్లు వాడుతున్నారో లేదో గమనించాలి.
- టవళ్లు, టిష్యూలు, దువ్వెనలు ఒకరికి వాడినవి ఇంకొకరికి వాడుతున్నారేమో గమనించాలి.
- పొడవాటి గడ్డాలు పెంచాలనుకుంటే శుభ్రతను పాటించాలి.
- దురద, పొట్టు లాంటివి కనిపిస్తే జాగ్రత్త పడాలి.
- ఎలక్ట్రిక్ రేజర్లను వాడిన ప్రతిసారీ శుభ్రం చేసుకోవాలి.

అబ్బాయిల్లో హార్మోన్ల ప్రభావం

కొందరికి ఒత్తుగా గడ్డాలు, మీసాలు పెంచాలని ఉంటుంది. కానీ అలా పెరగకపోయేసరికి తెలిసిన చిట్కాలన్నీ ప్రయోగిస్తూ ఉంటారు. వెంట్రుకల కుదుళ్లు చైతన్యమైతే త్వరగా పెరుగుతాయనే అపోహతో పదే పదే షేవింగ్ చేస్తూ ఉంటారు. కానీ గడ్డాలు, మీసాలు అనేవి వంశపారంపర్య లక్షణాలే! ఒకవేళ తండ్రికి ఒత్తుగా పెరిగి, కొడుక్కి పెరగకపోతే యుక్త వయసులోనే వైద్యుల్ని సంప్రదించి హార్మోన్ పరీక్షలు చేయించాలి. టెస్టోస్టిరాన్ హార్మోన్ తయారుకాకపోయినా, హెచ్చుతగ్గులున్నా ఆ ప్రభావం వెంట్రుకల మీద కచ్చితంగా ఉంటుంది. కాబట్టి ఆ పరీక్షలు చేయించటంతోపాటు, పౌష్టికాహారం తీసుకోగలిగితే ఈ సమస్య తొలగిపోతుంది.



డాక్టర్ పి.ఎల్. చంద్రావతి
సీనియర్ కన్సల్టెంట్ డర్మటాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్.

షేవ్ చేస్తే పెరుగుతాయా?

అపోహ : పదే పదే షేవ్ చేస్తే వెంట్రుకలు పెరుగుతాయి
వాస్తవం : ఇది నిజం కాదు. వెంట్రుకల పెరుగుదల వంశపారంపర్య లక్షణం. దీనికీ పదే పదే షేవింగ్ చేయటానికి సంబంధం లేదు. అలా షేవింగ్ చేయటం వల్ల వెంట్రుకలు చిక్కగా పెరగవు.

అపోహ : పసుపుతో వెంట్రుకలు రాలిపోతాయి
వాస్తవం : చాలామంది అమ్మాయిలు ఫేస్ ప్యాక్‌లో పసుపు కలుపుకుని అప్లై చేస్తూ ఉంటారు. ఇంకొందరు పసుపుతో ముఖం రుద్దుకుంటూ ఉంటారు. ఇలా చేయటం వల్ల వెంట్రుకలు రాలిపోతాయనేది అపోహ మాత్రమే! పసుపు క్రిమిసంహారిణి మాత్రమే!

అపోహ : నూనె పూస్తే వెంట్రుకలు పెరుగుతాయి
వాస్తవం : నూనె, షాంపూలకు వెంట్రుకలను పెంచే శక్తి లేదు. బయటి నుంచి మనం ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా వెంట్రుకలు పెరగవు. వెంట్రుకలు చక్కగా, ఆరోగ్యంగా పెరగాలంటే పౌష్టికాహారం తీసుకోవాలి.

అపోహ : అపసవ్య దిశలో షేవ్ చేస్తే వెంట్రుకల పెరుగుదల తగ్గుతుంది
వాస్తవం : వెంట్రుకలు పెరిగే దిశలోనే షేవ్ చేయాలి. వ్యతిరేకంగా చేయటం వల్ల అదనంగా ఒరిగే ప్రయోజనం ఏమీ లేదు. పైగా వ్యతిరేక దిశలో చేయటం వల్ల వెంట్రుకల కుదుళ్లు దెబ్బతిని అస్తవ్యస్తంగా పెరుగుతాయి.

గడ్డి కాదు!....అమృతం!!

ప్రకృతి వైద్యం



భూమిలో పాతుకుని ఉన్నంత సేపే, ఏ చెట్టయినా పచ్చపచ్చగా మెరిసిపోతుంది.

ఒక్కసారి ఆ భూమితో తెగతెంపులు చేసుకుని, వేళ్లు పెకిలించుకుని, ఈవలికి వచ్చిపడిందా...! పచ్చదనమంతాపోయి, ప్రాణర హితంగా మారిపోతుంది.

ప్రకృతి నుంచి, ప్రకృతి సిద్ధ జీవనశైలి నుంచి దూరంగా వెళుతున్న మనిషి పరిస్థితి కూడా ఇప్పుడు అలాగే ఉంది.

ఆధునిక జీవనంలో ప్రధాన భాగమైపోయిన పిజ్జాలు, బర్గర్ల నుంచి, సూప్స్, కూల్ డ్రింక్స్ దాకా.... అన్నీ. ప్రాణాల్ని హరింపచేసేవే తప్ప వీటిల్లో ఏ ఒక్కదానికైనా ప్రాణాల్ని నిలబెట్టే శక్తి ఉందా?

నిజానికి వేల సంవత్సరాల క్రితమే కొందరు మహర్షులు అద్భుతమైన ప్రకృతి చికిత్సా విధానాలెన్నో సూచించారు. వాటిల్లో ఏ కొన్ని పాటించినా, మానవ శరీరాలు ఇంతగా రోగగ్రస్థమయ్యేవే కాదు.

ప్రస్తుతం మనం ఏ ఆహారపానీయాలు తీసుకున్నా, వాటిల్లో శక్తిదాయకాలెన్ని? రోగకారకాలెన్ని? రోగనిరోధక శక్తిని పెంచేవెన్ని? ఈ దృష్టితో చూడాల్సి వస్తోంది.

ప్రస్తుతానికి గోదుమ నారు (గోదుమ గడ్డి) రసం, లేదా పొడినే తీసుకుంటే.... మనిషిలోని రోగనిరోధక శక్తిని పెంచడంలో, జీవశక్తిని పదింతలు చేయడంలో దాని పాత్ర ఎంతో కీలకమని చెప్పే పలు శాస్త్రీయ విశ్లేషణలు మన ముందున్నాయి

• • • •

మన శరీరానికి అవసరంగా, మనసుకు ఆసక్తికరంగా అనిపించేవే కావచ్చు. వాటిల్లో అన్నింటికి అన్నీ మేలు చేసేవిగా ఏమీ ఉండవు.మనకు అందుబాటులో ఉన్న ఏ పదార్థంలోనైనా, శరీరానికి మేలు చేసేవాటితో పాటు కీడు చేసేవీ ఉంటాయి. అయితే, ప్రకృతి సిద్ధమైన వాటిల్లో ప్రత్యేకించి గోదుమ నారులో మాత్రం, ఆరోగ్యదాయకమైనవే తప్ప వాటిల్లో ఏ ఒక్క అంశమూ హానికారకమైనవి కావు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా నేడు ఈ గోదుమ గడ్డి రసం లేదా చూర్ణం, ఒక ఔషధంగా ఆదరణ పొందుతోంది.

ఆపద్బాంధవిగా....

ప్రతి మనిషిలోనూ సహజంగానే ఒక నిరోధక వ్యవస్థ ఉంటుంది. చాలా జబ్బుల నుంచి నిరంతరం అది మనిషిని కాపాడుతుంది. ఎప్పుడైనా ఆ రోగ నిరోధక శక్తికి మించిన సమస్య తలెత్తినప్పుడే వైద్య చికిత్సలు అవసరమవుతాయి. కాకపోతే కాలగతిలో వస్తున్న వివిధ పరిణామాల్లో భాగంగా, హానికారక ఆహార పానీయాల వల్ల, కలుషిత వాతావరణం వల్ల, మానసిక ఒత్తిళ్ల వల్ల అతనిలోని వ్యాధినిరోధక శక్తి రోజురోజుకూ తగ్గిపోతోంది. ఫలితంగా శరీరాలు అనునిత్యం అనారోగ్యం పాలవుతున్నాయి. ఈ స్థితిలో గోదుమ గడ్డి చూర్ణంక, రసం ఉపకరిస్తాయి.

- గోదుమగడ్డి రసం లేదా చూర్ణం సహజసిద్ధమైన పౌష్టికాహారం. అదే సమయంలో ఔషధంగా కూడా ఇది పనిచేస్తోంది. మౌలికంగా, గోదుమ నారు పొడిలో 111 రకాల పోషక పదార్థాలు ఉన్నాయి. మరోరకంగా చెప్పాలంటే, 23 కిలోల కూరగాయలు ఇచ్చే శక్తిని ఒక కిలో పచ్చి గోదుమ నారు ఇస్తుంది. గోదుమ నారులో ఎ,బి,సి, ఇ మొదలైన విటమిన్లు, ప్రొటీన్లు, అమీనో యాసిడ్లు, ఎంజైములు, క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం సమృద్ధిగా ఉన్నాయి. వీటితో పాటు సోడియం, పొటాషియం, జింక్, భాస్వరం, సెలీనియం వంటి ఖనిజాలు, పత్రహరితం, పీచుపదార్థం, మానవ శరీరానికి కావలసిన పరిణామంలో ఉన్నాయి.
- శరీరానికి అవసరమైన మొత్తం 22 అమైనో యాసిడ్స్‌ల్లో 19 ఒక్క గోదుమ నారులోనే లభిస్తాయి.
- గోదుమ నారులో పత్రహరితం (క్లోరోఫిల్) 70 శాతం ఉంది. మనిషి రక్తానికి ఎరుపుదనం తెచ్చే 'హెమిన్' కణ స్వరూపానికీ, క్లోరోపిల్ కణ స్వరూపానికీ మధ్య సారూప్యత ఉండడమే కాదు అంతే శక్తిమంతంగా కూడా పనిచేస్తుంది.



- గోదుమ నారు రసంలో అతి త్వరితంగా రక్తంలో కలిసిపోయి, అన్ని కణాలకూ వ్యాపించి వాటిని బలోపేతం చేసే శక్తి ఉంది.
- గోదుమ నారులోని ఈ పత్రహరితంతో పాటుగా ఇంకా అనేక ఇతర పదార్థాలు ఉండడం వల్ల గోదు నారు రసాన్ని ' గ్రీన్ బ్లడ్ అని కూడా అంటారు. ఇది రక్తహీనతను (అనీమియా)ను తగ్గిస్తుంది. క్లోరోఫిల్‌లో ఉండే క్రిమిసంహారక శక్తి కూడా ఎక్కువే. ఇది యాంటీ సెప్టిక్‌గా పనిచేస్తుంది.
- ఆస్తమా, అల్సర్లు, చర్మవ్యాధులు, చిన్నపేవు ఉబ్బడం, గాయాలు మానకపోవడం వంటి సమస్యలను గోదుమనారు చూర్ణం నయం చేయగలదు. శరీరంలోని విషపదార్థాలను తొలగించగలదు.
- గోదుమ నారు చూర్ణంలో కరగని, కరిగిపోయే ఈ రెండు రకాల పీచుపదార్థాలూ ఉన్నాయి. ఇందులోని కరగని పీచుపదార్థం చిన్న పేగులో, జీర్ణకోశంలో ఆహారపు కదలిక జరిగేలా చూస్తుంది. దీని వల్ల మలబద్ధకం పోయి, శరీరంలో విషపదార్థాలు చేరే అవకాశం లేకుండాపోతుంది. కరిగే పీచుపదార్థం కార్బోహైడ్రేట్లు శరీరంలో ఇమిడిపోయే విధానాన్ని ఆలస్యం చేస్తుంది. దీనివల్ల రక్తంలోని చక్కెర స్థాయి అదుపులోకి వస్తుంది. పీచుపదార్థం కేన్సర్ నిరోధకంగా కూడా పనిచేస్తుంది.
- జీర్ణాశయానికి సంబంధించిన మలబద్ధకం అసిడిటీ, పైల్స్, కోలైటిస్, అల్సర్స్ తో పాటు, కిడ్నీ సమస్యలను కూడా గోదుమ నారు చూర్ణం దూరం చేస్తుంది. అలర్జీ, సొరియాసిస్, మొటిమలు, ఎగ్జిమా వంటి చర్మ రోగాల నుంచి విముక్తి కలిగిస్తుంది.
- కేన్సర్, బి.పి, బహిష్టు సమస్యలు, పక్షవాతం, లుకేమియా, కీళ్లనొప్పులు, ఆర్థరైటిస్, నిద్రపట్టకపోవడం, ఆస్తమా బ్రాంకైటిస్ నివారణకు కూడా అద్భుతంగా పనిచేస్తుంది. సాధారణ శక్తిహీనతను తొలగిస్తుంది.

ఎలా తీసుకోవాలి?

గోదుమ నారులో అనేకమైన విటమిన్లు, ఖనిజాలు, అమినో యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఒకే పదార్థంలో ఇవన్నీ ఉండడం వల్ల ఒక్కుమ్మడిగా వాటన్నింటినీ తీసుకోవడంలో తొలుత మన శరీరం కొంత ఇబ్బంది పడుతుంది. మరీ ముఖ్యంగా మన శరీరంలో మలినాలు బాగా పేరుకుపోయినప్పుడు వాటిని స్వీకరించడానికి శరీరం ఇష్టపడదు. అందువల్ల ముందు బాగా విరేచనం అయ్యేలా చూసుకోవాలి. నాలుగు రోజుల పాటు ఘనాహారం ఏమీ తీసుకోకుండా, వెచ్చని నీరు, పండ్ల రసం తీసుకోవాలి. చాలా స్వల్పంగా ఉడికించిని కాయగూరలు తీసుకోవచ్చు. ఇలా నాలుగు రోజులు గడిపాకే గోదుమ నారు రసం గానీ, చూర్ణం గానీ తీసుకోవాలి. గోడుమ నారు రసంలో పీచుపదార్థం ఉండదు. కాబట్టి చూర్ణాన్ని నీళ్లల్లో కలుపుకుని తీసుకోవడమే ఉత్తమం. గోదుమ నారు రసాన్ని తయారు చేసుకున్న వెంటనే తాగెయ్యాలి. చాలా సేపు అలాగే ఉంచితే అందులోని ఔషధ గుణాలు తగ్గుతాయి. ఒకవేళ ఈ రసం వగరుగా, ఘాటుగా అనిపిస్తే, కొంచెం తేనె కలిపి తాగవచ్చు.

క్రమంగా పెంచాలి

- ప్రారంభంలో ఈ రసాన్ని కొద్దిమోతాదులో తీసుకుంటూ క్రమంగా మోతాదు పెంచాలి. మామూలు జబ్బులకు 10 మి.లీ రసం చాలు. తీవ్రమైన వ్యాధితో బాధపడే వారు 25 నుంచి 50 మి. లీ రసం చొప్పున రోజుకు మూడు సార్లు తాగాలి. ఈ రసం తాగిన అరగంట దాకా మరేమీ తీసుకోకూడదు. ఈ రసాన్ని పొద్దున పరగడుపున తీసుకోవడమే మేలు. ఒకవేళ పొద్దున్నే తీసుకోవడం వీలు కాని వారు మధ్యాహ్నం కడుపు ఖాళీగా ఉన్నప్పుడు తీసుకోవచ్చు. వ్యాధిగ్రస్థులు తమ సమస్య నయం అయ్యేదాకా వరుసగా వాడవచ్చు. ఆరోగ్యవంతులు ఈ రసం తాగితే మరింత ఆరోగ్యవంతులవుతారు. వీరు 3 మాసాలు వాడిన తర్వాత ఆపేయాలి మళ్లీ మూడు నెలల తర్వాత వాడుకోవచ్చు. వీరు 2.5 గ్రాముల చూర్ణాన్ని ప్రతి రోజూ ఉదయం పరగడుపున 20 మి. లీ నీటితో కలిపి సేవించాలి. రుచికొరకు తేనె కలుపుకోవచ్చు మధుమేహలు మాత్రం తేనె కలుపుకోకూడదు.
- ఏదో వ్యాధిన బారినపడి దాని తాలూకు అనేక పరిణామాలకు ఆ తర్వాత బలికావడం కన్నా, గోదుమ నారు రసం సేవించడం ద్వారా ఆ వ్యాధులను అసలే దరిచేరకుండా చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

డాక్టర్ కృష్ణమూర్తి
సూపరింటెండెంట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచర్ క్యూర్, హైదరాబాద్

డైలీ సుడోకు - 165

				9		3	8	
		7			2			9
		3	4			7		
		2	9					7
7	4		8		3		2	5
8					5	9		
		6			9	4		
2			1			5		
	3	8		5				

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 164 సమాధానం

[illegible]

ఎవరి కర్మ వారికే!



ఒకానొక గ్రామంలో ఒక ఆశ్రమం ఉండేది. ప్రతి రోజూ సాయంత్రం ఆశ్రమంలో ఒక సాధువు ప్రవచనం చెప్పేవాడు. గ్రామస్థుల్లో చాలామంది ఆ ప్రవచనం వినడానికి వెళ్లే వాళ్లు. ప్రవచనం పూర్తయిన తర్వాత ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోతుండేవారు. అయితే ఒక వ్యక్తి మాత్రం ప్రతి రోజూ ప్రవచనం మధ్యలో ఉండగానే లేచి అక్కడి నుంచి వెనుదిరిగేవాడు. ఆ వ్యక్తి.. ప్రతి రోజూ ప్రవచనం మధ్యలోనే వెళ్లిపోవడం సాధువు గమనించాడు. ఒకరోజు అతణ్ణి పిలిచి.. "నాయనా! రోజూ ఎందుకలా మధ్యలోనే వెళ్లిపోతున్నావు?" అని అడిగాడు. దానికా వ్యక్తి.. "స్వామీ! మీ ప్రవచనం అద్భుతంగా ఉంటుంది. అయితే, చీకటి పడే లోపు నేను ఇంటికి వెళ్లిపోవాలి. నా కోసం నా భార్యా, బిడ్డలూ, తమ్ముళ్లూ, మరదళ్లూ, వారి పిల్లలూ.. అందరూ ఎదురు చూస్తూ ఉంటారు. నా రాక కాస్త ఆలస్యం అయినా.. తట్టుకోలేరు. నాపై వారికంత ప్రేమ. అందుకే మధ్యలోనే వెళ్లిపోతున్నాను" అని బదులిచ్చాడు. సాధువు నవ్వి.. ఆ వ్యక్తి చెవిలో ఒక విషయం చెప్పాడు.

మరుసటి రోజు ఆ వ్యక్తి యథాప్రకారంగా ప్రవచనం మధ్యలో లేచి వెళ్లిపోయాడు. ఇంటికి వచ్చిన భర్తను చూసి భార్య మురిసిపోయింది. పిల్లలు తండ్రితో ఆడుకుంటున్నారు. తమ్ముళ్లూ, మరదళ్లూ ఏవో కబుర్లు చెబుతున్నారు. అంతలో.. ఆ వ్యక్తి మూర్ఛ వచ్చి పడిపోయాడు. ఇంట్లో అందరూ కలవరపడసాగారు. ఇంతలో సాధువు వాళ్లింటికి వచ్చాడు. తమ ఇంటి యజమానికి ఎలాగైనా కాపాడమని సాధువుతో అందరూ వేడుకున్నారు. అందరినీ సంయమనం పాటించమన్నాడు సాధువు. లోనికి వెళ్లి ఒక పాత్రలో నీరు తీసుకురమ్మని

[illegible]

స్మార్ట్‌హోమ్

మొక్కలతో ఆహ్లాదం!

ఇంట్లో కుండీల్లో మొక్కలు అలంకరణ కోసమే కాదు, ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయి. ఇంట్లో గాలిని శుభ్రపరచడంలో, మనసుకు ప్రశాంతతను, ఆహ్లాదాన్ని అందించడంలో మొక్కలు బాగా ఉపయోగపడతాయి. ఇంట్లో మొక్కలు పెంచుకోవాలంటే ఇలా చేయండి.

- మొక్కలను కొనుగోలు చేసే ముందు ఏయే గదుల్లో ఎలాంటి మొక్కలను పెట్టాలనుకుంటున్నారో ఒక నిర్ణయానికి రావాలి. బాల్కనీలో అయితే సూర్యరశ్మికి పెరిగే మొక్కలు, ఇంట్లో అయితే నీడన కూడా పెరిగే మొక్కలను ఎంపిక చేసుకోవాలి.
- సూర్యరశ్మి నేరుగా పడకపోయినా వెలుతురు పడేలా చూసుకోవాలి. అందుకే కుండీలను కిటికీల దగ్గర ఏర్పాటు చేసుకోవాలి.



- నీరు మరీ ఎక్కువ కాకుండా, మరీ తక్కువ కాకుండా పోయాలి. మట్టిలో తేమ ఉన్నట్లయితే నీరు పోయాల్సిన అవసరం లేదు. కొన్ని మొక్కలకు రోజూ నీరు అవసరం అవుతుంది. కాబట్టి మొక్కల రకాలు, వాటి నీటి అవసరాలను తెలుసుకుని నీరు పోస్తుండాలి.
- ఇంట్లో గాలిని శుద్ధి చేసే మొక్కలను ఎంచుకుంటే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఇండోర్‌ప్లాంట్స్‌లో ఈ తరహా మొక్కలు అందుబాటులో ఉంటాయి.
- కుండీల్లో మొక్కలు నాటే ముందు ఎరువు కలిపిన మట్టిని ఎంచుకుంటే మేలు. మొక్క ఆరోగ్యవంతంగా పెరగడానికి, మొక్కకు తగిన పోషకాలు అందడానికి ఎరువులు చాలా అవసరం.

కౌన్సెలింగ్

తిండి తగ్గించేకొద్దీ... షుగర్ పెరుగుతోందేమిటి?



నా వయసు 36,. గత మూడేళ్లుగా నాకు మధుమేహం ఉంది. మాత్రలు వేసుకుంటున్నా, షుగర్ నియంత్రణలోకి రాకపోవడంతో ఇటీవల తినే ఆహారపు మోతాదును బాగా తగ్గించాను. అప్పుడూ ఇప్పుడూ మూడు పూటల తిండే... కాకపోతే తినే మోతాదే సగానికి తగ్గించాను. దీనివల్ల శరీరం నీరసించిపోతోందే తప్ప షుగర్ మాత్రం తగ్గడం లేదు. పైగా ఒక్కోసారి పెరుగుతోంది కూడా. నేనున్నది మార్కెటింగ్ రంగంలో. షుగర్ నియంత్రణ కోసం వాకింగ్, జాగింగ్ లాంటివి చేసే టైం నాకెలాగూ లేదు. ఈ స్థితిలో నన్నేం చేయమంటారో చెప్పండి.

- **కె. ప్రవీణ్,** విశాఖపట్నం.

మీ భోజనం మోతాదును సగానికి తగ్గించానంటున్నారు. అయితే అంతకు ముందు ఏం తినే వారు, ఇప్పుడు ఏం తింటున్నారు? ఈ వివరాలేమీ రాయలేదు. సాధారణంగా ఎక్కువ మంది తీసుకునేది కార్బోహైడ్రేట్లే కాబట్టి వాటి స్థానంలో ప్రొటీన్ మోతాదును, ఫైబర్ మోతాదును పెంచాలి. క్యాల్షియం, ఐరన్, జింక్, పొటాషియం, మెగ్నీషియం మోతాదును పెంచాలి. అలా కాకుండా అప్పటికే చాలీ చాలని పోషకాలు తీసుకుంటూ ఉన్నారనుకోండి, ఇప్పుడు మీరు, వాటిల్లోనే ఇంకా సగం తగ్గించేస్తే శరీరం నీరసించిపోకుండా ఏమవుతుంది? దీనికి తోడు ఆ లోటును బలవర్ధక ఆహారంతో పూరించకపోతే, ఎముకలు, కండరాలు రోజురోజూ బలహీనపడతాయి. దీనివల్ల ఎముకలు గుల్లబారిపోయి ఆస్టియో పొరోసిస్ వ్యాధి మొదలయ్యే ప్రమాదం ఉంది. అన్నింటినీ మించి షుగర్‌కు సంబంధించిన జీవక్రియలు అత్యధికంగా జరిగేది కండరాల్లోనే. కండరాలు బలహీనపడే కొద్దీ ఈ జీవక్రియలు మరింత కుంటుపడిపోయి షుగర్ నిలువలు అలా పెరుగుతూ వెళతాయి. అందువల్ల కండరాల, ఎముకల శక్తి ఏ మాత్రం తగ్గని రీతిలో మీరు తీసుకునే ఆహారం ఉండాలి. ఆకు కూరలకు ప్రాధాన్యతనివ్వాలి. పైగా మధుమేహం మొదలయ్యాక భోజనం చేయడాన్ని మూడు పూటలకే పరిమితం చేయడం ఎంత మాత్రం సరికాదు. అంతకన్నా తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు అంటే ఓ ఐదు సార్లు తీసుకోవడం ఉత్తమం. అయితే ఎంత మంచి పౌష్టికాహారం తీసుకున్నా, శరీర శ్రమ ఏదీ చేయకపోతే అందులోని పోషకాలేవీ ఒంటికి పట్టవు. మీకు మీ వృత్తిపరమైన ఒత్తిళ్లు ఎంతగా ఉన్నా వీరు వ్యాయామాకి సమయం కేటాయించాల్సిందే. పార్కులకో, మైదానాలకో వెళ్లడం కుదరకపోతే ఇంట్లోనే ఆ ఏర్పాట్లు చేసుకోండి. రోజుకు కనీసం 30 నుంచి 45 నిమిషాల పాటు చేయగలిగితే, మీ చక్కెర తప్పకుండా నియంత్రణలోకి వస్తుంది.

- **డాక్టర్ జె. శరచ్చంద్ర,** గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్

మీకు మీరే డాక్టర్

ఆరోగ్యానికి తొలిపొద్దు

- పొద్దు తిరుగుడు గింజలను దీని ఆకురసంతో నూరి ముద్దగా చేసి మూడు రోజులు వరుసగా నుదుటి మీద పట్టివేస్తే మైగ్రేన్ తగ్గుతుంది.
- పొద్దుతిరుగుడు చెట్టు వేరును ఆవుపాలతో మెత్తగా రుబ్బి, రోజుకు రెండు పూటలా తులం చొప్పున వేసుకుంటే కిడ్నీలోని రాళ్లు కరిగిపోతాయి.
- పది చుక్కల పొద్దు తిరుగుడు ఆకు రసాన్ని, పాలల్లో కలిపి తాగిస్తే పిల్లలకు వచ్చే కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం వంటి బాధలు తగ్గుతాయి.
- పొద్దు తిరుగుడు ఆకులను పైన కట్టుకట్టి ఉంచితే, గడ్డలు వాపు తగ్గుతాయి.
- 100 మి.లీ. ఆకు రసానికి 100 మి. లీ నువ్వుల నూనె చేర్చి, అందులో 25 గ్రాముల ఆకులను ముద్దగా నూరి వేసి తైలముగా కాచి ఆ తైలాన్ని చెవిలో వేసుకుంటే చెవిపోటు తగ్గుతుంది. ఆకు రసానికి సమానంగా, త్రికటు చూర్ణం వేసి వెచ్చచేసి రెండు చుక్కలు చెవిలో వేస్తే, చెవిలోని ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి.
- పొద్దు తిరుగుడు వేరుకు సమానంగా, వెల్లుల్లి కలిపి, ముద్దగా నూరి, కంఠానికి పట్టీగా కట్టుకడితే గాయిటర్ తగ్గుతుంది.
- పొద్దు తిరుగుడు గింజల చూర్ణానికి సమానంగా, చక్కెర పొడి కలిపి 6 గ్రాముల మోతాదులో రోజుకు రెండు పూటలా సేవిస్తే, అర్శమొలలు తగ్గుతాయి.
- మూడు గ్రాముల గింజల చూర్ణాన్ని రెండు పూటలా సేవిస్తే కడుపులోని నులిపురుగులు నశిస్తాయి.



హెల్దీ డ్రింక్

గోల్డెన్ గ్రీన్‌టీ



గ్రీన్ టీ తాగటం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని వింటున్నాం. దాంతో గ్రీన్ టీని మన జీవితంలో భాగం చేసుకున్నాం. అయితే గ్రీన్ టీ వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలున్నాయో మీకు తెలుసా? అయితే ఈ వాస్తవాలు తెలుసుకోండి.

- **మెటబాలిజం పెరుగుతుంది:** గ్రీన్ టీ లో ఉండే కెఫీన్ వల్ల శరీర కొవ్వు కరగటంతోపాటు మెటబాలిజం కూడా పెరుగుతుంది. కప్పు గ్రీన్ టీలో 20 నుంచి 40 మి.గ్రా కెఫీన్ ఉంటుంది. అలాగే దీనిలో క్యాచెటిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మెటబాలిజమ్‌ను బూస్ట్ చేస్తాయి.
- **వ్యాయామంతో రెట్టింపు:** గ్రీన్ టీ తాగితే కొవ్వు వేగంగా కరుగుతుంది. దీనికి వ్యాయామాన్ని కూడా జోడిస్తే రెట్టింపు ఫలితం దక్కుతుంది. అంటే గ్రీన్ టీ తాగుతూ వ్యాయామం చేయగలిగితే బరువు తగ్గే వేగం 15 శాతం పెరుగుతుంది. అంతేకాదు. విశ్రాంతిలో ఉన్నా కొవ్వు కరిగే వేగంలో మార్పు ఉండదు.
- **తక్కువ తింటాం:** గ్రీన్ టీ తాగటం వల్ల తక్కువ కెలోరీలను తీసుకుంటాం. దాంతో బరువు తగ్గుతాం. అలాగే గ్రీన్ టీ ఆకలిని తగ్గిస్తుంది. దీని వల్ల కూడా శరీరంలోకి ఎక్కువ కెలోరీలు చేరకుండా ఉంటాయి.

వన్ ప్లస్ వన్..!

వన్ ప్లస్ వన్ అంటే అదేదో ఆఫర్ అనుకునేరు.. కాదు.. ఏకకాలంలో రెండు సినిమాలు. అదీ నందమూరి సోదరులతో. విషయం ఏంటంటే... ఒకేసారి అన్నదమ్ములు ఇద్దరితో ఆడిపాడే అదృష్టం ఇప్పుడు మిల్కీబ్యూటీ తమన్నాను వరించింది. నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా జయేంద్ర దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో తమన్నా నాయికగా ఎంపికయ్యారు. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా తెరకెక్కడం ఇదే ప్రథమం. సెప్టెంబర్ 1 నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతుంది.


మరోవైపు నందమూరి తారకరామారావు ఆర్ట్స్ పతాకంపై నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మిస్తున్న 'జై లవకుశ'లో ప్రత్యేక పాటలో నర్తించే అవకాశాన్ని కూడా తమన్నా అందిపుచ్చుకున్నారన్నది ఫిల్మ్‌నగర్ టాక్ ఎన్టీఆర్ హీరోగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'జై లవకువ'లో తమన్నాపై చిత్రీకరించే గీతం చాలా వైవిధ్యంగా ఉంటుందట. తెలుగు చిత్రాల్లో ఇప్పటివరకు ప్రేక్షకులు చూడనిరీతిలో ఈ గీతాన్ని చిత్రీకరించడానికి హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భారీ సెట్ వేస్తున్నారని సమాచారం. ఎన్టీఆర్ సరసన తమన్నా నటించడం ఇది రెండో సారి. వీరి కాంబినేషన్‌లో ఇంతకుముందు 'ఊసరవెల్లి' విడుదలైంది.


ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్


తమన్నా

ఊటీలో.. కూల్ జిందగీ!

ఎవరు ఎంత కష్టపడ్డా జిందగీలో కూల్‌గా ఉండటానికే. ఉన్న ఒక్క జిందగీని కూల్‌గా గడపడానికి రామ్ ప్రస్తుతం ఊటీలో ఉన్నారు. ఆయన హీరోగా నటిస్తున్న 'ఉన్నది ఒకటే జిందగీ' సినిమా


రామ్

షూటింగ్ అక్కడ జరుగుతోంది. 'నేను శైలజ' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత కిశోర్ తిరుమల దర్శకత్వంలో రామ్ నటిస్తున్న సినిమా ఇది. 'స్రవంతి' రవికిశోర్, పి.ఆర్. సినిమాస్ సమర్పణలో స్రవంతి సినిమాటిక్స్ పతాకంపై కృష్ణచైతన్య నిర్మిస్తున్నారు. అనుపమా పరమేశ్వరన్, లావణ్యా త్రిపాఠి నాయికలు. 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ "స్నేహం, ప్రేమ నేపథ్యంలో సాగే చిత్రమిది. ప్రస్తుతం ఊటీలో షెడ్యూల్ చేస్తున్నాం. ఈ నెలాఖరుతో పూర్తవుతుంది. ఇంకో పాట మాత్రం మిగిలి ఉంటుంది. ఆ పాటను ఫారిన్‌లో చిత్రీకరిస్తాం. నిర్మాణానంతర పనులు పూర్తి చేసి దసరాకు చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని అన్నారు. శ్రీ విష్ణు, ప్రియదర్శి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





వాళ్ల పెళ్లికి నేను గెస్ట్‌ని



"చైతన్య పెళ్లి పనులు నేనేం చూడట్లేదు. నేను గెస్ట్‌నంతే. అంతా వాళ్లే చూసుకుంటామన్నారు. (నవ్వుతూ) నన్ను చెక్కుమీద సంతకం పెట్టమన్నారు. పెళ్లిని హడావిడి లేకుండా చిన్నగా చేసుకుంటున్నారు. అక్టోబర్ 6న ఇటు హిందు, అటు క్రైస్తవ సంప్రదాయం ప్రకారం పెళ్లి. ఆ తర్వాత కార్యక్రమం (రిసెప్షన్) ఎలా చేయాలన్నది నేను ప్లాన్ చేస్తా" అని చెప్పారు నాగార్జున. ఆయన ప్రధాన పాత్ర పోషించిన 'రాజుగారి గది 2' విడుదలకు సిద్ధమవుతోంది. మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా ఆ సినిమాతో పాటు తన కుమారుల గురించీ నాగార్జున చెప్పిన విశేషాలు...

– నాగార్జున



'రాజుగారి గది 2' పనులు పూర్తయినట్లే. వెన్నెల కిశోర్‌తో ఒక్క రోజు ప్యాచ్‌వర్క్ ఉంది. అతను బాగా బిజీ కదా! అతని కోసమే వెయిటింగ్. రీరికార్డింగ్ జరుగుతోంది. సెప్టెంబర్ 10కి ఫస్ట్ కాపీ రావాలి. తొలిసారి కామెడీ హారర్ థ్రిల్లర్ చేశాను. నా కేరక్టర్ పరంగా కామెడీ తక్కువ. వెన్నెల కిశోర్, ప్రవీణ్, అశ్విన్.. ముగ్గురిపై కామెడీ ఉంటుంది. నాకు హారర్ ఫిలిమ్స్ ఇష్టం. ఇది మరీ 'ఎగ్జార్సిస్ట్' టైప్ కాకుండా, లైటర్‌వీన్ హారర్ థ్రిల్లర్. లక్కీగా నాకు దొరికింది. చిన్నప్పుడు హారర్ సినిమాల్ని భయంభయంగా ముడుచుకుపోయి చూసేవాడ్ని. ఇప్పుడు కూడా అప్పుడప్పుడు అట్లాగే చూస్తుంటా. అయితే షూటింగ్ చేసేప్పుడు మామూలు సన్నివేశాలు చేసినట్లే ఉంది. ఒరిజినల్ 'రాజుగారి గది'కీ, ఈ సినిమాకూ సంబంధమే లేదు. ఆ జోనర్ కాబట్టి, అది సక్సెస్‌ఫుల్ సినిమా కాబట్టి.. టైటిల్ ఇలా పెట్టారంతే. ఇది పూర్తి భిన్నమైన కథ. మొదటి సినిమాలో నా పాత్ర లేదు. హారర్ కామెడీ కాబట్టి పిల్లలు కూడా ఈ సినిమాని చూడొచ్చు. ఓంకార్ మరీ పెర్‌ఫెక్షనిస్ట్. ఆయన అనుకున్నది కరెక్టుగా తీస్తాడు. చిన్న చిన్న వివరాలు కూడా పట్టించుకుంటాడు. పూర్తి స్క్రిప్టు ముందే రాసుకొని చెప్పాడు.

డ్రామా మా మధ్యే

నాది మెంటలిస్ట్ కేరక్టర్. అంటే ఎదుటివాళ్ల మైండ్‌ను చదివేయగల పాత్ర. నిజ జీవితంలో అలాంటివాళ్లను ఇద్దరు ముగ్గుర్ని కలిశాను. మనం మాట్లాడే విధానాన్ని బట్టి మన మనసులో ఏముందో కనిపెట్టేస్తుంటారు. నిజం చెబుతున్నారా, అబద్ధం చెబుతున్నారా.. అనేది చెప్పేస్తుంటారు. అదేమీ మ్యాజిక్ కాదు. వాళ్లకు అబ్జర్వేషన్ పవర్ చాలా ఎక్కువ. మిర్రర్ మెమరీ ఉంటుంది. అంటే ఇరవై ఏళ్ల క్రితం జరిగింది కూడా వాళ్ల మనసులో అలాగే ఉండిపోతుంది. ఈ సినిమాని ఒక నిజమైన మెంటలిస్ట్ కేరక్టర్‌ను బేస్ చేసుకొని తీశారు. ప్రీతమ్ అని మలయాళీ ప్రేరణతో ఈ క్యారెక్టర్‌ను మలచారు. అయితే యథాతథంగా కాదు. ఆయనతో స్వయంగా మాట్లాడాను కూడా. సినిమాలో నా పాత్రకూ, సమంత పాత్రకూ కథలో ఎలాంటి అనుబంధమూ ఉండదు. అయితే డ్రామా ప్రధానంగా మా ఇద్దరి మధ్యే నడుస్తుంది. ఆమెది ఒక ఆత్మ పాత్ర.

గిరిజ లాంటి.. సమంత లాంటి.. అమ్మాయి!

నిజానికి ప్రియదర్శన్ కుమార్తెకు స్క్రీన్ టెస్ట్ చేసిన తర్వాత ఇంకో ముప్పై, నలభై మందికి స్క్రీన్ టెస్ట్ చేయించాం. అందుకే షూటింగ్ లేటయ్యింది. సినిమాని ఎప్పుడో జనవరిలో మొదలు పెట్టాం. ఇది వెరీ యంగ్ ఫ్రెష్ లవ్ స్టోరీ. హీరోయిన్ యంగ్‌గా, ఇంతకు ముందు ఏ సినిమాలో కనిపించకుండా ఫ్రెష్‌గా ఉండాలి. 'గీతాంజలి'లో గిరిజ లాగా, 'ఏ మాయ చేశావే'లో సమంత లాగా కొత్తగా ఉండాలని వెతుకుతూ వచ్చాం. చివరకు కల్యాణిని తీసుకున్నాం.

మిలియన్‌కు ఒక 'బాహుబలి'

'బాహుబలి' ఒక ఫినామినల్! మిలియన్‌కు ఒకటి అలాంటి సినిమా వస్తుంది. ప్రతి రోజూ అలాంటి సినిమా వస్తుందని అనుకోవద్దు. ఆ సినిమా కోసం రాజమౌళి టీమ్, ఆయన ఫ్యామిలీ కేటాయించిన టైమ్, పెట్టిన ఎఫర్ట్ మామూలుగా ఎవరు పెడతారు! ప్రభాస్ దాని కోసమే ఐదేళ్లు కేటాయించడం.. నాట్ ఈజీ. అమీర్‌ఖాన్ ఒకసారి బహిరంగంగా చెప్పాడు.. 'మహాభారతం అంటే నాకు చాలా ఇష్టం. దాన్ని చేయాలనుంది. కానీ ఐదు నుంచి పదేళ్ల కాలం దానికే కేటాయించాలి. అందుకే చేయలేకపోతున్నా' అని. కానీ ఇక్కడ 'బాహుబలి' కోసం రాజమౌళి బృందం చేసింది కదా! శ్రీకుమార్ మీనన్ తీసే 'మహాభారతం'ను 2018లో మొదలు పెడతామని చెప్పారు. కర్ణుడి పాత్ర కోసం నాతో మాట్లాడారు. మళ్లీ ఇంతవరకూ సమాచారం లేదు. అది తీస్తారో లేదో నాకు తెలీదు.




నేనిచ్చిన టైటిల్

'హలో' యాక్షన్ లవ్ స్టోరీ. విక్రమ్‌కుమార్ చాలా బాగా చేస్తాడు. వెరీ క్రియేటివ్ డైరెక్టర్. ఆర్టిస్టులతో యాక్టింగ్ చాలా బాగా చేయించుకుంటాడు. సినిమా బాగా వస్తోంది. టైటిల్‌ను జనం బాగా యాక్సెప్ట్ చేశారు. ఒక వీడియో క్లిప్ ద్వారా 'హలో!' టైటిల్‌ను ప్రకటించిన విషయం మీకు తెలుసు. ఆ క్లిప్‌లో పెద్దాయన ఎన్టీఆర్‌తో మొదలుపెట్టించి, నాన్నతో చివరన 'హలో' అనిపించాలని అనుకొన్నాం. ఆ టైమ్‌లో సినిమాల్లో ఎన్టీఆర్‌గారు 'హలో' అన్న సన్నివేశం దొరకలేదు. అందుకని తారక్‌ను అడిగి, అతనితో స్టార్ట్ చేయించాం. సినిమాకు 'హలో!' అనేది పెర్‌ఫెక్ట్ టైటిల్. తను ప్రేమించిన అమ్మాయి దగ్గర్నుంచి 'హలో!' అనే ఒక్క మాట కోసం సినిమా అంతా వెయిట్ చేస్తుంటాడు అఖిల్. ఇది నేనిచ్చిన టైటిల్. వాళ్లు ఆరు నెలల నుంచి టైటిల్ కోసం కొట్టుకుంటున్నారు. సాధారణంగా నాకు మంచి ఆలోచనలన్నీ పొద్దున ఆరింటికి వస్తుంటాయి. అప్పుడే ఎక్సర్‌సైజ్ చేసి కూర్చుంటా. మైండ్ ఫ్రెష్‌గా పని చేస్తుంటుంది. ఆ టైమ్‌లో టైటిల్ స్ఫురించింది. ఆరున్నరకు సుప్రియకు ఫోన్ చేసి, 'హలో!' టైటిల్ వెంటనే రిజిస్టర్ చేయించమని చెప్పా. అప్పటికే ఎవరో ఒకరు కచ్చితంగా ఆ పేరు రిజిస్టర్ చేయించి ఉంటారనుకున్నా. ఐదేళ్ల నుంచీ ఎవరూ చేయించక పోవడం ఆశ్చర్యమే. టైటిల్ ఎనౌన్స్‌మెంట్‌ను స్ట్రాటజీతో చేశానన్నారు. కానీ అలాంటిదేమీ లేదు. మేకింగ్ పరంగా 'హలో!' కొంచెం కాంప్లికేటెడ్. ఎక్కువ లొకేషన్లలో చేయాలి. బాగా ఖర్చు పెట్టాలి. సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నా.

తారక్ ఫెంటాస్టిక్

నిజానికి బయట ఎలా ఉంటాడో.. 'బిగ్‌బాస్' హోస్ట్‌గా అలాగే కనిపిస్తున్నాడు తారక్. ఫెంటాస్టిక్‌గా చేస్తున్నాడు. సినిమాల్లో కేరక్టర్ ప్రకారం కంట్రోల్‌గా చేయాలి. ఒరిజినల్‌గా చాలా ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇప్పుడు ఈ షో ద్వారా అది బయటకు వచ్చింది. అలాగే 'నెం.1 యారి' హోస్ట్‌గా రానా కూడా బాగా చేస్తున్నాడు. మంచి జోడీ వచ్చినప్పుడు చాలా బాగుంటోంది. నన్ను కూడా దానికి పిలిచాడు కానీ.. తన వయసు వాళ్లతో అయితేనే అది బాగుంటుంది. ఫ్రీగా మాట్లాడుకోవచ్చు. నా వయసంటే ఏమన్నా అడగాలన్నా ఫ్రీజ్ అయిపోవచ్చు.


రవితేజ

సర్వేంద్రియాణాం...

"హి ఈజ్ బ్లైండ్, బట్ హి ఈజ్ ట్రైన్డ్'. కళ్లు లేని ఓ యువకుడి నమ్మకం ఇది. అంధుడైన అతను మనిషికి కళ్లు మాత్రమే కాదు.. సర్వం ప్రధానమంటాడు. మరోపక్క ప్రపంచాన్ని చూడలేని తన బిడ్డను.. ప్రపంచం మొత్తం చూడాలంటోంది అతని తల్లి. వీరిద్దరి నమ్మకం ఏంటో తెలుసుకోవాలంటే మా సినిమా చూడాల్సిందే అంటున్నారు అనీల్ రావిపూడి. రవితేజ కథానాయకుడిగా ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రాజా ది గ్రేట్'. మెహరీన్ కథానాయిక. దిల్ రాజు, శిరీశ్ నిర్మాతలు. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో చిత్రీకరణ జరుగుతోంది. ప్రకాశ్‌రాజ్, ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రెండు పాటలు మినహా 80శాతం చిత్రీకరణ పూర్తయింది. సెప్టెంబర్‌లో పాటల్ని, అక్టోబర్ రెండోవారంలో సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.

కొత్తరకం ప్రేమకథ

"ఓకే బంగారం' సినిమాతో దుల్కర్ సల్మాన్, 'ఫిదా' సినిమాతో సాయిపల్లవి తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ మహానటి సావిత్రి బయోపిక్ 'మహానటి'లో నటిస్తున్నారు. అలాగే నాని హీరోగా రూపుదిద్దుకొంటున్న ఎంసిఏ' చిత్రంలో సాయిపల్లవి కథానాయికగా నటిస్తోంది. సల్మాన్, సాయిపల్లవి కాంబినేషన్‌లో రూపుదిద్దుకొన్న చిత్రం 'కలి'. సీడెడ్ పంపిణీదారుడు డి.వి.కృష్ణస్వామి లక్ష్మీచెన్నకేశవ ఫిల్మ్స్ పతాకంపై 'హేయ్.. పిల్లగాడ' పేరుతో తెలుగులోకి ఈ సినిమాని లనువదిస్తున్నారు. సమీర్ తాహిర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం లోగోని దర్శకుడు శేఖర్ కమ్ముల ఇటీవల విడుదల చేశారు. ఈ సినిమా విజయం సాధించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. నిర్మాత డి.వి. కృష్ణస్వామి మాట్లాడుతూ కొత్తరకం ప్రేమకథతో సినిమా రూపుదిద్దుకున్న సినిమా ఇది. 'యూత్‌కు బాగా కనెక్ట్ అవుతుంది. సెప్టెంబర్ 8న విడుదల చేస్తున్నాం' అనితెలిపారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దక్షిణ్ శ్రీనివాస్, కో ప్రొడ్యూసర్: వి.చంద్రశేఖర్.


దుల్కర్ సల్మాన్, సాయిపల్లవి

ఎన్.శంకర్ స్టూడియోకు స్థలం



ప్రముఖ దర్శకుడు ఎన్. శంకర్‌కు స్టూడియో నిర్మాణం కోసం హైదరాబాద్ శివారులో ఐదెకరాల స్థలం కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు లాంఛనాలన్నీ పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు, టీఎస్‌ఐఐసీకి ఆదేశాలు జారీ చేశారు. రావిర్యాల గ్రామంలో టీఎస్‌ఐఐసీ ఆధీనంలో ఉన్న ఐదెకరాల స్థలాన్ని ఇప్పటికే స్టూడియో కోసం గుర్తించారు. నామమాత్రపు విలువతో ఎన్.శంకర్‌కు ఇవ్వనున్నారు. నగర శివారులో భూమిని కేటాయించి... స్టూడియో నిర్మాణం కోసం అవసరమైన ఖర్చును ప్రభుత్వం కూడా భరించే అవకాశాలు లేకపోలేదు. తెలంగాణ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ స్టూడియోను నిర్మించి... తెలంగాణ నేపథ్యంగా చిత్రాలను నిర్మించనున్నారు.

బ్రిడ్జిని దాటితే...




"ఆ ఊళ్లో అందరికీ బ్రిడ్జ్ అంటే భయం. అయినా ఓ యువజంట ఆ బ్రిడ్జిని దాటే సాహసం చేస్తుంది. అంత సాహసం ఎందుకు చేయాల్సి వచ్చింది? ఎలా సాధ్యపడింది?" అనే అంశంతో రూపొందిన చిత్రం 'అ ఆ పురం'. బాబీ సిన్హా, మౌనిక జంటగా నటించారు. గారపాటి మూవీ క్రియేషన్స్ పతాకంపై రూపొందింది. జి.ఎస్.ఎన్.మూర్తి (చిన్ని) నిర్మాత. నాగ సుబ్బారావు నేతృత్వం వహిస్తున్నారు. "హారర్, గ్రాఫిక్స్, సస్పెన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా సాగే చిత్రమిది. సెప్టెంబర్‌లో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అని నిర్మాత అన్నారు.

స్వచ్ఛమైన ప్రేమ



తనిష్‌రెడ్డి, అలెక్సియస్, సుభాంగి పంత్ నటీనటులుగా రూపొందుతున్న చిత్రం 'దర్పణం'. వి.రామకృష్ణ దర్శకుడు. వి.ప్రవీణ్‌కుమార్ యాదవ్ నిర్మాత. ఇటీవల హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభమైంది. దర్శకుడు మాట్లాడుతూ "స్వచ్ఛమైన ప్రేమ ఎలా ఉంటుందో తెలిపే ప్రేమకథ ఇది. యువతకు బాగా చేరువవుతుంది" అని తెలిపారు. దర్శకుడు కథ చెప్పిన విధానం నచ్చిందనీ, సింగిల్ షెడ్యూల్‌లో సినిమాను పూర్తి చేస్తామని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి ముత్యాల సతీశ్‌ఛాయాగ్రాహకుడిగా పనిచేస్తున్నారు.



మాట తప్పని వారైతే ఎంపీలతో
రాజీనామా చేయించండి

- **జగన్‌కు సీఎం చంద్రబాబు సవాల్**
- **నంద్యాలలో అభివృద్ధి, సానుభూతి గెలిపించాయి**
- **ఈ ఫలితంతో రాష్ట్రం ఊపిరి పీల్చుకుంది: చంద్రబాబు**

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'నంద్యాల ఫలితం తర్వాత కూడా జగన్ ఎన్నికలంటూ ఊరేగుతున్నారు. పార్లమెంటు సమావేశాలు అయ్యాక ప్రత్యేక హోదా కోసం మీ పార్టీకి చెందిన ఐదుగురు ఎంపీలతో జూన్‌లో రాజీనామా చేయిస్తా అన్నారుగా. ఆగస్టు వచ్చింది. మీ ఎంపీలతో రాజీనామా చేయించండి. విశ్వసనీయతకు మారు పేరు.. మాట తప్పను.. మడమ తిప్పను అంటారుగా.. మాటపై నిలబడండి' అని సీఎం చంద్రబాబు ప్రతిపక్ష నేత జగన్‌కు సవాల్ విసిరారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన 20 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లాలన్న జగన్ సవాల్‌పై సీఎం పైవిధంగా స్పందించారు. సోమవారం సచివాలయంలో సీఎం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం పలువురు ఎమ్మెల్యేలు టీడీపీలో చేరారని గుర్తు చేశారు. 'నంద్యాల ఫలితంతో రాష్ట్రం ఊపిరిపీల్చుకుంది. ఏంటీ ఉన్మాదం, ఏంటీ అరాచకత్వం అని ప్రతిపక్ష నేత


తన నివాసానికి వచ్చిన కార్యకర్తలకు చంద్రబాబు అభివాదం

తీరుపై ఆందోళన చెందిన రాష్ట్ర ప్రజలు ఉపశమనం పొందారు'ని వ్యాఖ్యానించారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లోను విజయం తమదేనన్నారు. 'నంద్యాల ఉప ఎన్నికలకు ఇంత ప్రాముఖ్యత ఇవ్వాల్సిన పనిలేదు. కానీ ప్రతిపక్ష నేత 13 రోజులు అక్కడే ఉండి ఏదో సాధించేస్తాం, తిరగరాసేస్తాం, నడిరోడ్డుపై కాల్చేస్తాం, బట్టలిప్పేస్తామంటూ మాట్లాడి నంద్యాల ఉప ఎన్నికకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చారు.' అని సీఎం వ్యాఖ్యానించారు. అభివృద్ధి, సంక్షేమం అజెండాతో తాము ప్రజల వద్దకు వెళితే జగన్ మాత్రం విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల ముందుకెళ్లాడని అన్నారు. ప్రజలు విజ్ఞతతో టీడీపీని గెలిపించారని పేర్కొన్నారు. నంద్యాల ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని, సానుభూతి కూడా పనిచేసిందని అన్నారు.

సాధువుల్లో డేరా బాబా...రాజకీయాల్లో జగన్ బాబా

ఒక సాధువుగా ఉండి ఉన్మాదాన్ని ప్రోత్సహించేందుకు డేరా బాబా ప్రణాళిక వేశారని, రాజకీయాల్లో జగన్ బాబా.. హింస, ఉన్మాదం, అరాచకాన్ని ప్రోత్సహిస్తున్నాడని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను ఒక సంప్రదాయానికి శ్రీకారం చుట్టా. ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి మరణిస్తే, వారి కుటుంబసభ్యుల్లో ఒకరిని ఏకగ్రీవంగా ఎన్నుకునే మంచి సంప్రదాయం అది. కానీ భూమా నాగిరెడ్డి చనిపోతే ప్రతిపక్ష నేత జగన్ దాన్ని పాటించలేద'న్నారు.


అఖిలప్రియ, మౌనికలతో బ్రహ్మానందరెడ్డి


కౌంటింగ్ హాల్‌లో దిగాలుగా శిల్పా

గెలుపు 'బ్రహ్మ'ండం

(మొదటి పేజీ తరువాయి)

పెరిగింది. అయితే సామాజికంగా, రాజకీయంగా నంద్యాలలో పలు సానుకూలతలున్నా, వైసీపీ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. సోమవారంనాడు... మొత్తం 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగ్గా, కేవలం ఒకేఒక్క రౌండులో మాత్రమే వైసీపీకి స్వల్ప ఆధిక్యం లభించింది. మిగతా 18 రౌండ్లలోనూ తెలుగుదేశానిదే పైచేయిగా నిలిచింది. రౌండు రౌండుకూ మెజారిటీ పెరుగుతూ పోయింది. పట్టణం, గ్రామీణ ప్రాంతం అనే తేడా లేకుండా ఓటర్లు తెలుగుదేశానికి ఓట్లు వేశారు. "నంద్యాలలో ముస్లిం, రెడ్డి, ఎస్సీల ఓట్లే సగం ఉన్నాయి! వైసీపీకే వారి ఓటు! నంద్యాల... అచ్చంగా వైసీపీ సీటు" అని తొలుత విశ్లేషణలు వెలువడ్డాయి. రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా ఉన్న శిల్పా మోహన్ రెడ్డి వైసీపీ నుంచి బరిలో నిలవగా, ఎక్కడా కనపడని, పేరైనా వినపడని కుర్ర నాయకుడు భూమా బ్రహ్మానంద రెడ్డి టీడీపీ అభ్యర్థిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో 'పోరులో వైసీపీదే గెలుపు' అని అంచనాలు వెలువడ్డాయి. అయితే హోరాహోరీ పోరు సంగతి పక్కనపెడితే... 27,466 ఓట్ల మెజారిటీతో టీడీపీ గెలుపొందడం గమనార్హం. దీంతో ఏపీ అసెంబ్లీలో టీడీపీ బలం అధికారికంగా 103కు పెరిగింది.

జగన్ వ్యూహాత్మక వైఫల్యం..

శిల్పా మోహనరెడ్డిని తమ పార్టీలోకి తీసుకొని అభ్యర్థిగా ప్రకటించడంలో చూపినంత వేగాన్ని జగన్ ఆ తర్వాత రాజకీయ ఎత్తుగడల్లో చూపించలేకపోయారు. చివరకు తమ పార్టీకి మంచి మెజారిటీ ఇస్తుందని ఆశించిన గోస్పాడు మండలంలో కూడా వైసీపీ మెజారిటీ సాధించలేకపోయింది. 'రాయలసీమలో వరుసగా రెండుసార్లు జగన్ వ్యక్తిగతంగా పరాజయం పొందారు. కడప ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన సొంత బాబాయి వివేకానంద రెడ్డిని పోటీకి నిలబెట్టి, తాను స్వయంగా కడపలో కూర్చుని ప్రచారం నిర్వహించారు. అయినా... అక్కడ టీడీపీ గెలుపొందింది. ఇప్పుడు నంద్యాలలో జగన్ 13 రోజులు మకాం వేసి ప్రచారం చేశారు. కానీ, భారీ మెజారిటీతో ఓడిపోయారు. సొంత ప్రాంతంలోనే ఆయన పట్టు కోల్పోతున్నారు. మేం బలపడుతున్నాం" అని రాయలసీమకు చెందిన టీడీపీ నేత ఒకరు వ్యాఖ్యానించడం విశేషం!

ఆది నుంచీ అదే వ్యూహం

శిల్పా మోహనరెడ్డికి నంద్యాల నియోజకవర్గంలో బాగా సంబంధాలున్నాయి. సీనియర్ నాయకుడు. పోయిన ఎన్నికల్లో కర్నూలు జిల్లాలో వైసీపీకి అనుకూలంగా పెద్ద ప్రభంజనమే వీచినా... టీడీపీ తరపున పోటీ చేసిన ఆయన కేవలం 3వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ నేపథ్యంలో వైసీపీకి అనుకూలంగా ఉన్న సామాజిక సమీకరణాలకు శిల్పా మోహనరెడ్డి సొంత సంబంధాలు తోడైతే తమకు ఓటమి తప్పదని టీడీపీ నాయకత్వం తొలుత ఆందోళన చెందింది. కానీ, టీడీపీ అధినేత చంద్రబాబు తన రాజకీయ అనుభవంతో పక్కా వ్యూహం రచించారు. అభివృద్ధే తమను గెలిపిస్తుందనే సూత్రాన్ని నమ్ముకున్నారు. నంద్యాలలో ఇరుకైన రోడ్లు ఉన్న విషయాన్ని గుర్తించిన సీఎం... ఆగమేఘాల మీద విస్తరణ చేపట్టారు. 13వేల ఇళ్ల నిర్మాణానికి చకచకా శ్రీకారం చుట్టారు. మూడున్నరేళ్లలో తమ ప్రభుత్వం సాధించిన విజయాలను, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. వీధివీధినా సీసీ రోడ్లు, చామకాల్వ, కుందూనది ఆధునికీకరణ, అమృత్ కింద వెలుగోడు నుంచి నంద్యాలకు తాగునీటి పథకం కోసం శంకుస్థాపన చేశారు. ఇలా పట్టణం, పల్లెల్లో రూ.2,135 కోట్లతో అభివృద్ధి పనులకు నాంది పలికారు.


బ్రహ్మానందరెడ్డి విజయోత్సాహం

అభివృద్ధే అజెండా...

సాధారణంగా ఉప ఎన్నికల్లో ఎలాంటి అజెండా ఉండదు. అధికార పార్టీని సులువుగా గెలుపు వరిస్తుంది. కానీ... నంద్యాల ఉప ఎన్నిక మాత్రం అసాధారణంగా జరిగింది. అభివృద్ధే ప్రధాన నినాదంగా మారిపోయింది. టీడీపీ గెలిస్తేనే పట్టణంలో అభివృద్ధి కొనసాగుతుందన్న అభిప్రాయం బలంగా వ్యాపించింది. ఇక... జగన్ కూడా 'ఉప ఎన్నికలో మేం బరిలో లేకుంటే నంద్యాలను పట్టించుకునే వారా?' అంటూ పదేపదే ప్రశ్నించడం టీడీపీకి పరోక్షంగా ప్రచారం చేసినట్లయింది. అంతేకాదు... చంద్రబాబును ఉద్దేశించి ఉరి వేయడం, కాల్చి చంపడం, చొక్కా విప్పడం, నిక్కరు విప్పడం వంటి పరుష పదజాలాన్ని ప్రయోగించారు. వీటన్నింటినీ అధికార పక్షం తనకు అనుకూలంగా మలుచుకోగలిగింది.


టీడీపీ కార్యకర్తల సంబరాలు

విలువైన భాగస్వామి
టీడీపీకి అభినందనలు

- **బ్రహ్మానంద రెడ్డికి శుభాకాంక్షలు**
- **మోదీ ట్వీట్.. ధన్యవాదాలు తెలిపిన చంద్రబాబు**



అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఉప ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీకి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందనలు తెలిపారు. 'నంద్యాలలో భారీ విజయం సాధించిన టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి, మా విలువైన ఎన్డీయే భాగస్వామి తెలుగుదేశంకు అభినందనలు' అని ప్రధాని ట్వీట్ చేశారు. చంద్రబాబు మోదీకి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సురేష్‌ప్రభు సైతం చంద్రబాబుకు ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు.

సోషల్ మీడియాలో
సెటైర్లే.. సెటైర్లు!

చాన్స్ దొరికితే చాలు! సెటైర్లతో విరుచుకుపడే నెటిజన్లు నంద్యాలపైనా అలాగే స్పందించారు. వాటిలో ఇవి కొన్ని...

- నంద్యాలలో తమకు ఓటువేసిన 1382 మందిని ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి రప్పించి, సన్మానం చేయాలని సోనియా, రాహుల్ నిర్ణయించుకున్నారు.
- నంద్యాల ఎన్నికల్లో వైసీపీకి భారీ ఆధిక్యం.. కాంగ్రెస్ అభ్యర్థికంటే!
- నంద్యాల చెప్పిన నీతి: అధికార దుర్వినియోగం కన్నా, నోటి దుర్వినియోగం ప్రమాదకరం!
- 'సైరా నరసింహారెడ్డి' లోగోను... 'జైరా బ్రహ్మానంద రెడ్డి'గా మార్చారు.
- నంద్యాలలో ధర్మమే గెలుస్తుంది: జగన్. 'ఔను. టీడీపీ గెలిచింది. వైసీపీ ఓడింది' - నెటిజన్.

రాజకీయ సన్యాసం తీసుకోండి



"నంద్యాల ఉప ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటామన్న శిల్పా బ్రదర్స్ మాట మీద నిలబడాలి. శిల్పా మోహన్ రెడ్డి గతంలో భూమా నాగిరెడ్డిపై ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని అన్నారు. ఇప్పుడు కూడా అదే సవాల్ చేశారు. ఈ విషయంపై మీడియా ప్రశ్నిస్తే అప్పుడు నేను స్పందించడం లేదని అంటున్నారు. ఓడిపోతే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని నేనే ముందు సవాల్ చేశాను. అందువల్ల ఆయన సవాల్‌కు ప్రతిస్పందించాల్సిన అవసరం లేదు. ఇలాంటి వారు రాజకీయాల్లో ఉన్నా తమకు నష్టం లేదు. అయితే నంద్యాల వదిలి కడప వెళ్లి రాజకీయాలు చేసుకోవాలి. నా కుటుంబాన్ని గెలిపించడం ద్వారా ప్రజలు భూమా నాగిరెడ్డిని బతికించారు."

– మంత్రి అఖిల ప్రియ

అప్పుడు స్పందించలేదు



"ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానన్న నా సవాల్‌కు అఖిలప్రియ స్పందించలేదు. అందువల్ల నేను మాట మీద నిలబడాల్సిన అవసరం లేదు. అప్పుడు ఆమె స్పందించి ఉంటే ఇప్పుడు నేను నా నిర్ణయం చెప్పి ఉండేవాడిని. నంద్యాల ఉప ఎన్నికలో డబ్బు, భూమా కుటుంబంపై సానుభూతి పనిచేశాయి. అందుకే టీడీపీ విజయం సాధించింది. మాకు మెజారిటీ వస్తుందనుకున్న ప్రాంతాల్లో కూడా రాలేదు. ఎన్నికల్లో గెలుపోటములు సహజం. ప్రజల తీర్పును శిరసావహిస్తా."

– వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి

ఇది గెలుపనుకుంటే...
చంద్రబాబు మూర్ఖుడే

- **ఉప ఎన్నికలో ఓటర్లను భయపెట్టారు**
- **బాబు సీఎంగా కొనసాగకతప్పదు కాబట్టే టీడీపీకి ఓటు వేశారు!**
- **ఇది రెఫరండం కానే కాదు: జగన్**

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): "నంద్యాల ఉపఎన్నికలో టీడీపీ గెలుపు చంద్రబాబునాయుడి విజయం అనుకుంటే అంతకంటే దిగజారుడుతనం మరొకటి ఉండదు. దీనిని గెలుపుగా భావిస్తే చంద్రబాబు అంతటి మూర్ఖుడు ప్రపంచంలో మరొకరు ఉండరు" అని వైసీపీ అధ్యక్షుడు జగన్ పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికలో తమ అభ్యర్థి ఓటమి ఖరారైన తర్వాత హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. "ఈ ఎన్నికల్లో టీడీపీ గెలవడానికి కారణం ఒక్కటే. ఇది సాధారణ ఎన్నిక కాదు. ఇప్పుడు టీడీపీని ఓడించినా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఇంకో ఏడాది కొనసాగుతారు కాబట్టి, మరో గత్యంతరం లేదు కాబట్టి టీడీపీకి ఓటు వేశారు. టీడీపీ పెట్టిన భయానికి, ప్రలోభాలకు ఓటర్లు ఒప్పుకోక తప్పలేదు" అన్నారు. ఈ ఉప ఎన్నిక ఫలితాలను టీడీపీ పాలనకు రెఫరండంగా భావిస్తారా అని అడగ్గా 'రెఫరండం ఎలా అవుతుంది?" అని జగన్ ఎదురు ప్రశ్నించారు. "పార్టీ ఫిరాయించిన 20 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు రమ్మనండి. పోలీసులు, డబ్బుతో భయభ్రాంతులను చేసి ఒక్క చోట గెలిస్తే అది రెఫరెండం ఎలా అవుతుంది. నంద్యాలలో 200 కోట్లు ఖర్చు పెట్టారు. 20 చోట్ల ఉప ఎన్నిక జరిగితే 4 వేల కోట్లు ఖర్చు ఎలా ఖర్చు పెడతారో చూద్దాం! మంత్రులను, పోలీసులను ఎలామోహరిస్తారో చూస్తాం!" అని జగన్‌సవాల్ విసిరారు.

ఆవేశం... తడబాటు...

మీడియాతో మాట్లాడుతుండగా జగన్ ముఖంలో ఒకింత ఆక్రోశం, ఆవేశం కనిపించాయి. ఆయన మాటల్లో తడబాటూ కనిపించింది. "మా పార్టీ గుర్తుమీద గెలిచిన ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకున్నారు. వారిని టీడీపీ గుర్తు మీద గెలుపించుకోగల ధైర్యం చంద్రబాబుకు లేదు" అంటూ 'హి ఈజ్ నాట్ ఎ మ్యాన్ ఎనఫ్' (అంతటి ధైర్యం లేదు) అన్నారు. 'పాలిటిక్స్‌లో ఉండాలంటే ధైర్యముండాల' అని ఛాతీపై చేత్తో తట్టుకున్నారు. ఇప్పుడు చంద్రబాబు దెబ్బ కొట్టారు. సమయమొచ్చినప్పుడు మేమూ కొడతాం" అన్నారు.

ఇది రెఫరండమే!



"నంద్యాల ప్రజలు కేవలం ఒక ఎమ్మెల్యేను ఎన్నుకునేందుకు ఓటు వేయడం లేదు. మూడున్నరేళ్ల చంద్రబాబు పనితీరుకు ప్రజలు చెప్పే తీర్పు! ఇది నీతికి, అవినీతికి... న్యాయానికి, అన్యాయానికీ మధ్య జరుగుతున్న ఎన్నిక. 2019లో జరగబోయే కురుక్షేత్రానికి నంద్యాల నాంది!"

– నంద్యాల ఎన్నికల ప్రచారంలో జగన్

రెఫరండం ఎలా అవుతుందమ్మా?

"ఇది రెఫరండం ఎలా అవుతుందమ్మా! నువ్వే చెప్పమ్మా! నాకు ఒకటి చెప్పు! ఒకే ఒక చోట ఎన్నిక జరపడం, మొత్తం 200 కోట్లు డబ్బు పెట్టడం, మంత్రులందరినీ కూర్చోపెట్టడం, పోలీసులందరినీ వాడుకోవడం... ఇలాంటి పరిస్థితి సృష్టించి జరిగే ఎన్నిక రెఫరండం అవుతుందా?"

– సోమవారం హైదరాబాద్‌లో జగన్ (తనను ప్రశ్నించిన మహిళా జర్నలిస్టుతో)

రెంటికీ చెడ్డ శిల్పా సోదరులు!

కర్నూలు, ఆగస్టు 28 (ఆంధ్రజోతి): ఆరేళ్ల ఎమ్మెల్సీ పదవికి మూడునెలల్లోనే రాజీనామా చేసిన తమ్ముడు! రాజకీయ అభద్రత, గెలుపుపై అతి విశ్వాసంతో అన్న! చివరికి ఇద్దరూ దెబ్బతిన్నారంటూ శిల్పా సోదరులపై ఒకింత సానుభూతి వ్యక్తమవుతోంది. ఇది వారి స్వయంకృతాపరాధమేననే వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి. కేవలం నెల రోజుల వ్యవధిలో ఈ ఇద్దరు సోదరులు తీసుకున్న అనూహ్య నిర్ణయాలు.. వారి జాతకాలను తారుమారు చేశాయి. 2014లో టీడీపీ నుంచి శిల్పా మోహన్‌రెడ్డి పోటీ చేసి భూమా నాగిరెడ్డి చేతిలో ఓడిపోయారు. నాగిరెడ్డి మరణం తర్వాత భూమా కుటుంబానికి మంత్రి పదవి ఇచ్చినందున, ఉప ఎన్నికల్లో తనకే అవకాశం ఇవ్వాలని సీఎం చంద్రబాబు వద్ద శిల్పా పట్టుబట్టారు. ఈ విషయంలో భూమా అఖిల ప్రియకు సర్దిచెప్పి.. శిల్పాకే టికెట్ ఇవ్వాలని ఒక దశలో చంద్రబాబు భావించారు. ఈలోపే అఖిలప్రియ చకచకా పావులు కదుపుతూ, నియోజకవర్గంలో దూసుకుపోయారు. ఈ క్రమంలో శిల్పా అభద్రతా భావానికి లోనయ్యారు. నియోజకవర్గంపై పట్టు కోల్పోతామనే ఉద్దేశంతో వెనువెంటనే టీడీపీని వీడి వైసీపీలో చేరారు. అధికార పక్షాన్ని వీడి... విపక్ష అభ్యర్థిగా బరిలో నిలిచారు! ఓడిపోయారు!

తమ్ముడి పరిస్థితి ఇలా...

"అన్న వేరు.. రాజకీయాలు వేరు. నేను టీడీపీలోనే ఉంటాను" అని శిల్పా చక్రపాణిరెడ్డి తొలుత ప్రకటించారు. ఆ తర్వాత.. ఆయన కూడా టీడీపీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తేనే వైసీపీలో చేర్చుకుంటానని జగన్ షరతు పెట్టడంతో.. పదవిని వదులుకున్నారు. ఎమ్మెల్సీ పదవి పోతే పోయింది, ఎన్నికల్లో అన్నను గెలిపించుకుని.. నంద్యాలలో తమ హవా తగ్గలేదని చాటాలని వ్యూహాలు అమలు చేశారు. కానీ... అవి పని చేయలేదు. ఆయన టీడీపీలో కొనసాగి ఉంటే... మండలి చైర్మన్ అయ్యేవారు! కానీ.. కేవలం తొందరపాటుతోనే రాజకీయంగా శిల్పా సోదరులు భారీ మూల్యం చెల్లించుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గోవా సీఎం పర్రీకర్ గెలుపు

- **ఉప ఎన్నికల్లో రెండు స్థానాలూ బీజేపీకే**
- **మనోహర్‌కు ప్రధాని మోదీ అభినందనలు**

పనాజీ, ఆగస్టు 28: గోవా ఉప ఎన్నికల్లో అధికార బీజేపీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ముఖ్యమంత్రి మనోహర్ పర్రీకర్ సహా.. ఉప ఎన్నిక జరిగిన రెండు అసెంబ్లీ స్థానాలనూ కమలం పార్టీ కైవసం చేసుకుంది. పనాజీ నుంచి పోటీ చేసిన సీఎం పర్రీకర్.. తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ సీనియర్ నేత గిరీశ్ చోడాంకర్‌పై 4803 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పర్రీకర్ కేంద్ర రక్షణశాఖ మంత్రి పదవిని వదిలి గోవా సీఎంగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇక వాల్పోయ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆరోగ్యశాఖ మంత్రి విశ్వజిత్ రాణే.. కాంగ్రెస్ అభ్యర్థిపై 10,066 ఓట్లతో గెలుపొంది తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఈ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎన్నికైన రాణే.. ఆ తరువాత బీజేపీలో చేరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక వచ్చింది. కాగా సీఎం పర్రీకర్‌కు, మంత్రి విశ్వజిత్ రాణేకు ప్రధాని నరేంద్ర మోదీ ట్విటర్‌లో అభినందనలు తెలిపారు.


పర్రీకర్ విజయోత్సవ ర్యాలీ

బవానాలో ఆప్ గెలుపు

ఢిల్లీలో సీఎం కేజ్రీవాల్ పట్టు నిలుపుకొన్నారు. బవానా అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్).. విజయం సాధించింది. ఆప్ అభ్యర్థి రాంచందర్ 59,886 ఓట్ల మెజారిటీతో బీజేపీకి చెందిన సమీప ప్రత్యర్థి వేద ప్రకాష్‌పై గెలుపొందారు. కాంగ్రెస్ మూడో స్థానానికే పరిమితమైంది.

లెక్క పక్కా!

నిజమైన 'ఆంధ్రజ్యోతి' అంచనా

- **'ఫ్లాష్ టీమ్'తో నంద్యాలలో సర్వే**
- **వైసీపీకి 38.53% ఓట్లు వస్తాయన్న సర్వే**
- **ఆ పార్టీ ఖాతాలో 40 శాతం ఓట్లు**

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రధాన పార్టీల్లో ఎవరి ధీమా వారిదే! అభిమానాలకు అనుగుణంగా ఎవరికి వారు తమ ఊహలకు రెక్కలు కట్టిన వారే! సామాన్య జనంలో మాత్రం ఎడతెగని ఉత్కంఠ, అయోమయం, గందరగోళం! ఇలాంటి సమయంలో... నంద్యాల బరిలో గెలుపు తెలుగుదేశానిదే అని ఢంకా భజాయించి చెప్పింది 'ఆంధ్రజ్యోతి'. ఇప్పుడు... ఆ సర్వే అక్షరాలా నిజమైంది. నంద్యాల నియోజకవర్గంలో ఆర్జీస్ ఫ్లాష్ టీమ్‌తో కలిసి 'ఆంధ్రజ్యోతి' ఎగ్జిట్ పోల్, పోస్ట్‌పోల్ సర్వే నిర్వహించింది. ఆ రెండింటి ఫలితాలను క్రోడీకరించి ఈనెల 25న ప్రత్యేక కథనం ప్రచురించింది. సోమవారం వెలువడిన తుది ఫలితాలతో ఈ సర్వే అంచనాలు దాదాపు వంద శాతం సరిపోలడం విశేషం. నంద్యాల పట్టణంతోపాటు రూరల్, గోస్పాడు మండలాల్లోనూ టీడీపీకే ఆధిక్యం దక్కుతుందని సర్వేలో స్పష్టమైంది. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి గరిష్ఠంగా 56.78 శాతం ఓట్లు లభిస్తాయని అంచనా వేయగా... ఆయన 56.05 శాతం ఓట్లు దక్కించుకున్నారు. అంటే... సర్వేకు, తుది ఫలితాలకు మధ్య తేడా కేవలం 0.73 శాతం. ఇక... వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డికి 36 నుంచి 38.53 శాతం ఓట్లు వస్తాయని పేర్కొంది. అయితే.. తుది ఫలితాలో వైసీపీ 40 శాతం ఓట్లు లభించాయి.సర్వే అంచనా కంటే 1.5 శాతం ఓట్లు ఎక్కువ పడ్డాయి. కాంగ్రెస్ ఖాతాలో 3 నుంచి 4.49 శాతం ఓట్లు పడతాయని సర్వేలో తేలింది. అయితే... 0.79 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్ ఓటు వేయాలనుకున్న వారు.. చివరి నిమిషంలో 'ఓటు వృథా కావడం ఎందుకు!' అనే ఉద్దేశంతో వైసీపీ వైపు మొగ్గుచూపడమే దీనికి కారణం. దీనివల్లే... సర్వే ఫలితాలకంటే వైసీపీకి1.5 శాతం ఓట్లు అధికంగా పడ్డాయి.

ఓటింగ్ పెరిగినా లెక్క తప్పలేదు

2014 సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే ఈ ఉప ఎన్నికల్లో 10 శాతం ఓట్లు అదనంగా పోలయ్యాయి. పెరిగిన పోలింగ్ తమకే అనుకూలమని వైసీపీ నేతలు లెక్కలు వేశారు. ఓటింగ్ సరళిపై లగడపాటి రాజ్‌గోపాల్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఉప ఎన్నికను టీడీపీ, వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం వల్లే పోలింగ్ శాతం పెరిగిందే తప్ప దాని వల్ల వైసీపీకి ప్రయోజనం ఉండదని చెప్పారు. అదే నిజమని ఫలితాల్లో స్పష్టమైంది.



దీపావళికి రెనో 'కాప్చర్' విడుదల!

న్యూఢిల్లీ : ఈ ఏడాదిలోనే దేశీయ మార్కెట్లోకి ప్రీమియం ఎస్‌యువి క్యాప్చర్‌ను విడుదల చేయనున్నట్టు రెనో ఇండియా ఆపరేషన్స్ కంట్రీ సిఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సుమిత్ సాహ్నీ తెలిపారు. దీంతో ఇక్కడి మార్కెట్లో రెనో కార్ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఏర్పడుతుందన్నారు. దీపావళి నాటికి ఈ కారును విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ కారు మధ్యతరగతి ఎస్‌యువి దస్తరకన్నా ఎగువ స్థాయిలో ఉంటుందని చెప్పారు. ప్రపంచమార్కెట్లో ఇప్పటికే లక్షలాదిగా క్యాప్చర్లు అమ్ముడయ్యాయని, దీన్ని భారత మార్కెట్లోకి తీసుకురావడం వల్ల ఇక్కడి ఎస్‌యువి విభాగంలో మార్కెట్ వాటాను మరింతగా పెంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. దేశంలో ఇప్పటికే డీలర్‌షిప్ ఔట్‌లెట్ల సంఖ్య 300 దాటిందని చెప్పారు.

ఎం అండ్ ఎం కొత్త ట్రాక్టర్ బ్రాండ్ 'ట్రాక్‌స్టార్'

న్యూఢిల్లీ : మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) కొత్త ట్రాక్టర్ బ్రాండ్ 'ట్రాక్‌స్టార్'ను ఆవిష్కరించింది. గ్రోమాక్స్ అగ్రి ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ కంపెనీ నుంచి ఈ బ్రాండ్ ట్రాక్టర్లు వెలువడతాయని కంపెనీ పేర్కొంది. గుజరాత్ ప్రభుత్వంతో కలిసి ఏర్పాటు చేసిన మహీంద్రా గుజరాత్ ట్రాక్టర్స్ పేరును గ్రోమాక్స్ అగ్రి ఎక్విప్‌మెంట్‌గా మార్చినట్టు తెలిపింది. ట్రాక్‌స్టార్ బ్రాండ్ కింద 30-50 హెచ్‌పి ట్రాక్టర్లు మార్కెట్లోకి వస్తాయని పేర్కొంది. విలువ కోరుకునే రైతులను దృష్టిలో ఉంచుకుని ఈ బ్రాండ్‌ను రూపొందించామని, దీని కింద అందుబాటు ధరల్లో మెకనైజేషన్ సొల్యూషన్స్ అభివృద్ధి చేస్తున్నామని తెలిపింది. గ్రోమాక్స్ అగ్రి ఎక్విప్‌మెంట్‌లో మహీంద్రాకు 60 శాతం, గుజరాత్ ప్రభుత్వానికి 40 శాతం వాటా ఉంది. వ్యవసాయ యాంత్రీకరణ దిశగా సొంతంత్య తరుణంలో గ్రోమాక్స్ ఎంతో కీలకమైనదని, దీని వల్ల రైతుల ఆదాయం రెండింతలు పెరగడానికి అవకాశం ఉంటుందని ఎం అండ్ ఎం ప్రెసిడెంట్ (ఫార్మ్ ఎక్విప్‌మెంట్ సెక్టార్) రాజేష్ జెజురికార్ తెలిపారు. ట్రాక్‌స్టార్ శ్రేణి ట్రాక్టర్లు 80 శాతం పరిశ్రమతో పోటీ పడతాయని చెప్పారు.



ఆర్ క్యాప్ షేర్‌హోల్డర్లకు ఉచితంగా ఒక హోమ్ ఫైనాన్స్ షేరు

ముంబై : రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ (ఆర్‌హెచ్‌ఎఫ్)ను వేరు చేసి ప్రత్యేకంగా లిస్టింగ్ చేసే ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ ఆరో తేదీ నాటికి రిలయన్స్ క్యాపిటల్ షేరు కలిగిన ప్రతి వాటాదారుకు ఒక ఆర్‌హెచ్‌ఎఫ్ షేరు ఉచితంగా కేటాయించనున్నారు. ఆర్‌హెచ్‌ఎఫ్‌ను ప్రత్యేకంగా లిస్టింగ్ చేసేందుకు ఆర్‌క్యాప్‌కు జూన్‌లో ఎన్‌సిఎల్‌టి అనుమతి లభించింది. సెప్టెంబర్‌లో ఆర్‌హెచ్‌ఎఫ్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఈ నిర్ణయానికి అనుగుణంగా సెప్టెంబర్ ఆరో తేదీనాటికి ఆర్‌క్యాప్ షేర్లున్న వారందరికీ ప్రతి ఆర్‌క్యాప్ షేరుకు ఒక ఆర్‌హెచ్‌ఎఫ్ షేరు ఉచితంగా కేటాయించనున్నట్టు కంపెనీ తెలిపింది.

సెప్టెంబరులో 4 ఐపిఒలు

రూ.2,500 కోట్ల సమీకరణ లక్ష్యం.. క్యూలో మరో 24 కంపెనీలు

ముంబై: స్వల్పకాలిక ఆటుపోట్లు సాగుతున్నప్పటికీ స్టాక్ మార్కెట్లపై ఎంతో బలంగా ఉన్న ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను సొమ్ము చేసుకోవడం లక్ష్యంగా వచ్చే నెలలో నాలుగు కంపెనీలు పబ్లిక్ ఇష్యూ (ఐపిఒలు)కు జారీ చేయనున్నాయి. ఈ నాలుగు కంపెనీలు మార్కెట్ నుంచి 2,500 కోట్ల రూపాయలు సమీకరించాలన్న లక్ష్యం పెట్టుకున్నాయి. మార్కెట్ తలుపు తట్టనున్న కంపెనీల్లో శ్రేయి ఇన్‌ఫ్రా ఫైనాన్స్ అనుబంధ సంస్థ భారత్ రోడ్ నెట్‌వర్క్, మాట్రిమోనీ డాట్ కామ్, డిక్సన్ టెక్నాలజీస్, కెపాసిటి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఉన్నాయి. విస్తరణ ప్రణాళికలకు అవసరం అయిన నిధులు పొందడంతో పాటు రుణభారం తగ్గించుకోవడానికి, సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఈ నిధులు వినియోగించుకుంటాయి.

ఇవి కాకుండా మరో 24 కంపెనీలు ఈ ఏడాది ఇప్పటికే ఐపిఒలు జారీకి అనుమతి కోరుతూ సెబికి దరఖాస్తు చేశాయి. ఇదిలా ఉండగా... ఈ ఏడాది ఇప్పటివరకు 17 కంపెనీలు ఐపిఒల ద్వారా నిధులు సమీకరించాయి. వాటిలో బిఎస్‌ఇ, ఎవెన్యూ సూపర్ మార్కెట్స్ (డిమార్ట్), హడ్కో, ఎరిస్ లైఫ్ సైన్సెస్, కొచ్చిన్ షిప్‌యార్డ్ తమ ఇష్యూల ద్వారా 12 వేల కోట్ల రూపాయలు సమీకరించాయి. మార్కెట్లో ప్రస్తుత ధోరణిని గమనిస్తే ఈ ఏడాది ఐపిఒ మార్కెట్ జోరుగా ఉంటుందని పరిశీలకులంటున్నారు. 2016 సంవత్సరం 26 పబ్లిక్ ఇష్యూలతో ఆర్థికకాలంలో అత్యధికంగా ఇష్యూలు జారీ అయిన సంవత్సరంగా నిలిచింది. ఈ ఏడాది ఆ రికార్డును కూడా ఛేదించవచ్చన్నది వారి అభిప్రాయం.

6న భారత్ రోడ్ నెట్‌వర్క్, డిక్సన్ ఇష్యూలు

సెప్టెంబర్ 6-8 తేదీల మధ్య ఈ ఇష్యూ మార్కెట్లో ఉంటుంది. ఒక్కోటి 10 రూపాయల ముఖ విలువ గల 29.30 లక్షల ఈక్విటీ షేర్లను ఈ సంస్థ జారీ చేయనుంది. 1200 కోట్ల రూపాయలు సమీకరించాలన్నది కంపెనీ లక్ష్యం.




- కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలోని డిక్సన్ టెక్నాలజీస్ 600 నుంచి 650 కోట్ల రూపాయలు సమీకరించాలన్న లక్ష్యం పెట్టుకుంది. ఈ ఇష్యూ కూడా 6-8 తేదీల మధ్యనే మార్కెట్లో ఉంటుంది. 37,53,739 షేర్లను ప్రస్తుత వాటాదారులకు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో అందించి 60 కోట్ల రూపాయల విలువ గల షేర్లను ఓపెన్ మార్కెట్‌కు జారీ చేయనుంది.
- భారత్ మాట్రిమోని బ్రాండ్‌తో ఆన్‌లైన్‌లో వివాహ సంబంధాలు కుదిర్చే మాట్రిమోని డాట్‌కామ్ 350 కోట్ల రూపాయలు సమీకరించేందుకు నిర్ణయించింది. 37,67,254 ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జారీ చేయడంతో పాటు 130 కోట్ల రూపాయల విలువ గల షేర్లను ఓపెన్ మార్కెట్‌లో జారీ చేయాలని కంపెనీ భావిస్తోంది.
- కెపాసిటి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ 400 కోట్ల రూపాయలు సమీకరించనుంది.

నేడు ఎన్‌టిపిసి వాటాల విక్రయం

ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి దిగ్గజం ఎన్‌టిపిసిలో ఐదు శాతం వాటాల విక్రయాన్ని ప్రభుత్వం మంగళవారం ప్రారంభించనుంది. ఒక్కోటి 168 రూపాయల ధరకు ఏడు వేల కోట్ల రూపాయలు సమీకరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్‌ఎస్) విధానంలో మంగళ, బుధవారాల్లో ఈ షేర్ల విక్రయం జరుగుతుందని అధికార వర్గాలు ప్రకటించాయి. సోమవారం బిఎస్ఇలో ఎన్‌టిపిసి షేరు 2.5 శాతం లాభంతో 173.55 రూపాయల వద్ద ముగిసింది. ఈ ధరపై 3 శాతం డిస్కౌంట్‌కు ప్రభుత్వం షేర్లను విక్రయిస్తోంది. ఐదు శాతం వాటాలు విక్రయించడంతో పాటు ఓవర్ సబ్‌స్క్రిప్షన్ వచ్చినట్టయితే మరో ఐదు శాతం వాటాలను కూడా కేటాయించే స్వేచ్ఛ ఉంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం ఈ ఏడాది ఇప్పటివరకు ఆరు పిఎస్‌యుల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా 8,800 కోట్ల రూపాయలు సమీకరించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 72,500 కోట్ల రూపాయలు పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా సమీకరించాలన్న భారీ లక్ష్యంలో భాగంగా మైనారిటీ వాటాల విక్రయం ద్వారా 46,500 కోట్ల రూపాయలు, లిస్టింగ్ అయిన పిఎస్‌యుల్లో వ్యూహాత్మక విక్రయాల ద్వారా 11 వేల కోట్ల రూపాయలు సమీకరించనుంది.

నాలుగో రోజూ లాభాలే

- 9900 పాయింట్ల పైకి నిఫ్టీ



ముంబై: భారత్-చైనా సరిహద్దు ఉద్రిక్తతల సడలింపునకు ఉభయ దేశాల మధ్య దౌత్యపరమైన అంగీకారం కుదిరిందన్న వార్తలు సోమవారం స్టాక్ మార్కెట్‌కు కొత్త ఊపిరులూదాయి. దీనికి తోడు ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్‌లో నాయకత్వం మార్పుతో ఆ షేరు మూడు శాతం పెరగడం కూడా ఇండెక్స్‌ల జోరుకు దోహదపడింది. దీంతో వరుసగా నాలుగో రోజు కూడా ఇండెక్స్‌లు లాభాలతో ముగిశాయి. ప్రధానంగా ఐటి, ఎఫ్ఎంసిజి, ఆటో, ఫార్మా షేర్లు మార్కెట్‌కు మద్దతు ఇచ్చాయి. ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, హెచ్‌యుఎల్ షేర్ల లాభాలతో నిఫ్టీ మరోసారి కీలక నిరోధం 9900 పాయింట్లను అధిగమించింది. మొత్తం మీద సానుకూల సంకేతాల నేపథ్యంలో సెన్సెక్స్ 154.76 పాయింట్ల లాభంతో 31,750.82 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ 55.75 పాయింట్ల లాభంతో 9912.80 వద్ద క్లోజయింది. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు తమ కొనుగోళ్లతో మార్కెట్‌కు మద్దతు ఇస్తున్నప్పటికీ ఎఫ్‌పిఐలు మాత్రం అమ్మకాలు సాగిస్తున్నట్టు సెబి గణాంకాలు తెలుపుతున్నాయి. గత గురువారం నాటి డిఐఐలు 1044.38 కోట్ల రూపాయల నికర కొనుగోళ్లు సాగించగా ఎఫ్‌పిఐలు నికరంగా 696.93 కోట్ల రూపాయల అమ్మకాలు సాగించారు. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.09 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.02 శాతం లాభపడ్డాయి.

- ఆస్ట్రేలియాలోని కార్మికేల్ బొగ్గు ప్రాజెక్టు పనులు అక్టోబర్ నుంచి ప్రారంభించి 2020 మార్చి నాటికి తొలి ఎగుమతులు ప్రారంభించనున్నట్టు చేసిన ప్రకటనతో అదానీ షేరు 9 శాతం లాభపడింది.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	ప్రొద్దుటూరు	ముంబై	చెన్నై
24 క్యారెట్లు	30,200	--	29,950	29,395	--
క్రితం ముగింపు	30,020	--	29,850	29,060	--
22 క్యారెట్లు	29,600	--	27,780	29,245	27,950
క్రితం ముగింపు	29,420	--	27,730	28,910	27,740
వెండి (కిలో)	40,250	--	40,100	39,225	--
క్రితం ముగింపు	40,000	--	40,100	38,710	--

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	355.00	వరంగల్	357.00
విజయవాడ	359.00	చెన్నై	397.00
గోదావరి	359.00	నమక్కల్	387.00
బెంగళూరు	382.00	చిత్తూరు	390.00
విశాఖపట్నం	362.00	ముంబై	400.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	84.00	గోదావరి	88.00
కరీంనగర్	84.00	విజయవాడ	88.00
వరంగల్	84.00	గుంటూరు	88.00
మహబూబ్‌నగర్	84.00	ఒంగోలు	90.00
కర్నూలు	84.00	చిత్తూరు	90.00
విశాఖపట్నం	81.00	నెల్లూరు	90.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో...)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.13	67.40
పౌండ్	74.89	86.85
యూరో	69.30	80.36
ఆస్ట్రేలియా డాలర్	46.14	53.41
బహ్రెయిన్ దినార్	157.50	180.40
కువైట్ దినార్	174.96	217.88
ఒమని రియాల్	154.12	176.37
సౌదీ రియాల్	15.46	18.32
సింగపూర్ డాలర్	42.86	50.76
యుఎఇ దిరమ్	15.82	18.49

ముగింపు నిలకడ

టెక్ వ్యూ

నిఫ్టీ 50 పాయింట్ల ఎగువన ప్రారంభమై కీలక నిరోధం 9900 పాయింట్ల వరకు వెళ్లి సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం నిలకడగా ముగిసింది. ఇది ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. టెక్నికల్‌గా 9700 స్థాయి నుంచి మార్కెట్ మైనర్ అప్‌ట్రెండ్‌లో ప్రవేశించింది. మరోసారి 20 డిఎంఎ వద్ద పరీక్షకు గురికానుంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ బలాన్ని ప్రదర్శించాలి.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం: 9950 మద్దతు: 9900

- ప్రధాన నిరోధం 9950. ఇదే గత వారం ఏర్పడిన మైనర్ టాప్. ఇక్కడ అప్రమత్త ట్రెండ్‌కు ఆస్కారం ఉంది. ఆ పైన బలంగా క్లోజయినప్పుడే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది.
- 9900 వద్ద బ్రేకౌట్ ఏర్పడినందు వల్ల పుల్‌బ్యాక్‌కు ఆస్కారం ఉంది. రియాక్షన్‌కు గురైనా భద్రత కోసం ఈ స్థాయికన్నా పైన నిలదొక్కుకోవాలి. అంతకన్నా దిగువన క్లోజయితే మైనర్ బలహీనతను ఎదుర్కొంటుంది. ప్రధాన మద్దతు స్థాయి 9800 పాయింట్లు.
- బ్యాంక్ నిఫ్టీ స్వల్పకాలిక నిరోధ స్థాయి 24,500కి చేరువవుతోంది. అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

ప్రారంభ సెషన్ మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి: భాద్రపద శుద్ధ అష్టమి **నక్షత్రం:** అనూరాధ

భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ: 9912.80 (+55.75)

ట్రెండ్ మార్పు వేళలు: 9.28, 1.40

ధోరణి: గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 10.45 వరకు అదే ధోరణిలో ట్రేడవుతూ తదుపరి ముగింపు వరకు నిస్తేజంగా ఉండవచ్చు.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 10.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 11 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు: 9955, 9990

మద్దతు స్థాయిలు: 9875, 9840

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 5.71(6.01)3850
ADITYA SPIN. 8.12(8.5)160
AGRO TECH FO 531.65(542.9)399
AISHWARYA TE 4.76(4.75)2943
ALPHAGEO (I) 768.75(767.15)2688
ALU FLUORIDE 65.35(63.55)98317
AMAR RAJA BA 772.05(778.55)535120
ANDHRA BANK 52.75(52.3)104090
ANDHRA CEMEN 9.26(8.64)32657
ANDHRA PETRO 31.35(32.05)58889
ANJANI PORTL 236.15(214.95)8810
ASTRA MICRO 125.2(122.35)21091
AUROB.PHARMA 741.35(732.5)177667
AVANTEL LTD 259.45(252.45)8296
AVANTI FEEDS 1883.05(1920.3)13228
B.N.RATHI SE 33.9(31)6741
BALAJI AMINE 311.8(311.2)5561
BAMBINO AGRO 185(176.2)4742
BARTRONICSIN 13.95(13.95)15184
BHAGIRA.CHEM 190.1(199.85)3700
BHAGYA INL 21.65(21.75)6908
BHARATFIN 886.7(880.35)83640
BNR UDYOG 51(48.15)11488
CAMBRIDGE 77.9(76.4)1077
CAT TECHN. .63(.6)854
CCHHL 13.24(13.1)12459
CCL PRODUCTS 281.4(277)5377
CELESTIAL 24(22.85)12622
CIL SECURITS 29.3(28.9)581
COROM INTER 441.15(428.9)8770
CUBEX TUBING 16.35(16.45)1252
CYIENT 534.95(531.35)9383
DANLAW TECH. 50(47.5)1204
DECAN CEMENT 1118.1(1120.05)650
DHAN ROTO SP 19.25(20.1)1025
DIAMONPOWER 21.15(20.6)20096
DIVI'S LAB. 694.6(673.1)198571
DIVYA.GRANIT 103.95(100)1375
DQ ENT 12.45(12.64)25771
DR.REDDY'S 2045.95(2087.9)78278
EMPEE SUGARS 5.3(5.09)5414
EVEREST ORG. 103(102.25)548
FACOR ALLOYS 3.68(3.73)42562
FIRSTOBJ 15.75(16)8900
GATI LTD. 114.45(113.5)79545
GAYATRI BIO 8.13(8.4)706
GAYATRI PROJ 179.4(175.45)24043
GENNEX LAB 3.99(3.95)65241
GMR INFRASTR 17.45(17.25)1889389
GODAVARI DRU 38.75(36.7)1214
GOLDST INFRA 143.9(137.05)169705
GOLDSTONE EN 11(10.71)17796
GRANULES (I) 130.15(130)106643
GVK POWERINF 12.03(11.46)452345
HBL P SYS 44.95(44.2)34947
HERITGFOOD 1423.7(1373.05)5125
HIND.FLUROCA 13.15(13.8)900
HINDUSTN BIO .78(.81)4300
I.C.S.A. IND 2.7(2.55)5280
INCAP LTD. 51.4(54.1)3866
IPAPPM 295.25(295.45)2324
IVRCL LTD 5.01(4.97)76870
KAKATIYA CEM 346.25(338.35)3944
KALLAM SPG. 31.5(34)137476
KARAN WOO-SN 1.1(1.05)600
KAVERI SEED 549.05(541.25)29442
KCP LTD 102.35(102.1)9231
KERNEX MICRO 36(35)2757
KNR CONST 214.45(217.65)2104
KREBS BIOCHM 93.2(92.8)51
LANCO INFRA .88(.92)1574635
LOKESH MACH 81.4(80.5)5238
LOTUS CHOC 28(29.45)400
MADHUCON PRJ 28.45(28.55)9770
MOLD-TEK TEC 53.15(50)65709
MOSCHIP SEMI 46.5(46.25)30732
MSR INDIA 32.9(34.5)471334
N C L IND. 240.15(231.5)40270
NAGAR.AGRICH 35.35(34)27118
NATCO PHARM 714.2(726.1)62918
NCC 86.55(86.5)92687
NEHA INTER. 4.75(4.9)181380
NETTLINX LTD 84.3(82.75)18375
NEULAND LAB. 1235.95(1236)490
NILE LTD. 596.45(594.05)12822
NTL 4.3(4.05)6101
OIL COUNTRY 43.7(43.5)560
PADMALAYA TE 7.32(7.23)12350
PALRED 90.7(94.5)1282
PANYAM CEMEN 61.15(58.95)21538
PENNAR STEEL 63(61.65)253614
PFL INFOTECH 5.77(5.77)2327
PHYTOCHEM I. 46.05(45.5)1766
PITTI LAMIN. 61.1(60.35)27781
POKARNA LTD 1258.65(1246.9)1384
PRAJAY ENGS. 8.85(8.43)62374
PREMIER EXPL 446.55(447.35)1370
PRISM CEMENT 110.1(109.5)9473
RAIN 145(145.55)231069
RAJ PACKAGIN 59.25(60.6)28571
RAJVIR IND 42.75(41.5)296
REG.CERAMIC 5.7(5.46)401
RESTILE CER. 5.1(5)7336
SAGAR CEM. 811.1(824.4)290
SAMKRG PIST. 263.9(258.1)3773
SAMPRE NUTRI 43.4(42.4)489
SANGHI IND. 85.25(82.05)66932
SATVAH.ISPAT 46.3(41.45)136262
SAVEN TECHNO 23.25(22.8)1720
SIBAR AUTO 14.69(15.46)3222
SMPL 1.66(1.59)9800
SMS PHARMACE 79.25(80.2)14115
SREE RAYALA 125.25(126.45)1713
STEEL EXCH 82.6(84.45)61563
SUJANA INDUS .97(.99)27900
SURANATP 4.65(4.65)9015
SURYACHAKRA 1.13(1.08)28491
SURYAMBA SP 66(63)2046
SURYLAK.COTT 99.4(99.95)1720
SUVEN LIFE S 166.75(167.55)25876
TAJ GVK HOTL 153.5(155.95)2871
TANLA 32.75(32.1)42000
TCI INDUS. 1696.8(1616)1
TRANSCORP IN 21(20.95)35434
TRANSGENE BI 2.47(2.37)32435
TRANSPORT CO 287.7(274.65)11890
USHER AGRO 6.65(6.54)7226
VICEROY HOTE 18.4(17.45)64283
VIJAY TEXTIL 65.6(63.4)91871
VIMTA LABS 130.9(130.25)7044
VIRAT CRANE 36.3(37.45)3117
VIRINCHI 74.95(76.25)44929
VISAKA IND. 627.05(540.7)186892
VISTA PHARMA 33.5(32.5)49187
VIVIMED LABS 102.55(102.9)51665
VST INDUS. 2690.45(2692.25)95
WATERBASE 115.45(118.15)100326
XLENERGY 1.65(1.74)460
YBRANTDIGI 6.18(6.44)2081898
ZEN TECH 50.5(50.2)13901
ZENOTECH 48(47.8)11276

ఎన్ఎస్ఇ-500 (NSE) షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా


AARTIDRUGS 524.55(516.2)6717
AARTIIND 843.25(841.75)27934
ABAN 178.1(175.65)928992
ABB 1364.35(1349.7)42283
ABFRL 169.95(169.1)125642
ABGSHIP 11.65(11.55)11401
ACC 1815.7(1781.5)512719
ADANIENT 119.2(109.15)16245306
ADANIPORTS 387.5(380.05)3245331
ADANIPOWER 30.3(28.55)24596908
ADANITRANS 118.1(108.85)913866
AEGISCHEM 184.85(186.3)174813
AHLUCONT 289.15(289.15)25947
AIAENG 1310.25(1345.35)105536
AJANTPHARM 1232.9(1231.95)183164
AKZOINDIA 1793.65(1779.1)4773
ALBK 68.65(68.4)2239453
ALLCARGO 167.45(164.75)79945
ALOKTEXT 3(3.05)2696366
AMARAJABAT 772.2(777.2)764716
AMBUJACEM 279.35(275.4)2031129
AMTEKAUTO 25.75(25.75)438899
ANANTRAJ 56.5(55.85)564318
ANDHRABANK 52.65(52.4)1406981
APARINDS 779.95(779.9)9406
APLLTD 516.45(510.2)29304
APOLLOHOSP 1092.65(1083.2)224857
APOLLOTYRE 252.6(257)5360565
ARVIND 366.45(363.5)771770
ASHIANA 168.1(166.55)11204
ASHOKA 186.1(184.5)24869
ASHOKLEY 105.7(103)11192216
ASIANPAINT 1155.9(1135.6)751938
ASTRAL 668.2(654.85)14375
ASTRAZEN 900.3(893.95)11418
ATUL 2106.45(2025.75)12075
AUROPHARMA 743.35(732.15)2297583
AVANTIFEED 1884.25(1924.2)96460
AXISBANK 510.6(506.85)3724389
BAJAJ-AUTO 2742.05(2728.55)227147
BAJAJCORP 385.25(388)32100
BAJAJELEC 340.9(340.2)128149
BAJAJFINSV 5578(5506.25)214750
BAJAJHIND 14.9(14.9)4074548
BAJAJHLDNG 2834(2750.8)48942
BALKRISIND 1542.8(1576.35)172555
BALLARPUR 13.2(13)936912
BALMLAWRIE 239.8(240.05)63876
BALRAMCHIN 173.05(166)2235530
BANKBARODA 144.25(142.85)10531819
BANKINDIA 143.75(144.15)4176278
BASF 1485.7(1430.2)30279
BATAINDIA 681.05(667.75)657180
BBTC 898.5(897.65)44363
BEML 1785.2(1791)512697
BERGEPAINT 244.25(240.55)716048
BFUTILITIE 327.25(325.2)291943
BGRENERGY 135.35(134.8)72639
BHARATFIN 887.7(880.45)2176979
BHARATFORG 1161.95(1147.95)325347
BHARTIARTL 434.4(432.95)2529369
BHEL 127.95(126.95)2141709
BHUSANSTL 70(69.95)749285
BIOCON 344.1(338.95)1549324
BIRLACORPN 963.25(956.25)41312
BLISSGVS 169.55(172.45)270143
BLUEDART 4253.4(4109.2)8135
BLUESTARCO 748.85(743.9)156908
BOMDYEING 92.6(85.05)12296759
BOSCHLTD 21843.35(21676.25)20425
BPCL 508(508.2)3110427
BRFL 138.85(140.95)26588
BRIGADE 268.8(264)17190
BRITANNIA 4188.3(4214.1)150029
CADILAHC 501.95(494.35)1650380
CANBK 339.05(341.2)1292097
CANFINHOME 2780.05(2772.15)67007
CAPF 724.5(713.8)433179
CARERATING 1547(1455)25684
CASTEXTECH 5.9(6.05)1096932
CASTROLIND 383.85(390.7)1173948
CCL 274.8(275.8)36358
CEATLTD 1651.75(1649.9)550007
CENTRALBK 80.3(73.55)5472238
CENTURYPLY 258(259.2)271853
CENTURYTEX 1238.15(1210.5)638871
CERA 2954.95(2925.05)2335
CESC 1019.6(956.35)3054507
CHAMBLFERT 148.85(143.95)1335611
CHENNPETRO 417.05(416.3)804851
CHOLAFIN 1159.55(1145.9)114748
CIPLA 574.1(574.05)905222
CLNINDIA 575.2(585.8)14265
COALINDIA 243.6(241.3)2231233
COLPAL 1100.25(1093.75)440426
CONCOR 1286.9(1267.8)209473
COROMANDEL 442.1(427.55)142725
CORPBANK 46.55(46.55)121889
COX&KINGS 264.05(262.5)55681
CRISIL 1886.25(1858.4)8989
CUB 159(162.2)454482
CUMMINSIND 895.25(891.85)141986
CYIENT 536.55(530.6)34462
DABUR 312.7(300.05)1644473
DALMIABHA 2675.6(2619.25)112891
DBCORP 376.6(372.15)22524
DBREALTY 37.1(36.5)264747
DCBBANK 192.3(185)2033471
DCMSHRIRAM 402.35(392.6)228897
DEEPAKFERT 383.9(392.5)229657
DELTACORP 186.45(182.15)4196498
DEN 91(92.75)167714
DENABANK 31.4(31.15)444993
DHANUKA 699.6(699.8)24858
DHFL 490.95(474.05)5986903
DISHTV 78.25(79.55)3378128
DIVISLAB 694.9(673.4)2008764
DLF 180.1(186.95)29863787
DREDGECORP 594.25(591.9)41695
DRREDDY 2049.4(2088.15)844176
DYNAMATECH 2104.65(2135.3)1532
ECLERX 1268.4(1261.05)11698
EDELWEISS 237.5(236.1)2180191
EICHERMOT 31288.35(30750.9)47279
EIDPARRY 320.1(315.4)175340
EIHOTEL 133.15(131.35)67825
ELECTCAST 29(29.05)118838
ELGIEQUIP 220.85(215.95)33160
EMAMILTD 1076.8(1075.05)94248
ENGINERSIN 153.8(152.15)789330
EROSMEDIA 201.65(196.95)553554
ESCORTS 619.5(613.9)607889
ESSDEE 30.45(31.15)46298
ESSELPACK 275.95(269.7)139841
EVEREADY 294.6(295.65)21194
EXIDEIND 200.05(202.55)2608325
FCONSUMER 49.45(47.45)11726726
FDC 169(170.05)19849
FEDERALBNK 109.65(106.45)4952851
FINCABLES 534.2(530.15)55341
FINPIPE 612.6(605.25)46351
FLFL 360.95(367.05)134377
FORTIS 148.9(151.75)5407774
FSL 37.9(33.6)9645528
GAIL 382(383)2374961
GATI 114.4(113.8)436082
GDL 231.85(233.95)98652
GEPIL 669.15(668.9)19518
GESHIP 390.65(389.5)55655
GET&D 382.3(380.3)421354
GILLETTE 5266.3(5333.85)11290
GLAXO 2422.9(2398.35)11646
GLENMARK 625.6(616.3)1245632
GLOBOFFS 34.25(34.35)31842
GMDCLTD 139.9(139.95)269778
GMRINFRA 17.45(17.25)32962980
GODFRYPHLP 1050.7(1051.4)158285
GODREJCP 939.85(917.45)675982
GODREJIND 613.8(604.65)315393
GODREJPROP 540.55(519.6)436372
GPPL 129.55(129.9)296504
GRANULES 130.5(130)721962
GREAVESCOT 149.95(145.25)241426
GREENPLY 277.05(274.4)42283
GRINDWELL 393.5(399.55)3453
GRUH 509.7(511.8)123142
GSFC 138.9(139.7)2188245
GSKCONS 5356.4(5295.6)7288
GSPL 196.95(193.1)506572
GUJFLUORO 739.05(734.6)58305
GUJGASLTD 789.45(788.15)15209
GULFOILLUB 792.6(799.45)3829
GVKPIL 12.15(11.6)1910964
HATHWAY 32.95(32.5)103875
HAVELLS 489.35(487.15)942081
HCC 34.8(34.55)1918055
HCL-INSYS 46.9(45.15)2279366
HCLTECH 867.65(867.5)896254
HDFC 1766.45(1757.35)4268581
HDFCBANK 1762.25(1762.5)376946
HDIL 62.1(61.6)10677890
HEIDELBERG 121.95(121.65)53966
HEROMOTOCO 3959.2(3882.65)435266
HEXAWARE 274(274.15)656392
HFCL 17.5(17.3)13337888
HIMATSEIDE 320.9(310.55)103396
HINDALCO 233.55(233)5152003
HINDCOPPER 62.2(61.95)448380
HINDPETRO 463.3(466.2)4743249
HINDUNILVR 1199.7(1179.7)630713
HINDZINC 286.5(283.95)1067933
HMT 33.4(32.4)3411
HMVL 273(270.2)4830
HONAUT 13199.35(12963.05)1733
HOTELEELA 20.7(20.45)154889
HSIL 382.9(378.05)40106
HTMEDIA 92.9(91.65)307502
IBREALEST 231.8(230.55)8461079
IBULHSGFIN 1223.25(1210.35)782937
ICICIBANK 300.9(297.7)8827300
ICRA 3866.55(3828.2)565
IDBI 56(55)1882463
IDEA 89.85(90)5239356
IDFC 55(54.6)5637700
IFBIND 689.7(696.1)1910
IFCI 23.85(23.65)4409898
IGARASHI 1000.05(997.15)8763
IGL 1242.75(1251.85)446505
IIFL 609.85(597.85)280221
IL&FSTRANS 83.35(79.5)376565
INDHOTEL 112.85(110.9)338644
INDIACEM 180.25(177.3)2954360
INDIANB 293.95(294.95)715275
INDOCO 191.8(189.9)32046
INDUSINDBK 1660.55(1667.7)745075
INEOSSTYRO 917.5(894.35)6848
INFRATEL 386.7(383.9)1402650
INFY 941(912.15)20356054
INGERRAND 808.75(809.05)4934
INOXLEISUR 238.4(234.2)64309
INOXWIND 130.85(123.05)875441
INTELLECT 106.75(108.9)237892
IOB 22.95(22.95)341004
IOC 440.7(428.2)6117189
IPAPPM 293.1(295.25)13181
IPCALAB 417.35(414.8)76528
IRB 212.15(212.55)849387
ITC 282.45(281.45)9974428
J&KBANK 81.6(81.95)112319
JAGRAN 173.85(173.5)182380
JAICORPLTD 78.95(77.65)363459
JBCHEPHARM 280.95(284.65)38887
JBFIND 158.7(153.15)50334
JCHAC 1973.05(2005.9)10252
JETAIRWAYS 574.6(574.25)1095329
JINDALPOLY 376.9(371.45)49753
JINDALSTEL 135.85(135.15)4814276
JISLJALEQS 98.2(95.35)4161508
JKCEMENT 1016.65(1013.45)7853
JKIL 198.5(196.1)596188
JKLAKSHMI 413.05(411.7)54364
JKTYRE 143.85(143.35)371583
JMFINANCIL 126(126.25)359310
JPASSOCIAT 23.5(23.35)71555196
JPINFRATEC 15.6(14.9)3099742
JPPOWER 5.85(5.9)3789932
JSWENERGY 66.9(63.8)21281794
JSWHL 1770.9(1742.95)2811
JUBILANT 718.1(726.25)355211
JUBLFOOD 1382.5(1393.55)580508
JUSTDIAL 367.45(362.65)1007887
JYOTHYLAB 377.6(377.75)20621
KALPATPOWR 350.05(354.65)43215
KANSAINER 472.7(468.2)61743
KEC 303.55(296.2)465243
KESORAMIND 134.15(129.85)357451
KIRLOSENG 375.65(376.6)3342
KITEX 234.6(227.5)38278
KOLTEPATIL 161.85(156.05)112527
KOTAKBANK 976.05(972.1)621906
KPIT 118.1(114.9)766106
KRBL 470.9(456.6)91354
KSCL 548.45(542.05)637020
KSK 7.35(7.05)372466
KTKBANK 152.55(151.45)2099290
KWALITY 153(147.5)1822247
L&TFH 188.05(174.85)14135663
LAKSHVILAS 175.25(177.2)444748
LAOPALA 461.5(467.15)23856
LAXMIMACH 6130.3(6006.6)4360
LICHSGFIN 656.6(658)2123949
LITL .85(.9)12492917
LT 1138.9(1131.7)1884734
LUPIN 991.2(992.5)1659832
M&M 1373.05(1375.15)1035223
M&MFIN 418.4(409.65)1786058
MAGMA 175.75(173.05)141264
MAHINDCIE 240.8(240.8)37306
MAHLIFE 439.55(425.25)108805
MANAPPURAM 95.6(95.75)4541543
MANPASAND 816.15(825.3)50523
MARICO 318.25(316.1)1213344
MARKSANS 39.75(38.1)1817023
MARUTI 7579(7612.85)391028
MAYURUNIQ 356.6(353.25)117340
MCDOWELL-N 2571.8(2567.15)330962
MCLEODRUSS 176.65(177.95)39669
MERCK 1209.35(1175.1)13255
MHRIL 363.55(353.35)35210
MINDACORP 108.75(108.25)49785
MINDTREE 478(468.2)367103
MMTC 56.35(55.7)348108
MOIL 364.75(359.55)157055
MONSANTO 2454.45(2438.9)739
MOTHERSUMI 311.75(310.5)2106398
MOTILALOFS 1203.05(1172.9)103004
MPHASIS 614.45(604.85)63138
MRF 62811.1(63049.7)7912
MRPL 128(124.95)2498302
MTNL 19.55(19.55)1337076
MUTHOOTFIN 453.15(443.25)718218
NATCOPHARM 714.2(724.8)561146
NATIONALUM 69.55(69.7)1610821
NAUKRI 946.8(936.55)22588
NAVKARCORP 187.9(186.2)17748
NCC 86.1(91)1187000
NCC 86.5(86.1)1050660
NETWORK18 50.3(49.75)182071
NHPC 29.2(29.75)6776281
NIITTECH 495.1(497.1)578555
NITINFIRE 3.95(3.95)1670341
NLCINDIA 92.25(92.65)160011
NMDC 122.4(122.2)3457248
NTPC 173.3(169)5203237
OBEROIRLTY 376.1(366.1)63318
OFSS 3465.2(3436.3)27959
OIL 288.1(283.4)241503
OMAXE 204.8(203.65)584563
ONGC 160.6(159.45)3680139
ORIENTBANK 125.7(124.35)1365886
ORIENTCEM 149.85(150.4)126855
ORISSAMINE 1672.65(1664.55)1227
PAGEIND 17411(17196.8)10735
PARSVNATH 19.75(20.1)108468
PCJEWELLER 353.15(359.9)3236855
PEL 2690.65(2676.75)125379
PERSISTENT 628.8(616.65)35063
PETRONET 224.9(226.55)2456549
PFC 122.6(121.4)4443434
PFIZER 1811.45(1813.2)18234
PFS 37.5(36.7)1571341
PGHH 8265.5(8156.45)3167
PHOENIXLTD 522.9(515.75)183095
PIDILITIND 836.15(829.05)592779
PIIND 723.95(728.7)150346
PNB 144.85(144.3)5356187
POLARIS 242.15(242.05)27683
POWERGRID 217.1(220.95)5486618
PRAJIND 69.1(68.9)193902
PRESTIGE 263.25(259)135705
PRISMCEM 110.05(109.9)43367
PTC 115.4(114.8)1834389
PUNJLLOYD 19.2(19.1)692400
PURVA 71.35(70.6)106603
PVR 1276.25(1263.55)183234
RADICO 164.55(165)458566
RAIN 144.8(145.3)890535
RAJESHEXPO 743.2(719.9)948931
RALLIS 231(229.3)142181
RAMCOCEM 678.9(667.4)374288
RAMCOSYS 353.6(347.65)27689
RATNAMANI 850.4(821.45)25761
RAYMOND 765.15(733.75)451604
RCF 97.5(97.85)3903929
RCOM 23.25(22.9)10510360
RDEL 53.25(52.85)735879
RECLTD 165.15(160.8)7991020
REDINGTON 147.2(147.9)180593
RELAXO 501.4(497.9)9850
RELCAPITAL 788.05(776.9)5549896
RELIANCE 1566.55(1568.05)2815328
RELINFRA 483.8(479.9)1710061
RENUKA 17.35(17.35)2415836
REPCOHOME 654.65(649.1)195388
RIIL 416.3(414.1)111858
RKFORGE 555.35(563.75)12862
ROLTA 53.35(53.1)230423
RPOWER 40.25(39.5)1564284
RTNPOWER 5.85(5.65)1547876
RUCHISOYA 21.5(21.35)423535
SADBHAV 275.95(267.75)53265
SADBHIN 102.4(102.85)4152
SAIL 61.5(60.65)3574745
SANOFI 4030.4(4002.1)2679
SBIN 279.35(280.3)10505317
SCHAEFFLER 4246.55(4225.45)11807
SCHNEIDER 122.85(122.9)46785
SCI 94.9(94.7)1188463
SHARDACROP 454.2(457.9)8783
SHILPAMED 603.7(568.5)86933
SHK 245.35(246.8)148892
SHOPERSTOP 355.8(353.75)36054
SHREECEM 17565.4(16992.1)19712
SHRIRAMCIT 2153.25(2200.9)12591
SIEMENS 1292.6(1265.15)124833
SIMPLEXINF 489.8(489.75)7642
SINTEX 30.65(30)13411839
SITINET 24.95(24.95)79235
SJVN 30.8(30.85)282406
SKFINDIA 1513.85(1529.45)7466
SMLISUZU 983.95(924.6)121575
SNOWMAN 50.85(50.1)292234
SOBHA 384.7(387)97667
SOMANYCERA 804.05(803.75)6796
SONATSOFTW 158.75(156.95)148790
SOUTHBANK 28(27.9)6297398
SPARC 389.45(391.9)619698
SREINFRA 120.65(120.35)973137
SRF 1471.35(1451.35)168965
SRTRANSFIN 981.45(975)247808
STAR 934.55(938.45)169196
STCINDIA 154.7(154.4)79218
SUNDARMFIN 1623.3(1633.4)15020
SUNDRMFAST 397.65(392.55)249331
SUNPHARMA 493.2(483)6388051
SUNTV 715.5(712.45)547833
SUPREMEIND 1178.9(1176)79703
SUVEN 166.95(167.95)164515
SUZLON 16.65(16.3)32604351
SWANENERGY 142.25(130.2)575607
SYMPHONY 1283.55(1268.8)27694
SYNDIBANK 65.55(65.15)1173068
SYNGENE 448.85(445)36428
TAKE 139(134.45)334640
TATACHEM 589.7(583.85)1117309
TATACOFFEE 132.3(132.05)243151
TATACOMM 664.55(641.55)825547
TATAELXSI 1671.7(1637.3)287494
TATAGLOBAL 193.3(194.25)3684762
TATAMOTORS 379.3(384.15)4403872
TATAMTRDVR 225.2(227.35)1868486
TATAPOWER 78.85(79.15)2117665
TATASPONGE 798.5(804.8)104212
TATASTEEL 635.85(639)3565779
TBZ 107.8(102.05)1665420
TCS 2487.3(2496.6)1018398
TECHM 427.75(427.7)1888194
TECHNO 356.25(363.3)30887
TEXRAIL 89.9(89.4)243316
THERMAX 897.6(878.45)83353
THOMASCOOK 217.25(216.6)129086
TIDEWATER 5751.05(5712.5)1080
TIMKEN 719.8(722.55)13498
TITAN 612.25(606.8)1284579
TNPL 338.8(339.35)128449
TORNTPHARM 1238.25(1226.35)79924
TORNTPOWER 213.65(209.95)1024247
TREEHOUSE 15.35(15.2)88123
TRIDENT 97(86.55)10188151
TRITURBINE 135(130.1)59490
TTKPRESTIG 6376.9(6369.9)550
TTML 6.8(6.75)1125720
TV18BRDCST 36.85(36.65)1777307
TVSMOTOR 604.65(595.15)1123058
TVSSRICHAK 3348.8(3321.4)1865
TVTODAY 243.3(242.6)25844
UBL 820.2(812.7)108954
UCOBANK 31.5(30.85)356186
UFLEX 420.1(416.95)126596
ULTRACEMCO 3984.15(3939.65)352378
UNICHEMLAB 243.5(242.2)14822
UNIONBANK 136.65(136.05)1868001
UNITECH 7.65(7.6)23972877
UPL 839.1(833.1)730266
VAIBHAVGBL 524(516)2780
VAKRANGEE 475.8(472.1)604780
VEDL 301.35(298.55)9151882
VIDEOIND 18.9(18.7)1339028
VIJAYABANK 70.85(69.6)1312606
VINATIORGA 1013.6(996.7)14458
VIPIND 222.05(211.6)1873730
VOLTAS 538.2(521)1969579
VRLLOG 333.7(330.35)30680
VSTIND 2704.8(2691.85)1187
VTL 1185.7(1182.15)31321
WABAG 606.15(611.25)84458
WABCOINDIA 5523.9(5522)7803
WELCORP 136.3(134.15)568144
WELSPUNIND 78.15(72.2)792944
WHIRLPOOL 1198(1171.4)39514
WIPRO 290.7(289.4)2143420
WOCKPHARMA 607.9(608.25)1032763
WONDERLA 338.25(337.75)21590
YESBANK 1753.35(1719.45)1949997
ZEEL 517.9(511.7)1011745
ZEELEARN 42.8(42.55)103500
ZENSARTECH 783.95(783)2634
ZYDUSWELL 878.35(871.45)3582

ఆంధ్రజ్యోతి బిజినెస్
నిజామాబాద్
మంగళవారం 29 ఆగస్టు 2017

▲ 154.76 సెన్సెక్స్ 31750.82	▲ 55.75 నిఫ్టీ 9912.80	▲ 335 బంగారం (ముంబై) 29,395 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)	▲ 515 వెండి 39,225 కిలో (రూపాయల్లో)	▲ రూపాయి Vs డాలర్ 63.91	▲ ముడి చమురు 52.46 బ్యారల్ ధర (డాలర్లలో..)

మళ్లీ రూ.1,000 నోటు?

న్యూఢిల్లీ: ప్రభుత్వం మళ్లీ 1,000 రూపాయల కరెన్సీ నోటును ప్రవేశపెట్టే ఆలోచనలో ఉందా? గతేడాది నవంబర్‌లో 500, 1,000 రూపాయల కరెన్సీ నోట్లను రద్దు చేసిన తర్వాత కొత్త డిజైన్, సెక్యూరిటీ ఫీచర్స్‌తో 500, 2,000 రూపాయల నోట్లను ప్రవేశపెట్టారు. ఇటీవలనే 200 రూపాయల నోటును కూడా మార్కెట్లోకి తెచ్చారు. ప్రస్తుతం 500 రూపాయల నోటుకు 2,000 రూపాయల నోటుకు మధ్య డినామినేషన్‌లో కరెన్సీ నోట్లు లేవు. అందువల్ల కొత్త ఫీచర్స్, సరికొత్త డిజైన్‌లో మళ్లీ 1,000 రూపాయల నోటును ప్రవేశపెట్టాలనే ప్రతిపాదన ఉందని డిఎన్ఎ పత్రిక విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూ వెల్లడించింది. ఈ కొత్త నోటు ప్రింటింగ్ త్వరలోనే మొదలవుతుందని కూడా పేర్కొంది. కొత్త నోటుకు సంబంధించిన డిజైన్, సెక్యూరిటీ ఫీచర్స్, పేపర్ కోసం సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయని, ఈ ఏడాది డిసెంబర్‌లోనే కొత్త 1000 రూపాయల నోటు మళ్లీ వచ్చే అవకాశం ఉందని కూడా డిఎన్ఎ వెల్లడించింది.



ఇన్ఫోసిస్ కళకళ

దూసుకుపోయిన షేరు.. కార్యక్షేత్రంలో నీలేకని
కొత్త సిఇఒ అన్వేషణపై దృష్టి.. బైబ్యాక్‌లో పాల్గొననున్న ప్రమోటర్లు

బెంగళూరు: దేశీయ ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్‌ను అలుముకొన్న అనిశ్చితి తొలగిపోతున్నది. మాజీ సిఇఒ, సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నీలేకని సారథ్య బాధ్యతల్లోకి రావడంతో స్టాక్ మార్కెట్లో షేరు ధర కూడా దూసుకుపోతున్నది. సోమవారం నాడు షేరు ధర 3 శాతం లాభంతో 941 రూపాయల వద్ద ముగిసింది. సంస్థ 13,000 కోట్ల రూపాయలతో చేపట్టిన షేర్ల బైబ్యాక్‌లో పాల్గొనేందుకు ప్రమోటర్లు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. ఎన్ఆర్ నారాయణమూర్తితో సహా మొత్తం వ్యవస్థాపక ప్రమోటర్లకు ఇన్ఫోసిస్‌లో 12.75 శాతం వాటా ఉంది. ప్రమోటర్లలో ఎవరు షేర్ల బైబ్యాక్‌లో పాల్గొనేందుకు ఆసక్తిగా ఉన్నారనే విషయం మాత్రం వెల్లడికాలేదు. ఇన్ఫోసిస్ జారీ చేసిన ఈక్విటీ షేర్లు 229.69 కోట్లు ఉండగా అందులో 11.3 కోట్ల షేర్లను బైబ్యాక్ చేయాలని ప్రతిపాదించారు. మొత్తం ఈక్విటీలో దాదాపు 5 శాతం వాటాకు ఇది సమానం. ఒక్కో షేరును 1,150 రూపాయల రేటుతో బైబ్యాక్ చేస్తారు. సిఇఒ పదవికి సిక్కా రాజీనామా చేసిన మరునాడే బైబ్యాక్ ప్రతిపాదనను బోర్డు ఆమోదించింది. అయితే షేర్ హోల్డర్ల ఆమోదం ఇంకా పొందాల్సి ఉంది. ఇదిలా ఉండగా నీలేకని రావడం ఇన్ఫోసిస్‌కు మళ్లీ మంచిరోజులు వచ్చినట్టేనని విశ్లేషకులు అంటున్నారు. కంపెనీ మళ్లీ నాయకత్వ సుస్థిరతను సాధించి, ప్రస్తుతమున్న సమస్యలను అధిగమించి కొత్త వ్యూహాలతో ముందుకు దూసుకుపోవడానికి నీలేకని నాయకత్వం దోహదం చేస్తుందని విశ్లేషకులు అంటున్నారు. నీలేకని కూడా జాగ్రత్తగా మాట్లాడుతూ ఫోకస్‌తో ఉన్నట్టుగా స్పష్టం చేయడాన్ని వారు అభినందిస్తున్నారు. నాన్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ హోదాలో ప్రస్తుతం కంపెనీ ఎదుర్కొంటున్న అనిశ్చితిని తొలగించి వ్యూహాత్మకంగా దిశానిర్దేశం చేయడంతోపాటు కొత్త సిఇఒ ఎంపికపై నీలేకని దృష్టి సారించనున్నారు.

స్టార్టప్‌లకు విదేశీ నిధులు



ఎఫ్‌డిఐపై సమీకృత విధాన పత్రంలో వరం

న్యూఢిల్లీ: కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఎట్టకేలకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డిఐ)కు సంబంధించి సమీకృత విధాన పత్రం విడుదల చేసింది. గత ఏడాది కాలంలో వివిధ రంగాల్లో ఎఫ్‌డిఐకి సంబంధించి తీసుకొచ్చిన వివిధ మార్పులు ఇన్వెస్టర్లకు తేలిగ్గా అర్థమయ్యేలా ఈ విధాన పత్రం విడుదల చేశారు. స్టార్టప్ కంపెనీలను కూడా తొలిసారిగా ఈ జాబితాలో చేర్చారు. దీంతో ఇక స్టార్టప్ కంపెనీలు కూడా తమ అవసరాన్ని బట్టి నూరు శాతం పెట్టుబడులను విదేశీ వెంచర్ క్యాపిటల్ ఇన్వెస్టర్ల (ఎఫ్‌విసిఐ) నుంచి సమకూర్చుకోవచ్చు. ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత ఇతర పెట్టుబడి సాధనాలు/రుణ పత్రాల జారీ ద్వారా స్టార్టప్ కంపెనీలు ఎఫ్‌విసిఐల నుంచి నిధులు సమకూర్చుకోవచ్చని ఈ విధాన పత్రం పేర్కొంది. ఇంకా దేశీయ స్టార్టప్ కంపెనీలు విదేశీ పౌరులు, సంస్థల నుంచి ఒకేసారి రూ.25 లక్షలు లేదా అంతకు మించిన పెట్టుబడులను కన్వర్టబుల్ నోట్స్ (డిబెంచర్లు) ద్వారానూ సమీకరించవచ్చు. అయితే పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు చెందిన పౌరులు, సంస్థలను మాత్రం ఇందుకు అనుమతించరు. తిరిగి తీసుకెళ్లేందుకు వీలు లేని పద్ధతిలో (నాన్ రిపాట్రియేషన్) ప్రవాస భారతీయులు(ఎన్ఆర్ఐ) ఈ కన్వర్టబుల్ నోట్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చని వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక శాఖ (డిఐపిపి) పేర్కొంది.

దీనికి తోడు ప్రభుత్వ అనుమతుల అవసరం ఉన్న రంగాల్లో పని చేసే స్టార్టప్ కంపెనీలు ప్రభుత్వ అనుమతి తీసుకున్నాకే ప్రవాస భారతీయులకైనా ఈ కన్వర్టబుల్ నోట్స్ జారీ చేయాలి. ఆర్‌బిఐ నిబంధనలకు అనుగుణంగా నివేదికలూ సమర్పించాలి. దేశంలో స్టార్టప్‌ల ద్వారా మరిన్ని ఉద్యోగ అవకాశాలు, నవీన కల్పనలను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ కొత్త సమీకృత విధాన పత్రంలో స్టార్టప్‌లను చేర్చింది. మరింత దూకుడుగా ఎఫ్‌డిఐ ఆకర్షించేందుకు ప్రభుత్వం గత ఏడాది కాలంలో అనేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా రక్షణ, పౌర విమానయానం, నిర్మాణ రంగం, ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు, న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్ వంటి దాదాపు 12 రంగాల్లో ఎఫ్‌డిఐ పెట్టుబడులపై ఉన్న అనేక ఆంక్షలను సడలించింది.

ఎయిర్ ఇండియా డిజిన్వెస్ట్‌మెంట్‌కు బ్రేక్

ఎఫ్‌డిఐపై తాజాగా విడుదల చేసిన సమీకృత విధాన పత్రంలోనూ ఎయిర్ ఇండియా ఈక్విటీలో మెజారిటీ వాటా కేంద్ర ప్రభుత్వం చేతిలోనే ఉండాలని స్పష్టం చేసింది. అంటే ఏ ప్రైవేట్ లేదా విదేశీ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఈక్విటీలో మెజారిటీ వాటా తీసుకునే అవకాశం లేదు. దీంతో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి ఎయిర్ ఇండియాలో మెజారిటీ వాటా కోసం పోటీపడాలన్న టాటా గ్రూప్ ప్రయత్నాలకు దాదాపు బ్రేక్ పడినట్టేనని భావిస్తున్నారు. ప్రధాని కార్యాలయం ఒత్తిడితోనే వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

మెజారిటీ వాటాకు తక్కువైతే టాటా గ్రూపు కూడా ఎయిర్ ఇండియాపై ఏ మాత్రం ఆసక్తి చూపక పోవచ్చని భావిస్తున్నారు. దీంతో ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఏ మాత్రం ముందుకు సాగే అవకాశం కనిపించడం లేదు.



తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి

కొత్త వెర్నా

ధర రూ. 9,99,900 - రూ.12,61,900

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కార్ల తయారీ దిగ్గజం హ్యుండయ్ మోటార్స్ కొత్త తరం వెర్నా గ్లోబల్ సెడాన్‌ను తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. అన్నీ సరికొత్త హంగులతో అత్యాధునికంగా దీన్ని తీర్చి దిద్దినట్టు కంపెనీ ప్రాంతీయ సేల్స్ మేనేజర్ సలీమ్ అమీన్ తెలిపారు. ప్రీమియం కార్లు తయారుచేసే కె2 ప్లాట్‌ఫారంపై దీన్ని తయారుచేయడంతోపాటు కొత్తగా స్మార్ట్ ఫీచర్లు అనేకం జోడించామన్నారు. ఎహెచ్ఎస్ఎస్ స్టీల్‌ను ఉపయోగించినందు వల్ల కారు బరువు కూడా తగ్గుతుందని, మరింత మెరుగైన ఇంధన సామర్థ్యానికి ఇది సహాయపడుతుందని ఆయన చెప్పారు. యాప్ ఆధారితంగా యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో అండ్ మిర్రర్ లింక్ వంటి సదుపాయాలున్న మల్టీమీడియా సిస్టమ్, స్ట్రీమింగ్ ఆడియో, వాయిస్ కంట్రోల్డ్ సెర్చ్, స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్లు యువతరాన్ని ఆకట్టుకుంటాయని సలీమ్ అన్నారు. ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు, స్మార్ట్ ట్రంక్, ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, క్రూయిజ్ కంట్రోల్, వెనుక కర్టెన్లు వంటి ఫీచర్లు ఈ సెగ్మెంట్‌లో తొలిసారిగా ప్రవేశపెట్టామని ఆయన చెప్పారు. మాన్యువల్, ఆటోమేటిక్ వేరియెంట్లు రెండింటిలో ఈ కారు అందుబాటులో ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో ఈ కారు (ఎక్స్ షోరూమ్) ధరలు పెట్రోల్ వేరియెంట్ 9,99,900- 12,23,900 మధ్య, డీజిల్ వేరియెంట్‌లో 9,90,900- 12,61,900 మధ్య ఉంటాయని ఆయన తెలిపారు. ఆరు రంగుల్లో ఈ కార్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

జిఎస్‌టి రిటర్న్‌లు దాఖలు చేసిన

36 లక్షల వ్యాపార సంస్థలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 36 లక్షల వ్యాపార సంస్థలు జిఎస్‌టి రిటర్న్స్ దాఖలు చేశాయి. కొన్ని ప్రత్యేక పరిస్థితలకు లోబడి రిటర్న్స్ దాఖలుకు ఇంకా గడువున్న కారణంగా జిఎస్‌టి కింద తొలిసారిగా వసూలైన పన్నుల మొత్తాన్ని మాత్రం ఇంకా లెక్కించలేదు. తొలి విడత జిఎస్‌టి వసూళ్ల మొత్తం 65 వేల కోట్ల రూపాయల వరకు ఉంటుందని ప్రభుత్వ వర్గాలు అంచనావేస్తున్నాయి. దేశంలో జిఎస్‌టి ఈ ఏడాది జూలై నుంచే అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. జిఎస్‌టి కింద పన్ను రిటర్న్స్ దాఖలు చేసేందుకు గడువు ఈ నెల 25న ముగిసింది. అయితే, వేరువేరు నిబంధనల కింద ఇంకా గడువు ఉంది. ట్రాన్సిషనల్ క్రెడిట్‌ను వినియోగించుకున్న వ్యాపారసంస్థలు ఆగస్టు 28 వరకు రిటర్న్స్ దాఖలు చేయవచ్చు. అయితే ఈ సంస్థ స్వీయమదింపు ప్రాతిపదికపై పన్నులను మాత్రం 25 లోగానే చెల్లించాల్సి ఉంటుంది.

ఉద్యోగుల ప్రోత్సాహకాలకూ జిఎస్‌టి

వ్యాపార సంస్థలు, పరిశ్రమలు ఉద్యోగులకు ఇచ్చే రకరకాల నగదుయేతర ప్రోత్సాహకాలు జిఎస్‌టి పరిధిలోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రత్యేకంగా మినహాయింపు ఉంటే తప్ప ప్రోత్సాహకాలుగా ఉద్యోగులు పొందే సర్వీసులు, ప్రాడక్ట్స్‌పై జిఎస్‌టి ఉంటుందని పేర్కొంది. నగదు రూపంలో లభించే ప్రోత్సాహకాలకు మాత్రం జిఎస్‌టి వర్తించదు. నగదు సప్లై కిందకు రాదని, అందువల్ల జిఎస్‌టి వర్తించదని ప్రభుత్వం వివరించింది.

చింతపండుపై జిఎస్‌టి మోత వద్దు

హైదరాబాద్: చింతపండుపై వెంటనే జిఎస్‌టి భారం తప్పించాలని తెలంగాణ చింతపండు వ్యాపారుల సంఘం డిమాండ్ చేసింది. గత పదిహేనేళ్లుగా చింతపండుపై ఎలాంటి పన్నులు లేకపోయినా జిఎస్‌టితో ఒక్కసారిగా 12 శాతం పన్ను పోటు పడిందని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నెల 5న జరిగిన సమావేశంలో దీన్ని ఐదు శాతానికి కుదించినా వ్యాపారులు, వినియోగదారులపై భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపైనా జిఎస్‌టి భారం

అమరావతి (ఆంధ్రజ్యోతి): బిందు సేద్యానికి ఉపయోగపడే మైక్రో ఇరిగేషన్ డ్రిప్ పరికరాలపై జిఎస్‌టి పేరుతో అదనపు భారం మోపడంపైనా రైతుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. జిఎస్‌టికి ముందు ఈ పరికరాలపై 12.5 శాతం ఎక్సైజ్, ఐదు శాతం వ్యాట్‌తో కలిపి 17.5 శాతం పన్నుల భారం ఉండేది. ఐదు శాతం వ్యాట్‌ను ప్రభుత్వం రైతులకు రూ.5,000 తిరిగి చెల్లించేది. ఇపుడు జిఎస్‌టితో ఈ పరికరాలపై 18 శాతం పన్ను భారం పడుతోంది.

సూక్ష్మసేద్యం అదనపు భారం లబ్ధిదారునిపైనే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): జిఎస్‌టితో సూక్ష్మసేద్యం పథకంపై పడే అదనపు భారం లబ్ధిదారులపైనే వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సూక్ష్మసేద్యం పరికరాలపైన గతంలో 5 శాతం వ్యాట్ ఉండేది. ఈ భారాన్ని గరిష్టంగా రూ.5 వేల వరకు ప్రభుత్వమే సబ్సిడీ కింద భరించేది. సూక్ష్మసేద్యం పరికరాలపై పన్నును 18 శాతం జిఎస్‌టి శ్లాబు పరిధిలో కేంద్రం చేర్చింది. ఈ నేపథ్యంలో గతంలో భరిస్తున్నట్లుగానే 5 శాతం పన్ను భారాన్ని.. గరిష్టంగా 5 వేల రూపాయల వరకు సబ్సిడీ కింద రీయింబర్స్‌ను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నాణ్యతా ప్రమాణాలతోనే

పారిశ్రామికాభివృద్ధి

అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు



రేణిగుంట: నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయాలని పారిశ్రామికవేత్తలకు అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు సూచించారు. సోమవారం నాడిక్కడ జరిగిన క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా (క్యుసిఎఫ్ఐ) తిరుపతి చాప్టర్ మూడో వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. తప్పులను సరిదిద్దుకునే మార్గంలో పారిశ్రామికవేత్తలు పరిస్థితులకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ముందుకెళ్లాలన్నారు. ఒకప్పటి మేడ్ ఇన్ ఇండియా ప్రస్తుతం మేక్ ఇన్ ఇండియాగా మారిందన్నారు. తిరుపతి చాప్టర్ ప్రారంభించిన అనతి కాలంలోనే స్వయం ప్రతిపత్తిని పొంది, దేశంలోనే అతిపెద్ద చాప్టర్‌గా అవతరించిందని క్యుసిఎఫ్ఐ తిరుపతి చాప్టర్ గుండ్లూరు జగన్మోహన్ తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో పోటీని తట్టుకుని నిలబడాలంటే వస్తు తయారీలో నాణ్యతను పాటించాలని అమరరాజ బ్యాటరీస్ క్యుహెచ్ఎస్ఇ ప్రెసిడెంట్ గల్లా విజయనాయుడు సూచించారు. వినూత్నమైన ఆలోచనా విధానాలతో ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ఇవి ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ నాణ్యతా ప్రమాణాలను అలవర్చుకోవాలని అన్నమాచార్య కళాశాల విద్యా సంస్థల అధినేత యల్లారెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలు రాష్ట్రాల్లోని 62 ప్రముఖ కంపెనీల నుంచి 237 బృందాలు పాల్గొన్నట్లు తిరుపతి చాప్టర్ చైర్మన్ జగన్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ ఫోరమ్ తిరుపతి చాప్టర్ సెక్రటరీ సులోచన, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ ఏడాది 55 వేల మంది

పర్యాటకులు

- **ఇజ్రాయెల్ పర్యాటక శాఖ అంచనా**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత సంవత్సరంలో భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు 55 వేల మంది పర్యాటకులు వస్తారని అంచనా వేస్తున్నట్లు ఇజ్రాయెల్ టూరిజం మంత్రిత్వ శాఖ భారత డైరెక్టర్ హసన్ మదాహ్ వెల్లడించారు. సోమవారం నాడిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2016లో ఇజ్రాయెల్‌ను 44,672 మంది పర్యాటకులు సందర్శించగా ఈ ఏడాది ఇప్పటికే 34 వేల మంది సందర్శించారని చెప్పారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఇజ్రాయెల్ పర్యటన అనంతరం తమ దేశ పర్యటనకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఈ ఏడాది పర్యాటకుల సంఖ్యలో ఇప్పటికే 36 శాతం వృద్ధి చెంది 34 వేలకు చేరుకోగా సంవత్సరాంతం నాటికి 55 వేలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. న్యూఢిల్లీ నుంచి ఇజ్రాయెల్‌కు నేరుగా విమాన సర్వీసును నిర్వహించేందుకు ఎయిర్ ఇండియా సన్నాహాలు చేస్తోందని తెలిపారు.

ఈ విమాన సర్వీసు అందుబాటులోకి వస్తే పర్యాటకుల సంఖ్య 80 వేలకు చేరుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ముంబై నుంచి టెల్‌అవీవ్‌కు మూడు-నాలుగు డైరెక్ట్ విమానాలు నడుస్తున్నాయని హసన్ తెలిపారు. అలాగే భారత్ నుంచి వచ్చే సినిమా నిర్మాతలకు ప్రోత్సాహన్నిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హసన్ వివరించారు.

డాక్టర్ రెడ్డీస్‌పై

అమెరికా కోర్టులో కేసు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌పై క్లాస్ యాక్షన్ లాసూట్ నమోదైంది. యుఎస్ ఫెడరల్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘిస్తూ తప్పుడు ప్రకటనలు ఇచ్చిందని ఆరోపిస్తూ ఒక ఇన్వెస్టర్ ఈ క్లాస్ యాక్షన్ లాసూట్‌ను దాఖలు చేశారు. తప్పుడు ప్రకటనల ద్వారా ఉద్దేశపూర్వకంగా షేరు ధర పడిపోయేలా కంపెనీ వ్యవహరించిందని పేర్కొంటూ కొంత మంది ఇన్వెస్టర్లు అమెరికాలోని న్యూజెర్సీ డిస్ట్రిక్ట్ కోర్టులో ఈ లాసూట్‌ను దాఖలు చేసిందని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వెల్లడించింది. అయితే ఈ లాసూట్‌ను ఇంకా అందుకోలేదని, పెండింగ్‌లో ఉన్న లిటిగేషన్‌పై ప్రత్యేకంగా ఆరోపించిన ఆరోపణలపై తాము మాట్లాడబోమని తెలిపింది. కొంత మంది ఇన్వెస్టర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న లా ఫర్మ్ ఈ నెల 25న కంపెనీ సిఇఒ, సిఎఫ్ఒలపై న్యూజెర్సీ కోర్టులో ఈ క్లాస్ యాక్షన్ సూట్‌ను దాఖలు చేసినట్లు పేర్కొంది. 2015 జూన్- 2017 ఆగస్టు 17 మధ్య కాలంలో న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ట్రేడవుతున్న షేర్లను ఈ లాసూట్‌లో భాగంగా ఉన్న ఇన్వెస్టర్లు కొనుగోలు చేశారని తెలిపింది. ఈ లాసూట్‌ను అందుకున్న తర్వాత ఈ ఆరోపణలకు స్పందించనున్నట్లు డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. అమెరికా కోర్టులో కేసు నమోదు కావటంతో సోమవారం బిఎస్ఇలో కంపెనీ షేరు 2.01 శాతం నష్టపోయి 2,045.95 రూపాయల వద్ద క్లోజైంది.

యుఎస్ మార్కెట్లోకి యాంటీ బాక్టీరియల్ ఔషధం..

అమెరికా మార్కెట్లోకి బాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ నివారణలో ఉపయోగించే ఔషధం సెఫిగ్జిమ్‌ను విడుదల చేసినట్లు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వెల్లడించింది. నోటి ద్వారా (ఓరల్ సస్పెన్షన్) తీసుకునే ఈ ఔషధాన్ని 100 ఎంజి/5ఎంఎల్, 200 ఎంజి/5ఎంఎల్ పరిమాణాల్లో విడుదల చేసినట్లు తెలిపింది. అస్టెల్లాస్ ఫార్మా ఇంక్... జెనరిక్ వెర్షన్ అయిన సుప్రాక్స్‌కు ఇది సమానమైనదని పేర్కొంది. జూన్‌తో ముగిసిన పన్నెండు నెలల కాలానికి గాను అమెరికాలో ఈ ఔషధ విక్రయాలు 5.05 కోట్ల డాలర్లుగా ఉన్నాయని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

పన్ను చెల్లింపులతోనే దేశాభివృద్ధి

- **ఈ ఏడాది టిడిఎస్ లక్ష్యం రూ.21,704 కోట్లు**
- **తెలుగు రాష్ట్రాల టార్గెట్ రూ.46,925 కోట్లు**
- **ఆదాయ పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎస్పీ చౌదరి**



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లింపులతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆదాయ పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎస్‌పి చౌదరి అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ఆదాయ పన్ను శాఖ అధికారులు, చార్టర్డ్ అకౌంటెంట్స్, కన్సల్టెంట్ల కోసం ఆదాయ పన్ను టవర్స్‌లో టిడిఎస్ (మూలం వద్ద పన్ను)పై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సును సోమవారం చౌదరి ప్రారంభించారు. టిడిఎస్‌పై ఉద్యోగులు, పన్ను చెల్లింపుదారుల్లో చాలా సందేహాలున్నాయని, వీటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత చార్టర్డ్ అకౌంట్లు, కన్సల్టెంట్లపైనే ఉందని చెప్పారు. చాలా మంది సిఎలు, కన్సల్టెంట్లు పలు సంస్థలకు సేవలు అందిస్తుంటారని, ఆ సంస్థల్లోని ఉద్యోగులకు టిడిఎస్‌పై అవగాహన కల్పించాలని చౌదరి అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల నుంచి రూ.46,925 కోట్ల ఆదాయ పన్ను వసూళ్లను రాబట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇందులో టిడిఎస్ పద్దు రూ.21,704 కోట్లుగా ఉందన్నారు. గత సంవత్సరం (2016-17)లో తెలుగు రాష్ట్రాల నుంచి రూ.18,007 కోట్ల టిడిఎస్‌ను వసూలు చేసినట్లు చౌదరి వివరించారు. ఇది మొత్తం ఆదాయ పన్ను వసూళ్లలో 45 శాతమని తెలిపారు. 2015-16లో రూ.13,395 కోట్లు, 2014-15లో రూ.11,639 కోట్ల టిడిఎస్‌ను వసూలు చేశామన్నారు. ఈ సమావేశంలో ఆదాయ పన్ను ప్రిన్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, కమిషనర్ రవీంద్ర సాయి, చార్టర్డ్ అకౌంటెంట్లు, కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

రూ.161 కోట్లతో హోస్ట్ ఎనలిటిక్స్ విస్తరణ

మూడేళ్లలో రెట్టింపుకానున్న ఉద్యోగుల సంఖ్య



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐటి ఉత్పత్తులు, సేవల రంగంలోని హోస్ట్ ఎనలిటిక్స్.. హైదరాబాద్‌లోని తన పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) కేంద్రాన్ని విస్తరిస్తోంది. ఇందుకోసం వచ్చే మూడేళ్లలో 2.5 కోట్ల డాలర్లు (సుమారు రూ.161 కోట్లు) ఖర్చు చేయనున్నట్టు కంపెనీ సిఇఒ డేవ్ కెల్లాగ్ విలేకరులతో చెప్పారు. ఈ విస్తరణతో ప్రస్తుతం 150 వరకు ఉన్న ఉద్యోగుల సంఖ్య 300కిపైగా పెరుగుతుందన్నారు. అమెరికాలోనూ ఈ కంపెనీ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

హైదరాబాద్‌లోని ఆర్ అండ్ డి కేంద్రంలో కంపెనీల ఆర్థిక నిర్వహణకు అవసరమైన క్లౌడ్ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ పర్ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ (ఇపిఎం) సొల్యూషన్స్ అభివృద్ధి చేస్తోంది. కంపెనీల ప్రధాన ఆర్థిక అధికారు(సిఎఫ్ఒ)లు మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సొల్యూషన్స్ ఉపయోగపడతాయి.. ఐటి పరిశ్రమ అభివృద్ధికి స్థానికంగా ఉన్న మౌలిక సదుపాయాలు, వసతులను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ కేంద్రాన్ని విస్తరించాలని నిర్ణయించినట్టు హోస్ట్ ఎనలిటిక్స్ (ఇంజినీరింగ్ అండ్ టెక్‌అప్స్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ వ్యాస్ చెప్పారు.

సహారా, సెబిలపైనే

అత్యధిక ఫిర్యాదులు

- **కుంభకోణాల సొమ్ము చేతికందని వైనం**

న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు, సెబిల పనితీరుపైనా ఇన్వెస్టర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కేసుల్లో ఇవిచ్చే తీర్పులు, అవార్డులు ఏ మాత్రం సక్రమంగా లేవని ఫిర్యాదు చేశారు. పార్లమెంటరీ కమిటీ సిఫారసులతో కేంద్ర సిబ్బంది, ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యుసిఐ) ద్వారా జరిపించిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. సహారా వంటి కుంభకోణాలు కేంద్ర ప్రభుత్వ దృష్టికి వెళ్లినా ఇప్పటి వరకు పైసా రీఫండ్ అందలేదని అనేక మంది ఇన్వెస్టర్లు తెలిపారు. నేషనల్ స్పాట్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ (ఎన్ఎస్ఇఎల్) కుంభకోణంతోపాటు ప్రభుత్వం కమోడిటీస్ ట్రేడింగ్‌టాక్స్ విధించడమూ తమను తీవ్రంగా నష్టపరిచినట్టు అనేక మంది కమొడిటీస్ ఇన్వెస్టర్లు చెప్పారు. కొన్ని కంపెనీల నుంచి షేర్లతోపాటు బోనస్ షేర్లు, డివిడెండూ ఇన్వెస్టర్లకు అందడం లేదు. సెబి నిబంధనలు ఎంత కట్టుదిట్టం చేసినా ఇంకా కొంత మంది స్టాక్ బ్రోకర్లు ఇన్వెస్టర్ల ఖాతాల నుంచి అనధికారికంగా లావాదేవీలు జరుపుతున్నట్టు తేలింది. దీనిపై సెబికి ఫిర్యాదు చేసినా సంతృప్తికరమైన పరిష్కారం దొరకడం లేదని అనేక మంది ఇన్వెస్టర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు.

గొలుసు కట్టు పథకాల జోలికి పోవద్దు : సెబి

పొంజీ పథకాలుగా పిలిచే గొలుసుకట్టు పథకాల పెట్టుబడులపై అప్రమత్తంగా ఉండాలి సెబి మరోసారి ఇన్వెస్టర్లను హెచ్చరించింది. ఈ పథకాలు నడిపే కంపెనీలు చెప్పే కల్లబొల్లి హామీలు నమ్మి అద్భుత లాభాలు లాభాలు వస్తాయని, ఆ పథకాల్లో మదుపు చేస్తే కొంప మునుగుతుందని సెబి డిజిఎం సూర్యకాంత శర్మ చెప్పారు. మధురలోని ఒక కాలేజీలో జరిగిన ఒక సదస్సులో ఆయన ఈ హెచ్చరిక చేశారు. ఈ పథకాల్లో మదుపు చేసే ముందే వాటి షరతులు పూర్తిగా చదవాలని కోరారు. సరైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైన సమాచారంతో పాటు మోసాల బారి నుంచి ఇన్వెస్టర్లను రక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

అడవి మృగం

(మొదటి పేజీ తరువాయి)

అర్హుడు కాదని తేల్చి చెప్పింది. హరియాణాలోని రోహ్‌తక్ నగర శివారులోని సునారియా జైల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోర్టులో సీబీఐ ప్రత్యేక జడ్జి జగ్దీప్ సింగ్ ఈ మేరకు 9 పేజీల తీర్పు వెలువరించారు. "తన దగ్గరకు వచ్చే మహిళా భక్తురాళ్లపైనే నిందితుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తనకు లొంగకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని బెదిరించాడు. ఈ కేసుకే ప్రత్యేకమైన వాస్తవాలు, పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే, ఇటువంటి వ్యక్తులు కోర్టు నుంచి ఎటువంటి కారుణ్యానికి అర్హులు కారు. తనపై ఎంతో భక్తి విశ్వాసాలు కలిగిన తన సొంత శిష్యురాళ్లను కూడా నిందితుడు వదలలేదు. ఒక అడవి మృగంలా ప్రవర్తించాడు. బాధితులు ఇద్దరూ గుర్మీత్‌ను దైవదూతగానే భావించారు. ఆ విధంగానే ఆయనను పూజించారు. అటువంటి అవివేక, గుడ్డి అనుచరులపై లైంగిక దాడి చేయడం ద్వారా గుర్మీత్ తీవ్ర నేరానికి పాల్పడ్డాడు" అని జడ్జి జగ్దీప్ సింగ్ స్పష్టం చేశారు. డేరా సచ్చా సౌదా వంటి మత సంస్థల అధిపతులు చేసే ఇటువంటి నేరాలు ప్రాచీన కాలం నుంచీ మన దేశంలో నెలకొని ఉన్న సదాచార, పవిత్ర, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక, మత సంస్థల ప్రతిష్ఠను మసకబారుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ సింగ్ రెండేళ్లుగా తమపై అత్యాచారం చేస్తున్నాడంటూ ఇద్దరు భక్తులు 2002లో అప్పటి ప్రధాన మంత్రి వాజపేయికి లేఖ రాశారు. 1999 నుంచి 2001 వరకూ తమపై అత్యాచారం చేశారని పేర్కొన్నారు. ఆశ్రమంలోని ఎంతోమంది మహిళలు ఆయన అకృత్యాలకు బలయ్యారని అందులో పేర్కొన్నారు. ఆ లేఖపై పంజాబ్, హరియాణా హైకోర్టు స్పందించింది. దర్యాప్తు చేయాల్సిందిగా 2002 డిసెంబరులో సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తు పూర్తి చేసిన సీబీఐ 2007లో గుర్మీత్ సింగ్‌పై చార్జిషీటు దాఖలు చేసింది. బాధితులు, నిందితుల వాదనలు విన్న సీబీఐ కోర్టు.. ఈ ఏడాది జూలై నుంచి రోజువారీగా విచారణ చేపట్టింది. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ వాదనలను ఆగస్టు 17వ తేదీన పూర్తి చేసింది. రాంరహీమ్ దోషి అంటూ ఆగస్టు 25న తీర్పు ఇచ్చింది. ఆ వెంటనే గుర్మీత్‌ను సునారియా జైలుకు తరలించారు. భద్రతా కారణాలతో సోమవారం మధ్యాహ్నం జడ్జి జగ్దీప్ సింగ్‌ను కూడా హెలికాప్టర్లోనే తరలించారు. అనంతరం గుర్మీత్‌కు ఎంత శిక్ష విధించాలనే అంశంపై వాదనలు ప్రారంభించారు. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ న్యాయవాదులకు తమ తమ వాదనలు వినిపించేందుకు పదేసి నిమిషాల సమయం ఇచ్చారు. బాబాగా ఉంటూ భక్తురాళ్లపైనే అత్యాచారం చేశారని, రెండేళ్లపాటు కొనసాగించారని, ఆయనకు గరిష్ఠ శిక్ష విధించాలని సీబీఐ తరఫు న్యాయవాదులు వాదించారు. గత సంప్రదాయాలను వివరిస్తూ యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని కోరింది. అయితే, గుర్మీత్ సామాజిక సేవకుడని, ఆయన ఎన్నో మంచి పనులు చేశారంటూ ఆయన తరఫు న్యాయవాదులు వివరించారు. గుర్మీత్ వయసు 50 ఏళ్లని, గత ఎనిమిదేళ్లుగా ఆయనకు హైబీపీ, తీవ్రమైన మధుమేహం, నడుమునొప్పి వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని తీర్పు ఇవ్వాలని కోరారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి 20 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. రెండు కేసుల్లోనూ ఒక్కోదానికి రూ.15 లక్షల చొప్పున జరిమానా విధించారు. ఆ డబ్బుల్లో రూ.14 లక్షలను ఒక్కో బాధితురాలికి చెల్లించాలని ఆదేశించారు. మరో మూడు అభియోగాలకు సంబంధించి రూ.65 వేల జరిమానా విధించారు. ఆ వెంటనే గుర్మీత్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. జైలు దుస్తులు ఇచ్చి కారాగారానికి తరలించారు. కాగా, గుర్మీత్‌కు పదేళ్ల శిక్ష విధించారంటూ తొలుత కథనాలు వచ్చాయి. అయితే, ఒక్కో కేసులోనూ పదేళ్ల శిక్ష విధించారని, రెండు కేసుల్లోనూ 20 ఏళ్లు పడిందని డిఫెన్స్ న్యాయవాది ఎస్కే గర్గ్ నర్వానా చెప్పారు. రెండు శిక్షలూ ఒకదాని తర్వాత మరొకటి అమలవుతాయని చెప్పారు. నేరపూరితంగా బెదిరించిన మరో కేసులో గుర్మీత్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధించారని చెప్పారు. ఈ శిక్ష మాత్రం ఏకకాలంలోనే అమలవుతుందని తెలిపారు. అయితే, కోర్టు తీర్పుపై తాము హైకోర్టుకు వెళతామని గుర్మీత్ తరఫు న్యాయవాదులు చెప్పారు.



బాబా అనుచరుల విధ్వంసంలో ధ్వంసమైన కారు



ఆశ్రమం నుంచి ఇళ్లకు తరలుతున్న భక్తులు

250 మందిపై రేప్!

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా బయటపెట్టాడు. కోర్టులో అతడికి రెండు కేసుల్లోనే శిక్షపడిందిగానీ.. అలాంటి ఘోరాలు అతడు ఎన్నో చేశాడని వివరించాడు. భక్తిభావంతో డేరా సచ్చా సౌదాలో చేరి సేవ చేయాలనుకున్న సాధ్వీలను వంతులవారీగా బలవంతంగా అనుభవించాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ అకృత్యాల గురించి అతడి మాటల్లోనే..

ఒకసారి గుర్మీత్ బాబా మౌంట్ అబులో సత్సంగ్ నిర్వహించాడు. అక్కడి క్యాంపులో ఒక టెంటుకు నేను కాపలా కాస్తున్నాను. అక్కడ బాబా ఒక 16-17 ఏళ్ల అమ్మాయిని పిలిచాడు. ఆమెను టెంట్‌లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆ అమ్మాయి అరుపులు నేను విన్నాను. ఇది 1995-96 నాటి మాట. ఆ సంఘటనతో నాకు ఆయనపై అసహ్యం వేసింది. ఇక ప్రధాన ఆశ్రమంలో ఆయన 'గుహ' వద్దకు చాలా మంది అమ్మాయిలు వచ్చేవారు. అలా వచ్చే అమ్మాయిల్లో ఒకరు ఆయన 'డేరా'లో ఒక రాత్రంతా ఉండేవారు. మా గార్డులందరం దీనిపై చర్చించుకునేవాళ్లం. కానీ, మిగతా వాళ్ల అభిప్రాయంతో నేను విభేదించేవాణ్ని. ఎందుకంటే.. బాబా ఒక అమ్మాయిని రేప్ చేయడం నేను నా కళ్లతో చూశాను. ఆ అమ్మాయి ఇప్పటికీ డేరాలో ఉంది. కానీ ఆమె పేరు చెప్పాలనుకోవట్లేదు. అవసరమైతే మాత్రం చెప్తాను. ఆ అమ్మాయే కాదు.. ఆయన 250 మందికి పైగా అమ్మాయిల్ని రేప్ చేశారు. 300 మంది సాధ్వీల్లో దాదాపు 90 శాతం మంది అతడి కామదాహానికి బలైనవారే. లైంగికదాడికి గురైనవారే.

వేలాది హత్యలు..

అత్యాచారాలే కాదు.. హత్యలు కూడా అక్కడ సర్వసాధారణం. గుర్మీత్ బాబా డేరా బాధ్యతలు చేపట్టాక చేసిన తొలి హత్య ఫకీర్ చంద్‌ది. అతణ్ని చంపి శవం కనిపించకుండా చేశాడు. ఆ తర్వాత అతడు వందల మందిని హత్య చేశాడు. తొలినాళ్లలో శవాల్ని పాకడా నదిలో పారేసేవారు. ఆ తర్వాత ఆశ్రమంలోనే తగలబెట్టేవారు. కొందరిని పూడ్చేసేవారు. అస్థికలను తోటలో వేసేవారు. ఇప్పటికీ ఆశ్రమంలో వెతికితే పండ్లతోటలో ఆ అస్థికలు దొరుకుతాయి. ఆ అస్థికలేంటని అడిగితే.. అవి కొందరు వ్యక్తులు తమ మృతదేహాలను స్వచ్ఛందంగా ఆశ్రమానికి సమర్పిస్తున్నట్టు జీవించి ఉండగానే రాసిచ్చారని చెబుతారు. దానికి సంబంధించిన అఫిడవిట్లను కూడా చూపుతారు. కానీ, అవన్నీ హత్యకు గురైనవారి ఎముకలే. ముఖ్యంగా.. తమ భూములను 'డేరా' కబ్జాలో పోగొట్టుకున్నవారి ఎముకలు.

శృంగారానికి పనికిరాకుండా..

డేరా సచ్చా సౌదాలో 600 మంది పురుషులు పర్మనెంట్ ఉద్యోగాలు చేస్తున్నారు. కొన్ని వేల మంది తాత్కాలిక ప్రాతిపదికన షిఫ్టులవారీగా పనిచేస్తారు. డేరాలో శాశ్వత ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగులు 250 నుంచి 300 మందిని నపుంసకులుగా, శృంగారానికి పనికిరానివారిగా మార్చేశారు. కొందరికి ఆపరేషన్లు చేసి పిల్లలు పుట్టకుండా చేశారు. అలాంటివారిలో కొందరు ఇంకా అక్కడే పనిచేస్తున్నారు. కొందరు డేరా వదిలి బయటకు వెళ్లిపోయారు. కొందరు విదేశాలకు వెళ్లిపోయారు.

హనీప్రీత్‌తో వేరే సంబంధం..

ఎప్పుడూ బాబా పక్కనే ఉండే అమ్మాయి.. హనీప్రీత్. ఆమె బాబాను తన తండ్రిగా చెబుతుంటుంది. కానీ అది తప్పు. డేరా బాబాకు ఆమెతో 'అంగీకార యోగ్యం కాని' సంబంధం ఉంది. అయినా ఆమెను తన కూతురుగానే చెబుతుంటాడు. అది సిగ్గుపడాల్సిన విషయం. నిజానికి ఆమె విశ్వాస్‌గుప్తా అనే వ్యక్తి భార్య. అతడో మంచి పేరున్న కుటుంబానికి చెందిన వ్యక్తి. ఒకప్పుడు బాబా భక్తుడు. బాబాకు అత్యంత సన్నిహితుడు కావడంతో ఆయన వద్దకు స్వేచ్ఛగా వచ్చివెళ్తుండేవాడు. గార్డులు కూడా వారిని ఆపేవారు కాదు. వారు రాగానే తలుపులు తెరిచేవారు. ఒకరోజు విశ్వాస్‌గుప్తా డేరాకు వచ్చేసరికి ఆయన భార్య బాబా బెడ్‌రూమ్‌లో, ఆయనతో అభ్యంతరకర స్థితిలో కనిపించింది (ఈ విషయం విశ్వాస్ గుప్తానే గతంలో మీడియాకు తెలియజేశారు). దీంతో ఆయన ఇంటికి వెళ్లి తన తల్లిదండ్రులకు ఆ విషయం చెప్పి, మీడియా ముందు బాబా గుట్టు రట్టు చేశారు. తన భార్య బాబాతో నగ్నంగా కనిపించిందని తెలిపారు. ఆ తర్వాత విశ్వాస్‌గుప్తాను, ఆయన తండ్రిని మానసికంగా హింసించారు. వారి ఆస్తిని మొత్తం స్వాధీనం చేసుకుని అమ్మేశారు. వారిపై పలు అక్రమ కేసులు బనాయించారు. ఆ హనీప్రీత్ కౌరే నేడు బాబా దత్తపుత్రికగా పేరొందిన హనీప్రీత్‌సింగ్. ఆయనకు ఇద్దరు కుమార్తెలున్నా.. జైలుకు వెళ్లగానే తనతోపాటు హనీప్రీత్ సింగ్‌ను కూడా జైల్లో ఉంచాలని అడిగారు. హనీప్రీతే ఎందుకుండాలి? ఆయన నిజమైన కూతుళ్లు ఆయనతో కలిసి జైల్లో ఎందుకు ఉండకూడదు?

జైల్లోంచి బయటకే రాకూడదు..

ఫ్రెండ్స్.. ఈ బాబా జైల్లోంచి అసలు బయటకే రాకూడదు. 2007లో అతడు గురుగోవింద్ సింగ్‌ను అనుకరించి సిక్కుల మనోభావాలను దెబ్బతీశాడు. 'గురుగోవింద్ సింగ్ ఒక కొత్త మతాన్ని స్థాపించడానికి 5 చిహ్నాలను ఉపయోగించారు. నేనైతే ఏడు చిహ్నాలను ఉపయోగిస్తాను. అందులో ఒకటి.. రక్తం. వేలి నుంచి రక్తపు చుక్క తీసి రూహ్‌అఫ్జా, పాలల్లో వేసి తాగాలి" అని చెప్పేవాడు. భూకబ్జాలు సైతం చాలా చేశాడు. ఏదైనా భూమి మీద అతడి కన్ను పడితే.. అక్కడికి గూండాలను పంపేవాడు. ఆ భూమిలో మలమూత్ర విసర్జన చేయాలని వారికి సూచించేవాడు. వారు మలమూత్ర విసర్జన చేసిన భూమిని ఆ భూ యజమాని ఎట్టిపరిస్థితుల్లోనూ బాబాకు విక్రయించాల్సిందే. రూ.20 లక్షల భూమికి రూ.1-2 లక్షలు రేటు కట్టేవాడు. ఇచ్చారా సరేసరి. లేకపోతే కబ్జా చేసేవాడు. గుర్మీత్ ఆశ్రమంలో నల్లధనం, అక్రమ ఆయుధాలు భారీ ఎత్తున పోగుపడి ఉన్నాయి. ఆర్డీఎక్స్‌లాంటి పేలుడుపదార్థాలు సైతం అక్కడ ఉన్నాయి. ఆశ్రమంలో ఉన్న ఆయుధాల్లో 60 శాతం అక్రమ ఆయుధాలే. 40 శాతానికి మాత్రమే లైసెన్సులున్నాయి. ఈ వ్యవహారాలన్నీ చూసి నేను విసిగిపోయాను. దీనికితోడు.. నాకు కూడా వృషణాలను తొలగించాలని నిశ్చయించారని, డాక్టర్లు అందుకు ప్లాన్ చేస్తున్నారని తెలియగానే అక్కణ్నుంచీ తప్పించుకుని బయటపడ్డాను. ఆ తర్వాత విదేశాలకు వచ్చి స్థిరపడ్డాను.





తప్పు చేశా.. నన్ను క్షమించండి!

- కోర్టులోనే కుప్పకూలిన డేరా బాబా
- చిన్న పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చిన రాక్‌స్టార్
- తనకు శిక్ష తగ్గించాలని వేడుకోలు
- కోర్టు హాల్లోంచి వెళ్లేందుకు నిరాకరణ
- బలవంతంగా ఈడ్పించిన జడ్జి

రోహ్‌తక్, ఆగస్టు 28: ఉల్లాసం.. ఉత్సాహం.. విలాసం.. వీటన్నిటికీ చిరునామా గుర్మీత్ రాం రహీం సింగ్! లక్షలాది మంది ఆయనకు రెండు చేతులూ జోడించి నమస్కరించారు! కానీ, కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. నిండు కోర్టులో మోకాళ్లపై పడిపోయాడు. లక్షలాదిమందికి ఆధ్యాత్మిక ఉపదేశాలు చేసిన బాబా.. చిన్న పిల్లాడిలా చేతుల్లో ముఖాన్ని దాచుకుని ఏడ్చాడు. 'తప్పు చేశాను.. నన్ను క్షమించండి' అంటూ ప్రాధేయపడ్డాడు. తనకు విధించిన పదేళ్ల శిక్షను తగ్గించాలంటూ చేతులూ జోడించి వేడుకున్నాడు. తనకు క్షమాభిక్ష ప్రసాదించాలంటూ విన్నవించాడు. అత్యాచారం కేసులో సీబీఐ కోర్టు పదేళ్ల శిక్ష విధిస్తున్నట్లు ప్రకటించిన వెంటనే, డేరా బాబా కోర్టు హాల్లోనే పది నిమిషాలపాటు తీవ్ర హైడ్రామాను రక్తికట్టించాడు. మూడు సినిమాల్లో కూడా నటించిన బాబా కోర్టులో మాత్రం జీవించాడు. ఒక్కసారిగా నేలమీద పడిపోయి రోదించాడు. 'నేను అమాయకుడిని' అంటూ చేతులు జోడించాడు. తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని వేడుకున్నాడు. 'నన్ను క్షమించండి' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. కోర్టు హాల్లోంచి వెళ్లడానికి నిరాకరించి అక్కడే కూలబడ్డాడు. తనకు హై బీపీ ఉందని, గుండెల్లో ఇబ్బందిగా ఉందని చెప్పాడు. దాంతో అక్కడికక్కడే డాక్టర్లు ఆయనకు వైద్య పరీక్షలు చేసి పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని ధ్రువీకరించారు. డేరా బాబా ఏడుపులకు, గగ్గోలుకు జడ్జి చలించలేదు. ఆయన ఆదేశాలతో పోలీసులు గుర్మీత్‌ను కోర్టు హాలు బయటకు ఈడ్చుకుని వెళ్లాల్సి వచ్చింది. కొంతసేపటికి తేరుకున్న బాబా.. తనకు టీ కావాలని అడిగాడు. గతంలో ఆయనకు వీవీఐపీ ట్రీట్‌మెంట్ ఇచ్చారని విమర్శలు రావడంతో టీ ఇవ్వడానికి పోలీసులు నిరాకరించారు. కాగా, రెండు హత్య కేసుల్లో కూడా గుర్మీత్ ప్రధాన నిందితుడు. ఇద్దరు భక్తురాళ్లపై అత్యాచారాన్ని వెలుగులోకి తీసుకొచ్చి కథనాలు ప్రచురించిన ఓ జర్నలిస్టును డేరా ఆశ్రమంలోనే హత్య చేశారని కేసు నమోదైంది.



తీర్పును స్వాగతించలేం..
వ్యతిరేకించలేం

- పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ వ్యాఖ్య
- ప్రజలంతా కోర్టు తీర్పును ఆమోదించాలని విన్నపం
- ప్రభుత్వం కనుసన్నల్లోనే విధ్వంసకాండ: శోభా ఓజా
- న్యాయ వ్యవస్థకు సెల్యూట్: అభిషేక్ సింఘ్వీ
- హింసను అణచివేయడంలో విఫలం: ఏచూరి
- చట్టం ముందు ఎవరూ పెద్ద కాదని తేలింది: స్వామి



చండీగఢ్, ఆగస్టు 28: డేరా బాబా గుర్మీత్ రాం రహీం సింగ్‌కు కోర్టు వేసిన శిక్షపై పలు పార్టీల నేతలు స్పందించారు. కొందరు తీర్పును స్వాగతిస్తే, మరికొందరు నేతలు ఎటూకాని వ్యాఖ్యలు చేశారు. కోర్టు తీర్పును స్వాగతించలేమని, వ్యతిరేకించనూ లేమని పంజాబ్ సీఎం అమరీందర్‌సింగ్ అన్నారు. ప్రజలంతా కోర్టు తీర్పును ఆమోదించాలని కోరారు. కాగా, రాజ్యాంగం కన్నా, చట్టం కన్నా ఎవరూ ఎక్కువ కాదని న్యాయవ్యవస్థ రుజువు చేసిందని కాంగ్రెస్ పేర్కొంది. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఈ తీర్పునిచ్చినందుకు న్యాయవ్యవస్థకు సెల్యూట్ చేస్తున్నామని ఆ పార్టీ నేత అభిషేక్ మను సింఘ్వీ అన్నారు. అయితే ఏదైనా సంఘటన జరిగినప్పుడు నేతలు పదవుల నుంచి వైదొలగాల్సిందిగా డిమాండ్లు వెల్లువెత్తుతాయని, కానీ, డేరా బాబా కేసు విషయంలో అన్నీ రివర్సయ్యాయని పేర్కొన్నారు. హరియాణా ప్రభుత్వ కనుసన్నల్లోనే గుర్మీత్‌సింగ్ అనుచరులు విధ్వంసానికి పాల్పడ్డారని అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శోభా ఓజా ఆరోపించారు. కాగా న్యాయాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. విధ్వంసం ఆందోళన కలిగించే అంశమని, అణచివేయడంలో హరియాణా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాగా మరోసారి న్యాయమే గెలిచిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా అన్నారు. చట్టం ముందు ఎవరూ పెద్ద కాదని గుర్మీత్ రాం రహీం సింగ్‌పై తీర్పే చెబుతుందని బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి అన్నారు.

యావజ్జీవం తప్పించుకున్న బాబా

న్యూఢిల్లీ, ఆగస్టు 28: పిల్లలపై అత్యాచారాలను నిరోధించే పోక్సో చట్టం వర్తించకపోవడం వల్లే గుర్మీత్ తక్కువ జైలు శిక్షతో తప్పించుకున్నాడు. పోక్సో చట్టం 2013లో అమల్లోకి రాగా, గుర్మీత్ తన ఆశ్రమంలో ఇద్దరు బాలికలపై 2002లో అత్యాచారానికి పాల్పడ్డాడు. దాంతో ఐపీసీలోని ఇతర సెక్షన్ల కింద శిక్ష విధించారు. పోక్సో చట్టం వర్తించి ఉంటే యావజ్జీవ కారాగార శిక్ష పడేదని న్యాయ నిపుణులు అంటున్నారు.

శిక్ష చాలదు...

- హైకోర్టుకెళ్తాం: బాధితులు

రోహ్‌తక్, ఆగస్టు 28: గుర్మీత్‌కు పడిన శిక్షపై బాధితుల తరఫు న్యాయవాది ఉత్సవ్ సింగ్ బైస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నేరానికి తగ్గట్లుగా సుదీర్ఘ జైలు శిక్ష విధించాలని కోరారు. గుర్మీత్‌పై ఇలాంటి మరో డజను లైంగిక వేధింపుల కేసులు ఉన్నాయని, మిగతా కేసులూ సీబీఐతో దర్యాప్తు చేయించాలని హైకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించారు.

సంతృప్తి కలిగించింది

- హత్యకు గురైన జర్నలిస్టు కొడుకు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: గుర్మీత్‌కు జైలు శిక్ష విధించడం పట్ల 2002లో సిర్సాలో హత్యకు గురైన దివంగత జర్నలిస్టు రామచంద్ర ఛత్రపతి తనయుడు అన్షుల్ ఛత్రపతి సంతృప్తి వ్యక్తం చేశారు. తండ్రి హత్యకు సంబంధించిన కేసునూ సీబీఐకి అప్పగించాలంటూ అన్షుల్ ఛత్రపతి న్యాయపోరాటం చేస్తున్నారు.

డేరాల్లో సోదాలు

ఆయుధాలు, డబ్బులు స్వాధీనం.. అడుగడుగునా కండోమ్‌లు

- సిర్సాలో సైన్యం కవాతు, 144 సెక్షన్
- హరియాణా పోలీసుల భారీ బందోబస్తు

చండీగఢ్, ఆగస్టు 28: ఆధ్యాత్మిక గురువు గుర్మీత్ రాంరహీమ్ సింగ్‌కు ప్రత్యేక న్యాయస్థానం పదేళ్ల జైలుశిక్ష ఖరారు చేసిన సందర్భంగా సోమవారం హరియాణాలో హింస జరగలేదు. డేరా సచ్చా సౌదా కేంద్ర కార్యాలయం ఉన్న సిర్సాలో మాత్రమే ఒక వాహనాన్ని తగులబెట్టారు. నలుగురు వ్యక్తులు రెండు లగ్జరీ కార్లలో వచ్చి ఒకదానికి నిప్పంటించి రెండో దాంట్లో వెళ్లారని సమీప గ్రామస్థులు తెలిపారు. అంతకు ముందు గుర్మీత్‌ను దోషిగా ప్రకటించిన రోజు శుక్రవారం అనుచరులు హింసకు దిగడంతో 38 మంది మరణించారు. 260 మంది గాయపడ్డారు. వందల వాహనాలు తగులబడ్డాయి. ఈసారి ప్రభుత్వం ముందు జాగ్రత్తతో భారీ ఎత్తున బలగాలను మోహరించడంతో హింసను నివారించగలిగారు. సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ ఉదయమే పరిస్థితిని సమీక్షించారు. భద్రతా చర్యల్లో భాగంగా డేరా కార్యాలయాల్లో పెద్ద ఎత్తున సోదాలు జరిపి, ఆయుధాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. భారీ ఎత్తున ఆహార నిల్వలు, కండోమ్‌లు కూడా డేరాల్లో దొరికాయి. పంజాబ్, హరియాణాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. గుర్మీత్‌ను ఉంచిన రోహ్‌తక్ జైలువద్ద మూడంచెల భద్రత కల్పించారు. గుర్తింపు కార్డు లేకుండా కొత్తవారు ఎవరు వచ్చినా అరెస్టు చేయాలని ఆదేశించారు. అల్లర్లకు పాల్పడి, అమాయకుల మీద దాడి చేస్తే మరో ఆలోచన లేకుండా వెంటనే కాల్చి చంపాలని ఆదేశాలు వెళ్లాయి. విద్యా సంస్థలు హరియాణాలో పూర్తిగా, పంజాబ్‌లో పాక్షికంగా మూసేశారు. అంబాలాలో హింసకు పాల్పడమని ప్రోత్సహిస్తూ డబ్బులు పంచుతున్న గుర్మీత్ అనుచరుణ్ణి అరెస్టు చేసి, రూ. 38 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఉభయ రాష్ట్రాల్లో డేరా ఆస్తులు, బ్యాంకు ఖాతాల స్వాధీనం మొదలైంది. తీర్పు వెలువడే వరకూ పంజాబ్, హర్యానాల్లో డేరాలున్న ప్రాంతాల్లో మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిలిపేశారు. గుర్మీత్‌ను దోషిగా ప్రకటించడానికి ముందే స్థానిక యువతతో యూత్ బ్రిగేడ్ ఏర్పాటు చేశారని, తీర్పు వ్యతిరేకంగా వస్తే హింసతో బెదరగొట్టడమే వారి లక్ష్యమని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. సోనేపట్ డేరాలో పోలీసులు పెద్ద ఎత్తున లాఠీలు స్వాధీనం చేసుకున్నారు. సైన్యం కూడా రంగంలోకి దిగింది. సిర్సాలో కవాతు చేసింది. పది డేరాలను మూసేశారు. వాటిలోని పది మంది కీలకమైన సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్‌లోని డేరాల్లో పోలీసులు సోదా చేయగా పెద్ద ఎత్తున ఆయుధాలు దొరికాయి. 52 పెట్రోల్ బ్యాంబులు, 12 బోర్ గన్లు, రివాల్వర్, బుల్లెట్లు సోదాల్లో లభ్యమయ్యాయి. 133 మందిని అరెస్టు చేశారు. డేరా హింసపై హరియాణా కేంద్రానికి నివేదిక ఇచ్చింది.



భార్య ఎక్కడ?

- గుర్మీత్ హైఫై లైఫ్‌కు హర్జోత్ పూర్తి భిన్నం

న్యూఢిల్లీ, ఆగస్టు 28: గుర్మీత్ వ్యక్తిగత జీవితం రహస్యమేమీ కాదు. ఆయనకు ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయితోపాటు దత్తత తీసుకున్న ఓ కుమార్తె కూడా ఉంది. ప్రశ్నల్లా.. గుర్మీత్ భార్య హర్జోత్ కౌర్ ఎక్కడున్నారనే! ఇంత జరిగినా ఆమె మీడియా ఎదుటికి రాలేదు. ఎందుకు? అనంటే ఆసక్తికరమైన కథనాలు వినిపిస్తున్నాయి. హర్జోత్ కౌర్‌ను గత ఐదేళ్లలో ప్రజా దర్బారులో ఎన్నడూ చూడలేదని సిర్సాకు చెందిన ఓ సాధ్వీ చెప్పారు. హర్జోత్ చాలా సాదాసీదా జీవనం గడుపుతారని, డేరా కార్యక్రమాల్లో ఆమెను గుర్తించడం చాలా కష్టమయ్యేదన్నారు. హర్జోత్ సన్నిహితుల సమాచారం ప్రకారం.. ఏళ్లుగా ఆమె డేరా కాంప్లెక్స్‌లోనే ఉంటున్నారు. అక్కడ రెగ్యులర్‌గా పని చేసేవారికి కూడా ఆమె అరుదుగా కనిపిస్తారు. సాధ్వీల మాదిరి సాదాసీదా వస్త్రాలనే ధరించి వారిలో ఒకరిగా వారి మధ్యలో కూర్చుంటారు. డేరా కార్యక్రమాల్లో బిజీగా గడుపుతారని, అందుకే వేదికల్లో కనిపించరని అంటారు.

తిరగబడ్డ గ్రామం

సిర్సాలోని గుర్మీత్ డేరాను ఆనుకొని ఉండే షాపూర్ బేగూ గ్రామవాసులు ఆయన అనుచరులు హింసకు పాల్పడితే దీటుగా ఎదుర్కోవాలని నిర్ణయించారు. ఈ మేరకు రాళ్లు, కర్రలు సిద్ధం చేసి పెట్టుకున్నారు. గ్రామంలో దాదాపు తొమ్మిది వేల మంది ప్రజలు ఉన్నారు. వారికి డేరా కార్యకలాపాలంటే గిట్టదు. తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. ఈ నెల 25నే దాడి జరిగితే ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు. గుర్మీత్ అనుచరులు గ్రామం మీదకు రాకపోవడంతో ఘర్షణ తప్పింది.



సిర్సాలో పోలీసు పహారా

ప్రొ కబడ్డీలో నేటి మ్యాచ్‌లు

Star Sports 2	బెంగళూరు X యూపీ రాత్రి 8.గం
maa movies	యు ముంబా X గుజరాత్ రాత్రి 9.గం





విమల్‌కుమార్–సైనా

షెడ్యూలే సైనాను దెబ్బతీసింది

కోచ్ విమల్

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సింధు రజతంతో సత్తా చాటితే, సైనా కాంస్యంతో మెరిసింది. సెమీస్, ఫైనల్లో ఈ ఇద్దరినీ ఓడించిన జపాన్ ప్లేయర్ నొజోమి ఒకుహరా స్వర్ణం ఒడిసిపట్టింది. అయితే, ఈ మెగా టోర్నీ మ్యాచ్ షెడ్యూల్ సరిగ్గా ఉంటే భారత అభిమానులు కోరుకున్నట్టు సైనా, సింధు ఫైనల్లో తలపడే అవకాశం ఉండేది. క్వార్టర్ ఫైనల్ ముగిసిన గంటల వ్యవధిలోనే సెమీస్‌లో బరిలోకి దిగడం సైనా ఆటతీరుపై తీవ్ర ప్రభావం చూపిందని ఆమె కోచ్ విమల్ కుమార్ అంటున్నాడు. అర్ధరాత్రి జరిగిన క్వార్టర్స్ తర్వాత సెమీస్‌కు సమాయత్తమయ్యేందుకు సైనాకు తగిన సమయం దొరకలేదని వాపోయాడు. సెమీస్‌లో ఓడిపోవడానికి చెత్త షెడ్యూలే కారణమని ఆరోపించాడు. వరల్డ్ చాంపియన్‌షిప్స్, ఒలింపిక్స్ లాంటి పెద్ద ఈవెంట్లలో అయినా కచ్చితమైన షెడ్యూల్ ఉండాలని కోరాడు. 'సైనాకు ఇలా జరగడం దురదృష్టకరం. అర్ధరాత్రి వరకు క్వార్టర్‌ఫైనల్ ఆడిన సైనా.. ఉదయాన్నే సెమీస్ ఆడాల్సి వచ్చింది. నేనైతే మొత్తం షెడ్యూలింగ్‌లోనే లోపం ఉందని భావిస్తున్నా'నని పేర్కొన్నాడు. టీవీ ప్రసారాలు.. షెడ్యూల్‌ను ప్రభావితం చేయకూడదని విమల్ స్పష్టం చేశాడు. 'దీనికి పూర్తి బాధ్యత టెక్నికల్ అధికారులదే. రెండు మ్యాచ్‌ల మధ్య పుంజుకునేందుకు ప్లేయర్‌కు తగిన సమయం ఉండేలా చూసుకోవాల్సింది వాళ్లే. చెన్‌లాంగ్, శ్రీకాంత్ కూడా అర్ధరాత్రి మ్యాచ్‌లు ఆడి మళ్లీ ఉదయాన్నే బరిలోకి దిగాల్సి వచ్చింద'ని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఇక 'రిజర్వ్'లకు

చాన్సిస్తాడట!



పల్లెకెలె: వన్డే సిరీస్‌ను కైవసం చేసుకోవడంతో శ్రీలంకతో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో జట్టులో మార్పులు చేయనున్నట్టు టీమిండియా కెప్టెన్ కోహ్లీ చెప్పాడు. తొలి మూడు వన్డేల్లో ఒకే జట్టుతో భారత్ బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. దాంతో మిగిలిన మ్యాచ్‌ల్లో మనీష్‌పాండే సహా రిజర్వ్ ఆటగాళ్లకు తుది జట్టులో చోటు లభించనుంది. 'మాది 15మంది సభ్యుల బృందం. సిరీస్ గెలిచినందున మిగిలిన క్రికెటర్లకూ అవకాశాలు ఇవ్వాలనుకుంటున్నాం' అని మూడో వన్డే అనంతరం విరాట్ తెలిపాడు. తక్కువ లక్ష్యాలను ఛేదించే క్రమంలో ఇండియా ఇక్కట్ల పాలవడం ఇది వరుసగా రెండోసారి. అయితే ఇది జట్టుకు పెద్ద సమస్యే కాదని కొట్టిపారేశాడు కోహ్లీ. 'స్వల్ప లక్ష్యాలు ఎప్పుడూ ప్రమాదకరమే. ఒకటి రెండు సార్లు అలా జరిగినంత మాత్రాన అది పెద్ద సమస్య కాదు. ఇక్కడ వికెట్ ఒకింత సవాలుగా నిలిచింది. గత మ్యాచ్‌లోనూ మేం కుప్పకూలే స్థితికి చేరాం. కానీ ఒకరిద్దరు బ్యాట్స్‌మన్ పట్టుదలగా ఆడారు. యువ ఆటగాళ్లపట్ల ఒకింత ఓర్పుగా వ్యవహరించాలి' అని వివరించాడు.

మెరిసిన షకీబల్

- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 217 ఆలౌట్

ఢాకా: ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ పట్టుబిగిస్తోంది. షకీబల్ హసన్ (5/68) విజృంభణతో.. ఓవర్‌నైట్ స్కోరు 18/3తో రెండో రోజైన సోమవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ మరో 199 పరుగులు జోడించి 217 వద్ద ఆలౌటైంది. ఓపెనర్ రెన్‌షా (45), అస్టన్ అగర్ (41 నాటౌట్) టాప్ స్కోరర్లు. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (8), హాండ్స్‌కోంబ్ (33), మాక్స్‌వెల్ (23), మాథ్యూ వేడ్ (5) విఫలమయ్యారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లా ఆట చివరకు వికెట్ నష్టానికి 45 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆతిథ్య జట్టు 88 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 260 పరుగులు చేసింది.

చాందిమల్ అవుట్

కొలంబో: శ్రీలంక టాపార్డర్ బ్యాట్స్‌మన్ దినేష్ చాందిమల్ చేతి వేలి గాయం కారణంతో మిగతా రెండు వన్డేలకు దూరమయ్యాడు. ఆదివారం జరిగిన మూడో వన్డేలో బ్యాటింగ్ సందర్భంగా భారత బౌలర్ హార్దిక్ పాండ్యా విసిరిన బౌన్సర్‌కు టెస్ట్ కెప్టెన్ చాందిమల్ కుడి చేతి బొటన వేలికి తీవ్ర గాయమైంది.

హైదరాబాద్ కోచ్‌గా

అరుణ్ కుమార్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ జట్టు నూతన కోచ్‌గా జె. అరుణ్ కుమార్ ఎంపికయ్యాడు. కర్ణాటక కోచ్‌గా పని చేసిన అరుణ్.. 2017- 18 సీజన్‌లో హైదరాబాద్‌కు సేవలందించనున్నాడు. గత సీజన్‌లో కోచ్‌గా ఉన్న భరత్ అరుణ్ టీమిండియా బౌలింగ్ శిక్షకుడిగా వెళ్లడంతో ఆ పదవి ఖాళీ అయింది. ఫస్ట్‌క్లాస్ మాజీ క్రికెటర్ అయిన అరుణ్ కుమార్ ఆ స్థానంలో బాధ్యతలు చేపట్టాడు. 2012-13 నుంచి కర్ణాటకకు కోచ్‌గా ఉన్న అరుణ్.. ఆ జట్టు రంజీ ట్రోఫీ, ఇరానీ కప్, విజయ్ హజారే టోర్నీ గెలవడంతో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో పంజాబ్ జట్టుకు కూడా అరుణ్ కోచ్‌గా పని చేశాడు.



వరల్డ్ చాంపియన్ అయ్యే సువర్ణావకాశాన్ని తెలుగమ్మాయి పీవీ సింధు త్రుటిలో చేజార్చుకుంది..! దాదాపు రెండు గంటల పాటు సాగిన ఫైనల్లో నొజోమి విసిరిన సవాల్‌ను ఛేదించేందుకు తన శక్తినంతా ధారపోశానని సింధు చెబుతోంది..! ఫలితం కొంత నిరాశ పరిచినా దేశానికి రజతం అందించానన్న సంతృప్తి తనకు ఉందంటోంది..! చరిత్రలో నిలిచిపోయే మ్యాచ్ ఆడినందుకు గర్వపడుతున్నానని ఆమె తెలిపింది..! ఈ టోర్నీ ఇచ్చిన సానుకూలతలతో.. అందిపుచ్చుకున్న ఆత్మవిశ్వాసంతో.. భవిష్యత్‌లో దీటుగా తిరిగొస్తానంటోంది..! గతంలో రెండు సార్లు కాంస్యం నెగ్గి.. ఈ సారి పతకం రంగు మారుస్తానన్న మాటను నిలబెట్టుకొని స్వదేశానికి పయనమైన సింధు ఫైనల్ మ్యాచ్.. ప్రత్యర్థి.. తన కెరీర్‌పై మాట్లాడింది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

శక్తినంతా ధారపోశా...

- చరిత్రలో నిలిచే ఫైనల్ ఆడాను..
- అందుకు సంతోష పడుతున్నా
- ఓడినందుకు నిరాశే..
  కానీ, రజతం ఆనందమే..

స్వర్ణం నెగ్గే సువర్ణావకాశాన్ని వదులుకున్నందుకు కొంత అసంతృప్తి ఉంది. అయినా.. ముందుగా చెప్పినట్టు పతకం రంగు మార్చినందుకు సంతోషపడుతున్నా. హోరాహోరీగా సాగిన తుదిపోరులో ఒకుహరాకు, నాకు సమాన అవకాశం కనిపించింది. మొదటి సెట్ నుంచే ప్రతీ పాయింట్ ఇద్దరికీ ఎంతో కీలకమైంది. నేను ఆధిక్యంలో ఉన్నా.. ఒకుహరా ముందంజలో ఉన్నా.. ఆటలో ఎవరిదీ పైచేయి అనలేం. ఎన్నో సుదీర్ఘ ర్యాలీలు నడిచాయి. చివరి గేమ్‌లో 20-20తో స్కోర్లు సమమైనా మ్యాచ్ గెలిచేందుకు నా శాయశక్తులా పోరాడాను. కానీ, ఫలితం అనుకూలంగా రాలేదు.

సత్తాకు పరీక్ష..

ఈ పోరు నా సత్తాకు పరీక్ష పెట్టింది. ఇలాంటి మ్యాచ్‌ల్లో చాలా వేగంగా.. తరచుగా వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుంది. మేమిద్దరం ఏ అవకాశాన్ని కూడా వదులుకోలేదు. నేను మరింతగా ఎదురుదాడి చేయాల్సింది అంటున్నారు. కానీ, నేనైతే దూకుడుగానే ఆడా. అన్ని రకాలుగా ప్రయత్నించా. ఇలాంటి మ్యాచ్‌లు నెగ్గడం అంత ఈజీ కాదు. మన ఓపికతో పాటు ఆటలో ప్రతీ అంశాన్ని పరీక్షిస్తాయి. ఏదేమైనా చరిత్రలో నిలిచే ఫైనల్లో ఆడినందుకు నేను గర్వపడుతున్నా.

ఎవ్వరం తగ్గలేదు..

ఒకుహరా సాదాసీదా క్రీడాకారిణి కాదు. ఆమెతో ఎప్పుడు పోటీ పడినా ఇలానే హోరాహోరీ పోరు ఉంటుంది. ఎక్కువగా ర్యాలీలతో నడిచిన ఈ మ్యాచ్ కఠినంగా అనిపించింది. మూడో గేమ్‌లో ఏ ఒక్క చాన్స్‌నూ వదలకూడదని అనుకున్నా. 11వ పాయింట్ తర్వాత ఆట సుదీర్ఘంగా సాగుతుందని ఊహించా. 13-12, 13-13, 14-13, 14-14 సాగడం బట్టి మేం ఎలా పోరాడామో చెప్పొచ్చు. నా శక్తిని ఎల్లప్పుడూ నమ్ముతా. అనుకున్న దాన్ని సాధించగలనని విశ్వసిస్తా. ఒకుహరా కూడా ఇలానే ఉందేమో.

వాళ్లు బలవంతులు..

ఫైనల్ మ్యాచ్‌లో శారీరకంగా, మానసికంగా మా ఇద్దరికీ కఠిన పరీక్ష ఎదురైంది. ఫిట్‌నెస్ విషయానికి వస్తే జపాన్ ప్లేయర్లు ఎప్పుడూ శారీరకంగా బలంగా ఉంటారు. నొజోమి లాంగ్ ర్యాలీలు, స్లో డ్రాప్స్‌తో పరీక్షిస్తుందని తెలిసి అందుకు పూర్తిగా సన్నద్ధమై ఫైనల్‌కు వచ్చా. చివరి గేమ్‌లో 1-5తో వెనుకబడ్డా మళ్లీ పుంజుకోవడంతో గెలుస్తానన్న నమ్మకం ఏర్పడింది. అయితే, 11 పాయింట్ల తర్వాత ఆట నొజోమి చేతుల్లోకి వెళ్లిందనుకున్నా. అక్కడి నుంచి అంత భారీ ర్యాలీలు ఆడాల్సింది కాదు.

ఎవరి ఆట వారిదే..

ఒకుహరాతో పాటు చైనా షట్లర్లతో నన్ను పోల్చిచూస్తున్నారు. అయితే, ప్రతీ ప్లేయర్‌కు ప్రత్యేక ఆటతీరు ఉంటుంది. ఎవరి వ్యూహాలు వారివే. చైనీయులు చాలామంది అటాకింగ్ ప్లేయర్లు. కానీ, ఒకుహరా మాత్రం గొప్పగా ర్యాలీలు ఆడుతుంది. ఈ స్థాయిలో ఏ ప్లేయర్ కూడా అంత సులభంగా లొంగరు. మ్యాచ్ రోజు మంచి వ్యూహాలు అమలు చేసి, గొప్పగా ఆడిన వారిదే విజయం.

ఎన్నో సానుకూలతలు..

నా మ్యాచ్‌ను చూస్తే ముఖ్యంగా నిర్ణాయక గేమ్‌లో 20-20తో ఉన్నప్పుడు కొత్త అనుభూతి కలిగింది. ఎందుకంటే ఇక్కడినుంచి గేమ్ ఎవరిదైనా కావొచ్చు. మేమిద్దరం బాగా కష్టపడ్డాం. ఈ చాంపియన్‌షిప్ నుంచి నేను ఎన్నో సానుకూలతలు అందుకున్నా. ఈ క్లాసికల్ ఫైనల్ తర్వాత మరింత దృఢంగా తిరిగిరావాలని, మరిన్ని విషయాలు నేర్చుకోవాలని తెలుసుకున్నా. ఇలాంటి మ్యాచ్‌ల్లో జయాపజయాలు క్రీడాకారుల కెరీర్‌లో భాగమే. ఏం జరిగిందనేది గతం. ఇప్పుడు జరగాల్సిన దాని గురించే దృష్టి పెట్టాలి.

దేనికైనా సిద్ధంగా ఉండాల్సిందే..

మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌కు ఫైనల్‌కు మధ్య మరికొంత వ్యవధి ఉండాలని అంటున్నారు. నాకైతే ఇది పెద్ద సమస్యగా అనిపించలేదు. ఇలాంటి టోర్నీలో ప్రతీ ఒక్కరూ దేనికోసమైనా సన్నద్ధం అయి ఉండాలి.

73 షాట్ల ర్యాలీపై...

నేనైతే ఫలానా ర్యాలీని పెద్దదని అనుకోవడం లేదు. ప్రతీ ర్యాలీ సుదీర్ఘంగా సాగింది. రెండు వైపుల నుంచి చాలా షాట్లు కొట్టాం. నొజోమి అలసిపోయింది. నేనూ అలసిపోయా. అయినా.. షటిల్‌ను రిటర్న్ చేసేందుకు అటు.. ఇటు దూకాం. మొత్తానికిది మంచి మ్యాచ్.

అది గొప్ప అనుభూతి..

మేమిద్దరం (సైనా, సింధు) పోడియంపై నిల్చోవడం గొప్ప అనుభూతి. ఈ టోర్నమెంట్‌లో సైనా కూడా తన శక్తిమేరకు పోరాడింది. మొత్తంగా మా ప్రదర్శనపై సంతృప్తిగా ఉన్నాం. దేశానికి రెండు పతకాలు నెగ్గడం గొప్ప విషయం.

ఒత్తిడికి గురవలేదు..

సైనా నెహ్వాల్ సెమీస్‌లో వెనుదిరిగిన తర్వాత నాపై ఒత్తిడేమీ పెరగలేదు. రియో ఒలింపిక్స్ ఫైనల్ ఆడిన తర్వాత అంతటి ప్రాముఖ్యం ఉన్న మ్యాచ్‌పై ఎలాంటి అంచనాలు ఉంటాయో నాకు తెలుసు. ఈ మారథాన్ పోరు ద్వారా నాలో ఓపిక స్థాయి కూడా ఒకటి రెండు పాయింట్లు పెరిగిందని నిరూపించినందుకు ఆనందంగా ఉంది.

పాక్‌తో మ్యాచ్ అంటే..

కాలు పోయినా ఆడతానన్నాడు!

- ధోనీ అంకితభావం గొప్పది : ఎమ్మెస్కే



ఎమ్మెస్కే ప్రసాద్

చెన్నై: భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ అంకితభావాన్ని చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ కీర్తించాడు. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో మ్యాచ్ అంటే ఒక కాలు పోయినా ఆడతానని ఒకానొక సందర్భంలో ధోనీ తనతో చెప్పాడని, ఆట పట్ల అతనికున్న అంకిత భావం చాలా గొప్పదని ఎమ్మెస్కే గుర్తుచేశాడు. తమిళనాడు స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీఎన్ఎస్‌జేఏ) వార్షిక అవార్డుల కార్యక్రమానికి హాజరైన ప్రసాద్.. మహీని ప్రశంసల్లో ముంచెత్తాడు. ధోనీ అంకితభావాన్ని గురించి ప్రస్తావిస్తూ బంగ్లాదేశ్ వేదికగా గతేడాది జరిగిన ఆసియా కప్‌లో భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌ను ఉదాహరణగా చెప్పాడు. ఆ మ్యాచ్‌కు రెండు రోజుల ముందు జిమ్‌లో వ్యాయామం చేస్తున్న సమయంలో ధోనీ గాయపడ్డాడని, గాయం తీవ్రమైనదే కావడంతో పాక్‌తో మ్యాచ్‌కు దాదాపు దూరమైనట్టేనని భావించామని చెప్పాడు. దీంతో అతణ్ని స్ట్రెచర్‌పై తీసుకెళ్లాల్సి వచ్చిందని ఎమ్మెస్కే వివరించాడు. ఆ పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థంకాక ఈ విషయంపై మాట్లాడదామని ధోనీ రూమ్‌కు వెళితే.. 'ఏం పర్లేదు ఎమ్మెస్కే భాయ్..' అని కూల్‌గా అన్నాడని చెప్పాడు. కానీ.. రిస్క్ తీసుకోవడం ఎందుకని పార్థివ్ పటేల్‌ను బ్యాకప్‌గా పిలిపించామని అన్నాడు. 'పాకిస్థాన్‌తో మ్యాచ్ రోజు మధ్యాహ్నం జట్టు ప్రకటనకు ముందు ధోనీ రెడీ అయ్యాడు. నన్ను తన రూమ్‌కి పిలిపించుకొని మాట్లాడాడు. ఎందుకు ఇంతగా ఆందోళన చెందుతున్నావు ఎమ్మెస్కే భాయ్..? పాకిస్థాన్‌తో మ్యాచ్ అంటే.. ఒక కాలు పోయినా నేను బరిలోకి దిగుతానని చెప్పాడు. ఆట పట్ల అతనికున్న అంకితభావం అంత గొప్పద'ని ప్రసాద్ తెలిపాడు. ఆ మ్యాచ్‌లో ఆడిన ధోనీ భారత్‌కు అద్భుత విజయాన్ని అందించాడని గుర్తుచేశాడు.



శ్రీతన్‌కు రజతం


అబుదాబి: తెలంగాణకు చెందిన శ్రీతన్ సేపురి ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో సత్తా చాటాడు. అబుదాబి వేదికగా జరిగిన ఈ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన 12 ఏళ్ల శ్రీతన్ రజత పతకంతో మెరిశాడు. మొత్తం 9 రౌండ్లకుగానూ శ్రీతన్ 6.5 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకున్నాడు. ఈ టోర్నీలో తనకన్నా మెరుగైన ర్యాంక్ క్రీడాకారులను ఓడించి అబ్బురపరిచాడు. హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్ ఆత్మకూరి రామారావు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న శ్రీతన్ ఇటీవల జరిగిన కామన్వెల్త్ చెస్, జాతీయ అండర్-13 పోటీల్లో టాప్-10లో నిలిచాడు.

ముగురుజ బోణీ

- చెమటోడ్చిన క్విటోవా
- గార్సియా ముందంజ
- యూఎస్ ఓపెన్

న్యూయార్క్: ఈ ఏడాది చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో స్పెయిన్ టెన్నిస్ స్టార్ గార్బినె ముగురుజ బోణీ కొట్టింది. సోమవారం మొదలైన ఈ మెగా టోర్నీ మహిళల సింగిల్స్‌లో ముగురుజ తొలిరౌండ్‌లో అలవోక విజయం సాధించింది. వార్వరా లెప్‌చెంకో (అమెరికా)తో జరిగిన ఈ పోరులో మూడోసీడ్ ముగురుజ 6-0, 6-3తో గెలుపొంది రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టింది. ఫ్రాన్స్ ముద్దుగుమ్మ కరోలిన్ గార్సియా కూడా సునాయాస విజయంతో రెండోరౌండ్‌కు చేరుకుంది. తొలిరౌండ్లో 18వ సీడ్ గార్సియా 6-0, 6-1తో తెరెజా మార్టిన్‌కోవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించింది. అయితే 13వ సీడ్ పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) తొలిరౌండ్‌ను దాటేందుకు చెమటోడ్చింది. తొలిరౌండ్లో క్విటోవా 7-5, 7-5తో జెలెనా జంకోవిచ్ (సెర్బియా)పై కష్టపడి గెలిచింది. క్రిస్టీనా ప్లిస్కోవా (చెక్), ఎరీనా రొడియొనోవా (ఆస్ట్రేలియా), మగ్దలెనా రిబరికోవా (స్లొవేకియా), ఎకతరీనా అలెగ్జాండ్రోవా (రష్యా) కూడా తొలి రౌండ్ విజయాలతో ముందంజ వేశారు.

టైటిల్ ఫేవరెట్లలో ఒకరిగా దిగిన ముగురుజ శుభారంభం చేసింది. స్థానిక క్రీడాకారిణి లెప్‌చెంకోతో పోరులో ఆమె తడబాటు లేకుండానే విజయం సాధించింది. తొలి సెట్‌లో వరుసగా ఆరు గేమ్‌లు నెగ్గిన ముగురుజ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు. అయితే రెండో సెట్‌లో మాత్రం లెప్‌చెంకో కొద్దిగా పోరాడింది. కానీ ముగురుజ జోరు ముందు నిలవలేకపోయింది.



ముగురుజ

విండీస్ లక్ష్యం 322

- ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్

లీడ్స్: మొయిన్ అలీ (84), క్రిస్ వోక్స్ (61 నాటౌట్) రాణించడంతో వెస్టిండీస్‌తో రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్ పట్టుబిగించింది. విండీస్ ముందు 322 పరుగుల విజయ లక్ష్యాన్ని ఉంచింది. 169 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆతిథ్య జట్టు.. 490/8 వద్ద డిక్లేర్ చేసింది. రూట్‌తోపాటు మలాన్, స్టోక్స్ క్యాచ్‌లను చేజార్చిన విండీస్ ఫీల్డర్లు.. మ్యాచ్ నెగ్గే సువర్ణావకాశాన్ని జారవిడిచారు. ఓవర్‌నైట్ స్కోరు 171/3తో నాలుగో రోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్.. విండీస్ బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొంది. కెప్టెన్ రూట్ (72), మలాన్ (61) నాలుగో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. తర్వాత బెన్ స్టోక్స్ (58), మొయిన్, వోక్స్ భారీ స్కోరుకు బాటలు వేశారు. అనంతరం ఛేదనకు దిగిన విండీస్ సోమవారం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 4 రన్స్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 258, విండీస్ 427 పరుగులు చేశాయి.



'స్పోర్ట్స్ టాలెంట్ సెర్చ్' పోర్టల్‌ను

ప్రారంభించిన ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ: దేశంలో క్రీడా మాణిక్యాలను వెలికి తీసేందుకు ఏర్పాటు చేసిన నేషనల్ స్పోర్ట్స్ టాలెంట్ సెర్చ్ పోర్టల్‌ను ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సోమవారమిక్కడ ప్రారంభించారు. చిన్నారుల్లో ప్రతిభను గుర్తించి వారిని సానబెట్టేందుకు ఈ పోర్టల్ ఉపయోగ పడనుంది. 'www.nationalsportstalenthunt.com' లో ఆటగాళ్ల బయోడేటా, వీడియో క్లిప్‌లను ప్లేయర్‌కు సంబంధించిన ఎవరైనా అప్‌లోడ్ చేయవచ్చు. చిన్నతనంలో ప్రతిభను గుర్తించి సానబెట్టాల్సిన అవసరం ఉందని పోర్టల్ ప్రారంభం సందర్భంగా వెంకయ్య అన్నారు. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో రజతం సాధించిన షట్లర్ పీవీ సింధును ఉపరాష్ట్రపతి ప్రశంసించారు.



టెక్సాస్, ఫ్రెండ్స్‌వుడ్ ప్రాంతాల్లో వరదనీటిలో చిక్కుకున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

పీకల్లోతు వరదలో భారత విద్యార్థులు

- హ్యూస్టన్ వర్సిటీలో చిక్కుకున్న 200 మంది.. ట్విటర్‌లో సుష్మా స్వరాజ్

హ్యూస్టన్, ఆగస్టు 28: అమెరికాను 13 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా అమెరికాను హరికేన్ హార్వే ముంచేసింది. ఈ వరదల్లో వందలాది మంది భారతీయ విద్యార్థులు చిక్కుకుపోయారు. టెక్సాస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్ నీట మునిగింది. పీకల్లోతు వరద నీటిలో 200 మంది భారత విద్యార్థులు చిక్కుకుపోయారు. సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ తన ట్విటర్ ద్వారా వెల్లడించారు. షాలిని, నిఖిల్ భాటియా అనే ఇద్దరు విద్యార్థులు ఐసీయూలో చికిత్స పొందుతున్నారని, వర్సిటీలో గొంతులోతు వరద నీటిలో భారతీయ విద్యార్థులు చిక్కుకుపోయినట్టు హ్యూస్టన్ కాన్సూల్ జనరల్ అనుపమ్ రే తనకు తెలిపారని ఆమె చెప్పారు. ఆస్పత్రి పాలైన విద్యార్థుల కుటుంబీకులు.. అక్కడికి చేరేలా సత్వర ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కాగా, హరికేన్ హార్వే వల్ల 1.3 కోట్ల మంది ప్రజలు ప్రభావితులయ్యారు. వరద విలయాన్ని సమీక్షించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మంగళవారం టెక్సాస్ వెళుతున్నారు. వరదల సమయంలోనూ అరుదైన వ్యాధి లీష్మానియాసిస్‌కు వాడే ఔషధాన్ని టెక్సాస్ ఆస్పత్రికి పంపించారు భారత సంతతి అమెరికన్ సీఈవో హరీశ్ కథరాని. సౌత్‌సైడ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు సీఈవో అయిన ఆయన.. రాత్రికిరాత్రే 49 వేల డాలర్ల ఖరీదైన ఔషధాన్ని ఆయన పంపించారు.

కమ్మేసిన 'మాయదారి' పొగ

బ్రిటన్‌లో 130 మంది ఆస్పత్రి పాలు



లండన్, ఆగస్టు 28: అది బీచ్ పక్కనే ఉండే ఓ ప్రాంతం. ఉన్నట్టుండి ఏదో మాయదారి పొగ ఆ ప్రాంతాన్నంతా కమ్మేసింది. ఆ పొగధాటికి జనం విలవిల్లాడిపోయారు. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. 130 మందికి పైగా ప్రజలు శ్వాస తీసుకోలేకపోయారు. కళ్ల మంటలతో గగ్గోలు పెట్టారు. వాంతులు చేసుకుని ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘటన బ్రిటన్‌లోని తూర్పు ససెక్స్ తీర ప్రాంతంలోని బర్లింగ్ గ్యాప్ బీచ్‌లో ఆదివారం జరిగింది. సముద్రం నుంచే ఆ అంతుబట్టని పొగ వచ్చి ఉంటుందని అధికారులు చెబుతున్నా.. ఆ విషయాన్ని మాత్రం ఇంతవరకూ ధ్రువీకరించలేదు. ఆ మిస్టరీ పొగను క్లోరిన్‌గా అనుమానిస్తున్నారు. బర్లింగ్ గ్యాప్‌లో నివసించే ప్రజలంతా ఇంటి తలుపులు, కిటికీలు మూసి ఉంచుకోవాలని, బయటకు రావొద్దని, వీలైతే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని అధికారులు సూచించారు.

వెనకడుగు ఇందుకే!

న్యూఢిల్లీ, ఆగస్టు 28: దాదాపు రెండున్నర నెలలపాటు సాగిన డోక్లాం ప్రతిష్ఠంభనకు తెర ఎలా పడింది? ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం ప్రారంభించి.. ఇన్నాళ్లపాటు మొండిగా వ్యవహరించిన చైనా చివరకు వెనక్కి తగ్గడానికి కారణాలేంటి? అంటే.. అందుకు పలు కారణాలున్నాయని విదేశీ వ్యవహారాల నిపుణులు అంటున్నారు. వారు చెబుతున్నదాని ప్రకారం..

- వచ్చే నెల 3 నుంచి 5 దాకా చైనాలోని జియామెన్‌లో బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) సదస్సు జరగనుంది. చైనా దీన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ఎందుకంటే, ఈ ఏడాది బ్రిక్స్ సదస్సు.. 'మెరుగైన భవిష్యత్తుకు బలమైన భాగస్వామ్యం' అనే థీమ్‌తో జరగబోతోంది. డోక్లాం ప్రతిష్ఠంభన నేపథ్యంలో ఆ సదస్సుకు మోదీ హాజరు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో 'బలమైన భాగస్వామ్యం' అనే థీమ్‌కే అర్థం లేకుండా పోయే పరిస్థితి. దీనికితోడు, ఒక వివాదాస్పద ప్రాంతంపై భాగస్వామ్య దేశాలతో పరిష్కారం చేసుకోకుండా, ఆ ప్రాంతంలో యథాతథస్థితిని మీరడం ద్వారా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించే దేశంగా చైనా ప్రపంచ దేశాల ముందు నిలిచింది. ఇది చైనాకు ఇబ్బందికర పరిస్థితి. అందుకే ఒకింత వెనక్కి తగ్గింది.
- డోక్లాం పై అంతర్జాతీయంగా మద్దతు కూడగట్టేందుకు చైనా విశ్వప్రయత్నాలు చేసింది. కానీ.. వివాదాస్పద ప్రాంతంలో రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించడం ద్వారా డ్రాగన్ దేశమే తప్పిదానికి పాల్పడిందనే విషయాన్ని భారత్ ప్రపంచదేశాలకు విస్పష్టంగా చెప్పి ఒప్పించగలిగింది. దీంతో అమెరికా, యూకే ఈ విషయాన్ని భారత్‌తో దౌత్య మార్గాల ద్వారా, ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చైనాకు సూచించాయి. జపాన్ అయితే ఈ వ్యవహారంలో చైనాదే తప్పని కుండబద్దలుగొట్టి చెప్పింది. నేపాల్‌ను తమకు మద్దతుగా కూడగట్టుకోవాలని చైనా భావించినప్పటికీ.. ఆ దేశం తటస్థంగా ఉండడానికే మొగ్గు చూపడంతో చైనాకు దిక్కు తోచలేదు.
- చైనా మీడియా, ప్రజల దృష్టిలో భారత్‌ను చాలా సులభంగా ఓడించేయవచ్చు. కానీ, రెండున్నర నెలలు గడుస్తున్నా భారత్ తమ దేశంతో దీటుగా వ్యవహరించడంతో ప్రజల నుంచి, మీడియా నుంచి చైనా ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిపోయింది. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సైనిక దాడుల దిశగా కదులుదామంటే.. అది ఒక్క డోక్లాం ప్రాంతానికే పరిమితం కాదు. భారత్‌తో సరిహద్దు పొడవునా అన్ని చోట్లా చైనా ఏమీ బలంగా లేదు. కొన్ని వ్యూహాత్మక ప్రాంతాల్లో భారత్ బలంగా ఉంది. పైపెచ్చు ఆ దేశం పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆర్థిక కారిడార్ (సీపీఈసీ) నిమిత్తం దాదాపు 3 లక్షల కోట్లు పెట్టుబడులకు సిద్ధమైంది. ఇప్పటికే పని కూడా జరుగుతోంది. డోక్లాంలో సైనికదాడులకు బదులుగా భారత్ సీపీఈసీపై దృష్టిపెడితే చాలా విధాల నష్టపోయే ప్రమాదం ఉంది. దానికితోడు చైనా చుట్టూ ఉన్న పలు దేశాలతో భారత్ చాలా సన్నిహితమైన దౌత్యసంబంధాలు నెరపుతోంది. యుద్ధం అంటూ వస్తే చైనా ఆ కోణంలో కూడా పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వీటన్నిటినీ బేరీజు వేసే చైనా వెనక్కు తగ్గింది. పైకి మాత్రం.. 'డోక్లాంలో మా గస్తీ కొనసాగుతుంది' అని బింకాలు పోతోంది. రోడ్డు నిర్మాణంపైన మాత్రం నోరెత్తట్లేదు.

డోక్లాంలో చైనా వెనకడుగు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చినట్టు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "గత కొద్దివారాలుగా భా రత్, చైనా మధ్య దౌత్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో రెండు దేశాలూ దీనిపై తమతమ అభిప్రాయాలను, ఆందోళనలను, ప్రయోజనాలను గురించి చర్చించుకున్నాయి. అందులో భాగంగానే ఒప్పందం కుదిరింది. ఇరుదేశాల సైనికుల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది" అని వెల్లడించింది. చైనాలోని జియామెన్‌లో సెప్టెంబరు 3 నుంచి 5 వరకూ జరిగే బ్రిక్స్ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్న నేపథ్యంలో ఈ సమస్య సద్దుమణగడం గమనార్హం. చైనా, భూటాన్ తమదిగా చెప్పుకొంటున్న డోకాలాంలో.. రోడ్డు నిర్మించేందుకు చైనా చేసిన ప్రయత్నాలను భూటాన్ తరఫున భారత సైన్యం అడ్డుకోవడంతో జూన్ 16 నుంచి అక్కడ పరిస్థితి 'నువ్వా-నేనా' అన్నట్టుగా ఉన్నసంగతి తెలిసిందే. ఈ విషయంలో భారత్‌దే తప్పని.. చైనా భూభాగమైన డోకాలాంలోకి భారతసేనలు చొచ్చుకొచ్చాయని, వెనక్కి వెళ్లకపోతే యుద్ధం తప్పదని.. 1962 యుద్ధంలో ఓటమిని భారత్ గుర్తుంచుకోవాలని చైనా ప్రభుత్వ అధికార పత్రికలు, ఇతర మీడియా తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశాయి. భారత్‌ను ఎద్దేవా చేస్తూ జాతివివక్షతో కూడిన వీడియోలు సైతం విడుదల చేశాయి. కానీ, ఆ హెచ్చరికలను భారత్ ఎంతమాత్రం పట్టించుకోలేదు. డోక్లాంలో రోడ్డు నిర్మించాలన్న చైనా వ్యూహాన్ని ఫలించనీయలేదు. దౌత్యనీతితో డ్రాగన్ దేశంతో చర్చలు జరపడం ద్వారా ఎట్టకేలకు జూన్ ముందు నాటి స్థితి కొనసాగేలా చేయడంలో విజయం సాధించింది. ఇన్నాళ్లూ అక్కడ నియమించిన 350 మంది సైనికులను క్రమంగా ఉపసంహరించే ప్రక్రియ కొనసాగుతోందని భారత సైనిక వర్గాలు తెలిపాయి. భారత ప్రకటన చైనా సోషల్ మీడియాలో, మీడియాలో వైరల్‌గా వ్యాపించడంతో.. కింద పడ్డా తమదే పైచేయి అన్న చందంగా చైనా వ్యవహరించింది. "సోమవారం మధ్యాహ్నం భారత సైనికులు, తమ సామగ్రితో సహా తాము చొరబడిన డోక్లాం నుంచి వైదొలగారు. క్షేత్రస్థాయిలో ఉన్న చైనా దళాలు దీన్ని ధ్రువీకరించాయి. చైనిస్ సైనికులు ఆ ప్రాంతంలో గస్తీ కొనసాగిస్తారు. చైనా తన సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను చారిత్రక ఒప్పందాల మేరకు కాపాడుకుంటుంది." అని ప్రకటించారు. భారత దేశంతో స్నేహపూర్వక సంబంధాలకు తమ దేశం ఎంతో విలువనిస్తుందని వ్యాఖ్యానించారు. అయితే, అసలు ఈ వివాదానికి కారణమైన రోడ్డు నిర్మాణం గురించిన ప్రశ్నలకు మాత్రం ఆమె స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. భారత్ చెబుతున్నట్టు ఇరు దేశాల మధ్య దళాల ఉపసంహరణ ఒప్పందం కుదిరిందా అనే ప్రశ్న పదే పదే వేయగా.. "క్షేత్రస్థాయిలో పరిస్థితులను బట్టి చైనా ఎప్పటికప్పుడు సర్దుబాట్లు చేసుకుంటుంది" అని తెలివిగా దాటవేశారు. మరోవైపు.. "డోక్లాం నుంచి ఇరువర్గాలూ వైదొలగాలన్న ఒప్పందాన్ని చైనా అంగీకరించలేదా" అని భారత విదేశాంగ శాఖ ప్రతినిధులను ప్రశ్నించగా.. "భారతదేశం ఏకపక్షంగా ఉపసంహరించుకోవాలనుకుంటే దానికి చైనాతో ఒప్పందం ఎందుకు?" అని వారు తిరిగి ప్రశ్నించారు. చైనా రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేసిందని, ఈమేరకు ఆ దేశ బుల్‌డోజర్లు వెనక్కి వెళ్లాయని భారత ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. కాగా, డోక్లాం విషయంలో చైనాతో ఘర్షణ ముగియడంపై సీపీఎం నేత సీతారాం ఏచూరి సంతోషం వ్యక్తం చేశారు.



డోకాలాం నుంచి భారత్ వెనకడుగు వేసిందటూ చైనాలో ప్రచారం చేస్తున్న దృశ్యం



భారత్‌కు వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్లతో ఉన్న కార్లు

భారత ప్రభుత్వంపై ప్రశంసల జల్లు!

- మోదీని అభినందించిన రాజకీయ పార్టీలు

కశ్మీర్, ఆగస్టు 28: డోక్లాం వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలనే ఇరు దేశాల నిర్ణయానికి ప్రశంసల వర్షం కురుస్తోం ది. ఈ వివాదానికి ముగింపు పలకాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తదితరులు ప్రశంసించారు. విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్‌కు సోనియా, మన్మోహన్ అభినందనలు తెలిపారు. డోక్లాంలో రహదారి నిర్మాణాన్ని చైనా నిలిపివేయగా, అక్కడి నుంచి భారత దళాలు వైదొలుగుతున్నాయి. దీంతో చైనాపై భారత్ పైచేయి సాధించిందని జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్‌అబ్దుల్లా ట్విటర్ ద్వారా అన్నారు. 'దుందుడుకు చర్యలకు పాల్పడకుండానే చైనాపై భారత్ పైచేయి సాధించింది. ప్రధాని మోదీకి, అతని బృందానికి అభినందనలు' అని ఒమర్ ట్వీట్ చేశా రు. కాగా, డోక్లాం వివాదంలో వెనక్కి తగ్గాలన్న ఇరు దేశా ల నిర్ణయాన్ని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు స్వాగతించా యి. 'డోక్లాం వివాదం సద్దుమణగడాన్ని స్వాగతిస్తున్నాం. పొరుగుదేశాలతో సఖ్యత పెంపెందించుకోవడంపై భారత ప్రభుత్వం దృష్టిపెట్టాలి' అని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ట్వీట్ చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా కూడా భారత ప్రభుత్వ నిర్ణయాన్ని అభినందించారు.




సీజేఐగా జస్టిస్ దీపక్ మిశ్రా

45వ భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం

'సుప్రీం' జడ్జిగా సంచలన తీర్పులు..యాకూబ్ కేసులో అర్ధరాత్రి విచారణ

'నిర్భయ' దోషులకు మరణ శిక్ష ఖరారు చేసిన బెంచ్‌కు నేతృత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, జస్టిస్ మిశ్రాతో ప్రమాణ స్వీకారం చేయించారు. సుప్రీం కోర్టు 45వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మిశ్రా ఇంగ్లిషులో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. ప్రధాన న్యాయమూర్తిగా సోమవారం పదవీ విరమణ చేసిన జస్టిస్ ఖేహర్.. ఆనవాయితీ ప్రకారం గత నెలలోనే జస్టిస్ మిశ్రా పేరును ప్రకటించారు. జస్టిస్ మిశ్రా 1953 అక్టోబరు 3న ఒడిసాలో జన్మించారు. 1977 ఫిబ్రవరి 14న అడ్వకేట్‌గా ఎన్‌రోల్ అయ్యారు. రాజ్యాంగం, సివిల్, క్రిమినల్, రెవెన్యూ, సేవా, అమ్మకం పన్ను సంబంధిత కేసుల్లో ఒడిసా హైకోర్టు, సర్వీస్ ట్రైబ్యునల్‌లో ప్రాక్టీస్ చేశారు. 1996లో ఒడిసా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అదే ఏడాది మధ్యప్రదేశ్ హైకోర్టుకి బదిలీ అయ్యారు. మరుసటి సంవత్సరమే శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2010 మే నెల వరకు పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2011లో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన న్యాయమూర్తిగా వచ్చే ఏడాది అక్టోబరు 2 వరకు సుమారు 18 నెలల పాటు కొనసాగనున్నారు. జస్టిస్ మిశ్రా భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంగనాథ్ మిశ్రా మేనల్లుడు. ప్రస్తుతం కావేరి, కృష్ణా జలాల వివాదాలు, బీసీసీఐ సంస్కరణలు, సహారా కేసు తదితర అంశాలను విచారిస్తున్న బెంచ్‌కు నేతృత్వం వహిస్తున్నారు. పలు సంచలన కేసుల్లో జస్టిస్ మిశ్రా తీర్పులు వెలువరించారు. నిర్భయ గ్యాంగ్ రేప్ కేసులో నలుగురు దోషులకు మరణ శిక్షను ఖరారు చేసిన బెంచ్‌కు నేతృత్వం వహించారు. దేశమంతటా సినిమా థియేటర్లలో ప్రదర్శనకు ముందుకు జాతీయ గీతం వినిపించాలన్న బెంచ్‌లో కూడా ఆయన సభ్యుడు. ముంబై పేలుళ్ల దోషి యాకూబ్ మెమెన్ పిటీషన్‌పై అర్ధరాత్రి విచారణ చేపట్టి.. అతనికి విధించిన ఉరి శిక్షను రద్దు చేయడానికి తిరస్కరించిందీ జస్టిస్ మిశ్రాయే. హైకోర్టు జడ్జి కర్ణన్‌కు జైలు శిక్ష విధించిన బెంబచ్‌లోనూ ఉన్నారు. కేసు నమోదైన 24 గంటల్లో ఎఫ్ఐఆర్‌ని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించారు. పరువు నష్టం కేసును క్రిమినల్ కేసుగా పరిగణించకూడదన్న ప్రతిపాదనను తోసిపుచ్చి.. వాక్ స్వాతంత్ర్యం హక్కు అంటే ఇతరుల పరువు తీయడం కాదని స్పష్టం చేసిందీ జస్టిస్ మిశ్రాయే. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్, పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ దీపక్ మిశ్రాతో రాష్ట్రపతి కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య, ప్రధాని మోదీ

రూ. 2 లక్షలపై లావాదేవీలకు నగదు వాడొద్దు

(మొదటిపేజీ తరువాయి)



వ్యక్తి నుంచి, ఒక రోజులో ఒక లావాదేవీలో కానీ, పలు లావాదేవీల్లో కానీ తీసుకోవడం నిషిద్ధం" అని పేర్కొంది. "స్థిరాస్తి బదిలీ కోసం రూ.20 వేలకు మించి నగదు తీసుకోవడం కానీ, ఇవ్వడం కానీ చేయరాదు. వృత్తిపరమైన, వ్యాపారపరమైన ఖర్చులు రూ.10 వేలకు మించి క్యాష్‌గా చెల్లించరాదు" అని వివరించింది. "పైన పేర్కొన్న పరిమితులకు మించి నగదు చెల్లించడం నిషిద్ధం. ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు తప్పవు. క్యాష్‌లెస్ లావాదేవీలు జరపండి. పారదర్శకంగా ఉండండి" అని సూచించింది. అలాంటి ఉల్లంఘనలకు ఎవరైనా పాల్పడుతుంటే ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్‌కు ఈ మెయిల్ ద్వారా (blackmoneyinfo@incometax.gov.in) సమాచారం అందించాలని చెప్పింది. బడ్జెట్లో భాగంగా చేసిన చట్టసవరణ ద్వారా ఏప్రిల్ 1 నుంచి రెండు లక్షల నిబంధన అమల్లోకి వచ్చింది. ఆదాయ పన్ను చట్టంలో చేర్చిన 269ఎస్టీ నిబంధన ప్రకారం... రెండు లక్షల నిబంధన ఉల్లంఘించిన వారికి వందశాతం జరిమానా వేస్తారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, సహకారబ్యాంకులకు ఈ నిబంధన వర్తించదు. నల్లధనాన్ని నియంత్రించేందుకే నగదు లావాదేవీలపై పరిమితి విధించారు.



ఎన్‌డీఏ కన్వీనర్‌గా అమిత్ షా?

న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కన్వీనర్‌గా బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. 2019 నాటికి పాత, కొత్త మిత్రులందర్నీ సమాయత్తపరచి ఎన్నికల బరిలోకి దిగేందుకు వీలుగా ఎన్‌డీఏను మరింత బలపరచాలని మోదీ-షా ద్వయం భావిస్తోంది. గత ఎన్నికల్లో ఎన్‌డీఏ పేరుతో పోటీ చేసినప్పటికీ ఆ తర్వాత జరిగిన ఎన్నికలన్నింటిలో బీజేపీ పెద్దన్న పాత్ర పోషించింది. మూడేళ్లుగా ఎన్‌డీఏకి కన్వీనర్‌ను నియమించకుండా సంప్రదాయాలను విస్మరించారు. అయితే రాబోయే ఎన్నికల్లో బీజేపీ బలం తగ్గే అవకాశాలు ఉన్నాయంటూ అంతర్గత సర్వేలు స్పష్టం చేయడంతో మిత్రపక్షాలతో ఇప్పటి నుంచే సత్సంబంధాలు నెలకొల్పడం మంచిదని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అందులో భాగంగానే కో కన్వీనర్‌గా బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌ను నియమించాలనుకుంటున్నారు. ఆయన కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. త్వరలో టీడీపీ అధినేత చంద్రబాబుతో కూడా ఎన్‌డీఏలోని ఇతర పదవులపై అమిత్ షా చర్చిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. త్వరలో ఏపీకి కూడా మరింత సాయం చేసే అవకాశాలు ఉన్నాయని బీజేపీ ముఖ్యనేతలు తెలిపారు.

ముఖ్యమైన 3 సమస్యలు- పరిష్కారాలు

అమెరికాలో చదువుకోవటానికి వెళ్లే విద్యార్థులందరి మనస్సుల్లోను- 'చదువు తర్వాత ఏమిటి? ఉద్యోగం వస్తుందా? హెచ్-1బీ వీసా వస్తుందా?' లాంటి అనేక సందేహాలు తలెత్తుతూ ఉంటాయి. అమెరికాలో చదువుకోవటానికి.. ఆ తర్వాత ఉద్యోగం చేయటానికి అనేక అవకాశాలు ఉన్నాయంటున్నారు విద్యా నిపుణులు. అమెరికాకు వెళ్లిన విద్యార్థులను ఎక్కువగా వేధించే మూడు సందేహాలకు సమాధానాలేమిటో ఇప్పుడు చూద్దాం..

చదువు తర్వాత..

అమెరికాలో చట్టాలు, విధానాలు తరచూ మారుతూ ఉంటాయి. అందువల్ల వెళ్లే ముందే వీసాలో ఉన్న నిబంధనలను సరిగ్గా అర్థం చేసుకోవాలి. చాలా విశ్వవిద్యాలయాల్లో చదువుపూర్తయిన తర్వాత ఇంటర్న్‌షిప్‌లను అందిస్తూ ఉంటారు. అలాంటి ఇంటర్న్‌షిప్‌లు ఉన్న కోర్సులను ఎంపిక చేసుకుంటే మంచిది. చాలా సందర్భాలలో విద్యార్థులు- తమ విశ్వవిద్యాలయాలు అందిస్తున్న కోర్సుల గురించి పూర్తిగా తెలుసుకోరు. ఏదైనా విశ్వవిద్యాలయానికి అప్లై చేసే ముందే పూర్తిగా కోర్సు గురించి.. కోర్సు పూర్తయిన తర్వాత లభించే ఉపాధి అవకాశాల గురించి తెలుసుకొని.. ఆ తరహా వీసాలకు దరఖాస్తు చేసుకోవటం మంచిది. వీలైతే ఆ కోర్సులను చేసిన వారితో మాట్లాడితే అదనపు వివరాలు తెలుస్తాయి. అంతేకాకుండా చదువుతున్న సమయంలో- విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా ఉన్న కంపెనీలలోని అవకాశాలను తెలుసుకుంటే మంచిది. ఈ విధమైన నెట్‌వర్కింగ్- చదువుపూర్తయిన తర్వాత ఎంతో ఉపయోగపడుతుంది.

కమ్యూనికేషన్..

చాలా మంది విద్యార్థులకు టోఫెల్‌లో మంచి స్కోరు వస్తుంది. అయితే వారికి ఇంగ్లీషులో బాగా రాయటం.. మాట్లాడటం రాదు. దీనితో ఒక సారి విశ్వవిద్యాలయంలోకి వెళ్లిన వెంటనే- అక్కడి వాతావరణం భయంకరంగా కనిపిస్తుంది. దీని వల్ల వారు కొన్ని కొన్ని కోర్సులలో ఉన్నత స్థానాలు సాధించలేకపోతారు. గ్రూపుల్లో భాగస్వాములు కాలేకపోతారు. అందువల్ల అమెరికాకు వెళ్లే ముందే- అక్కడి భాషావ్యవహారాలను గమనిస్తే మంచిది. దీనికి ఇంగ్లీషు సినిమాలు ఎంతో ఉపకరిస్తాయి. ఇంగ్లీషు సినిమాలు చూసి వారు మాట్లాడే భాషను అర్థం చేసుకోవటం వల్ల ఎన్నో ఉపయోగాలుంటాయి. చాలా విశ్వవిద్యాలయాల్లో ఇంగ్లీషేతర విద్యార్థుల కోసం కోచింగ్ క్లాసులుంటాయి. వీటిలో చేరటం వల్ల చాలా ఉపయోగాలుంటాయి. ఒక వేళ కమ్యూనికేషన్ సబ్జెక్ట్ కోర్సులో లేకపోయినా- దానిని ఎంచుకోవటం మంచిది.



కాపీ విషయంలో జాగ్రత్త..

చాలా సందర్భాలలో- అంతర్జాతీయ విద్యార్థులకు అమెరికాలో కొట్టడాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తారని తెలియదు. వాస్తవానికి అమెరికాలోని హైస్కూళ్లలోను, కాలేజీలలోను- ఈ విషయాన్ని ముందు నుంచి చెబుతారు. ఇద్దరు కలిసి ప్రిపేర్ అయి.. ఒకే నోట్స్‌ను సబ్‌మిట్ చేస్తే దానిని కూడా అమెరికాలో కాపీగా పరిగణిస్తారు. అందువల్ల అమెరికాలో చదువుకొనే విద్యార్థులు- కాపీకి సంబంధించి- తాము చదువుతున్న విశ్వవిద్యాలయం విడుదల చేసిన మార్గదర్శకాలను జాగ్రత్తగా చదవాలి. ప్రొఫెసర్లతో తరచూ మాట్లాడుతూ ఉండటం వల్ల కూడా దేనిని కాపీగా పరిగణిస్తారనే విషయం తెలుస్తుంది.

-స్పెషల్ డెస్క్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.